# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటి - 3

## వచన కవితలు - భాగం - 2



పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

Hymavathi Bhimanna
24/8/2013

# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటి -3

వచన కవితా సంపుటులు: భాగం- 2 .

గుడిసెలు కాలిపోతున్నై, కేదారేశ్వరి, రాధతో ఎగ్జిబిషన్,
భీమన్న ఉగాదులు, డ్రగ్ ఎడిక్టులు.

ప్రధాన సంపాదకులు
**ఆచార్య అనుమాండ్ల భూమయ్య**

సంపాదకులు
**ఆచార్య కర్రి సంజీవరావు (శిఖామణి)**

సహాయ సంపాదకులు
శ్రీమతి బోయి విజయేందిర
శ్రీ గసుమల జ్ఞానేశ్వర్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

**Boyi Bhimanna - Vachanakavyalu-2**

Padmabhushan Dr. Boyi Bhimanna - Sahitya Peetham
Potti Sree Ramulu Telugu University
Hyderabad - 500 004

డా॥ బోయి భీమన్న శతజయంతి ప్రచురణ

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ: **2010**

ప్రతులు : **1000**

మూల్యం : రూ॥ 120/-

**ISBN NO: 81-86073-200-2**

ప్రతులకు:
రిజిస్ట్రార్
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ - **500 004**

ముద్రణ: చరిత ఇంప్రెషన్స్
అజామా బాద్, హైదరాబాద్ - **500 044**

Grams: "TELVERS"

Phone: Off: 040-23234815
Tele Fax : 040-23236911
E-mail: info@teluguuniversity.ac.in

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య అనుమాండ్ల భూమయ్య
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డన్స్,
హైదరాబాద్ - 500 004

## డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం - కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠాన్ని తేది 19-09-06న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు ప్రకటించారు. వెంటనే దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్యపీఠం వెంటనే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు పరుస్తుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి డా॥ కొణిజేటి రోశయ్యగారి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భీమన్న పీఠానికి తమ వంతు సహకారం కొనసాగిస్తున్నది.

1. డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని (పద్యం, గేయం-వచనకవిత్వం, నాటకం, వచనం) సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. డా॥ భీమన్న రచనలపై వివిధ ప్రదేశాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
3. భీమన్న జీవితం-రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేయడం.
4. భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
5. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటాలుగా ముద్రించడం.
6. భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.
7. భీమన్న రచనలపైన వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.
8. భీమన్న నాటకోత్సవాల్ని నిర్వహించడం.

9. డా॥ భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, కొన్నింటిని భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి శరవేగంతో పూర్తి చేస్తోంది. రాష్ట్రం నాలుగు చెరగులా, ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న తన కావ్యాలను రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికలను రెండు సంపుటాలుగా ప్రకటించాం. డా॥ భీమన్న రచనలను ఇంగ్లీషులోకి అనువాదం చేసేనిమిత్తం. ప్రసిద్ధులైన అనువాదకులకు అప్పగించి పూర్తిచేయుటం జరిగింది.

గడచిన మూడు సంవత్సరాలలో భీమన్న సమగ్ర సాహిత్యం పేరిట భీమన్న గేయ కావ్యాలు భాగం1, 2, భీమన్న పద్యకావ్యాలు భాగం 1,2, భీమన్న నాటకాలు 1,2, భీమన్న పీఠికలు భాగం 1,2, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయ భీమన్న గ్రంథాలను ప్రచురించి విడుదల చేయడం జరిగింది. ఇది బోయి భీమన్న శతజయంతి సంవత్సరం.

డా॥ బోయి భీమన్న గారి వచన కవితా సంపుటులను అన్నింటినీ ఒకచోట చేర్చి కాలక్రమపద్ధతిలో విభజించి మూడు భాగాలుగా ప్రచురిస్తున్నాం. భాగం-1లో త్రిపదలు, అనాది కోస నుంచి అనంతత్వంలోకి, మోక్షం నా జన్మహక్కు, 'ఓయీ కవి కవిత్వం రాయి!' కవితా సంపుటులున్నాయి. భాగం -2లో గుడిసెలు కాలిపోతున్నై, కేదారేశ్వరి, రాధతో ఎగ్జిబిషన్, భీమన్న ఉగాదులు, డ్రగ్ ఎడెక్టులు కవితా సంపుటులున్నాయి. భాగం - 3లో గిల్లి చెబుతున్నా, చివరి మెట్టు మీద శివుడు, ఒంటరిగొంతు కవితా సంపుటులున్నాయి. తెలుగు వారి భాషా, సాహిత్యం, సంస్కృతి రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలుకల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నానికి మీరు అందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి భీమన్న రచనలను ఒకసారికి ముద్రణ (2008) హక్కులు ఇచ్చిన బోయి భీమన్న సాహితీనిధి అధ్యక్షులు శ్రీమతి హైమవతీ భీమన్నగారికి, ఇతర సభ్యులకు ధన్యవాదాలు. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం, ఆదరణ ఉంటుందని ఆశిస్తున్నాను.

తేది: 10-9-2010
హైదరాబాద్

(అనుమాండ్ల భూమయ్య)

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 004

ఆచార్య కె. సంజీవరావు
కన్వీనర్

---

# గద్య కవితా విద్యాధరుడు బోయి భీమన్న

ఆధునిక తెలుగు సాహిత్యంలో అనే ప్రక్రియలను చేపట్టి సమర్థవంతంగా నిర్వహించి ఔననిపించుకొన్న కవులలో పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న ప్రథమ పంక్తిలోని వారు. వారి చేతిలో వచన కవిత కొత్త పోకడలను, ప్రయోగశీలతను సంతరించుకుంది. బయలుదేరిన చోటే ఆగిపోతే అది ప్రవాహము కాదు, అతను కవీ కాదు. నిత్య సజీవ స్రవంతిలా కవీ ముందుకు కదలాలి. పద్యరచనతో తన కవితా యాత్ర ప్రారంభించిన భీమన్న అటు తర్వాత గేయాన్ని, వచన కవితనూ సమాదరించాడు. తన సాహిత్య పరిణామ శీలత్వాన్ని గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటిలో ఇలా వ్యక్తం చేసాడు.

ఆకాశంలో పద్యంగా ప్రవహించే వాణ్ణి
దూకి, గేయంలో పడ్డాను
అక్కడ నుంచిగెంతి, గద్యం మీద పడ్డాను.

ఆ గద్య కవితా ప్రక్రియ భీమ కవికి కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డును సంపాదించి పెట్టింది. 1973లో భీమన్న వెలువరించిన గుడిసెలు కాలిపోతున్నై గద్య కవితల సంపుటికి 1975లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. పాలేరు, కూలిరాజు వంటి నాటకాలలో భీమన్న స్వీకరించిన సామాజిక ఇతివృత్త పరంపర భీమన్న వచన కవిత్వంలోనూ కొనసాగింది. ''కవిత్వంలో ఛందస్సుల మొక్కలు నాటను, భావనలో సామాన్యుని కామన దాటను'' అన్న కుందుర్తి మార్గానికి భీమన్న రచనలు దగ్గరగా ఉంటాయి. పద్యం రాయడం చేతగాక వచన కవిత్వం రాస్తున్నారన్న అపవాదును తొలగించిన వారిలో తిలక్, కుందుర్తి వంటి వారితో పాటు భీమన్న కృషి కూడా వుంది. తెలుగు కవిత్వంలో వచన కవిత ఇంకా పూర్తి స్థాయిలో ప్రవేశించని

కాలంలో భీమన్న 1962లో అనాది కొస నుంచి అనంతత్వంలోకి కవితా సంపుటితో వచన కవితా రంగంలో ప్రవేశించారు. "దాదాపు ఒక దశాబ్దానికి పూర్వమే శ్రీ బోయి భీమన్న గారు వచన కవితా రంగ ప్రవేశం చేసారు" అని 14-3-1976 నాటి విశాలాంధ్రలో 'విస్తరిస్తున్న వచన కవిత' వ్యాసంలో పేర్కొన్నారు కుందుర్తి. 'అనాది కొస నుండి అనంతత్వంలో'కితో మొదలైన వారి వచన కవితా యాత్ర 2006లో వారి మరణానంతరం ప్రచురించిన కుక్క మొరుగుతూనే వుంది వరకూ డజను కవితా సంపుటులలో విస్తరించింది.

దళితులగోడును తన వాణిగా వినిపించడం. ప్రకృతి పురుషుల ప్రణయం ఆత్మ పరమాత్మల ఐక్యం, మూఢ దైవభావన తిరస్కరణ, రసాద్వైతం, జీవిత సత్యాలకు నిర్వచనాలు, తనదైన వ్యాఖ్యానాలు మొదలైన అంశాలు ఈ వచన కవితల నిండా పరచుకొని వున్నాయి. విస్తృతంగా రాయడం, ప్రతీచిన్న అంశాన్ని వస్తువుగా స్వీకరించడం, సూటిగా చెప్పాలనుకోవడం వల్ల ఈ వచన కవితల్లో కొన్ని చోట్ల వచనం పాలు ఎక్కువైనట్లుగా అనిపించవచ్చు. అయితే వస్తుబలం ఆలోపాన్ని కప్పేస్తుంది.

భీమన్న వచన కవితా సంపుటులు మూడు భాగాలుగా వెలువడుతున్నాయి. మొదటి భాగం -1లో త్రిపదలు, అనాది కొస నుంచి అనంతతత్వంలోకి, మోక్షం నా జన్మహక్కు, ఓయీ కవి కవిత్వం రాయి కవితా సంపుటులు ఉన్నాయి. భాగం-2లో గుడిసెలు కాలిపోతున్నై, కేదారేశ్వరి, రాధతో ఎగ్జిబిషన్, భీమన్న ఉగాదులు, డ్రగ్ ఎడిక్టులు, భాగం -3లో గిల్లి చెబుతున్నా, చివరి మెట్టు మీద శివుడు, ఒంటరిగొంతు సంపుటులున్నాయి.

1. గుడిసెలు కాలిపోతున్నై: 1973లో అచ్చయిన ఈ కవితా సంపుటికి 1975లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. 57 కవితల సమాహారం ఇది. ఇందులో గుడిసెలు కాలిపోతున్నై, అమ్మో దున్నలు, పాపం ప్రజలు, మారని వాడు, టుమ్రీలు అనే విభాగాలున్నాయి.

గుడిసెలు కాలిపోతున్నై ... ఎవరి గుడిసెలో పాపం
మాల మాదిగలవే అయి వుంటై, గుడిసెలు మరెవరికుంటై

అనే స్పష్టమైన అవగాహనతో సాగిందీకావ్యం. వేద వేదాంగ వైభవాలపై నాకు గల వారసత్వపు హక్కులు దొంగిలించబడి ఇక్కడే పాతిపెట్టబడినై. కాబట్టి ఈ శ్మశానాన్ని తవ్వుతున్నాను. ఈ హక్కులు నాకు ఇప్పుడు ఏమీ ఉపయోగపడవు. ఇవి నావని ప్రపంచానికి చూపి గర్వంగా అవతలపారేస్తానని అనగలిగిన ధీ శాలి భీమన్న.

**2.** కేదారేశ్వరి: ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా **1975** లో ప్రచురింపబడింది. పచ్చని పల్లె పట్టు అయిన కోన సీమ నడిబొడ్డున జన్మించిన భీమకవి ఆ ప్రకృతి అందాలను తన వాక్యాలలో ఒడిసిపట్టారు. కనుచూపు మేర విస్తరించిన పచ్చని వరిపొలాలకు కేదారేశ్వరిగా కావ్యరూపం ఇచ్చారు. ఇందులో తెలుగు నేల సిరి, వరిలక్ష్మి పుట్టిల్లు అనే రెండు భాగాలున్నాయి.

**3.** రాధతో ఎగ్జిబిషను: హైదరాబాదులో ఎగ్జిబిషన్స్ గ్రౌండ్స్‌లో ప్రతీయేటా జరిగే పారిశ్రామిక ప్రదర్శన నేపథ్యంగా దృష్టిలో పెట్టుకొని రాసిన కావ్యం ఇది.

**4.** భీమన్న ఉగాదులు: ఇందులో **45** కవితలు ఉన్నాయి. **1983**లో ముద్రించబడింది. తెలుగు వారికి వసంత ఋతువు ఆరంభం, తెలుగు సంవత్సరారంభం ఒకటే, భీమన్న తన జీవిత కాలంలో అనేక ఉగాది పర్వదినాలను పురస్కరించుకొని రాసిన కవితలు, వసంతం గురించి రాసిన కవితలు ఇందులో పొందుపరచబడ్డాయి.

**5.** డ్రగ్ ఎడిక్టులు: **1993** లో ఈ గ్రంథం ముద్రించబడింది. తన అనేక రచనలలో నేను నాస్తికున్ని అని ప్రకటించుకున్న భీమన్న దేవుడనే భావన ప్రమాదకరమైన ఒక డ్రగ్ వలె మానవున్ని పీడిస్తుందని దాని నుండి విముక్తి పొందాలని మానవజాతికి హెచ్చరిక చేస్తున్నాడీ గ్రంథంలో.

"ప్రపంచంలోని ఏ మతవిశ్వాసులైన
అందరూ డ్రగ్ ఎడెక్టులే
ఆ డ్రగ్ పేరు దేవుడు" అనగలిగిన నాస్తికుడు భీమన్న

భీమన్న సమగ్రసాహిత్య సంపుటాలలో ఇతర సంపుటాలను ఆదరించినట్లే ఈ వచన కావ్య సంపుటాలను పాఠకలోకం ఆదరిస్తుందని నమ్ముతున్నాను.

బోయి భీమన్న గారి మొత్తం రచనలను సేకరించడానికి కొంత శ్రమ పడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతి భీమన్న గారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మిత్రులు శ్రీ గనుమల జ్ఞానేశ్వర్, డా॥ బోయి నాగవర్మగారు అందించారు. భీమన్నగారి కావ్యాలు నిర్దుష్టంగా, అందంగా రావడానికి సహకరించిన సహాయ సంపాదకులు శ్రీమతి బోయి విజయేందిర, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్‌లకు కృతజ్ఞతలు.


ఈ సంపుటిని గ్రంథముద్రణకు వీలుగా శుద్ధ ప్రతిని తయారు చేయించిన పీఠం పూర్వ కన్వీనర్ ఆచార్య కె. ఆనందన్ గారికి, సహకరించిన డా॥ ఎమ్. కనకదుర్గ గారికి, శ్రీమతి సి. పుష్పలత గారికి, సకాలంలో ముద్రించి ఇచ్చిన చరిత ఇంప్రెషన్స్ వారికి కృతజ్ఞతలు.

తేది: **10-9-2010**
హైదరాబాద్

కె. సంజీవరావు

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | గుడిసెలు కాలిపోతున్నాయి | 1–223 |
| 2. | కేదారేశ్వరి | 225–264 |
| 3. | రాధతో ఎగ్జిబిషన్ | 265–290 |
| 4. | భీమన్న ఉగాదులు | 291–476 |
| 5. | డ్రగ్ ఎడెక్టులు | 477–541 |


గుడిసెలు
కాలిపోతున్నై
బోయి భీమన్న

ప్రథమ ముద్రణ: 1973
ద్వితీయ ముద్రణ: 1977

ప్రగతి ఆర్ట్ ప్రింటర్స్
కాపీలు: 1500
హైదరాబాదు : 500 004

హక్కులు రచయితవి

వెల: రూ॥ 9/-

ప్రతులకు
సుఖేలా నికేతన్,
ఐ.సి. 85, ఇర్రం మంజిల్ కాలనీ,
హైదరాబాదు - 500 004

## దండోరా

సాయంత్రమయింది. పొద్దు కుంకింది. చీకటి కమ్మింది. అప్పటికిగాని వదల్లేదు పని నుంచి కూలీలను ఖామందు.

పని నుంచి తమ గుడిసెలకు పోతున్న కూలీలు దారిలో దొరికిన ఒక ఎండు కొబ్బరాకును తుంటగా కట్టి, దాని వెలుగు సహాయంతో దారి చూచుకొంటూ ముందుకు సాగారు.

ఆ తుంట కూలీలతో ఆడుతూ, పాడుతూ యాత్ర సాగించి, ఆ కూలీ పేటను వాళ్ళ గుడిసెలను చూచి విస్తుపోయింది.

"దేశ సంపదను సృష్టిస్తూ, జాతి జాతినే పోషిస్తున్న కూలీలు తలదాచుకొంటున్న పేట ఇంత ఇరుకుదా! ఇది నరకం కంటె మురికిది కదా! ఈ చీకటి ఆకటి పాగ గుడిసెల్లోనా ఈ జాతి జీవన దాతలు, ఈ నిస్వార్థ శ్రమ జీవులు నివసిస్తున్నది! ఛీ! అసహ్యం! వీటిని తగలబెట్టి పారేస్తాను" అనుకొన్నదా తుంట!

"మురికి సందులు, ఇరుకు గుడిసెల
మూల్గుచున్న దరిద్రమున్, గన
తగులబెట్టగ బుద్ధి పుట్టెను
తల్లి! నా కపుడు-"

"చేతకాని నరుడు సిగ్గు నెగ్గును లేక
పాడు గుడిసెలందు బ్రతుకుగాక
చలము గల్గి, చేత బలమున్న చిచ్చేల
ఓగు గాల్చి, బాగ నోము రాదు?"

అలా అనుకొని, ఒక గుడిసె చూరు తన సమీపంలోకి రాగానే – కొబ్బరాకుల వెలుగు రూపంలో వున్న ఆ సర్వమానవ సమతా జ్యోతి దానికి అంటుకొని - అన్యాయానికీ, అధర్మానికీ, మానవుడు మానవుణ్ని పెట్టే హింసకూ జీవ నిదర్శనాలైన ఆ గుడిసెల్ని మొత్తం తగలబెట్టి పారేసింది!

కాలిపోయిన ఆ గుడిసెల స్థానంలో మేడలు లేస్తాయని ఆ దివ్యశక్తి ఆకాంక్ష, పాపం!

ఈ ఘట్టం – నేను నా చిన్నప్పుడే వ్రాసి, 1955లో ముద్రించిన "దీప సభ" కావ్యంలోది!

ఇది ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ వారి కవితా సంకలనం (ఏంథాలజీ)లోకి స్వీకరించబడింది కూడ.

అయినా–

స్థానిక తెలుగు సాహితీ రథ సారథుల దృష్టికి గాని, ప్రజాస్వామిక ప్రభుత్వ రథచోదకుల దృష్టికి గాని ఆనలేదు! గుడిసెలు మారలేదు!

## అరణ్యా రోదన మేనా?

కవి ఎంత ఏడ్చినా అది అరణ్య రోదనమేనా?

వేద ఋషులు, వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, వేమన్న – వీళ్ళందరి ఏడుపూ నా ఏడుపులా అడవిగాసిన వెన్నెలేనా?

మానవ జీవిత ప్రగతికి ఆనంద రాయబారులైన ఈ కవుల ఉద్బోధ – స్వార్థ, లౌకిక, ధన మోహిత, మానవ రూప గోమాయు మనస్తత్వపు బూడిదలో పోసిన పన్నీరేనా?

కావచ్చు!

మనిషి – తన స్వార్థానికి కలిసివచ్చే మాటను తప్ప – మరొక మాటను వినడు – అది ఎంతటి వేద వాక్యమైనా సరే!

అందుకే నేను చెపుతున్నాను – మనిషికి నీతులు చెప్పవద్దు, బ్రతికే మార్గం చూపండి అని!

దైనందినం నిరాశా నిస్పృహలకు బానిసలైపోతున్న యువకులకి క్రమశిక్షణ, గురుభక్తి, దైవభీతి వగైరా చెత్తబోధలు చెయ్యకండి! బ్రతుకు తెరువు కల్పించండి!

అందుకు చెపుతున్నాను నేను–

గుడిసెలు కాలిపోతున్నై! మానవులారా, మానవత్వం కేసి మరలండి!

''గుడిసెలు కాలిపోతే మాకేం అనుకోకండి! ఇప్పుడు కాలిపోతున్నట్టివి వట్టి గుడిసెలే కాదు ఆ గుడిసెల్లోని గొర్రెల అజ్ఞానమూ, అబలత్వమూ, చీకటి, మురికి కూడ కాలిపోతున్నై!

కాలిపోతున్న గుడిసెల స్థానంలో మళ్ళీ గుడిసెలే లేస్తాయిలే – అని అనుకోకండి! ఇక అలా జరగదు. జరగబోదు!

మురికిపేటల నిర్మూలన (Slum clearance) పేరుతో గుడిసెల్ని పీకిపారేస్తున్నాం – వాళ్ళకు ఆ సమీపంలో మరో వసతి చూపడం లేదు! ఆ గుడిసెల్లోని నోరులేని మూగజీవాలు – దిక్కు కనిపించక, పేవుమెంట్ల పైకి చేరుతున్నారు! దేవుడి గుడుల ముందు మూగుతున్నారు! సర్వాంతర్యామి అయిన శివుడిలా ఎక్కడబడితే అక్కడ వాళ్ళే కనిపిస్తున్నారు!

ఈనాడు మన దేశంలోని సగంలో సగం మందైనా సాక్షాత్తు ఆ ఆదిభిక్షువు అపరావతారాలు!

ఎంతమందికని భిక్ష పెడతాం? నూటికి తొంభై తొమ్మిది మందిని ఛీకొట్టి పొమ్మం టున్నాం! పూర్వమైతే ఆకలి చావులు చచ్చేవాళ్ళు. ఇక ముందు అలా చస్తారనుకోకండి! వాళ్ళ హక్కులేమిటో వాళ్ళూ గుర్తించుకొంటున్నారు! మన కంటే వాళ్ళే మెజారిటీ అవుతున్నారు. పరిస్థితిని తారుమారు చెయ్యగలరు!

## నిర్మాణం లేని నిర్మూలనం

ఆ మధ్య, రాత్రి మట్టి (Night soil)ని తట్టలతో మోసుకు పోవడాన్ని ప్రభుత్వం – ముఖ్యంగా మైసూరు ప్రభుత్వం – నిషేధించింది!

ఓహో! పాకీవాళ్ల పట్ల ప్రభుత్వాని కెంత ప్రేమ – అని లోకం విస్తుపోయింది! అయితే–

ప్రభుత్వ నిషేధాన్ని రద్దుచేయవలసిందిగా – అంటే, తమ పాత వృత్తినే తమకు వుంచవలసిందిగా – వాళ్ళు హైకోర్టులో రిట్ పిటీషను దాఖలు చేసుకొన్నారు?

ఏమిటీ వింత?

వాళ్ళు నిజంగానే – "మారనివాడు" కవితలో నేను వర్ణించినట్లు – నిజంగానే మారనివాళ్ళా? నిజంగానే అంతటి మూర్ఖులా?

కాదు!

మరెందుకు తమ సొంత వృత్తినే, ఆ నీచ వృత్తినే, కావాలని కోరుకొంటున్నారు?

మరో వృత్తి చూపబడలేదు కాబట్టి!

అంతకు ముందు గీత కార్మికుల్నీ, స్వర్ణకారుల్నీ ప్రభుత్వం ఏంచేసింది? వాళ్ళ వాళ్ళ వృత్తులకి ఎసరుపెట్టి – మరో ప్రత్యామ్నాయ వృత్తి చూపకుండానే వాళ్ళందర్నీ పేవుమెంట్లమీద వదిలేసింది! అలానే తమను కూడ చేస్తుందేమో అనే భయం, వాళ్ళందరి కంటే నిస్సహాయులైన పాకీవాళ్ళకు కలగడంలో ఆశ్చర్యం ఏముంది?

"ఈ పాకీవాళ్ళను ఫలానా వృత్తి నుంచి తొలగించి, ఫలానా వృత్తిలోకి బదిలీ చేస్తున్నాం" అని ప్రభుత్వం చెప్పివుంటే – వాళ్ళు దాన్ని ఆనందంతో స్వీకరించి వుండే వాళ్ళు కాదా?

నిర్మూలనమే కాని, నిర్మాణం చేతకాని ఈ నాటి ఎర్రటేపు బర్రె ప్రభుత్వాన్ని సామాన్య ప్రజలు నమ్మడం ఎలా?

అందుకే–

"ఏ వృత్తి అయితే ఏమిటి? బ్రతకడం ముఖ్యం! బ్రాహ్మలు తోళ్ళ వ్యాపారం చెయ్యడం లేదా? దేశంలో లక్షలాదిగావున్న తోళ్ళ, చెప్పుల, బూట్ల కంపెనీలు, షాపులు ఎవరివి?" అన్న ప్రశ్నకు ఏమిటి జవాబు?

సోషలిజం పేరుతో – మురికి పేటల్ని రద్దుచేస్తామన్న నీతుల నినాదాలతో పేదల్నీ, వెనకబడ్డ కులాల గొర్రెల్నీ వృత్తి, వసతి హీనుల్ని చేసి, బిచ్చగాళ్ళను చేసి, ఆకటిచావులు చావింపించాలనే దురుద్దేశం ఈనాటి ప్రజా (ధనిక) స్వామిక ప్రభుత్వానికి లేదనడానికి రుజువేమిటి?

## నిరుద్యోగులు, బిచ్చగాళ్ళు

''అమ్మా!'' బిచ్చగాడి అరుపు.

''పోయిరా!'' ఇల్లాలి జవాబు!

''పోయి, మళ్ళీ ఎప్పుడొస్తాను? పెట్టేదేమిటో ఇప్పుడే పెట్టు!'' బిచ్చగాడి ఆజ్ఞ; ఏ ముంది పెట్టడానికి?

బియ్యం దొరక్క, బ్లాకులో కొనుక్కొనే డబ్బులేక, తామే ఏమీ వండుకోలేదే!

''అమ్మా!'' మరో బిచ్చగాడి అరుపు!

ఈ బిచ్చగాళ్ళు సంసారులు కంటె మెజారిటీ అయిపోతున్నారు! నాయకులారా, పాలకులారా గుర్తిస్తున్నారా?

ఒకో పంచవర్ష ప్రణాళిక పేదల పాలిటి ఒకో మహా పంచాననంలాతయార యింది?

''దేశమంతా నిరుద్యోగులు కావడానికి ఇంకా ఎన్ని పంచవర్ష ప్రణాళికలు కావాలో చెపుతారా?'' అని ఆ మధ్య పార్లమెంటులో ఒక సభ్యుడు ప్రశ్నించాడు. ప్రశ్న తమాషాగా వున్నట్టనిపించినా, వాస్తవ పరిస్థితినే ప్రతిబింబించడం లేదా?

దేశంలో నేడున్న దుస్థితి కంతకూ కారణం ప్రజాదృష్టిలేని పంచవర్ష ప్రణాళికలే అని నా ఉద్దేశం, కాదనగలరా?

ప్రజలతో నిమిత్తం లేని, ప్రజల సమస్యలపట్ల సానుభూతి లేని, ప్రజల్ని మనుషులుగా గుర్తించని అధికారులూ, ధనికులూ, రాజకీయ నాయకులూ తమ కోసం వేసుకొన్న ప్రణాళికల్లా కనిపిస్తాయవి!

దేశాన్ని సర్వనాశనం నుంచి రక్షించాలంటే – ఈ పంచవర్ష ప్రణాళికల్ని రద్దు చెయ్యడమో, పూర్తిగా మార్చివెయ్యడమో జరగవలసి వుంది.

ప్రజల్ని దృష్టిలో పెట్టుకొనే ఏ ప్రణాళికలైనా రచించబడవలసి వుంది.

## మతం ఎవరికి?

"It is the poor who need religion. Hope is the spring of action. Religion affords this hope. Therefore, mankind finds solace in the religion, and that is why the poor cling to religion"

(మతం కావలసింది పేద వాళ్ళకు. ఆశే జీవిత సారథి. ఆశను కలిగిస్తున్నట్టిది మతం. అందుకే మానవజాతి మతం ఒడిలో ఓదార్పును పొందుతున్నది. పేదవాళ్ళు మతాన్ని పట్టుకు వేలాడడానికి కారణం అదే.)

ఇది డాక్టర్ అంబేడ్కరు చెప్పింది కాదు, ఆయనకు తన అధ్యాపకుడైన జర్మన్ ప్రొఫెసరు వింటర్ నిట్జ్ చెప్పినట్టిది. (Thus spoke Ambedkar, Page 156-57)

అంటే ఏమిటి?

మతం పేదలకే గాని, ధనికులకు అవసరం లేదు అని!

పేదలంటే ఎవళ్ళు? ఈనాటి భాషలో చెప్పాలంటే – పేదలంటే హరిజనులు, గిరిజనులు, వెనుకపడిన కులాల వాళ్ళు, ఇంకా అజ్ఞానంలో కూరుకుపోయి వున్న శూద్రాదులు. అన్నికులాలకూ చెందిన స్త్రీలు!

ఈ పేదలే ఇంకా అజ్ఞానాంధకారంలో మునిగివున్న వాళ్ళు! వీళ్లే ఈనాడు మతాన్నీ, భక్తినీ నిలబెట్టి వుంచుతున్న వాళ్ళు! రాబందుల వంటి మతాధిపతులకూ, బాబాలకూ పాదసేవలు చేస్తున్న వాళ్ళు!

మతమూ, భక్తీ నిర్మూలించబడితే తప్ప మానవజాతికి ముక్తి లేదని నేను చెపుతున్నదందుకే!

ప్రజలారా, ఆలోచించండి?

## కుల పిశాచం

"You will remember the case of an Air hostess who was rejected when her caste was known, but selected when it was not known!....." (Justice R.R. Bhole in his paper on the problem of untouchability and its solution)

కులం తెలియక ముందు గౌరవించబడి, తెలిసిన తర్వాత అవమానించబడే సందర్భాలు వేలు లక్షలు ఏర్పడుతూనే వున్నై ప్రతిరోజూ ఈ మన సమాజంలో!

"కుల వ్యవస్థ నిర్మూలించబడనిదే ఈ భారత సమాజానికి ముక్తి లేదు" అన్నాడందుకే డాక్టర్ అంబేడ్కరు. అందుకోసం "కులనిర్మూలన" అనే ఒక మహాగ్రంథాన్నే సృష్టించాడు! అది నిరుద్ధ కులాల వారికంటె, అగ్రకులాల వారే పారాయణ చేసుకోవలసిన నిజమైన ఆధునిక వేదం!

"The generation gap, of which so much is being talked, is nothing but a myth.... the real gap which is highly desirable is woefully lacking among the present youth.... They are not coming forward to annihilate the concept of caste... They are worshipping the political leaders and cine stars! - The youth of today are in no way better than the elders of yesterday.....!" అన్నారు న్యాయమూర్తి శ్రీ ఆవుల సాంబశివరావుగారు, ఆ మధ్యలో ఒక సభలో మాట్లాడుతూ.

హరిజన, గిరిజన వగైరా బలహీన వర్గాలకు ఈనాటికీ జరుగుతున్న అన్యాయాలను గురించి విచారం ప్రకటిస్తూ, ప్రభుత్వం న్యాయం చెయ్యలేకపోతున్నదని అంటూ, "Mass awakening" (ప్రజా జాగృతి) కావలసి వున్నదనీ, ఈ అన్యాయాలను కాంగ్రెసు వారంతా సాంఘిక సంస్థల సహాయంతో ఎదుర్కొనవలసి వున్నదనీ – ఆ మధ్య A.I.C.C. సభలో హెచ్చరించి వున్నారు మన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ!

The President, Sri V.V.Giri, underlined the need to amend Article 17 of the Constitution to provide for imposition of capital punishment to those who practised untouchability....

Inaugurating Dr. B.R.Ambedkar College of Arts, Commerce and Science at Hyderabad - deviating from the text of his speech... with a raised voice.... the President said that every one was born from his mother's womb and would go to the funeral pyre just like anyone, and in these phases of human life there was no distinction between caste and creed....

"The entire nation should exhibit its solidarity in blotting out this evil and stand by Harijans in resisting denial of human rights to the weaker sections of society. If untouchability or any disability based on caste is being practised in any part of the country by any one, the perpetrators of such practice should be branded as the biggest enemies of society and dealt with as such" he said.

(The Deccan Chronicle, 16-9-1973)

ఇవన్నీ ఇక్కడ ఎందుకు ఉదాహరిస్తున్నానంటే – నాకు పిచ్చెక్కి కాదు! ఇలాంటి ఉద్బోధలు పూర్వం చేసిన, ఇప్పటికీ చేస్తున్న మహానీయులంతా నా కంటె చాల గొప్ప వాళ్ళు కావడంవల్ల!

## మూడు పీడలు

నేను పిచ్చి వాణ్ణైతే–

ఆత్మవత్సర్వభూతాని

అహం బ్రహ్మాస్మి

సర్వే జనా స్సుఖినో భవంతు

నిన్నువలెనే నీ పొరుగువాణ్ని ప్రేమించు

వగైరా బోధలు చేసిన వేద ఋషుల నుంచి – నేటికీ అవే బోధలు చేస్తున్న మన రాజకీయ, సాంఘిక, మత ప్రభువుల దాకా అందరూ పిచ్చివాళ్ళే! కాకపోతే, మానవ స్వభావం తెలియని అమాయకులు!

బోధలకు బుద్ధీ, నీతులకు నిజస్వభావమూ మారవు.

మరెలా?

''మేలుకో! బలాన్ని కూడగట్టుకో! ఆందోళన చెయ్యి!'' అన్నాడు అంబేద్కర్.

''ప్రజలు మేలుకోవాలి'' అన్నది ప్రధాని ఇందిరాగాంధి!

ఈ మేలుకోవడం ఎలా?

మతానికీ, దేవుడికీ, భక్తికీ కట్టుబడిపోయి వున్నంతకాలం ప్రజలు మేలుకోలేరు. యుగయుగాలుగా ప్రజల్ని అంధకారంలో వుంచుతున్నట్టి మత్తు, మోసం ఈ మూటిదే?

మానవ జాతిని పుట్టుకతోనే పట్టుకున్న పీడలు ఈ మూడూ. ఇవి మనిషిని ఏ విధంగానూ పెరగనివ్వడం లేదు.

అందుకే మతం నుంచీ, దేవుడి నుంచీ, భక్తి నుంచీ విమోచన పొందవలసిందిగా నేను ప్రజల్ని ఉద్బోధిస్తున్నాను.

# నా గ్రంథమూ - నేనూ!

కేవలం సాంఘిక, మత, రాజకీయ విమర్శకు సంబంధించిన రచనలను మాత్రమే ఈ సంపుటిలో చేర్చాలని మొదట అనుకున్నాను. దీనికి "గుడిసెలు కాలిపోతున్నై" అనే పేరు పెట్టిందందుకే.

అయితే – నేను అనుకొన్న దొకటైతే – జరిగిందొకటైంది.

నాదొక విచిత్రమైన మనస్తత్వం. వంద పేజీల పుస్తకం ప్రెస్‌లో ఇస్తే, అది ప్రెస్ నుంచి బైటికి వచ్చేటప్పటికి రెండు వందల పేజీలవుతుంది!

ఈ గ్రంథం కూడా అలానే పెరిగింది!

"అమ్మో, దున్నలు" కవితనుచేర్చమన్నారు కొందరు మిత్రులు. "వాల్మీకి వనిత అయివుంటే" కవిత లేకపోతే ఎలా అన్నారొకరు. "రసాద్వైతం?" గుర్తుచేశారొకరు. "మారనివాడి మాట?" అన్నారింకొకరు!

అందుకని–

ఇంతవరకు నేను ఆకాశవాణితో సహా అనేకానేక కవిసమ్మేళనలలో చదివి, బాగున్నాయనిపించుకొన్న గద్య కవిత లన్నిటినీ ఇందులో చేర్చడానికే నిర్ణయించుకొన్నాను. చాలా వరకు చేర్చాను.

ఈ కవితా సంపుటిలో నేను ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపంగా కనిపించే ప్రమాదం వుంది.

"బోయి భీమన్న అంటే ఎవరు, ఏమిటి"? అని ఇప్పుడిప్పుడే ప్రశ్నించుకోవడం ప్రారంభించిన తెలుగు సహృదయులకు ఇప్పుడు నేను పూర్తిగా అర్థం కాని పరిస్థితి ఏర్పడవచ్చు కూడ.

నన్ను కొందరు నాస్తికుడనవచ్చు. మతమూ, భక్తీ, పూజలూ, భజనలూ మనిషికి అనవసరం అంటున్నానేకాని – విశ్వచైతన్య శక్తి లేదనడం లేదు. ఈ సత్యాన్ని రసజ్ఞులు గుర్తించగలరు.

సర్వలోకాలనూ, సర్వజీవులనూ ఒకే సూత్రాన నడిపిస్తున్న శక్తిని గురించీ, చావు పుట్టుకల నిజస్థితిని గురించీ పరిశోధన జరపగల మేధావితా, తీరికా కలవారు ఆ పని చేయవచ్చు. సరైన సమాధానం దొరకని సంఘటనలను దైవానికో, కర్మకో అంటగట్టడం మాత్రం పట్టి ఆత్మవంచన, లేక మోసం!

నేను ప్రజల్ని మేలుకొల్పే వైతాళికుణ్ణి.

ఇంతవరకూ – మత ప్రవక్తలు, నీతి బోధకులు, ధర్మశాస్త్ర కర్తలు వగైరా అందరూ కూడ ప్రజల్ని నిద్రపుచ్చుతూనే వచ్చారు. ఈ నిద్ర ఇంకా ఇలానే కొనసాగితే మొత్తం మానవజాతే దీర్ఘ నిద్రపోయే ప్రమాదం వుంది.

## మతానికో దేవుడా?

రామాయణ కాలంనాటి మానవుడికి, నేటి మానవుడికీ స్వభావంలో కాని, ప్రవర్తనలో కాని తేడా ఏమ్మైనా వున్నదా?

అంతేకాక, మానవుడు క్రమేణా అన్ని విధాలా దిగజారి పోతూ వస్తున్నాడు కదా? మతాలూ, మతాధిపతులూ, ధర్మశాస్త్రాలూ చేస్తున్న బోధలన్నీ ఏమ్మైపోతున్నై? ఆ బోధలకూ, నేటి సమాజంలోని మానవుడి ప్రవర్తనకూ సంబంధమేమ్మైనా వున్నదా? పెద్దలలో కాని, పిన్నలలో కాని నీతి, నిజాయితీ స్వార్థాన్ని మించి కనిపిస్తున్నాయా? కనిపిస్తున్న దైవభక్తి అంతా మూఢ భక్తో, మోసమో కదా?

అందుకే – మతాన్నీ, భక్తినీ ముందు తొలగించి పారవెయ్యవలసిందిగా యువకుల్ని హెచ్చరిస్తున్నాను.

బియ్యంలోని పురుగు బియ్యపు గింజలాగే వుంటుంది. ఆకుల్లోని పురుగు ఆకులాగే వుంటుంది. ఏ పదార్థం నుంచి పుట్టే జీవం ఆ పదార్థాన్ని పోలి వుంటుంది.

పర్వత శిఖరం మీది రాతి అణువూ, నదీ తీరంలోని మట్టి అణువూ, ఆ మట్టి నుంచి పుట్టే పచ్చిక అణువూ కాలవ్యవధికిలోబడి ఒక్కటే కదా?

దేశ కాల పరిస్థితులకు లోబడి, మానవ జాతి అంతా ఒకటే అయినప్పుడు, ఇన్ని మతాలెందుకు? ఒకో మతానికి ఒకో దేవుడా?

పరస్పర విరుద్ధాలైన సిద్ధాంతాలను కల్పించి, నీతులు బోధించి, మానవజాతిని కుల మత వర్గాలుగా చీల్చి పారవేసిన ప్రవక్తలూ, మతాధిపతులూ నిజానికి మానవ జాతి పురోభివృద్ధికి ద్రోహం చేసిన వాళ్ళే కావడం లేదా?

అందుకే – కుల మతాలను నిర్మూలించమంటున్న నా మీద, సత్యావిష్కరణ చెయ్యవలసిన బాధ్యత కూడ వుంది. ఈ సంపుటిలో ఉత్తమ సాహితికీ, ఉన్నత తత్వానికీ

సంబంధించిన రచనలను కూడ చేర్చడానికి హేతువదే! మట్టి నుంచి మణిమానసం దాకా వివిధ దృక్పథాలను ప్రజలకు చూపవలసిన బాధ్యత నాది.

ఒకో దృక్పథానికి ఒకో రూపంలో కనిపిస్తాను నేను. ప్రకృతి లాంటి నా అనేకత్వంలో పరమ చైతన్యం లాంటి ఏకత్వాన్ని సహృదయులు గుర్తించగలరు - ''మారని వాడు''లో మహా శివుణ్నివలె.

ఇక - ఈ సంపుటిలోని కవితలను గురించి నేనేమీ చెప్పదలచుకోలేదు, అవి దేని కదే పరస్పరం సంబంధం లేని స్వతంత్ర రచనలు. అయితే - అవి అరణ్యాలు కావు, ఉద్యాన వనాలు. సహృదయులు స్వేచ్ఛగా విహరించగలరు.

## వన్య వ్యవస్థ

మనం పిండీ గిండీ కలవని సిసలైన ఆవుపాలకు నోచుకోని శిశువులం. కనీసం అ ఆ లైనా ఉచితంగా నేర్చుకోడానికి నోచుకోని బాలలం!

సామర్థ్యాన్ని బట్టి బలంగా క్రికెట్ బంతిని విసరడానికి కూడ అవకాశం ఇవ్వబడని పేదవర్గాల విద్యార్థులం. భవిష్యత్తు అంధకార బంధురంగా కనిపిస్తున్న ఫస్టుక్లాసు గ్రాడ్యుయేట్లం!

వేలు పోసి ఉద్యోగాలు కొనుక్కోలేని పేద విద్యావంతులం. లక్షలతో పదవులు బేరం చేసుకోలేని నిజాయితీ సంఘ సేవకులం!

కులం పేరుతో, మతం పేరుతో, రాజకీయ పార్టీల పేరుతో అడుగడుక్కూ మోసగించబడుతున్న ప్రజలం! పేద గొర్రెలం!

ఈనాడు మానవ సమాజంలో వర్ణవ్యవస్థ అమల్లో లేదు. వర్గవ్యవస్థకు అవకాశం లేదు. వన్యవ్యవస్థ మాత్రం స్వైర విహారం చేస్తున్నది.

వన్యవ్యవస్థ అంటే జంతువుల సమాజం.

మానవులను నేను మూడు తరహాలుగా విభజిస్తున్నాను - (1) పులులు (2) నక్కలు (3) గొర్రెలు.

ఈ మూడు తరహాలూ ఎలా ఏర్పడుతున్నారంటే - వాళ్ళను నేటి సమాజమే అలా తయారుచేస్తున్నది. పురుషార్థాలు పునాదిగా వర్ధిల్లిన వైదిక సమాజం వర్ణవ్యవస్థ

అనే రోగంతో పతనమైపోయిన తర్వాత, ఇంతవరకు దాని ఉద్ధరణే జరగలేదు. అది వన్యవ్యవస్థగా తయారై పరస్పరం పీక్కు తింటున్నది. (పురుషార్థాలను గురించిన నా వివరణను రాగవాసిష్ఠం, ధర్మం కోసం పోరాటం వగైరా గ్రంథాలలో చూడగలరు).

సోషలిస్టు సమసమాజం ఏర్పడాలంటే ఈ వన్య వ్యవస్థ ముందుగా నాగరిక మానవ వ్యవస్థగా మారవలసి వుంది.

## నా పరిసరాలూ - నేనూ

నేను రసానంద వాదిని. రసాద్వైతిని. సృష్టిలోని ప్రతి అంశంలోను సౌందర్యాన్ని చూస్తాను. రసాస్వాదన చేస్తాను. ఇది నా ప్రకృతి. ఇది నా ప్రవృత్తి.

అయితే -

నేను అడవిలో తపస్సు చేసుకోవడం లేదు. మానవ సమాజం మధ్య కష్ట సుఖాలను అనుభవిస్తూ వున్న వాణ్ని.

కనుక -

సుఖాలనుభవించే మనస్తత్వం కలవాడిని కనుక, కష్టాలను చూస్తూ కళ్లు మూసుకోలేను.

నా చుట్టూ చిరునవ్వులు, పువ్వులు, నృత్యం, సంగీతం, ఉత్సాహం, ఉత్సవాలు ఎల్లప్పుడూ వెల్లివిరుస్తూ ఉండాలి. తద్విరుద్ధమైన ఆకలి, దైన్యం, ఏడుపు, మురికిపేటలు, గుడిసెలు, దేవురింపులు వగైరా చెత్తను, శిదరను నేను భరించలేను.

నేను ఆనందంగా వుండాలంటే - నా చుట్టు ప్రక్కల అంతా, అందరూ ఆనందంగా వుండాలి.

అయితే - నేను చెయ్యగలిగిందేమిటి?

నేను సంఘ సేవకుణ్నయితే - మానవుడి నేటి పాతిత్యానికీ, అతడిలో పెట్రేగిపోతున్న పైశాచిక ప్రవృత్తికీ వ్యతిరేకంగా గాంధీజీవలె సత్యాగ్రహోద్యమాన్ని నడిపి వుండే వాణ్ని.

నేను రాజకీయ సేవకుణ్నయి వుంటే - నేతాజీ వలె విప్లవోద్యమాన్ని లేవదీసి వుండే వాణ్ని.

సాంఘిక, రాజకీయ రంగాలలో వేడి నెత్తురు పొంగులెత్తే నిజాయితీగల యువకులు పూనుకుంటే తప్ప, మానవుడు మారడు. సమాజం పాపక్షాళితం కాదు.

ఈనాడు - ఒక్క గొర్రెలు తప్ప - తక్కిన రెండు తరహాల వాళ్ళూ పాపాన్ని పంచదారలా ఆరగిస్తున్న వాళ్ళే. వాళ్ళు తింటున్న ప్రతిముద్దా తోడి కష్టజీవుల నెత్తురు చెమట్లతో వటవట్లాడుతున్నట్టిదే. వాళ్ళు చెపుతున్న ప్రతి మాటా అబద్ధాల మూటే. వాళ్ళు చేస్తున్న ప్రతి పనీ మోసాల ఖనే.

కోటి విద్యలూ కూటి కోసమే అయినా - లంచాలు పట్టడం, లాభాలు గుంజడం ఈ రెండే నేడు మహా విద్యలుగా గద్దె లెక్కి కూర్చున్నై.

## దేవుడికే నా కున్నపాటి హృదయం వుంటే?

"The fundamentals of Hindu Society like Chaturvarna and the theory of Birth and Re-birth, had to be knocked down and caste system abolished. హిందూ సమాజపు ప్రాథమిక సూత్రాలైన చాతుర్వర్ణ, పునర్జన్మ వంటి వాటిని పూర్తిగా నిర్మూలించి పారవెయ్యాలి. కుల వ్యవస్థను రద్దు చెయ్యాలి'' అన్నారు దేశ రక్షణ మంత్రి శ్రీ జగ్జీవన్‌రాం - ఆ మధ్య విశాఖపట్నంలో ఒక సభలో మాట్లాడుతూ.

(The Deccan Chronicle. 1-10-1973)

ఇవే మాటలు వందల వేల సంవత్సరాలుగా మహర్షులు చెపుతూనే వస్తున్నారు. ఫలితం మాత్రం శూన్యం. కారణం? పులులూ, నక్కలూ!

మనం బైటకి అడుగు పెట్టగానే - మనకు ఎదురయ్యే శకునం ఏమిటి? బిచ్చగాళ్ళు, రోగులు, చింకిపాతల కూలీలు, మురికి మొగాల పేదలు!

ఈ నాటి మానవులలో ఎంత వేదన! ఎంత బాధ! ఎంత దుఃఖం!

నా తోడి మానవుల బాధల్నీ, యాతనల్నీ, దారిద్ర్యాన్నీ చూస్తుంటే - నా హృదయమే ఇంతగా విలవిల లాడిపోతున్నదే! ఈ సృష్టికి, కనీసం ఈ మానవ సృష్టికి ఆదినాథుడైన భగవంతుడనబడే వాడే ఒక డుండి వుంటే - అతడి హృదయం ఏమైపోవాలి?

నాకున్న హృదయంలో లక్షోవంతు అయినా భగవంతుడి కున్నదా?

కనీసం మానవ సమాజం నుంచి దారిద్ర్యాన్ని, రోగాన్నీ అయినా – ఒక్క వరద హస్తంతో అతడు రూపుమాప లేడా? లేకపోతే – అతడి కర్తృత్వం దేనికి? అస్తిత్వం దేనికి?

అందుకే, నేను చెపుతున్నాను–

దైవం అనబడే దొక ఆదిమవాస అనాగరిక అజ్ఞాన భావన! దానిని ఇంకా పట్టుకొని వేళ్ళాడడం అభివృద్ధి నిరోధక మూర్ఖత్వానికి నిదర్శనం!

సృష్టి దానంతట అది జరుగుతున్నది. నశిస్తున్నది.

ఎవరి సుఖం కోసం వాడు కృషి చేసుకోవడం, అడ్డం వచ్చే వాణ్ని అణిచి వెయ్యడం – ఇదీ జీవ స్వభావం! అదే మానవ స్వభావం!

బలం కలవాడే రాజు

Struggle for existence

Survival of the fittest

మొండివాడు రాజు కంటె బలవంతుడు

రాజ్యం వీర భోజ్యం

వగైరా సామెతలన్నీ పుట్టింది ఈ పరమసత్యం నుంచే!

వేదకాల మందు వేటాడి చంపిరి

దస్యుజాతి నరుల దారుణముగ,

నరుల హింస కంటె నాజీజ మేమిటి?

వాస్తవమ్ము నార్ల వారి మాట!

అంటూ పూజ్యులు డాక్టర్ నార్ల వెంకటేశ్వరావుగారు వ్రాసిన పద్యం వెనుక వున్న సత్యం ఇదే కదా!

## నేటి సాహిత్య విమర్శకులు

మారనివాడు కవితను రేడియోలో విని – "బోయి భీమన్న అంతటివాడు తన కవితకు వస్తువుగా ఒక విశాలతర విషయాన్ని కాక, పేద హరిజనుణ్ని ఎందుకు ఎంచుకొన్నాడో ఆశ్చర్యంగా వున్నది" అని వ్రాశారు కొందరు సమీక్షకులు. నాకు ఆ మాత్రం ప్రాముఖ్యం ఇచ్చినందుకు వారికి నేను కృతజ్ఞుణ్ణి. కాని –

పేద హరిజనుడు కవితా వస్తువుగా పనికిరాడా?

"హరిజనుడు పేదవాడే కావచ్చు. కవితకు మాత్రం పేదవాడు కాదు. అతడు సాక్షాత్తు పరమశివుడు?" అని అట్టి వారికి నేను మనవిచేస్తున్నాను.

"తోడి మానవుని జీవిత సమస్యలు
సూటిగా కాలేవా కవితా వస్తువులు?"

అంటారు ప్రజాకవి శ్రీ మాలకొండయ్యగారు. నిజానికి అవే కవితా వస్తువులు కావాలి. కానివి కవితలు కావు, కాష్ఠాలు.

సాధారణంగా ఈనాడు – కవులకు ఔచిత్య జ్ఞానం లేనట్టే, విమర్శకులకు కవిత్వ జ్ఞానం లేదు. పత్రికలలో ప్రకటనలు, వీధులలో నినాదాలు – ఇదే కవిత్వం నేటి విమర్శకులకూ, చదువరులకూ కూడ?

నేటి చదువరులు ఎడతెగని ప్రయాణికులు. విందులు, అందాలు, ఆనందాలు ఎరగరు వాళ్ళు. స్టేషనులలో దొరికే వేడి చారు, సాంబారు, తైరు మెతుకులే వాళ్ళకు జీవధార, ప్రాణప్రదం! మరి – వాళ్ళకు, పాపం, ఏవో నాలుగు నినాదాలు, పది ప్రకటనలు వరసగా ఏకరువు పెట్టే కవి నామక వెండరు (Vendor)లే మహాకవులు, కవితా బాబాలు.

సినీ తారల్నీ, నినాదాల కవుల్నీ, రేసు గుర్రాల్ని ఆరాధించే వాళ్ళు మేడిపండులోని పురుగులు కాగలరే కాని, గొంగళి పురుగులోని సీతాకోక చిలుకలు కాలేరు!

ఈనాడు పత్రికలే వాఙ్మయ పరమేశ్వరాలు. అవి ఊర్వశీ రంభా మేనకాది అప్సరసలు; ఓ వర్ధమాన యువకుల్లారా, వాటి కపట ప్రేమ ధృతరాష్ట్ర కౌగిళ్లలో చిక్కుకోకండి! అవి పెత్తందారీ ఏనుగులు! అవి తినే చెత్తలో–

పెత్తనమున ఏనుం గిల
చెత్తను తినవలసె, చీమ చిన్న తనమునే
హత్తుకొని తినును చక్కెర–

అంటూ, ఎప్పుడో ఏ ఆధ్యాత్మిక కవో చెప్పిన సత్యాన్ని గుర్తించి – మీరు కూడ ఆ చెత్తలో ఒక పరమ చెత్త కాబోకండి!

# మోసమా? మూర్ఖత్వమా?

అయితే – అదంతా చెత్త అని అనడానికి కూడ వీలు లేదు.

వాస్తవికత నుంచి, సత్యం నుంచి, జాగృతి నుంచి, ధర్మం నుంచి, ధర్మం కోసం పోరాటం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి పెత్తందారీ వర్గాలు, కులతత్వం వర్గాలు చేస్తున్న తీవ్రయత్నంలో ఇదొక భాగం కావచ్చు!

పడక కుర్చీల–గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ల – స్కాచ్ విస్కీల – నినాదాల రచయితలను విప్లవ యుగకర్తలుగాను, మడిగట్టుకొన్న సనాతన సమాధుల్ని జీవత్ బ్రహ్మలుగాను వర్ణిస్తూ – ఒకటే డబ్బా వాయించే పత్రికలు, విమర్శకులు, ప్రసార వేదికలు చేస్తున్న ప్రచారం అంతా నిజమనుకోవద్దు, అందులో మూర్ఖత్వానికి మించిన మోసం వుంది.

గొర్రెల్ని శాశ్వతంగా గొర్రెలుగానే వుంచడం, గుడిసెల్ని ఎల్లప్పుడూ గుడిసెలుగానే అట్టిపెట్టడం ఆ మోసం!

ధనిక వర్గానికి చెందిన యువకులలో కొందరు ఈ మోసానికి తోడ్పడే నిమిత్తం మీకు నాయకత్వం వహించడానికి రావచ్చు. పేద వర్గాల యువకుల్లారా, జాగ్రత్తగా వుండండి!

దెయ్యాలు వేద పఠనం చేస్తాయి! బహు పరాక్!

అది మోసానికి పరాకాష్ఠ అయితే –

మూర్ఖత్వానికి పరాకాష్ఠ ఇది చూశారా?

ఆస్తికుల, భక్తుల పరమ భాగవత దృష్టితోనే చూడండి–

కేవల శక్తిస్వరూపిణి అయిన, మహాశివుణ్ని కూడ అలక్ష్యం చెయ్యగలిగిన, దున్నపోతుల్లాంటి రాక్షస పురుషుల్ని ముక్కచెక్కలుగా నరికిపోసిన మహాదుర్గను ఆరాధించడానికి కదా దేవీ నవరాత్రులు జరుపుకొనేది?

వాటిని ఈనాడు ఎలా జరుపుతున్నారు? శ్రీ వేంకటేశ్వరస్వామి వారి చిలిపి సెక్సు సినిమా పాటలతో కాదా? రణ దుర్గకు శృంగారాన్నా వినిపిస్తున్నారు? ఇది నిజానికి దేవికి అపచారమూ, దైవానికి ద్రోహమూ కాదా?

ఇది భక్తా?

మూర్ఖత్వానికి పరాకాష్ఠ కాదా?

అందుకే – ఈ చెత్తనంతా తగలబెట్టమంటున్నాను. మరమ్మత్తుకు లొంగనంతగా చెడిపోయింది మన సమాజమూ, మతమూ, భక్తీ! పూర్తిగా నిర్మూలించకుండా సామాజిక నవ నిర్మాణం సాధ్యం కాదు.

మానవుడు నేటి పైశాచిక పథం నుంచి, తిరిగి మానవతా మార్గానికి మారాలంటే – అందుకు యువకులు నడుం కట్టవలసిందే.

## గుడిసెలంటే జ్ఞాపకం వచ్చింది

"గుడిసె లంటే జ్ఞాపకం వచ్చింది" – అన్నారు శ్రీ తిరుమల రామచంద్ర. ఆయన గొప్ప విద్యాంసుడు, బహు భాషావేత్త, రచయిత, జర్నలిస్టు మాత్రమే కాక, నాకు చిరకాల మిత్రుడు కూడ.

"అది 1925. అప్పటికి నా వయస్సు 12. తిరుపతిలో, శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాలలో చదువుతున్నాను... ఒకనాడు ఆ దగ్గరలోని హరిజనవాడకు నిప్పంటుకొన్నది. సవర్ణు లెవళ్ళూ ఆర్పడానికి వెళ్ళలేదు. ఏభైయేళ్ళ నాటి మాట. అంటు జాడ్యం ఏ మాత్రమూ సడలని రోజులవి...

"ఆ మంటలు, ఆ ప్రజల హాహాకారాలు చూచి నేను భరించలేకపోయాను. వాటికేసి పరిగెత్తాను. నా వెనకనే – నాకు వలెనే జుట్టూ, ఊర్ధ్వపుండ్రాలూ ధరించి వున్న నా సహ విద్యార్థులంతా పరిగెత్తుకువచ్చారు.

'మే మంతా ఆ గుడిసెల్లో దూరి, దొరికిన కుండా మండా పుచ్చుకొని, ఆ మంటల్ని ఆర్పసాగాం. అప్పుడు కొందరు సవర్ణ పెద్దలు కూడ ధైర్యం చేసి మాకు తోడు వచ్చారు. కొన్ని గంటలు పనిచేసి మంటల్ని ఆర్పేశాం.

'మేము ఆ పనిచేసి మైల పడ్డామని కొంతమంది సవర్ణ పెద్దలు మమ్మల్ని తిట్టి పోసినా – మా గురువు గారైన శ్రీమాన్ గిరిధరాచార్యులవారు మాత్రం మానవతా దృష్టిని ప్రదర్శించి మమ్మల్ని ఆశీర్వదించారు. ఇప్పుడీ మంటలు చూచి, ఆ మంటలు జ్ఞాపకం వచ్చాయి–"

జనరేషన్ గేప్ అంటే ఇదీ! యువకులు ముందుకుపోవడం అంటే ఇదీ!

ఏభై యేళ్ళ నాటి యువకుల్లో అట్టి అభ్యుదయ భావాలు, కార్యదీక్ష, ధైర్యసాహసాలు ఈనాటి యువకుల్లో ఉన్నాయా?

## యువకులు - భావ విప్లవం

భావ విప్లవం, జాతి సమైక్యం, కుల నిర్మూలన, సమ సమాజ స్థాపన, శ్రేయో రాజ్య సిద్ధి - ఈ పంచ లక్ష్యాలనూ సాధించాలంటే, అందుకు ఒక్క యువకులే సమర్థులు.

యువకులంటే - ఎన్నికల జ్వరమూ, పదవుల పిచ్చి, అధిక ధనాశా వంటి రోగాలున్న సోషల్ వర్కర్లూ, చోటా లీడర్లూ కాదు.

స్వార్థం లేని యువకులు.

నేను రచయితను కనుక - అట్టి నిస్వార్థ వీరయువతరాన్ని ఉద్బోధించగలను. అదొక్కటే కవిగా నాకు చేతనైన పని.

ఈ పని నేను నా చిన్నప్పటి నుంచీ చేస్తూనే వున్నాను.

ఈ కవితలలో ఒక్క పంక్తి అయినా, ఒక్క హృదయం గల యువకుడినైనా యోధనాయకుడుగా మార్చగలిగితే - అంతకంటె నాకు వేరే ధన్యత ఏంకావాలి?

ఇందులో - నా రచన లన్నిటికీ స్వభావ సిద్ధాలైన - రసమూ, ధర్మమూ, తత్త్వమూ ఒక్కొక్క చోట అంతర్వాహినిగా, ఒక్కొక్క చోట గట్లొరసు కొంటూ ప్రవహిస్తూ వుంటాయి. పరిణత హృదయులు గుర్తించగలరు.

జిజ్ఞాసను, జ్ఞాన పిపాసను, విశ్వజనైక దృష్టిని, మానవ బాధ్యతను ఎదిగే బాల మనస్సులలో ప్రజ్వలింప జెయ్యడమే నా ఏ రచనకైనా లక్ష్యం. ఇవన్నీ ఎందుకంటే సమ్యక్ సుందరమైన ఆనందం కోసం.

నీ ప్రక్కవాడి క్షేమం నీ క్షేమానికి అవసరం. నీ గాదెలో గింజలు భద్రంగా వుండాలంటే నీ పొరుగు వాడు పస్తులు పడ గూడదు.

ఇంతవరకు ఏది ఎలా జరిగినా - ఇక ముందు మాత్రం గొర్రెలు గొర్రెలుగా వుండవు. గుడిసెలు గుడిసెలుగా వుండవు.

## జరగవలసిందేమిటి?

అనేక విధాలుగా చెక్క ముక్కలైపోతున్న ఈ దేశాన్ని, ఈ జాతిని రక్షించాలంటే-

1. పార్లమెంటు, కేంద్ర ప్రభుత్వం మాత్రమే డైరక్టుగా అన్ని రాష్ట్రాలను పరిపాలించాలి.
   రాష్ట్ర శాసన సభలూ, రాష్ట్ర మంత్రి వర్గాలూ వుండకూడదు. అంటే, పూర్తిగా Unitary Type కేంద్ర ప్రభుత్వం ఏర్పడాలన్నమాట.
   అప్పుడే - భాష, ప్రాంతం, సంప్రదాయం, జీవిత పద్ధతి వగైరా భేదాలతో ప్రజలు కొట్టుకుచావడం నిరోధించబడుతుంది. దేశం చిన్న చిన్న రాజ్యాలుగా మళ్ళీ విడిపోయే ప్రమాదాల నుంచి రక్షించబడుతుంది.
   కేంద్రం అప్రతిహత బలదర్పాలు కలదై వుండాలని డాక్టర్ అంబేడ్కర్ కూడ ఆనాడు ఉద్ఘాటించి వున్నాడు.
2. ఉత్పత్తి, పంపిణీ, రవాణా వగైరా సాధనాల నిర్వహణ - ఆయా సాధనాలను నడిపే రైతుల, కూలీల, ఉద్యోగుల ప్రాతినిధ్యపు అజమాయిషీలో కొనసాగాలి. యాజమాన్యం ప్రభుత్వం చేతిలోనే వుండాలి.
3. విద్య హైస్కూలు స్థాయి వరకు కఠినమైన క్రమశిక్షణతో బోధించబడాలి. కాలేజీ, యూనివర్సిటీ విద్యపై ఆయా విద్యార్థి ప్రతినిధుల అజమాయిషీ వుండాలి. ఏ స్థాయిలోను ప్రయివేటు యాజమాన్యం అనుమతించ బడగూడదు.
4. భిక్షాటన పూర్తిగా నిషేధించబడి, కఠినంగా అమలుపరచబడాలి. వీధుల్లో రోడ్లమీద ఎక్కడా ముష్టివాళ్ళు, రోగులు కనిపించగూడదు.
5. చిన్న చిన్న పల్లెటూళ్ళు రద్దుచేయబడి, అన్ని ఆధునిక సౌకర్యాలతోను పట్టణాలు అభివృద్ధి చెయ్యబడాలి. పల్లెటూళ్ళు యథాతథంగా వున్నంతకాలం కుల మత విభేదాలు నశించవు.
6. అసలు మానవజాతిని సర్వనాశనం నుంచి ఉద్ధరించాలంటే - మతాన్ని, భక్తిని బహిరంగంగా ప్రదర్శించకుండా, ప్రచారం చెయ్యకుండా నిషేధించాలి.
7. సంప్రదాయం, వంశధర్మం వంటి చిలక పలుకుల్ని ప్రోత్సహించకూడదు. యువకులు గతాన్నే పట్టుకొని వ్రేలాడుతూ వుండడం మానాలి.

## మానవుడు బ్రతకడం ఎందుకు?

మానవ జీవిత లక్ష్యం మధురంగా బ్రతకడం. ఈ లక్ష్య సాధనకు–

(1) మతం, వర్గం, స్వార్థం లేని సమాజం ఏర్పడాలి.

(2) కూడు, గుడ్డ, కొంప ప్రతి మనిషికీ లోటులేకుండా లభించాలి. అలా లభించ డానికి మతం, వర్గం, స్వార్థం అడ్డవస్తున్నాయి కనుక, వాటిని నిర్మూలించాలంటున్నాను.

మత పట్టుదల కల ప్రతివాడూ నాస్తికుడే నా దృష్టిలో. బహు విధాలుగా వున్న సృష్టి కంతకూ తండ్రి ఒకే భగవంతుడనే సత్యం తెలియని మూర్ఖుడతడు. భగవంతుని సమభావం మీద విశ్వాసం లేని వాడతడు.

మానవజాతి సమస్తాన్నీ ఏక కుటుంబంగా కలిపి వుంచవలసిన మతం ఎక్కడికక్కడ ముక్కలుచేసి పారేసింది.

వందల వేల సంవత్సరాల క్రితం – అప్పటి పరిస్థితుల కనుగుణంగా, ఎవరో తమ వంశం వాడు చెప్పిన మాటే ఈ నాటికీ వేదమా?

మానవ చరిత్రలో మతం చిందించి నంత మానవ రక్తాన్ని మరే క్రూర రాక్షస మూక అయినా చిందించిందా?

మతరక్త పిపాసువు, మానవతకు పరమ శత్రువు.

ఇక, వర్గం మాట–

వర్గ రహిత సమాజం కావాలంటూ, వర్గ వైరాన్ని ప్రోత్సహించడం అర్థరహితం.

ధన స్వామికంలో ధన నాయకుడు ప్రభువైనా, ప్రజాస్వామికంలో ప్రజా నాయకుడు ప్రభువైనా, కార్మిక నియంతృత్వంలో కార్మిక నాయకుడు ప్రభువైనా, చేసే పని ఒక్కటే. తన చుట్టూ కొందరు స్వార్థపరులూ, కఠినులూ అయిన గ్రహాలను కూడగట్టుకొని, అధికారాన్ని హస్తగతం చేసుకొని, మిలిటరీ సహాయంతో ప్రజల్నీ, ప్రజ్ఞానుల్నీ అణచివుంచడం! భావ వికాస స్వేచ్ఛను అరికట్టి, తానే అధికార పీఠానికి అతుక్కుపోవడం!

రాజ్యం వీర భోజ్యం అనే సూక్తిలోని ఆంతర్యం ఇదే. అనాడు వీరుడు అనే పదానికి నేటి పర్యాయపదం రౌడీ.

ఆనాడూ, ఈనాడూ, ఏనాడూ రాజ్యం రౌడీదే.

అందుకే – వర్గతత్వం మానవాభ్యుదయానికి శత్రువంటున్నాను.

ఇక – స్వార్థం ప్రజాస్వామ్యానికే వేరు పురుగు. తాను సుఖంగా బతకడానికి చాలి నంతకు మించి, అదనంగా ధనం సంపాదించే వాడు ప్రజ్ఞావంతుడే. కాని, దాన్ని తనకోసమే దాచుకొనేవాడు మాత్రం మానవ ద్రోహి, దైవద్రోహి.

బాల్యావసరాలు, విద్య, ఉద్యోగం, వైద్యం, వృద్ధాప్యావసరాలు – వీటి బాధ్యతను ప్రభుత్వమే వహించవలసి వుంది – అది నిజంగా ప్రభుత్వం అనిపించుకోగల అర్హత గలదైతే!

ఇవన్నీ సాధ్యమా?

సాధ్యమే – ఒక్క నిజమైన జనరేషన్ గేప్‌సి సమాజం సాధించగలిగితే!

సంప్రదాయం అనే మురికి చింకి పాతల్ని తీసిపారేసి, మతం అనే తరతరాల బురదను విజ్ఞానపు వేడి నీటిలో కడిగి వేసుకోగలిగితే!

## అంకితం చరిత్ర

ఒక సాయంకాలం నేను, సుప్రసిద్ధ చిత్రశిల్పి అయిన శ్రీ పి.టి.రెడ్డిగారి చిత్రశాలలో కూర్చుని, టీ త్రాగుతూ, ఆయన వేస్తున్న "గుడిసెలు కాలిపోతున్నై" గ్రంథం ముఖ చిత్రాన్ని పరికిస్తుండగా – మిత్రులు శ్రీ తిరుపతిగారూ, అప్పారావుగారూ నన్ను వెతుక్కొంటూ అక్కడికి రావడం చూచి, ఆశ్చర్యపోయాను.

(ఆ ఇద్దర్నీ నేను వెతుక్కొంటూ పోయిన సందర్భాలే కాని, వారిలో ఏ ఒక్కరూ నన్ను వెతుక్కొంటూ వచ్చిన సందర్భాలు నాకు జ్ఞాపకం లేదు!)

(పైగా – అక్కడ, ఆ సమయంలో వారు నన్ను పట్టుకోవడం – నాకు హాలీవుడ్ క్రైం పరిశోధక సన్నివేశాలను జ్ఞప్తికి తెచ్చి, నేను మరీ చకితుణ్ని అయాను. అదే అక్కడి కక్కడ మేం అనుకొన్నాం కూడ!)

గుడిసెలు కాలిపోతున్నై అనే ముఖ శీర్షికను అప్పారావుగారు మొట్టమొదటగా చూచిందక్కడే!

చిత్రాన్ని తీసుకొని, అప్పారావుగారి కారులోనే బ్లాక్ మేకర్ వద్దకు వెళ్ళి, అక్కడ దాన్ని ఇచ్చి, మా ఇంటికి వచ్చాం.

అప్పుడాయన ,అన్నారు – ''మీ గ్రంథ నామం చూచినప్పుడు నాకొక వుద్దేశం కలిగింది'' అని!

వెంటనే నే నన్నాను – ''ఈ గ్రంథంలోని, ఈ శీర్షికతోగల రచనను నేను వ్రాసిన ఆ క్షణంలో నా మనస్సులో ఒక వ్యక్తి మెరిశాడు'' అని!

ఆ తర్వాత మా సంభాషణ తమాషాగా నడిచింది. చిత్రమేమిటంటే – ఏనాడో నా మనస్సులో మెరిసిన వ్యక్తీ, అప్పారావుగారి వుద్దేశంలో వ్యక్తీ ఒక్కడే కావడం!

ఆ వ్యక్తే తొలిసారిగా జాతీయ గుడిసెల సంఘాన్ని స్థాపించి, గుడిసెల కొక వ్యక్తిత్వాన్ని కల్పించి, గుడిసెల వాళ్ళకు ఒక పోరాట శక్తిని ప్రసాదించిన కార్మిక నాయకుడు శ్రీ జి.వెంకటస్వామిగారు!

పగలంతా కూలి నాలి చేసుకొంటూ, రాత్రుళ్ళు గుడిసెల్లో తలదాచుకొంటూ, దిక్కు మొక్కూ కనిపించక, దీనంగా హీనంగా బ్రతుకులు సాగించే నిరుపేదలకు ఒక రక్షకుడుగా అవతరించిన వాడు శ్రీ వెంకటస్వామి గారు.

అందుకే–

''ఈ గ్రంథాన్ని వెంకటస్వామి గారికి అంకితం ఇస్తే–'' అని అప్పారావుగారు అంటున్నప్పుడు–

''చాల బాగుంటుంది'' అనేశాను నేను, ఆయన మాటను మధ్యలోనే అందుకొని!

## గుడిసెలే గుడిగంటలు

ఈ గుడిసెల వాళ్ళను, ఈ నిరుపేద జీవుల్ని సముద్ధరించడానికి పుట్టిన నిజమైన నిస్వార్థ నాయకుడు వెంకటస్వామిగారు. ఆయనకు ఈ కావ్యం అంకితం కావడం – శ్రీకృష్ణుడికి రుక్మిణి అంకితం కావడం! అంత వీరోచితం, అంత సహజం!

ఈ సహజ సమాగమాన్ని సమకూర్చి పెట్టిన శ్రీ అప్పారావు మహాశయులకు నేను సర్వదా కృతజ్ఞుణ్ని!

శ్రీ వెంకటస్వామిగారి జన్మస్థలం హైదరాబాదులోని గౌలీపురా, జన్మతేదీ 1929, అక్టోబరు 5. తండ్రి శ్రీ మల్లయ్యగారు, తల్లి శ్రీమతి పెంటమ్మగారు.

నైజాం రాజ్య కాలంలో ఉరుదూ అధికార భాషగా వుండేది. ఎవరైనా సరే – చదువుకోవాలనుకుంటే ఉర్దూ భాష మీడియంగా చదువుకోవలసిందే. వెంకటస్వామి గారు కూడ ఉర్దూ మీడియంగానే విద్యాభ్యాసం చేశారు. ఉర్దూలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. తెలుగు ఎలానూ మాతృభాషే. ఇంగ్లీషులో వారి వైదుష్యమంతా స్వయం కృషి ద్వారా సాధించుకొన్నట్టిదే!

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందో, లేదో! చిన్నప్పటి నుంచీ కూడ వెంకటస్వామి గారిది మాత్రం నాయక స్థానమే. విద్యార్థిగా వున్నప్పుడే నిజాం నిరంకుశ పాలనను ప్రతిఘటించి ఉద్యమాలు నడిపించిన యువ యోధుడీయన. (1946)

జి.వెంకటస్వామి అనే పేరుతో అవినాభావ సంబంధంగల పేర్లు (1) The National Huts Union (2) The Indian National Trade Union Congress. హైదరాబాదులో జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు స్థాపించబడిందంటే, దానికి వెంకటస్వామిగారే సూత్రధారి. 1961 నుంచి మూడేళ్ళపాటు దానికి ఆయనే అధ్యక్షుడు ! ఇక్కడ ట్రేడ్ యూనియన్ ఉద్యమానికే ఆయన జీవగఱ్ఱ.

ఇక, గుడిసెలంటే – గుడిసెలకు ఒక వ్యక్తిత్వం కలిపించిన వాడే వెంకటస్వామిగారు. గుడిసెల వాళ్ళకు ఈయనే వెలుగు, వేగు జుక్క!

ఈ గుడిసెల సంఘం సభ్యత్వం 75 వేలట! 50 లక్షల రూపాయలకు మించి విలువచేసే ఇళ్ళ స్థలాలను ఈ నిరుపేదలకు ఆయన సేకరించి పెట్టాడంటే – ఆయనను మించిన నిజమైన ప్రజాసేవకుడు, సరియైన కార్మిక నాయకుడు మరెవరు అన్న ప్రశ్నకు జవాబు వెతుక్కోవలసిందే కదా!

పేదలకు, ధనికులకు మధ్యగల అంతరాలను నిర్మూలించడానికి, పేదలను సమ సమాజ స్థాయికి పెంచడానికి సహకార రంగాన్ని కూడ వెంకటస్వామిగారు సాధనంగా చేసుకొన్నారు. పేదల కోసం ఆయన ఏర్పరచిన సహకార సంఘాలు అనేకంగా సహకారోద్యమ మాధవీలతకు ఆయన మధుర సహకారం.

1959లో, జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సంఘ సమావేశానికి భారత ప్రతినిధిగా హాజరై, వెంకటస్వామిగారు – ఏతత్సమావేశానికి తమ అమూల్య సలహాలను

ఇవ్వడమే కాక ఆయా దేశాల పర్యటనలో తాము సేకరించిన అనుభవాలను తమ ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దడానికి పూర్తిగా వినియోగించారు. 1972లో ట్రేడ్ యూనియన్ మహాసభల సందర్భంగా రష్యా దేశ పర్యటన జరిపారు.

## వెంకటస్వామిగారి హేతువాదం

భారత రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ బిరుదాన్ని తీసుకోవడానికి 1973 మార్చిలో నేను ఢిల్లీకి వెళ్ళి, దాన్ని తీసుకొని, మా నాన్న పల్లయ్య గారు స్మృతి పథానికి తగలగా, అక్కడి నుంచి హరిద్వార్ వెళ్ళాను.

తాను ఎప్పటికైనా హరిద్వార్ వెళ్ళి, ఆ ప్రాంతాల అడవుల్లో తపస్సు చేసుకొంటానని మా నాన్న తన శిష్యులతో అంటూ వుండేవారు. అప్పటికి నేను చాల చిన్న పిల్లవాణ్ని. ఆయన కోరిక తీరనే లేదు.

నా పద్మశ్రీని మా నాన్నకు అంకితం చేసి, ఆయన కోర్కెను Posthumous గా అయినా తీరుద్దామనే వింత భావం నాలో కలిగింది.

అందుకే – హరద్వార్ వెళ్ళాను. అక్కడ సంధ్యా సమయంలో మహాశివుడికి జరిగే దీపోత్సవంలో పాల్గొని, మా నాన్నకు పద్మశ్రీని అంకితమిస్తూ వ్రాసిన పద్యాలను ఒక దీపకుండికలో వుంచి బ్రహ్మ కుండంలో వదిలేశాను.

ఓహో, ఆ గంగా వేగంలో ఆ హారతి దీపాల అపూర్వ సుందర దృశ్యం!

మా నాన్న ఊహించి వుండిన హరిద్వార్‌ను, అక్కడి గంగను, శివాలక పర్వతాలను, మనసాదేవిని, హృషీకేశ ఆశ్రమాలను చూచి, తిరిగి ఢిల్లీ వచ్చి – శ్రీ బి.ఎన్.మూర్తి నండూరి విఠల్ గార్లకు అతిథిగా వుంటూ, ఒక సాయంత్రం సరదాగా ఆంధ్రా గెస్టు హౌసుకు వెళ్ళగా–

అక్కడ కనిపించారు శ్రీ జి.వెంకటస్వామిగారు – శ్రీ కె.రాజమల్లు, ముత్యాలరావు మొదలైన మిత్రుల ఇష్టాగోష్ఠిలో.

''పద్మశ్రీ మీ నాన్నగారికి అందిందా?'' అన్నారాయన, నా యాత్ర వివరాలు విని, తమాషాగా!

హేతువుకు అందని, నిలవని ఏ విషయమూ వెంకటస్వామి గారికి నచ్చదు. ఆయన ఎంతటి ప్రజాసేవకుడో, అంతటి హేతువాది అన్న సత్యం నేను గ్రహించిందప్పుడే.

ఆయనను నేను పదిహేనేళ్ళుగా ఎరిగివున్నా – ఆయన కేంద్ర మంత్రి అయిన తర్వాత, అదే ఆయనను మొదటిసారి చూడడం. ప్రజల – ముఖ్యంగా పేదల, కార్మికుల హక్కుల కోసం, వారి అభ్యుదయం కోసం నిరంతర కృషి, పోరాటం – ఇదే ఆయన నిత్య కార్యక్రమం. ప్రజల దైనందిన జీవిత పురోగతికి తోడ్పడని సెంటిమెంట్లు, ఆచారాలు, విశ్వాసాలు ఆయనకు కిట్టవు. అట్టి వాటికి ఆయన పూర్తి వ్యతిరేకి కూడ.

అది కదా నిజమైన నాయకత్వానికి వుండవలసిన లక్షణం!

శ్రీ వెంకటస్వామి గారు విశ్వ మానవతకు ప్రతీక. దీన జనోద్ధరణకు అపర అంబేడ్కరు. మానవాభ్యుదయం విషయంలో రాజకీయం లేని నిష్ఠావ్రతుడు. ధైర్యానికీ, స్థైర్యానికి సవ్యసాచి, సుఖ దుఃఖాలకు అతీతుడైన శుద్ధ కర్మయోగి.

''దేశం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించి, సాంఘిక విప్లవం సంభవించనిదే హరిజనులకు, దుర్బల వర్గాలకు విముక్తి సాధ్యం కాదు'' అన్నారు శ్రీ వేంకటస్వామిగారు ఆ మధ్య ఒక సభలో మాట్లాడుతూ (ఆంధ్రప్రభ, 4-10-73).

ఆర్థిక స్వాతంత్ర్యం, సాంఘిక విప్లవం – ఇదే ఆయన నిరంతర కృషికి లక్ష్యం. కబుర్లవల్ల సాధ్యపడే లక్ష్యం కాదిది. అందుకే ఆయన ప్రజల మధ్య నిల్చి పనిచేస్తున్నది.

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించి, దానికి అధ్యక్షుడుగా వుండి, దాని ఆధ్వర్యాన హైస్కూళ్ళను, కాలేజీలను, తదితర అభివృద్ధి సంస్థలను నెలకొల్పుతూ, హరిజన సేవా, శ్రామిక జనసేవా చేస్తున్న నాయకుడు, ముఖ్యంగా పదవిలో వున్న నాయకుడు యావద్భారతంలోను ఒక్క వెంకటస్వామిగారు కాక మరొకరెవరు?

భారత కేంద్ర ప్రభుత్వంలో ఇప్పుడు వెంకటస్వామిగారు కార్మిక శాఖా డిప్యూటీ మంత్రి, ఆయన ప్రజాసేవాసక్తికి, ఆత్మ శక్తికీ అంకితం ఈ నా విప్లవ కావ్యం.

# వేదమా? అరణ్యమా?

ఈ పీఠిక ఒక అరణ్యంలా వున్నట్టుంది కదూ?

భావం ఎలా వస్తే అలా అక్షరగతం చేశాను. ఇది ఒక రకమైన (Stream of Conscience) చింతనా ప్రవంతి. ఇది వేదం లాంటిది. దీన్ని ఒక క్రమంలో ఎడిట్ చెయ్యాలంటే ఒక వ్యాసుడంతటివాడు కావలసిందే. అందుకు తావుంతా ప్రయత్నించవలసిందిగా సహృదయ పాఠక మహాశయుల్ని కోరుతున్నాను.

కవితా గ్రంథానికి రాజకీయ పీఠిక వ్రాశాను. గ్రంథంలోని వివిధ రచనలలో నేను వెలిబుచ్చిన భావాలకు ఇది కొంత వివరణ.

జానపదుని జాబులు, పాలేరు, కూలిరాజు, ధర్మంకోసం పోరాటం వంటి గ్రంథాలు సాంఘిక ప్రయోజనం కలిగినట్టివే. సాంఘిక, రాజకీయ విషయాలను కవితా వస్తువులుగా స్వీకరించి నట్టివి. ఆ కోవలోది ఈ గ్రంథం.

నేను ప్రధానంగా కవిని. వస్తువేదైనా – దాన్ని కవిత్వీకరించడం నా జీవ ధర్మం, అయితే– ఈ గ్రంథంలో నేను దర్శించిన కొన్ని మత, సాంఘిక, రాజకీయ సత్యాలను సూటిగా చెప్పక తప్పలేదు.

"The poet is not as others are... He looks at the world and has views on what he sees. He regards his fellow men and has something to say. He contemplates nature ... in forming these views and in the literary finesse of presenting them, he is set apart from his fellows..." అంటున్నది. The Sunday Standard (7101973) పత్రిక, తన సంపాదకీయంలో – సమాజం నడుమ కవి యొక్క సంగ నిస్సంగ ద్వైదీ బాధ్యతను గురించి.

ఒక్కొక్కప్పుడు – ముఖ్యంగా ఈనాడు, కళాత్మకంగా చెప్పితే సమాజం గ్రహించలేనప్పుడు, కఠినంగా చెప్పవలసి వస్తుంది. తప్పదు మరి.

వేదం భగవంతుడి ఊపిరి అయితే –

ఇది నా ఊపిరి!

భగవంతుడు వేదకాలంనాడే కాదు. ఈనాడు కూడ వున్నాడు. కాగా, వేదం ఈనాడు కూడ పుడుతుంది. నా నుంచి కూడ పుడుతుంది.

"నేనేది చెపితే అది వేదం" అన్నా నందుకే.

సూర్యగతిని బట్టి వాయు సంచారం మారేటట్టే - దేహ స్థితిని బట్టి భావ సంచారం మారుతూ వుంటుంది. పిడుక్కీ, బియ్యానికీ ఒకటే మంత్రం కాదు, కారాదు.

ఆనాటి భగవంతుడూ, ఈనాటి భగవంతుడూ ఒక్కడే కావచ్చు. అతడి వూపిరిలో మాత్రం దేశ కాలాల తేడావుంటుంది. వుండక తప్పదు. ఆనాడది వేదం. ఈనాడిది వేదం.

ఇప్పటికైనా ప్రజలు, ముఖ్యంగా యువకులు, ఈ సత్యాలను గుర్తించి, కాలానుగుణమైన మార్పును సాధిస్తే మానవజాతి మనగలుగుతుంది. లేకపోతే - తను ఆరాధిస్తున్న సమాధులలో తాను కూడ ఒకటై పోతుంది.

జ్ఞానోదయమా! ఈ మానవజాతి కళ్ళు తెరిపించు! యువకుల్లారా! మేల్కొనండి! మీ తాతల సమాధుల్ని వదిలి, ఇటు అభ్యుదయంలోకి రండి!

హిమానీ
భాగ్యనగరు

బోయి భీమన్న
10-10-1973

# ఎందరికో - వందనాలు

మానవ సమాజంలో ఒక మూల పేరుకు పోయిన దైన్యాన్నీ, దారిద్ర్యాన్నీ, మూర్ఖత్వాన్నీ, దుఃఖాన్నీ కాల్చిపారవెయ్యాలంటే - మరో మూల వికటాట్టహాసం చేస్తున్న స్వార్థాన్నీ, సంకుచితత్వాన్నీ, దౌర్జన్యాన్నీ, ధనిక వర్గ నాయకత్వాన్నీ కూడ కాల్చివెయ్యక తప్పదు.

ఒక గుడిసె కాలిపోతే, దాని స్థానంలో మరో గుడిసె లేవగూడదు. గుడిసెల స్థానంలో శుభ్రమైన మంచి గృహాలు ఆవిర్భవించడమే ప్రగతి. సమాజ భావనలో ఒక తీవ్ర విప్లవం వచ్చినప్పుడే ఈ లక్ష్యం సిద్ధించడం.

ప్రజలలో తరతరాలుగా పాతుకుపోయిన పాత భావాలను, ఆచారాలను, సంప్రదా యాలను తుడిచివేసి, ఆధునిక విజ్ఞానానికి అనుగుణంగా మానవుని ఆలోచనా సరళిని మార్చేదిగా ఉండాలి అట్టి విప్లవం. అట్టి అభ్యుదయ లక్ష్యంతో ప్రత్యేక సందర్భాలలో వ్రాసి, కవి సమ్మేళనలలో గానం చేసి, ప్రజల ప్రశంసలను అందుకొన్న కవితలను ఒక చోట చేర్చిన గ్రంథమిది. ఆది నుంచీ నా పట్ల అపార వాత్సల్యం కల సరస్వతి ఈ గ్రంథంపై తన అమూల్య శుభాకాంక్షలు వర్షించింది. అది నా అదృష్టం.

తెలుగులో కవితకు కేంద్ర సాహిత్య అకాడెమీవారి 1975వ సంవత్సరపు జాతీయ బహుమానం ఈ గుడిసెలకే లభించింది. నేనింతవరకు ఎంతో కవితా సృష్టిచేసి వున్నాను. ప్రకటించివున్నాను. గుడిసెలలో పుట్టి, గుడిసెల మధ్య పెరిగిన నాకు "గుడిసెలు" కవితకే జాతీయ బహుమానం రావడం చిత్రం. ఇందులో సరస్వతి ఉద్దేశించిన సామాజిక సాంస్కృతిక విప్లవ రహస్యం ఏదో ఇమిడివున్నదనుకోవాలి. అవును. సరస్వతికి సమస్తమైన ప్రజలూ సరిసమానులైన బిడ్డలే కదా!

ఆ బహుమానాన్ని 1976 ఫిబ్రవరి 21వ తేదీన ఢిల్లీలో ఏర్పాటైన కేంద్ర సాహితీ సదస్సులో అందుకొన్నాను - సకుటుంబంగా వెళ్ళి.

# మతపిచ్చి పోతేనే ప్రగతి

"It is the Priesthood that has been largley responsible and standing in the way of progress by misinterpreting religion to the public. This is true of every religion including Islam." Begum Abdullah, (The Hindu, Sunday 20, 1977, Page iii)

ప్రపంచంలో ఎక్కడైనా సరే సామాన్య ప్రజలు మూర్ఖత్వంలో మునిగి ఉండడానికి మత పెద్దలే కారణమని పదే పదే నేను చెప్పడం కాదు – మేధావులూ, సంస్కర్తలూ అయిన వారెందరో నొక్కి చెపుతూనే వున్నారు. "మతములన్నియు మాసిపోవును, జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును" అనీ, "మంచియన్నది మాల అయితే మాలనే అగుదున్" అనీ ఎలుగెత్తి చాటిన గురజాడను గురువుగా భావించే వాళ్లైనా, ఆచరణలో అనుసరిస్తున్న వాళ్లెంతమంది?

సమాజంలో నిజాయితీ లోపించడానికీ, హేతువు వెలివేయబడడానికీ విజ్ఞానంతో కాలు కదిపి సమాజం ముందుకు సాగలేకపోవడానికీ మూలకారణం మతంలోని అభివృద్ధి నిరోధకత్వమే. ఈ సత్యాన్నే మళ్ళీ మళ్ళీ చెప్పాని గుడిసెల్లో. అగ్రకులాలకు మతం ఒక రక్షణ కవచం. గుడిసెలైనా మేల్కొని ఈ కశ్మలాన్ని కాల్చిపారేస్తాయని నా ఆశ.

–భీమన్న

# అంకితం

గుడిసెల కొక వ్యక్తిత్వం కల్పించి
వాటిని గోపురాల ఎత్తుకు పెంచి
గుడిసెలలోని పిరికి గొర్రెలను
సింహ కిశోరాలుగా మార్చిన
శ్రీ జి. వెంకటస్వామి గారికి!

పేదల పాలిటి పెన్నిధి అయి
కార్మిక లోకానికి ఉదయ భానుడయి
హరిజనులకు అపర అంబేడ్కరు అయి
అభ్యుదయానికి నాయకుడయిన
శ్రీ జి. వెంకటస్వామి గారికి!

ప్రజలే పరమాత్మగా
ప్రజా సేవే పరమ తపస్సుగా
సామ్యవాద దేశికుడైన
సమ్యక్ కళా పోషకు డైన
శ్రీ జి. వెంకటస్వామి గారికి!

–భీమన్న

❋ ❋ ❋

# గుడిసెలు కాలిపోతున్నై

గుడిసెలు కాలిపోతున్నై !
ఓహో, కాలిపోతున్నై !

ఎవరి గుడిసెలో, పాపం !
మాల మాదిగలవే అయివుంటై !
గుడిసెలు మరెవరి కుంటై ?

చాలా మందికే వుంటై లే
అసలు ఈ దేశ ధర్మమే అంత !
అయితే – ఈ గుడిసెలు
ఏడాది కొకసారైనా కాలిపోతుంటై !

ఒకసారి కాలిపోయిన గుడిసెలు
మరి మళ్ళీ కాలిపోవడానికి,
ఎక్కడి నుంచి వస్తుంటై ?

అవును – నిజమే !
ఎక్కడి నుంటి వస్తుంటై ?

అదే మన ధర్మంలోని రహస్యం
ధర్మ సంస్థాప నార్థం
ఈ గుడిసెలు
మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై !

పోతుంటై
పుట్టుకొస్తుంటై !

ఈ విషవలయం సాగడం
ఎంత వరకు ?
రహస్యం గుడిసెల వాళ్ళకు తెలిపే వరకు !

❋ ❋ ❋

## 2. గుద్ది పారేస్తాం

అభ్యర్థి గారికి స్వాగతం !
గతం కాదండీ, మీకు మా -
అదే నండి, అదే - వోటు కాగితం
మా వోటు కాగితా లన్నీ మీకే నండి !

మా అంటే గౌరవవాచకం కాదండి, బాబు !
అది బహువచనం
మీ ఏక వచనమే
మా బహువచనం !

మీ రొక్కరు -
మేం లక్షా పదివేల వోటుకాగితాలం !
మా వోట్లన్నీ మీకే నండి
మా గుడిసెలన్నీ మీవే నండి !

మీ రేం చెప్పక్కర్లేదు -
మీరు చెప్ప దలచిం దంతా
మాకు కంఠతా గానే వుందండి !

మీ (ఎన్నికల) గుర్తా ?
మీ గుర్తు తెలియక పోవడ మేమిటి ?
గుర్తుపట్టి గుద్దడమేగా ?

ఓ, మా వాళ్ళకు తిక్క రేగాలే గాని -
ఒకే గుద్దడం గుద్ది పారేస్తారు
ఇక వెళ్ళిరండి, బాబు !
మేం ఇంకా గంజి కాచుకో లేదు.

## 3. కల్తీరాజ్యపు దేవుడు గారు

దేవుడుగారా ? నమస్కారం !
మస్కా కాదండీ, న మస్కా –
ఆ తర్వాత "రం" వుంది లెండి !
రండి, కూర్చోండి.

కింద కూర్చోలేరా ?
అయ్యో, మరెలా ?
సింహ, మయూర, వృషభ, గరుడ,
కీర, మరాళ – వంటి వేమి లేకపోయినా
కనీసం మూషికం లాంటి ముక్కాలి పీటైనా
లేదా అంటున్నారా ?

ఇప్పుడు మాకు అలాంటి
బూర్జువా సంప్రదాయా లేం లేవండి
ఇప్పుడు మాదంతా మార్వాడీ సోషలిజం !

పర్వాలేదు, చతికిల బడండి కింద
ఇదిగో దిండు, చేరబడండి గోడకి.

చక్రం, శూలం, శిలువ, చంద్రవంక,
నామం, విభూతి, పిలక, గెడ్డం,

గళ్ళలుంగీ, నెక్‌టై, కుచ్చుటోపీ-
అదేం వేష మండోయ్, బాబు !
విశ్వమతోన్మాదు లందరికీ
ఏకైక ప్రతినిధా ఏమిటి మీరు ?

ఇడ్లీ, గోంగూరా, కోడి గుడ్డూ,
ఉప్పు చేపా, మేక మాంసం, ఆవగాయా,
పాలకోవా, పకోడీ - అన్నీ కలిపి దంచి
ముక్కటంలో ఊరబెట్టి, ఎండగట్టిన
మా జాతీయ పిండివంట రెడీగా వుంది
కొంచెం ఆరగించి వెళ్ళండి !

ఒరే, రాం రహీం జాన్ నాయుడు శాస్త్రీ !
మన కల్తీ పురుషు జమీందారుగారు
దేవుడుగారు ఈ పూట ఇక్కడే తింటారు -
కాళ్ళకు టించరైడిన్ ఇచ్చి
స్నానానికి ఫినాల్ తోడు !

❋ ❋ ❋

# 4. ఎక్కడికి పోతున్నారు

ఎక్కడికి పోతున్నారు వీళ్ళు ?
పూర్వం గుడికి పోయే వాళ్ళు
ఆ మధ్య బడికి పోయే వాళ్ళు
ఇప్పు డెక్కడికి పోతున్నారు వీళ్ళు ?

ఎక్కడికో పోతున్నారు -
మరేం చేస్తారు ?
గ్రామ దేవతల నుంచి బాబాల దాకా
చిత్తం పూజల మీద - ప్రజల మీద కాదు,
టీచర్ల నుంచి ప్రొఫెసర్ల దాకా
దృష్టి జీతం మీద - చేతం మీద కాదు !

మరి - తల్లి దండ్రులు లేరా అంటే -
ఉన్నా లేనట్టే,
వాళ్ళ ఇరవై నాలుగు గంటలూ
వృత్తి ఉద్యోగ సేవలకే చాలవు.

ఇక ఏం చేస్తారు ఈ పసివాళ్ళు ?
ఎక్కడికో పోతున్నారు, పాపం !
పూలనూ, పండ్లనూ విసిరేసి

పుస్తకాలనూ, ముద్దుమురిపాలనూ చించేసి
గతం తెలియక, భవిష్యత్తు కనిపించక
వర్తమానం పొమ్మని పొగ పెడుతుండగా -
పాపం - ఏం చేస్తారు ?

గుండెలను బండలు చేసుకొంటూ
ఆ రాళ్ళతో జేబులు నింపుకొంటూ
వాటిని ఇటూ, అటూ - దారిపొడుగునా
కనిపించిన దాని కేసెల్లా విసిరికొడుతూ
నిరాశతో, కోపంతో, పిచ్చిగా
పోతున్నా రెక్కడికో !

మంచి, చెడ్డ తెలియని అమాయకులు !
లక్షణమైన శిక్షణకు నోచుకోని అనిరుద్ధులు !

* * *

## 5. నా వారసత్వపు హక్కులు

విశ్వాన్నే ఆర్యం చెయ్యా లనుకొని,
తాను కులంలేని వాడైనా, బ్రహ్మర్షి అయి
నమ్మదగ్గ భార్యకోసం
నానా దేశాలూ వెతుకుతున్న వశిష్ఠుడికి
ఆ మాలమాదిగ పిల్ల అరుంధతే దొరక్కుండావుంటే !

ఇద్దరి నుంచి అద్దరికి తరింప జేస్తూ
మానవ సేవా పరాయణ అయిన మత్స్యగంధి -
ఆనాడు అరుంధతి మనుమడైన పరాశరుడు
మోహంతో మీద చెయ్యవేసి నప్పుడు -
కోపంతో మూతిపళ్ళు రాలగొట్టివుంటే !

సంతు లేకుండానే వితంతువు లై పోయిన
అంబికా అంబాలికా సోదరీ మణులు
అత్తగారి ఆజ్ఞల్ని ధిక్కరించి
పరపురుషుడైన వ్యాసుణ్ని తిరస్కరించి
పాతివ్రత్యాన్ని ప్రదర్శించి వుంటే !

వేద వ్యాసుడు పుట్టేవాడే కాదు,
మహా భారతానికి కథే వుండేది కాదు !

ఆర్యజాతి వ్యక్తిత్వానికే ఆదిపురుషుడు
వ్యాసుడు మాలమాదిగ వాడే కదా ?
ఈనాడు అతడు అగ్రవర్ణం వాడు,
అతడి వంశం వాణ్ని నేను అంత్యజుణ్ని !
ఇదే – మన భారతీయ సమాజ ధర్మం
నేటి దాకా సాధించిన పురోగమనం !

ఈ శ్మశానాన్ని ఎందుకు తవ్వుతున్నా నంటారా ?
వేదవేదాంగ వైభవాలపై నాకు గల
వారసత్వపు హక్కులు దొంగిలించబడి
ఇక్కడే పాతిపెట్టబడినై కనుక !
నేను తెలుసుకొని తిరగబడతా నన్న భయంతో
అవి నాకు అందకుండా
నన్ను ఇంతకాలంగా వెలివేసి వుంచారు కనుక !

ఇప్పుడీ హక్కులు నాకేమీ ఉపయోగించవు నిజమే –
కాని – వీటిని త్రవ్వి తీసి,
ఇవి నావని ప్రపంచానికి చూపి,
ఆ తర్వాత – గర్వంగా అవతల పారేస్తాను !
ఠీవితో తలెత్తుకు తిరుగుతాను !

❋ ❋ ❋

## 6. మతం ఒక పిచ్చి

శివాయ నమః
నారాయణాయ నమః
శక్త్యైనమః
బుద్ధాయ నమః
అల్లాయ నమః
యెహోవాయ నమః
కారల్ మార్క్సవే నమః
మహాత్మా గాంధినే నమః
డాక్టర్ అంబేడ్కరాయ నమః
లైట్ కోసం నమః

ఎవరు స్వామీ తమరు ?
నేనా, నేను –
నేను విశ్వమత సమన్వయ వాదిని !

తమరు హిందువా ?
ఏం, అలా అడుగు తున్నావు ?
క్షమించాలి – ఈ రకం పిచ్చి వుండేది
ఒక్క హిందువుడిలోనే లెండి !

మానవు డంటే ఒక జంతువు
మతం అంటే ఒక రకం పిచ్చి !
ఒకొక జంతువుకి ఒకొక పిచ్చి
మానవుడుకి మత పిచ్చి !
హిందువుడికి అదనంగా
ఒక విశ్వసమన్వయ పిచ్చి !

ఓయి, నానామత సమన్వయ వాదీ !
కృణ్వంతో విశ్వం ఆర్యం అంటూ
వేదారణ్యాలు వేసిన అరణ్యారోదనం నుంచి -
ఈశ్వర్ అల్లా తేరేనాం అంటూ
జాతి చెవులు పగలగొట్టిన స్వాతంత్ర్యోద్యమం నుంచి -
నీ దాకా ఇంతమంది నిస్సార మతులు
ఈ గంగా గోదావరీ కావేరీ ఒండ్రుమట్టిలో
ఎలా పుట్టారో, విధి వైపరీత్యం !

ఓరీ, మూర్ఖుడా, మతం విషంరా, విషం !
నల్లమం దన్నా డెవడో, అది అబద్ధం !
మతం విషం, ఆత్మనే చంపుతున్న విషం !
నానా విషాలు కలిపిన కషాయం
అమృతం అవుతుందా, బాబూ ?
నీ నానా మత సమన్వయ ప్రయత్నమూ అంతే !
అది విషం, దాన్ని సాంతం నిర్మూలించి పారెయ్ !

మానవ భావన నుంచి
మతాన్ని తొలగించ గలిగితే చాలు
విశ్వమానవ శ్రేయస్సు
సర్వమానవ సమతోషస్సు
సద్య స్సముద్భూత మవుతుంది,
ప్రతిప్రాణీ సంప త్సమృద్ధ మవుతుంది !

మబ్బు విడిచిన సూర్యుడిలా
మానవాత్మ జాజ్వలమాన మవుతుంది !

❋ ❋ ❋

# 7. నమః స్వామికం

నమస్కార మండీ, నమస్కారం
బంట్రోతు గారికి నమస్కారం
వట్టి నమస్కారం కాదండీ,
ఇదిగో, టీ తాగి రండి !

గుమాస్తా గారికి నమస్కారం
ఆఫీసరు గారికి నమస్కారం
ఐ దైనా, ఇంకా ఏం వర్కండీ ?
అలా బజారుకు పోదాం పదండి !

మెంబరు గారికి నమస్కారం
మంత్రి గారికి నమస్కారం
"ఊర్వశి" చూశారా ?
పిక్చరా ? తారూ ? బారూ కూడ !

ఆలయంలో అమ్మవారికి నమస్కారం
గుడిలో శివుడి గారిగి నమస్కారం
కొబ్బరి కాయే కాదండీ -
గొర్రె పోతును కూడ తెచ్చాం !

ఇక్కడింకా ఎవరెవరో ఉన్నారే !
అయ్యా, అందరికీ నమస్కారం :
నా నమస్కారం -
మస్కా పురస్కారం :

ఏదో పేదవాణ్ని, తమ భక్తుణ్ని
నా కున్న పది లక్షలూ
ఫిక్సెడ్ డిపాజిట్‌లో వుండి పోయి -
జేబులో పైసా లేదు, సార్ !

ఈ కాంట్రాక్టు మీ రివ్వక పోతే
ఇక నా చావు ఆకటి చావే !
మీరు ప్రజా సేవకులు,
ఈ ప్రజాస్వామికంలో
నేను కనీసం ఒక నాయకుణ్ని.

కనీసం వచ్చే ఎన్నికల దాకా అయినా
మీరు నన్ను బ్రతికించక తప్పదు !
ఆ తర్వాత - చూస్తారుగా ?
అందరికీ ఒకో నమస్కారం,
ధన లక్ష్మీ పురస్కారం !

* * *

## 8. బానిసల జాబితా

ప్రభూ ; మా పేర్లను
వోటర్ల జాబితా నుంచి తొలగించి
బానిసల జాబితాలో చేర్పించండి !
చచ్చి, మీ కడుపున పుడతాం !

బానిసల జాబితా అనేది ఇప్పుడు లేదంటారా ?
పూర్వం రాజుల పాలనలో వుండేదే !
ఇప్పు డిది ప్రజల పాలన అంటారా ?
బానిసల జాబితా స్థానంలో
వోటర్ల జాబితా వచ్చిం దంటారా ?

అయ్యో–బానిసలమై వుంటే
ఏ అబ్రహాం లింకన్ వంటివాడి కోసమో అయినా
ఎదురు చూస్తూ బ్రతికే వాళ్ళమే !
ఈ వోటర్ల జాబితా నుంచి
మమ్మి ఏ దేవు డుద్ధరించగలడు !

అదేమిటయ్యా, అలా ఏడుస్తారు ?
వోటంటే ఏమి టనుకొంటున్నారు !
అది మా పాలిటి శని, ప్రభూ!

ఒక ప్రక్క రకరకాల జెండాల వాళ్ళు
మరో ప్రక్క మావూరి ఖామందుల వాళ్ళు
ఈ వోటు అమ్మోరు కోసం
మా ప్రాణాలు తోడేస్తున్నారు
బానిసల కుండే సుఖ శాంతులు సైతం
మా పేద వోటర్లకు లేవు, మహాప్రభో !

ఆ వోట్లేవో - మీ దొరలే వుంచేసుకోండి
మా గుడిసెల్లో మమ్ము బ్రతక నివ్వండి
మేం వెనకబడ్డ వాళ్ళం, బలహీన వర్గాల వాళ్ళం
విలువైన దేన్నీ కాపాడుకోలేం !

ఈ దేశంలో పేదలకు వోటుండడం
పక్కలో పా ముండటమే !
ఈ వోట్ల చెలగాట్లతో మమ్ముల్ని చంపకండి !
దయచేసి, జాబితా మార్చెయ్యండి !

❋ ❋ ❋

## 9. కులమతాల ఉమ్మడి కాష్ఠం

ఆకాశంలో మంటలు ! మంటలు !
అమ్మో, ఏదో కాలిపోతున్నది
కాలిపోతూ కూలిపోతున్నది
ఇంకేముంది, అంతా బూడిద!

క్షణం ముందు వరకూ-
అదొక కోట్ల విలువైన మహా విమానం
ఇప్పు డది వట్టి మసి, మట్టి !
అందులోని ప్రయాణికులు
కోటీశ్వరులు, కుబేరుని వారసులు
ఇప్పుడు వట్టి పీనుగు పెంటలు !

స్త్రీలు, పురుషులు, బాలలు, వృద్ధులు
హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు
మంత్రులు, ఉద్యోగులు, వ్యాపారులు, చారులు
క్షణం ముందు వరకూ ఎన్నోరకాల వాళ్ళు
ఇప్పు డందరూ ఒకే రకం కళేబరాలు ?
జాతి వృత్తి మ తాతీత మాంసపిండాలు !

ఏది ముఖం, ఏది నడుం, ఏది కాలు, ఏది చేయి
ఏ బుర్ర ఏవరిది, ఏ బొర్ర ఎక్కడిది ?
ఇంతకూ విడివిడిగా ఏమున్న దక్కడ ?
అందరిచేతా విధి అని పిలువబడే ధర్మవ్యాధుడు
విమానం అనబడే ఒక వేట జంతువును
కైమా కొట్టి పెట్టిన ఒకే పోగు అది !
అన్ని మతాలూ, కులాలూ, జాతులూ, వృత్తులూ
కలిసి కార్చిన ఒకే కన్నీటి గుడ్డు అది !

ఒరే, మానవుడా, మూర్ఖుడా, బుద్ధిహీనుడా !
అలా చూడు, ఆ శ్మశాన కాష్ఠ జ్వాలలు !
మానవు డొకడే, మానవత ఒకటే–
ఆ ఉమ్మడి అగ్ని సంస్కార జ్వాలలు
కులమత వృత్తి విభేదాలకు అంత్యక్రియలు !

నేర్చుకో అనుభవం నుంచి
మార్చుకో దుస్తులు !

❋ ❋ ❋

# 10. భగవంతు డొక కొట్టిన పిండి

నాకు తెలియ కడుగుతాను -
అడగండి ! అడగండి !
నిన్ను తిరుపతిలో చూసాను-
అవునండి, ధర్మదర్శనం క్యూలో ?
నిన్ను శ్రీశైలంలో చూసాను-
అవునండి, శివలింగం కౌగిట్లో ?
నిన్ను కాచిగూడా గుడిలో చూసాను-
అవునండి, ఆంజనేయుడి తోక దగ్గర ?

నిన్ను బాసరలో చూసాను -
అవునండి, సరస్వతి చరణ సన్నిధిలో ?
నిన్ను హరద్వారంలో చూసాను -
అవునండి, గంగాశివుల సంధ్యాతాండవ దీపావళిలో !
నిన్ను నాస్తిక సభలో చూసాను -
అవునండి, త్వమేవాహపు బ్రహ్మాసనం పై !

* * *

నీవు ఆస్తికుడివా ?
అవునండి
నా స్తికుడివా ?
అవునండి

నీ వుద్దేశం ?
నాదే నండి
నీ ఆదర్శం ?
నేనే నండి !

దేనికైనా, బ్రహ్మజ్ఞానే సమర్థుడు, స్వామీ !
బ్రహ్మజ్ఞాన సంపన్నుడికి
భగవంతు డొక కొట్టిన పిండి !
దానితో అతడు పకోడీలు వండుకు తినవచ్చు
పాయసం చేసుకు తాగవచ్చు
గుమ్మంలో ముగ్గులు కూడ పెట్టుకోవచ్చు !
సర్వసముడైన సామాన్యుడే బ్రహ్మజ్ఞాని
నేనొక సామాన్యుడిని

❋ ❋ ❋

## 11. మనిషే మార్గదర్శకుడు

నేను నిజం అనుకొన్న దానిని
నిష్ఠూరమైనా చెప్పక తప్పదు -

రాముణ్ని దేవుణ్ని చేసి
రామాయణాన్ని పురాణం చేశాం,
బుద్ధుడికి జాతక కథ లంట గట్టి
మనిషికి అందకుండా విసిరేశాం,
నూరుశాతం పురుషుడైన కృష్ణుణ్ని
నారాయణుణ్ని చేసి వదిలేశాం,

ప్రతిభావంతుడైన ప్రతి వాణ్ని
ఇలా పరమేశ్వరుణ్ని చేసేస్తూ
ప్రజల మధ్యనుంచి తీసేస్తూ వుంటే
ఇక సామాన్యుడు పెరిగే దెలా ?
సంఘాభ్యుదయం జరిగే దెలా ?

మనిషికి మార్గదర్శకుడు
తనకంటె ముందున్న పెద్ద మనిషి ,
భగవంతుడు కాదు.

అందుకే, నేను -
మానవుడై పుట్టి,మహాత్ముడుగా బ్రతికి,
మనుగడ చాలించిన ఏ గొప్ప వాణ్నీ
దేవుణ్ని చేసి దూరం చేసుకోను.

దేవుణ్ని ఆదర్శంగా పెట్టుకోవడం
పులిని చూసి నక్క వాతలు పెట్టుకోవడం.

❋ ❋ ❋

## 12. చచ్చినవాణ్ని సాయ మడిగితే

రామాయణాన్ని, భారతాన్ని, పురాణాలను
సాహిత్య దృష్టితో చదువండి
వాటి కథల్ని నాటకాలుగా, సినిమాలుగా
కళా దృష్టితో చూడండి
ఆయా పాత్రల భక్తి కరుణ శృంగార వాక్యులను
శ్రవణ పేయంగా వినండి
అనుభూతి పొందండి
ఆనందించండి !

కాని – అవి
పాత కథ లన్న సత్యాన్ని మరువకండి.
ఆయా కాలాల్లో అక్కడక్కడ పుట్టి
మంచిగానో, చెడ్డగానో బ్రతికి
నాడే చచ్చిపోయిన వ్యక్తుల కథ లవి,
వా ళ్ళీనాడు బ్రతికి లేరు.

రాముడు త్రేతాయుగంలో పుట్టి
ఆ యుగంలోనే మరణించిన మహారాజు,
మీకాయన ఆదర్శపురుషు డైతే
ఆయన చూపిన మార్గాన్ని స్వీకరించండి.

అంతే గాని
ఈ నాడు రామా అని పిలిస్తే
పలుకుతా డని మాత్రం భ్రమపడకండి.

ఎవరికో, ఎక్కడో పలికా డనో
కనిపించా డనో వచ్చే వార్తలు
మత బోధకుల దంభాలో
మూఢ భక్తుల మనో బింబాలో మాత్రమే,
అవి నిజం కావు, కాబోవు !

"రామ" అనే మాటకు మంత్రశక్తి వున్నదంటే
అది కౌసల్య కొడుకు "రామ" కాదు
ఆత్మారాము డంటే రామాయణం రాముడు కాదు
శబ్ద సామ్యం చంపేసింది జాతి ఆత్మ శక్తిని !

"కృష్ణా" అంటూ ఆనాడు ఏ వ్యక్తి పిల్చినా
కృష్ణుడు ప్రత్యక్ష మయ్యే వీలుంది.
కృష్ణ నిర్యాణం తర్వాత, ఆ మరునాడే
మరది పార్థుడికే దిక్కులేక పోయింది కద ?

ఆనాడు చచ్చిన వాడు
ఈనాడు ఎలా సాయపడతాడు ?

రాముడు, కృష్ణుడు అవతార మూర్తు లంటే -
అసలు విష్ణువునే ఆరాధించ వచ్చుగా ?
చాలించబడ్డ తాత్కాలిక అవతారాల నెందుకు ?
ఒక్కొక్క అవతారం
ఒక్కొక్క పనికోసం వచ్చి పోయి నట్టిది.

వారి వ్యక్తిత్వాల పట్లగౌరవం అంటారా ?
అయితే - అంతకంటె ఎక్కువ పరిధిలో
ఎక్కువ మానవ సేవ చేసిన గాంధీ, అంబేడ్కర్ వంటి
మహితుల్ని కూడ ఆ జాబితాలో చేర్చండి !

వీర పూజ మంచిదే - కాని
మన కష్టాలను, కోరికలనూ తీర్చడానికి
ఏనాడో చచ్చిపోయిన ఆ వీరుల్ని పిలుస్తూ
భజనలు చేస్తూ కూర్చుంటే మాత్రం
ఫలితం ఏమీ వుండదని గుర్తించండి!

ముఖ్యంగా యువకులకి చెపుతున్నాను -
మీరైనా భ్రాంతి నుంచి బైట పడండి !
మానవుణ్ని మరో మెట్టుకు పెరగనివ్వండి !

❋ ❋ ❋

## 13. వద్దు రాంబందులు

ఆంధ్రప్రదేశ రాజ్యంలో ఆమధ్య
ఒక మూడేళ్ళ పాటి రాజకీయ కథ -
అన్నదమ్ముల సంబంధాలకే కాదు
అఖిల భారత జాతీయతకే కాదు
మొత్తం మానవత్వానికే
గొంతు దిగని వ్యథ !

ఆ పరువు మర్యాదల చిత్రవధల కాలంలో
కవులు, కోకిలలూ పారిపోయి
గోవులూ, గోవత్సాలూ నలిగి పోయి
మృత్యువూ, మూర్ఖత్వమూ చెట్టాపట్టాలతో
రాక్ అండ్ రోల్ తాండవం చేస్తున్నప్పుడు -

నక్కలూ, రాంబందులూ పోటీ పడి
ప్రజల్ని ఫలాహారం చేసుకొంటూ -
సాగరాణం నన్నయాదులనూ
రాయలాణం పెద్దనాదులనూ
తెలుంగాణం పోత నాదులనూ
ముక్కలు కోసి, సీక్ కబాబ్ చేసి
ప్రాంతీ యోన్మాద స్వార్థ బ్రాందీతో
నంజుకు తింటున్నప్పుడు -

ఇందిర చకితయ్యై
గిరిజ కుపితయ్యై
సరస్వతి మహితయ్యై
సర్వాంధ్రను ఉద్ధరించడం కోసం

ఆది వరాహమూర్తి ప్రసన్నతలా
రాష్ట్రపతి పాలన అవతరించింది
రాజ్యం అనాగరికం కాలేదని నిరూపించింది !

అబ్బ, ఎంత ఘోరం జరిగింది
ఎంత గండం గడిచింది !

త్రిమూర్త్యాత్మక శక్తిత్రయీ !
నిజంగానే తెలుగు వాళ్ళను ఉద్ధరిస్తావా, తల్లీ ?
అయితే – రాష్ట్రాలలో ప్రజా పాలనకు స్వస్తి చెప్పు !
సరాసరి కేంద్రపాలననే స్థిరీకరించు !

ఈ రాజకీయ రాబందుల, నక్కల
కరుణా కటాక్ష వీక్షణాలు మా కొద్దు !
కేంద్రంలో ఇందిర, రాజ్యంలో గిరిజ
హృదయంలో సరస్వతి చాలు మాకు !

వద్దు రాబందులు –
వద్దు నక్కలు !

❋ ❋ ❋

## 14. ఇల్లు చేరుకోవాలి

ఇంటికి పోవాలి !
ఏమైనా సరే –
తక్షణం ఇల్లు చేరుకోవాలి !

ఇక్కడి హోటళ్ళు మొసళ్ళు
ఇక్కడి వీధులు వ్యాధులు,
ఇక్కడి పురజనులు –
పాపం, వట్టి గిరిజనులు
నోరూ వాయీ లేని హరిజనులు !
ఒక క్షణమైనా ఇక్కడిక వుండలేను
ఏమైనా సరే ఇంటికి పోవాలి !

ఇక్కడికి నన్ను తెచ్చిన పెద్దలు
మళ్ళీ కనిపించ లేదు
పెద్దల స్వభావమే అంత !
పని తీరిన తర్వాత సాక్షాత్తు ఆ
బెమ్మన్న అయినా, వట్టి తిమ్మన్నే !

ఒక మొసలి నోట్లోపడి, విషం తిని
విరేచనాలు పట్టుకొన్న వాణ్ని

బస్సులో ఎలా ప్రయాణం చెయ్యగలను ?
రైల్లో రిజర్వేషను లేదు,
ఇక్కడొక క్షణం వుండలేను !
సొంతూరు జ్ఞాపకం వచ్చేకొలదీ
పొరుగూరు మరీ బాధిస్తోంది !

ఎక్కడెక్కడ తిరిగినా
ఎన్నెన్ని గౌరవాలు పొందినా
తిరుగు లేని తృప్తి కోసం
తరుగు లేని శాంతి కోసం
ఇల్లు చేరుకోవాలి –
ఇల్లు గుయ్యారం గుడిసైనా సరే
ఇల్లాలు గయ్యాళి గంపైనా సరే !

రవికైనా అంతే
కవికైనా అంతే !
దూరం కూడ ఎంతో లేదు, కాని
దారే తోచడం లేదు !

❋ ❋ ❋

## 15. ఒకొక్కడికొకొక్క రోగం

ఓహో, ఊరంతా ఇక్కడే వుందే !
బాబాజీ వచ్చారుగా ?
వస్తే ఏమి టట ?
ఆయన సర్వరోగ నివారణ యోగ ర్షి !
ఒకో చూపుతో, చిరునవ్వుతో, స్పర్శతో,
మంత్రం విభూతి బొట్టు వగైరాలతో – ఆయన
నివారించలేని బాధంటూ లేదుట !

అయితే – ఈ వూళ్ళోవా ళ్ళంతా
ఏదో ఒక రోగంతో చస్తున్న వాళ్లేనా ?

అరే! అరే! అదిగో, అదిగో
గూండా ముండపతి ! రౌడీ రంగపతి !
మన కులపతి ! వా రబ్బాయి మలపతి !
ఊరికే ఊర్వశి – దొరగారి ప్రేయసి !

అదిగో – మన సర్కారు డాక్టరు
అకాడమీ బెస్టు అవార్డు ఏక్టరు
వ్యాయామ కళాకేంద్ర డైరెక్టరు !

దేవుడి లాంటి పంచాయతీ ప్రెసిడెంటు
ప్రతి వుద్యమానికీ ముందుండే స్టూడెంటు
లక్షలు గడించిన ఆ భిక్షాలు
భిక్ష మెత్తుకుంటున్న ఈ వరహాలు !

ఓరి, బాబో ! ఈ అందరికీ ఏవో రోగాలే ?
కుబేరులకూ గజ్జి కురుపులే ?
యములాళ్ళకూ యమ గండాలే ?

ఈ మానవ లోకంలో
ఒకొక్కడి కొకొక్క రోగం !
పైకి బాగానే కనిపిస్తారు
లోపల ఏదో కుళ్ళు, ఏవో పుళ్ళు !
అందమైన దంత క్షతాల వెనుక
గార పట్టిన పుచ్చు పళ్ళు !

మన కవిగారు కూడ వచ్చాడే !
ఈయన కేం రోగమో !

❋ ❋ ❋

## 16. నినాదాలు విప్లవం తెస్తాయా

అయ్యా, మహా కవీ !
నీ కవిత్వంతో
మా కడుపులు నిండుతా యంటావా ?

ఎవరా అడుగుతున్నది ?
పిల్లలా ? పెద్దలా ? ప్రజలా ? నాయకులా ?

ఓహో, సోదర సోదరీ మణులారా !
మీరు చేస్తున్న నినాదాలతో అయినా
మీ కడుపులు నిండుతున్నాయా ?
నిజం చెప్పండి, సంతోషిస్తాను !

ప్రతి పండక్కీ మీకు కానుకలు తెస్తున్నది
దేవదూత తాతయ్యేనా ? పిల్లలూ !
నీవు కొట్టిన ఒకొక్క కొబ్బరి కాయకు
ఒకొక్క మార్కు అయినా పడిందా, విద్యార్థీ ?
అన్ని సార్లు కొండకు వెళ్ళావే
పదవి ఎందుకు నిలవలేదు, మాజీమంత్రీ ?

పురాణాల్లోను, సినిమాల్లోనూ తప్ప
దేవు ణ్నెప్పుడైనా చూశావా, భక్తుడా ?
పతే దైవ మంటూ మగవాడు చేసే ప్రచారాన్ని

నిజంగానే నమ్ముతున్నావా, యువ మహిళా ?
పేదరికం పోవాలి, ఉద్యోగం రావాలి అంటూ
ఊరేగింపులు జరిపినంత మాత్రం చేతనే
విప్లవ పరిణామం వచ్చేస్తుందా, యువకుడా ?

మంత్రాలకు చింతకాయలు రాలవు,
నినాదాలతో విప్లవం రాదు
నా కవిత్వం మీ కడుపు నింపదు
నిజం, నిజం, ముమ్మాటికీ నిజం !
మరి-ఇప్పు డేమిటి కర్తవ్యం ?

గరీబీ హటావో అంటూ అరిచి, అరిచి
సోషలిజం రావాలి అంటూ ఎగిరి, ఎగిరి
సమ్మెలు, నిరాహార దీక్షలు చేసి, చేసి
కడుపు నిండక, నోరైనా తడవక
సొమ్మసిల్లి ఎక్కడో పడిపోయి నప్పుడు
నన్ను జ్ఞాపకం తెచ్చుకోండి, మహాశయా !

నా కావ్యాలలో దేన్ని ఎక్కడ ఏ పేజీ తెరచినా
గంటెడు ఓదార్పైనా లభించక పోదు-
గుక్కెడు మధువైనా దొరక్క పోదు !

❋ ❋ ❋

అమ్మో-

దున్నలు ! దున్నలు !

## 17. యువకులున్నారు జాగ్రత్త

తుపాకి పేలింది !
అదిగో, అటుకేసి పేలింది !
పదండిరా, పదండి
షికారి ఎవడో ఎవడి క్కావాలి ?
వాడు కాల్చిన కోడో, లేడే కావాలి
పదండిరా, పదండి
పైబడి లాక్కొద్దాం, పదండి

మన పాలేళ్ళనీ, పని వాళ్ళనీ పోగుచెయ్యండి
వాళ్ళ పేర్లమీద షేర్లు తీసుకోండి
వా టన్నిటినీ మ నింటికి చేర్చెయ్యండి
దొడ్లో పీపా లున్నై చూడండి
ఒకో చుక్కేసుకు పదండి !

యువకు లున్నారు జాగ్రత్త !
వాళ్ళు న్యాయమంటారు, ధర్మ మంటారు
ఏవో లక్ష్యా లంటూ చస్తారు
బ్రతుకు రహస్యం తెలియని
బడుద్దాయీలు !
యువకుల్ని మాత్రం దూరంగా వుంచండి.

యువక మేళం
మన నోటికి తాళం !

ఒక కోడో, లేడో
మనందరికీ ఏం చాలుతుం దంటారా ?
చాలక పోతే షికారీ లేడా ?
వాణ్నే కాల్చుకు తినేద్దాం
అగస్త్యుడు తినలేదా వాతాపిని ?

పర్వాలేదు, పదండి
ఆలస్యం చేస్తే –
ఇక మన పని పస్తే !
ప్రజాస్వామికంలో అయినా
పై బడి తినే వాడే రాజు,
పదండిరా, పదండి
పంచుకు తినేద్దాం, పదండి !

❋ ❋ ❋

## 18. మేకతోలు వాతాపులు

ఆస్తికు డంటే -
భయమూ భక్తీ కలవాడు,
చెడు అంటే భయం,
మంచి అంటే భక్తి,

భయం నుంచి పుట్టేదే పరాక్రమం
దానితో అతడు చెడును జయిస్తాడు,
భక్తి నుంచి పుట్టేదే విశ్వజనీనత
దానితో అతడు మంచిని పూజిస్తాడు,

నాస్తికు డంటే -
మంచి చెడ్డలతో నిమిత్తం లేకుండా
మతాన్నే పట్టుకు వ్రేలాడే వాడు,
మనిషిని మనిషిగా గుర్తించని వాడు.

దేవుడు లే డనేవాడు నాస్తికుడు కాడు,
ఉన్నాడనే వాడు ఆస్తికుడూ కాడు,
ఆస్తిక్యం నుంచి నాస్తిక్యాన్ని విడదీసేది
ఆత్మవత్ సర్వభూతాని వైఖరి.

నేటి మతం మతం కాదు,
అదొక రాజకీయ తద్ధితం,
రాజకీయ వ్యాఘ్రం.

ఎంత కాలం గొర్రెవుగా వుంటావే, జనతా ?
సింహం పై తిరగబడి రాక్షసవధ చెయ్యి !
నీతులతో, నినాదాలతో ఊరేగుతున్న
ఈ వేషగాళ్ళు వట్టి మహిషాసురులే కాదు !
మేక తోలు కప్పుకొన్న వాతాపులు కూడ.

❋ ❋ ❋

# 19. అమ్మో - దున్నలు

దున్నలు, దున్నలు, దున్నలు !
అమ్మో, దున్నలు, దున్నలు !
కారు దున్నలు, కొట్ల దున్నలు
ఉరుక్కొచ్చేస్తున్నై ఊళ్ళమీదికి
అమ్మో, దున్నలు, దున్నలు !

"సర్వ మంగళ మాంగల్యే,
శివే, సర్వార్థ సాధకే,
శరణ్యే త్ర్యంబకే, దేవీ,
నారాయణి, నమస్తుతే !"

ఊళ్ళమీదికి ఉరుక్కొచ్చేస్తున్నై
కళ్ళు మూసుకు దుముక్కొచ్చేస్తున్నై
పంట పొలాలు తొక్కేస్తున్నై
ప్రజలు కృషిని మెక్కేస్తున్నై !
అమ్మో, దున్నలు, దున్నలు !

"సర్వ దేవ మయీం దేవీం
సర్వమంత్రమయీం పరాం
ఆత్మానాం చింతయేత్ దేవీం
పరమానంద రూపిణీం !"

త్యాగం వెంట త్యాగం చేస్తూ
ప్రజలు ఎముకల గూళ్లై పోతున్నారు,
ఎముకల గూళ్ళను విరుచుకు తినేస్తూ
దున్నలు కొవ్వెక్కి పోతున్నై
సింహేంద్రా! సిద్ధం కా!

అయ్యయ్యో, అదేమిటి, ఈశ్వరీ ?
ఏమిటా హడావిడి ?
దున్నలా ? ఎక్కడివి ? ఎప్పటివి ?
మతి పోయిందా మహిషాసుర మర్దనీ !

అయ్యో, ఆ చదరంగం బలగా న్నంతా
అలా చిమ్మేస్తున్నా వేమిటి ?
గుర్రాలను రేసుల్లోకి
ఏనుగుల్ని సర్కసుల్లోకి
రథాల్ని మ్యూజియం లోకీ
రాజుల్ని రంభల కౌగిళ్ళ లోకీ
మంత్రుల్ని మాజీ మంటల్లోకీ
అలా విసిరి పారేస్తున్నా వేమిటి ?
ఏమిటి, దున్న లంటున్నావ్ ?
ఎందు కలా కంగారు పడిపోతున్నావ్ ?

నీవు మహిషాసురుణ్ని చంపి
చాల కాల మయింది
అతడి దున్నలదండు గుండెలు పగిలి
యుగాలు గడిచినై
ఇది కలియుగం, ప్రజల యుగం
ప్రజలే ఇప్పుడు స్వయంపాలకులు
ఈనాటి విశ్వరూపం జనం !
ఏవీ, ఎక్కడున్నై ఆ దున్నలు ?
చూపు, విరగ్గొట్టేస్తా వాటి వెన్నులు !

అహ్హాహ్హాహ్హో ! అవా ?
అవి విల్లమ్ములు కావు
గిలకల బద్దం బుక్కా గొట్టాలు,
అవి చతురంగ బలాలు కావు
దసరా వేడుక బుట్ట బొమ్మలు,
అవి సింహనాదాలు కావు
అరణా పైసల కోసం
అఠాణా రాగంలో అడుక్కొనే
పులి వేషగాళ్ళ దేవురింపులు !

నీవు సింహ వాహనవే-కాని
సింహో లెక్క స్వారీచేసే ఆడపిల్లలు

వందలు, వేలు ఉన్నారీ నాడు -
సర్కసుల్లోను, రంగుల రాట్నాల్లోనూ !

ఒక్క మహిషాసురుణ్ని చంపావు నీవు ;
దెబ్బకు లక్షమంది మహిషాసురుల్ని చంపగల
వీర యువతులు ప్రతి కాలేజీలోనూ వున్నారిప్పుడు !
ఎందుకు వృథా భయం ?
పద, మనదారిని మనం పోదాం !

వృథా భయమా, ప్రభూ ?
నిజమైన భయం నేడే చుట్టుముట్టింది నరజాతిని !
ఆ నాడు మహిషుడితో పాటే
వాడి రాకాసి దున్నలన్నీ చచ్చాయను కొన్నాం
చావ లేదు, శంభో, చావ లే దవి !
అంతులేని మారు రూపాలు ధరించి
అలగా జనం మీద విరుచుకు పడ్డై
విరుచుకు తినేస్తున్నై వాళ్ళ బ్రతుకుల్ని !

అమ్మో, దున్నలు, దున్నలు !
అలాచూడు, భక్తవత్సలా, శ్రీశైల వాసా !
నీకు చెవుడే కాని చత్వారం లేదుకదా ?
అదిగో చూడు, ఆ బీభత్సవం !

అణు ధూళి ధూమ కేతువులు !
ఆ ధాన్యలక్ష్మి చరణ చల న్మంజీర
కింకిణీ రసధ్వనుల మణుల కోసం
జట్టీ వ్యాపార పన్నగాల పన్నాగాలు !

ఆ అమాయక రసమయ ఆనందమయ
సంపత్ స్రష్టల బ్రతుకులపై
పదవీ రాజకీయాల విలయ తాండవాలు !

ఆ రైతుల, కూలీల, శిల్పుల, నిపుణుల
నిరంతర కాయ కష్టంపై
పని దొంగల దోమ తొండాలు !
ఆ నిజాయతీపరుల నిష్పాక్షిక కార్యక్రమాలపై
స్వప్రయోజక కుల తత్వాల కరకు కోరలు
లంచ గొండుల హస్త లాఘవాలు !

అలా, ఎన్నని చెప్పను, ప్రభూ ?
అన్నీ దున్నలు ! అవే దున్నలు ! దున్నలు !
రూపాలు మార్చుకొని
పాపాలు పంచుకొంటున్న కారు దున్నలు !

అవును, దేవీ, అవును, అవును !
అవతారాలు మారినా, అవే దున్నలు!
చావలేదు మహిషాసురుడు.
నశింపలేదు అతడి దున్నల దండు !

లంచాలు, దొంగలాభాలు, మాయ నాటకాలు
పదవీ రాజకీయాల ఇంద్ర జాలాలు,
బ్రాందీ బారులలో
గాంధీ నాయకులకు సన్మానాలు !

మూఢభక్తి ప్రచారాలు
అధికార దుర్వినియోగాలు
ఆత్మ వంచక బక జపాలు,
బలహీనవర్గాల నోళ్ళు చూపి
బలవంతులు కడుపులు నింపుకోడాలు,
నాయకుల నమ్మక ద్రోహాలు
జాతి సేవకుల అంగుడు లేని మింగుళ్ళు,
అశక్తికి అధికార పీఠాలు

ప్రతిభకు ముష్టి మెతుకులు,
ధనంతో జనాన్ని కొనివెయ్యడాలు
జనశక్తి పేరుతో ధనశక్తి ఊరేగడాలు !

నిజం, దేవీ, నిజం !
అవే దున్నలు ! దున్నలు ! దున్నలు !

మహిషాసురుడు చావలేదు
అతడి దున్నల దండు నశించలేదు
సోషల్ వర్కర్ల పేరుతో
సొసైటీని తినేస్తున్నె
దేశోద్ధారకుల ముసుగులో
దేవాలయా లెక్కి కూర్చున్నె
శవాల చుట్టూ రాబందుల్లా
పైసల్ని పసిగట్టి మూగుతున్నె !

రైతుకు కృషిఫలం దక్కడం లేదు
శ్రామికుడికి శ్రమఫలితం అందడం లేదు
ఉద్యోగానికి జీతం డబ్బులు చాలడం లేదు
విద్యార్థికి భవిష్యత్తు కనబడడం లేదు !

అమ్మో, దున్నలు ! దున్నలు !
మంచితనాన్ని తొక్కేస్తున్నె
ప్రతిభను ప్రాసిక్యూట్ చేసేస్తున్నె
ప్రజల దైనందిన కాయకష్టాన్ని
సారాతో నంజుకు తినేస్తున్నె

గొర్రెలను మచ్చిక చేసుకొని
కసాయిాలకు అమ్మేస్తున్నె
తామే భోక్తలుగా కూర్చొని
తాజా విందులు ఆరగిస్తున్నె !

దేవీ ! ఎలా !
ఎలా ఈ ప్రజల్ని రక్షించడం !
"చతుర్భుతే, చంద్రకళావతంసే,
కుచోన్నతే, కుంకుమరాగ శోణే,
పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ
హస్తే, నమస్తే జగదేక మాత ః !"

ఎంతటి కారుదున్న లైనా
నీ సింహం ముందు సున్నాలేగా ?
అవతరించు మళ్ళీ !
ఆదుకో మానవుణ్ని !
నశించనీ దున్నలను
వికసించనీ మానవతా క్రొన్ననలను !

సర్వనారీ సమ్యక్ శక్త్యంశవు నీవు
సహించకు స్వార్థాన్నీ, క్రౌర్యాన్నీ !
మృగం నుంచి మానవుడు జన్మిస్తే -
మానవుడి నుంచి దేవుడు జన్మించవద్దా !

మానవుడు తిరిగి
మృగం కాదలుస్తున్నాడు నేడు
ఇంకా వట్టి పసివాడు
ఏదో మట్టి తినేస్తున్నాడు !

అవతరించు మళ్ళీ, అధిమానవ శక్తీశ్వరిగా !
మేలుకొల్పు విశ్వజనతను సంపూర్ణ మానవతకు !
క్షమించకు కలుపు మొక్కల్నీ, చీడపురుగుల్నీ
నరికి పారెయ్ న్యాయద్రోహుల్ని
పెరికి పారెయ్ ప్రగతి నిరోధకుల్ని !

అదిగో, నా శివ శక్తి
నీలో ఐక్యమై పోతున్నాను నేను
మహాకాళిగా దుష్టుల్ని సంహరించి,
మహాలక్ష్మిగా ఐశ్వర్యాన్ని పెంపొందించి,
మహాసరస్వతిగా ఆనందాన్ని పంచు !

"చతుర్ముఖ ముఖాంభోజ
వన హంసీ వధూ ర్మమ
మానసే రమతాం నిత్యం
సర్వశుక్లా సరస్వతీ !"

❋ ❋ ❋

## 20. ఇదిగో మోక్ష మార్గం

వెలిగించిన దీపం
ఆరిపోక తప్పదు,
ఆరిపోయే దీపాలను
ఆరాధించను నేను,

అయితే–దీపమే అక్కర లేదా !
ఎందు కక్కర లేదు ?
నిజమైన దీపమై వుండా లది -
మిణుగురు పురుగు కారాదు,

ఈ గుడులన్నీ మట్టివి
ఈ దేవుళ్ళంతా మిణుగురులు
ఈ మఠా లన్నీ దొంగల గుహలు
ఈ మనుషులు బుర్రల్లేని బొమ్మలు !

ఏదీ దీపం ?
అసలు దీప మనేదే లే దిప్పుడు !
ఉన్నవన్నీ ఏళ్ళనాటి శిథిలావశేషాలు -
ఒకడి దంతం, మరొకడి కేశం,
ఒక చెదలు తిన్న తాళపత్రం,
ఒక చవుడు తిన్న శిలా శాసనం !

దెయ్యపు మంటల్ని
దీపా లనుకొంటున్న గొర్రెల్లారా !
మీరు ఉరుకు తున్నది
కసాయి ఖానాల వైపు !

ఇదిగో మళ్ళం డిటు !
ఇదీ మోక్ష మార్గం !
కుల, మత, వర్ణ, వర్గ విముక్త మైన
విశ్వైక మానవతా మార్గం !
అరుణ తరుణ గుణ పరీయులకు
ఆనంద రసాద్వైతం !

❋ ❋ ❋

# 21. చీమల పుట్టలు

నల్ల చీమలు, తెల్ల చీమలు
ఎర్ర చీమలు, పచ్చ చీమలు
చలి చీమలు, పులి చీమలు
కండ చీమలు, రెక్కల చీమలు
అబ్బో, ఎన్నెన్ని రకాల చీమలు !
ఎన్నెన్ని రంగుల చీమలు !

ఒకో రంగు చీమలకు ఒకో పుట్ట
ఏరకం చీమలకైనా ఉండే దొకే పొట్ట
ఏ పొట్ట నిండడానికైనా
కావలసింది ఇన్ని గింజలు
గింజల కోసం గింజుకు చస్తున్నై లంజలు !

నల్లచీమ నోట్లోని బియ్యపు గింజను
తెల్ల చీమ లాక్కొంటున్నది
తెల్ల చీమ పుక్కిట్లోని కాకితం ముక్కను
కండ చీమ పీక్కొంటున్నది
నేల నిండా ఆహారం వున్నా –
అది తింటున్న లమే ఇదీ కావాలంటున్నది !

చీమ కొంచెం సైజు మారితే, అదొక జాతి -
కొంచెం రంగు మారితే, అది మరొక జాతి !
దేశ కాలాలను బట్టి పాత్రల గుణవర్తనలు
మారుతూ వుంటై అని ఎరగని చీడలు !
తక్కిన అన్ని జాతుల మీదా
తన జాతే గొప్ప దనుకొనే పీడలు !

జాతి కో పుట్ట
ఎన్నో పుట్టలు !
పుట్టకూ పుట్టకూ మధ్య
పొట్ట కూటి పోరాటాలు !

తెలివి తక్కువ చీమలు
గింజల కోసం గింజకు చస్తుంటై
అవి పెట్టిన పుట్టలు
పాముల కిర వవు తుంటై !

ఇప్పుడు ఏపుట్టలో చూచినా
వాటి నిండా పాములే !
కనీసం సుమతీ శతకమైనా చదుకోని చీమలు
కలిసి చలిచీమ లెలా అవుతై ?
ఆ పాముల పడగల నీడల్లో ఒదిగి
కప్పల్లా బ్రతుకు తున్నై !

అయ్యో, పాపం, చీమలు
రంగులే రాజ్యా లనుకొంటూ
హంగుల్ని పోగొట్టుకొన్న చీమలు ;

స్వపరాలు లేని చెట్టు చేమలు -
దూర భారాలు లేని దోమలు కూడ
తమకంటె తెలివైన వని
తెలియ లేని చీమలు !
తమలో తాము కొట్టుకు చస్తూ
తమ పుట్టల్ని
పాములకు కట్టబెడుతున్న చీమలు !

❋ ❋ ❋

## 22. మానవుడు బాగుపడడం

మానవుడు
ఎలా బాగుపడతాడు ?
అంటే – ఇప్పుడు
చెడిపోయి వున్నా డనేగా ?
అవును !

సత్యం, అహింస, న్యాయం, నిజాయితీ
ఇవే కదా మనిషిని
మృగం నుంచి . విడదీసే గుణాలు ?
ఇవి ఈనాడు
ఒక్కడిలో అయినా వున్నాయా ?

లేవు, ముమ్మాటికీ లేవు !
అందుకే అడుగుతున్నాను –
మానవు డెలా బాగుపడతాడు ?
ఎప్పుడు మరో మెట్టెక్కు తాడు ?

చెప్పు మంటావా ?
తర్వాత తిట్టుకోవు కద ?
నన్ను నాస్తికు డనవు కద ?
ఉపేక్షించి పోవు కద ?

అయితే – చెపుతున్నాను విను !
మానవుడు బాగుపడడం –
మరో మెట్టెక్కడం –
మతం నుంచి బైట పడ్డప్పుడు !

తాను కల్పించుకొన్న దైవ భ్రాంతి నుంచి
తప్పించుకొని నిలబడి నప్పుడు,
కర్మసిద్ధాంతాన్ని కాల రాచేసి నప్పుడు,
తనను తాను తెలుసుకొని
తన్మయాత్ము డైనప్పుడు !

❋ ❋ ❋

## 23. పశువే నయం

ఆది శంకరులు -
జ్ఞానా ? భక్తుడా ?
అయ్యో - ఆయన అద్వైతాచార్యుడు కదా ?

మరి, భజగోవిందం మాట ?
అదా, అది మూఢమతుల కోసం.
శివానంద లహరి ?
భక్తుల కోసం.
సువర్ణ ధార ?
ప్రజల కోసం.
సౌందర్య లహరి ?
తన కోసం.

ఇదంతా నిర్గు ణోపాస నేన ?
అవును - సగుణ బ్రహ్మ ద్వారా.

ఎవరా బ్రహ్మ ?
నీ వే దనుకుంటే అదే -
నీ కోరిక కల్పించుకొన్న రూపం !
అయితే - ఎంతటి జ్ఞానికి కూడ

ఒక ఇష్టదైవం తప్పదన్న మాట !
అవును, అది మానవుడి బలహీనత !

తనను శత్రువుల నుంచి కాపాడడానికి
తన కోరికలను తీర్చడానికి
ఒక దైవం తనకు కావాలి !

అలా కల్పించుకొన్న దైవం
అభయ హస్తం పట్టాలి,
వరద హస్తం చూపాలి !
మరో కొన్ని చేతుల్ని కూడ మొలిపించుకొని
ఉన్న ఆయుధా లన్నీ పుచ్చుకొని
తన చుట్టూ గస్తీ తిరగాలి !
ఇలువే ల్పయి – వాచ్‌మన్ గా
తన ఇంటనే ఉండిపోవాలి !

అప్పుడు ఇక భయం లే దనుకొంటూ,
బ్రతుకుతాడు మనిషి !
పాపం, మనిషి !
జీవిత ధర్మంలో తనకంటె
పశువే నయ మనిపించే మనిషి !

❋ ❋ ❋

## 24. నాకు రావలసిన బాకీ

నేను సూర్యుణ్ని కాదు
చంద్రుణ్ని !

నా కున్నది ఎండకాదు
గుండె !

నేను దోషరహితుణ్ని కాదు
దోషాకరుణ్ని !

నా చేతిలోది ఖడ్గం కాదు
కళ !

నేను స్థిరుణ్ని కాదు
హాని వృద్ధులున్న వాణ్ని !

నా సహచరి రాజ్యలక్ష్మి కాదు
ప్రజా వాణి !

నేను మహా నాయకుణ్ని కాదు
మాములు మనిషిని !

❋ ❋ ❋

నేను తినేది ప్రజాధనం కాదు
నా కాయకష్ట ఫలం !

నేను కోరేది మీ దయాధర్మ భిక్ష కాదు
నాకు రావలసిన బాకి !

నేను నిలబడింది లంచాల మేడ మీద కాదు
నీతీ నిజాయతీ ధర్మచక్రాల రథం మీద !

ఓ, అహంకార కులాగ్రేసరా !
నా హక్కులేవో నా కిలా పారేయ్ !
హే, పీడిత పిరికి జనమా!
ఇవిగో మీ హక్కులు
అధికారంతో అనుభవించం డిక !

❋ ❋ ❋

## 25. ప్రపంచ పోటీలు

ప్రపంచంలోని వివిధ జాతుల మానవుల
జవ సత్త్వాలకు, నైపుణ్యాలకు
గీటు రాళ్ళు ఒలింపిక్ ఆట గాళ్ళు !

రకరకాల ఆటలు, పందాలు, పోటీలు !
శక్తి, యుక్తి, బలం, చలం
నేర్పు, ఓర్పు, వేగం, విక్రమం -
శక్తీశ్వర విశ్వరూప సందర్శనం అది !

ఈ విశ్వశక్తి ప్రదర్శనలలో
భీమార్జు నాది విజేతలకు
ఎన్నో వెండి బంగారు పతకాలు !

అందులో ఒకటీ మనకు రాదు !
ఈనాడు ఒక్క భీముడు కూడ మనకు లేడు !

అయ్యో, ఎందుకు లేడు ?
మా గిరిజన గూడెంలో
ప్రతి వాడు ఒక అర్జునుడే !

మా హరిజన వాడల్లో
ప్రతి వాడూ ఒక భీముడే !
ఇక్కడ ఇంతమంది మహాయోధు లుండగా
అక్కడ విశ్వశక్తి పోటీలకు
సైంధవులూ, శిఖండులూ,
పేడి కూడ తోడులేని ఉత్తర కుమారులూ
ఎలా వెళ్ళి నట్టు ?
భారత వీరజాతి కింత
ఘోరావమానం ఎందుకు తెచ్చి పెట్టినట్టు ?

అవన్నీ రాజకీయాలు !
భారత ప్రజాస్వామిక రాజకీయాలు !

ఈ మన రాజకీయాలలో
పైరవికే కాని ప్రతిభకు చోటు లేదు !
ఆశ్రిత పక్షపాతానికీ, బంధుప్రీతికీ తప్ప
శక్తి సామర్థ్యాలకు దిక్కు లేదు !

ఒలింపిక్ ఆటల పోటీలకు
అంతర్జాతీయ సాంస్కృతిక సమారోహాలకు
మనవాళ్ళు వెళ్ళడం –

అక్కడ మనజాతి గొప్పను చూపడానికి కాదు
విదేశ యాత్రా కండూతిని తీర్చుకోడానికి !
అవన్నీ రాజకీయాలు !
రావు మనకు కనీసం మెర్సీ పతకాలు !

అంతేనా ?
దుష్ట రాజకీయ దున్నల గిట్టల కింద
భారత కళా సంపదల కేదారాలు
మట్టి గొట్టుకు పోవలసిందేనా ?
ఇక మనం ఎందుకూ పనికి రామా ?

అయ్యో రామా, ఎందు కంత నిరాశ ?
మనకున్న శక్తులు మనకూ వున్నైగా !
లంచాలు తీసుకోవడంలో
కంచాలు ఖాళీచెయ్యడంలో
బిచ్చ మెత్తుకోవడంలో
ప్రపంచ పోటీలు పెడితే
పతకా లన్నీ మనకే రావా ?

లంచగొండి తనం
మన జాతీయ క్రీడ కాదా ?
దానికి నోబెల్ ప్రైజు ఇస్తే
ప్రతి ఏడాదీ అది మనకే రాదా ?

పురుష సూక్తపు జాతి వాళ్ళం,
సూక్తాన్ని బట్టీ పట్టి
బట్టీ సారాను త్రాగుతున్న వాళ్ళం,
పురుషత్వాన్ని ఇతర జాతులకు వదలి
పురుగుల్లా బ్రతుకుతున్న వాళ్ళం,
రామాది పురుష లక్ష్యాలను చించేసి
రాజకీయాల పెంట కుప్పలపై
రామబందులుగా విహరిస్తున్న వాళ్ళం,
ఎవరికైనా తీసిపోతామా ?

పెట్టమనండి పోటీ పందాలను
ఒక్క దగాకోరు తనంలో !
ఈ భూప్రపంచాన్నే కాదు
త్రిలోకాలనూ జయించగలడు
మనలో ఏ ఒక్కడైనా సరే
కూలీ మొదలు కోటీశ్వరుడి దాకా !

పురుష సూక్తులు పూర్వకాలం వాళ్ళకు
పౌరుషాలు పరాయి వాళ్ళకు !
మన వేదాలు అపౌరుషేయాలు
అ పౌరుషమే మన ధర్మం !
పర బ్రహ్మ నపుంసక లిగం,
భారతీయుడు పుంలింగ మెట్లా ?

కోడి పందాల జాతి మనది
మనమే పొగరెక్కిన కోడి పుంజులం
మనలో మనం సుందోప సుందులం
ఇతరుల ముందు కుక్కిన పేనులం !
మాయా వాదానికి వారసులం
మనుష్యుల్ని మాయచెయ్యడంలో
త్రిలోక ఛాంపియనులం మనమే !
లంచం, మంచం, భిక్ష, కక్ష -
ఇదీ ప్రస్తుతం
మన గుణ కర్మల వ్యవస్థ !

నిరాశ పడకండి,
సోదర భారత యువకుల్లారా !
మనకున్న శక్తులు మన కున్నై !

కొత్త నీతులు సృష్టించండి
క్రొత్త పుంతలు తొక్కండి !
వినకండి తలిదండ్రుల మాటలు
చించి పారెయ్యండి పాఠ్యగ్రంథాలు
కాపీలు కొట్టి పాసవ్వండి
రికమండేషనులతో అధికారులు కండి !

పని చెయ్యకుండా జీతాలు తీసుకోండి,
చేసిన పనికి లంచాలు గుంజుకోండి !

అమ్మేసుకోండి క్రింది ఉద్యోగాల్ని
కొనేసుకోండి మీది పదవుల్ని !
వెధవ ఒలంపిక్ పోటీలు –
మనమే పెడదాం ఇందుల్లో కొత్త పోటీలు !
బంగారు, వెండి, కంచు, గడ్డి
అన్ని పతకాలు మనకే వస్తై !

మనకు సిగ్గు లేదు –
అక్కర లేదు !
మగ వాళ్ళం కాం –
అవును, కాం !
హాకీ అనే కూపంలో
కూపస్థ మండూకాలం –
సరే, కాలం !
ఆ కూపం కూడ కూలిపోయింది –
పోతే పోయింది !

ఓహో, యమ ధర్మ రాజా !
డిస్మిస్ చేసెయ్ నీ భటుల్ని !
నీకూ నాలుగు రాళ్ళు సంపాదించి పెడతాం
వేసెయ్ ఆ ఖాళీలలో మమ్మల్ని !
నీ లోకపు సందడి అంతా
మా దేశపు నల్ల ధనమేగా ?
అవినీతి జిందాబాద్ !
శక్తిసామర్థ్యాలు ముర్దాబాద్ !

## 26. చీకట్లో అర సున్న

చీకట్లో అర సున్న
కనిపిస్తుం దంటాడు మా వాడు !

చిమ్మ చీకట్లో
గాలి వాన చీకట్లో
కరెంటు పోయిన నగర వీధి చీకట్లో
వధువు సిగ్గుపడ్డ శోభనంగది చీకట్లో
కాళరాత్రి చీకట్లో కూడ
కనిపిస్తుం దంటాడు అర సున్న !

వెధవ అరసున్న – ఎవడి క్కావాలిరా ? అంటే
కావలసిన వాళ్ళకే అంటాడు !
కవి కంటె చాల చిన్నవాడు
కవి సృష్టించిన అందాలకు
అర్థాలు చెప్పుకొంటూ బ్రతికేవాడు
కవిని బట్టీపట్టి పండితుడైన వాడు
కవినే విమర్శిస్తున్నా డీ నాడు !

అయితే – చీకటిని సృష్టించిన వాడూ కవేగా ?
అందులో ఏముందో, ఏం లేదో

ఋషి కనుక తన కక్కరలేక పోవచ్చు !
పదిమందితో పోటీపడి బ్రతకవలసిన
పండితుడి కక్కర లేదా ?
ఈ లోకంలో మనిషికి మిగిలిం దేమిటి ?
చీకటి ఒక్కటేగా !

చీకట్లో దేవులాడవలసిన వాడికి
నెల వంక లాంటి అరసు నైనా
కనిపించక పోతే –
ఆ వెనుక పొదల్లో మెరిసే
ఆకలి పులి కళ్ళ నుంచి
తప్పించుకోవడం ఎలా ?
పాపం, నిజానికి, ఈనాడు
లోకంలోని ప్రతి మనిషి
ప్రజాస్వామికంలోని వోటరులా
చీకట్లోని అరసున్నే !

❋ ❋ ❋

## 27. మానవు లెక్కడున్నా

మా బస్సుకు ఆక్సిడెం టయింది !
కంట్రోలు తప్పి, దేనికో గుద్దుకొని,
పేలి, కాలిపోయింది !
చితికిన పండునుంచి గింజల్లా
చెల్లా చెదురై పోయాం మేం !

అమ్మో, ఆ ప్రక్కకూర్చున్న కాటుక కళ్ళు !
లే దనకుండా ఎక్కించుకునే ఆ కండక్టరు !
ఎందరో తన శకటం కింద పడి చస్తున్నా
తాను మాత్రం బ్రతికేవుంటున్న డ్రైవరు !
అంతమంది ప్రయాణీకులు !
ఏమై పోయారో ఆ అర్ధరాత్రి చీకట్లో !
ఎవరైనా మిగిలారో లేదో !

ఆ కాలిపోతున్న బస్సు మంటల వెలుగులో
ముక్కుకు సూటిగా పోయాం మేం !
మే మంటే ఎవరు ? నేనే !
నాతో మరెవరో వున్నారన్న భ్రాంతి !

ఏ మంట మా యాత్రకు అగ్ని సంస్కార మైందో
అదే మాకు వెలుగు చూపించింది,
అదే ఆరి చీకట్లో ముంచింది !

మబ్బు కమ్మిన ముసుగు చీకట్లో
నడిచాం, నడిచాం, ఎటో, ఎంతదూరమో !
సొమ్మసిల్లి పడిపోయాం, ఎక్కడో, ఎంతసేపో !
మేం కన్ను తెరిచిందే మా జన్మభూమి అయింది !
ప్రొద్దు పొడిచిందే మాకు తూర్పుది క్కయింది ;

నాతో మరెవరో వున్నా రన్నది భ్రాంతా ?
కాదు, నిజంగానే వున్నా రక్కడ పడి !
నలుగురూ ఒకరి కొకరు కొత్తవాళ్ళు
నలుగురూ నాలు గూళ్ళ వాళ్ళు !

కన్నీటి కంఠాలతో మూలుగుతున్నారు వాళ్ళు -
వృద్ధుడు కూతురు కోసం
బాలిక తండ్రి కోసం
యువతి భర్త కోసం
యువకుడు ప్రియురాలి కోసం !
ఎవరే దిక్కుకు పోయారో !
అసలు బ్రతికున్నారో లేదో !

ఎందుకు బ్రతి కుండరు ?
మనం బ్రతికి లేమా ?

బస్సులోని అందర్నీ కుదిపేసి
నాల్గు దిక్కులకూ తరిమింది ఆక్సిడెంటు !
ఎవరో కొత్తవాళ్ళం నలుగురం
ఈ దిక్కున కలవడమూ ఆక్సిడెంటే !

కన్నీరు నించి ఏం లాభం ?
కలిసి వున్నవాళ్ళమే కుటుంబం !
ఇప్పుడు మేం అయిదుగురం ఒక కుటుంబం,
మేం కన్ను తెరిచిన ఇదే మా జన్మ భూమి !
మాకు లాగే మా వాళ్ళంతా
ఎక్కడెక్కడో వున్నారు !
మానవు లెక్కడున్నా మా వాళ్ళే
మా వాళ్ళున్న భూము లన్నీ మా భూములే !

❋ ❋ ❋

## 28. ముగ్గురు భార్యలు

నాకు ముగ్గురు భార్యలు,
దశరథుణ్ని మాత్రం కాదు నేను.

పెద్దామెకు భక్తుణ్నీ కాదు
చిన్నామెకు సేవకుణ్నీ కాదు
నడుమామె పట్ల నిర్లక్ష్యతా లేదు
నేను పోషలిస్తును.

ఆ ముగ్గురూ ఒకే గుత్తిలోని మూడు పువ్వులు
ఒకే కాలంలోని మూడు అవస్థలు !

త్రి సంధ్యా రాగోజ్వల వదన గాయత్రి
సూర్యుని చుట్టూ వలె -
ఆ మూడు ముఖాల గుత్తీ
నా చుట్టూ తిరుగుతూ వుంటుంది
నా ఒకో అభిరుచికి
ఒకో ముఖం పెదవి కలుపుతూ,

అయితే-ఆ ముగ్గురూ
ఎంత వయ్యారులో

అంత గయ్యాళులు,
ఒక్కొక్కరితో
ఒక్కొక్క అవస్థ,
ఒకో అవస్థ ఒకో లోక వ్యవస్థ !

నా భార్యలు
లోకానుభవ గుణ ధుర్యలు
కాలాను గుణ మాధుర్యలు !
కాని–గుమ్మంలో తాము
ఒకరిపై ఒకరు దూసిన కత్తులు
గుండెల్లో మాత్రం
మూడు లోకాలకూ ముగ్గు రమ్మలు.

ఇక–నేను–ఈ ముగ్గురితో
త్రి కాల బాధితుణ్నే అయినా –
కాలేశ్వరుణ్ని కనుక –
దేశకాల పాత్రోత్తర పరమాత్మను గా
బ్రతికి వుంటున్నాను !
ఒక భ్రాంతిమ దలంకార రసావర్తం
నా ఇతివృత్తం !

❋ ❋ ❋

## 29. గద్దలూ, ఉండేలు బద్దలూ

సంగీత సాహిత్యాలు
చిలకా గోరింకల్లా బ్రతకాలి !

గోరింక కాదు –
పావురం అన మంటున్నా రెవరో !
కళా రంగం కూడ
రాజకీయ కదనరంగ మేనా ?

రామ చిలక ఆనందానికి రాయల్ అంబాసిడర్ !
శుక సందేశా లెన్నో శుభోదయా లైనై !
కపోత సందేశ మొక్క టైనా
కత్తికి కారుణ్యం నేర్పగలిగిందా ?

కత్తి లేకుండా కాకరకాయ కూడ
గొంతు దిగ దంటున్నారు కదూ !
అంతే నండీ, అంతే
గోరింక లంతా పావురాలు కండి !
గొప్పగొప్ప శాంతి సందేశాలతో
గొంతులు కొయ్యండి
గొంతుకలో వేసుకోండి !
కనీసం-చిలకల్ని అయినా
చిత్తంలో భద్రపరుచుకోండి !
పైని గద్ద లున్నై
క్రింద ఉండేలు బద్ద లున్నై !

❋ ❋ ❋

## 30. కవిత వల్ల ప్రయోజనం

మనిషికి చదువు అవసరమా !
సుఖంగా బ్రతకడానికి
చదు వక్కర లేదు.

ఇదిగో, ఈ మేడ ఎవరిది ?
అదిగో, ఆ కోట ఎవరిది ?
ఈ సిటీలోని ఆస్తిపరులలో
ఎవరి పనిని వారు చేసు కొంటూ
స్వతంత్రంగా జీవిస్తున్న వారిలో
చదువుకొన్నవా ళ్ళెంత మంది ?

సుఖంగా బ్రతకడానికి
చదువే అక్కర లేదు,
సాహిత్యం దాకా ఎందుకు ?

ఉజ్వలంగా బ్రతకడానికి
విద్య అవసరం –
యూనివర్సిటీ విద్య కావచ్చు,
ఇంద్రజాల విద్య కావచ్చు !

ఆనందంగా బ్రతకా లనుకొన్నప్పుడే
అవసర మవుతుంది సాహిత్యం !
సాహిత్యంలో కవిత
సాహిత్యంలో అమృతం !

కవిత ఒక భోగవస్తువు ,
అది ఎవరో ఒక కొందరికే !
జనానికి కావసింది
చవుక బియ్యపు దుకాణం ,
రత్నాల షాపు కాదు !
జనాభ్యుదయానికి కావలసినవాడు
రాజకీయ విప్లవకారుడు,
కవి కాదు.

రామాయణం చదువడం
రాముడిలా నడువడానికి కాదు,
హరిశ్చంద్ర నాటకం చూడడం
సత్యం పలకడం నేర్చుకోడానికి కాదు ,
సర్కసు చూడడం సరదాకు
లా చదువడం బ్రతకు తెరువుకు.

బుద్ధుడు, క్రైస్తు, మార్క్స్, మహాత్ముడు,
అంబేద్కరు వంటి మానవోద్ధారకులలో
ఒక్కడూ కవి కాదు ,
రచనను విప్లవ వ్యూహ రచనగా
విన్యసింప జేసేవాడు
రాధా మనోరథుడైనా
రాజకీయ రథ సారథే !

కవిత ఒక అద్వితీయమైన అమృతం !
కవి తానే మంధరమూ, వాసుకీ అయి
దైత్యులూ, ఆదిత్యులూ తానే అయి
తానే పాల్కడలీ, మహాకూర్మమూ అయి
చుట్టుముట్టే విషాన్ని తానే కంఠగతం చేసుకొని

అమృతాన్ని సృష్టించి, అరచేతిలో పెట్టుకొని,
ధన్వంతరిగా తానే అవతరిస్తాడు
గుండె గుండెనూ తడతాడు
ప్రతి సరసుడికీ పంచుతాడు !
బిచ్చగాడైన దాత, భక్తుడైన భగవంతుడు
ఎవడైనా వుంటే - అతడే కవి !

అయితే -
దాత వల్ల ఏమిటి ప్రయోజనం ?
మన అన్నదాన సిద్ధాంతం
ఆకలి తీర్చగలిగిందా కోటి కొకరి కైనా ?
భగవంతుడి వల్ల ఏమిటి లాభం ?
మన భక్తవత్సల విశ్వాసం
రక్షించ గలిగిందా దేశాన్ని దాస్యం నుంచి ?

ఎవడి దయాధర్మ భిక్షా వద్దు
నీకు ఉప్పు, పప్పు, బియ్యం కావలిస్తే
సూపరుబజారుకు వెళ్ళి!
ఉద్యోగం, ప్రమోషను, పర్మిట్టు కావలిస్తే
అయ్యగారి కిచను గార్డెనుకు వెళ్ళు !

సర్వం పోయినా చవకడబ్బు కావా లనుకొంటే
రేసులు, లాటరీలు, బ్రాకెట్లు చాల వున్నై !
ఏ వృత్తికీ, ఉద్యోగానికీ పనికిరాక పోతే
రాజకీయమో, సాంఘిక సేవో లేదా ?
తృప్తిగా తిని, తాగి, ఆనందించా లనుకొంటేనే
ఇటు నా వద్దకు రా !
ఇదిగో, కవిత !

❋ ❋ ❋

## 31. నాకు పేదరికం లేదు

నాకు తిండి దొరక్క పోతే
నేను పస్తు లుండను ,
ఉపవాసాలు చేస్తాను !
నాకు పేదరికం లేదు.

నాకు బట్ట దొరక్కపోతే
నేను చింకి పాతలు కట్టను,
దిగంబ రోద్యమం నిర్వహిస్తాను!
నాకు పేదరికం లేదు.

నాకు కొంప దొరక్క పోతే
పేవుమెంట్ల పై కూర్చోను,
శ్రీ శుక మహర్షినే అవుతాను !
నాకు పేదరికం లేదు.

❋ ❋ ❋

## 32. అందరూ - నేనూ

అందరూ పైకి చూస్తు న్నప్పుడు
నేను క్రిందికి చూస్తాను !

పచ్చని చేలు, పైరు పాటలు, తోటలు,
రైతు బిడ్డలు, నదీ కాంతలు, కళలు !
ఆనందం విరుస్తుంది నాలో,
ఆకాశానికి పొంగుతుంది అమృతం !
అందరూ క్రిందికి చూస్తు న్నప్పుడు
నేను పైకి చూస్తాను !

చుక్కలో, చంద్రుడో, సూర్యుడో,
మబ్బులో, మెరుపులో, మాయా శూన్యమో !
అమృతం కురుస్తుంది నాపై !
ఆనందం విరుస్తుంది నాలో !

నే నెక్కడ చూస్తే అక్కడ
అమృతం కురుస్తుంది,
ఆనందం విరుస్తుంది !

నిజానికి –
క్రింద నుంచి విరిసేదంతా
పై నుంచి కురిసేదే,
పై నుంచి కురిసే దంతా
క్రింది నుంచి విరిసేదే !

❋ ❋ ❋

## 33. పాత్రతో పనిలేదు

నే నిక మానేస్తా !
ఏమిటి ?
కవిత్వం వ్రాయడం !

అరే, నవ్వుతున్నారే !
నవ్వండి, నవ్వండి !
నే నేదో దుర్యోధను ణ్ననుకోకండి !

పాపం, దుర్యోధనుడు !
వాడే సరసుడై వుంటే
ద్రౌపదే నవ్విం దనుకొంటే
ఆమెను ఆరాధించే వాడు !
విరసంతో విషం నింపుకొని
పగపట్టి పామై పోయాడు, పాపం !

ఇంతకూ – మీరు నవ్వడం –
అలవా టైన వాణ్ని
ఎలా మానగల నని కదూ ?

ఆకాశంలో గేయంగా ప్రవహించే వాణ్ని
దూకి, పద్యంలో పడ్డాను !
అక్కడి నుంచి గెంతి, గద్యం మీద పడ్డాను !
ఇక్కడి నుంచి ఇక -

మరీ నవ్వుతున్నారే !
వెండిదో, గాజుదో, మట్టిదో
పాత్ర ఏ దైతే ఏం అంటున్నారా ?
అవును, మధువు కదూ కావలసింది !
జానపద సుధా సముద్రాన్ని అంతా
మట్టి ముంతతో ముంచుకు తాగడం లేదా ?

కావచ్చు–నాకూ జ్ఞాపకం వున్నై
అంటగూడని అమృత హస్తాల నుంచి
దోసిలిపట్టి దాహం తీర్చుకొన్న రోజులు ;
నిజమే–మీ రనేది !

కవిత్వం ఒక ప్రక్రియకు ప్రేయసి కాదు
ఒక భాషకు బందీ కాదు
ఒక స్వేచ్ఛా సుందర మధుర భావన అది !

కవిత్వం వ్రాసేదీ, చదివేదీ కాదు
ఆస్వాదించి, ఆనందించే దది !

ఇంతకూ–నాకు ఒక పాత్రతో పనిలే దంటారు ?
నిత్యం మధు వందిస్తూనే వుంటా నంటారు ?
సరే, కానివ్వండి !
మీ మాటే సాగనివ్వండి !

* * *

## 34. ఆనంద రాయబారులు

ఏవేవో, ఎన్నెన్నో లోకాలోకల నుంచి
అ పూర్వసౌందర్య మాధుర్యాలను
మనిషికి మచ్చు చూపించ వచ్చిన
ఆనంద రాయబారులు కవులు !

స్వర్గం నుంచి అప్సరల పెదవులతో
కల్ప వృక్షాల కల్లును
మందారాల మధువును -

వై కుంఠం నుంచి భోగ భాగ్యాలను
మనోవైభవ లీలా విలాసాలను -

కై లాసం నుంచి శివానంద లహరులను
కళానంద శోభా పారవశ్యాన్ని -

గోలోకం నుంచి రాధా రాగ సౌభాగ్యాన్ని
రసానంద పారమ్యాన్ని -

ఇలా - ఎన్నెన్నో, ఏవేవో
బహి రంత రాభ్యంతర

దివ్య భవ్య నవ్య లోకాల నుంచి
అనేకానేక సౌందర్యాలను, రసాలను
మాధుర్యాలను తెస్తారు కవులు
మనిషికి మచ్చు చూపించడానికి.

ఆత్మ సాఫల్యానికి
ఆనంద రాయబారి కవి.

ఏ లోకం నుంచి తాను వచ్చాడో
ఆ లోకంలో, తమ రాజ్యంలో
మానవాత్మ సౌఖ్యానికి, శ్రేయానికి
ఏయే సౌకర్యాలు, సౌలభ్యాలు
మాహాత్మ్యాలు ఉన్నాయో చెపుతాడు కవి ,
మచ్చు చూపుతాడు కవి !

అందరినీ విను
అన్ని మచ్చులూ చూడు
ఏది నచ్చితే దాన్ని తీసుకో !

ఏ సౌందర్య మైనా
స్వర్గ సుధను అందివ్వగలదు ,
ఏ భోగ విలాస మైనా

వైకుంఠాన్ని రుచిచూపగలదు ,
ఏ నట న్న వాలక అయినా
ఆనంద గంగలో ఓల లాడించ గలదు ,
ఇన్ని మచ్చులు
నీ ఎన్నిక కోసం !

అభిరుచులు అనేకం
ఏ రుచికి ఆ పదార్థం !
నచ్చిన దాన్ని స్వీకరించు
అనుభవించు !
నచ్చక పోతే నిరాకరించు,
నిరశించకు !
నీ కక్కర లేకపోతే తోసెయ్ ,
తీసెయ్యకు !

వసంతంలా పూచినా
వర్షంలా ప్రవహించినా
ఎండలా మండినా
చలిలా కొరికినా
ఏ కవి ఏరూపంలో వచ్చినా –
ఆతడు వేషధారి కాక
నిజమైన కవే అయినప్పుడు
నీకు భయం అక్కర లేదు.

అన్నీ చూడు
ఎన్నుకో నీ అభిరుచిని బట్టి !

ఒక్కటి మాత్రం గుర్తుంచుకో –
మళ్ళీ మళ్ళీ చదవా లనిపించేది సాహిత్యం
మళ్ళీ మళ్ళీ వినా లనిపించేది సంగీతం
మళ్ళీ మళ్ళీ చూడా లనిపించేది శిల్పం
ఈ కళా కమనీయ సంసారమే కవిత !

బెంగలను బాధలను తొలగించి
నిరాశా నిస్పృహలను ఊదేసి
మనస్సును ఉత్తేజ పరచి
ఆత్మను అలరించేది కవిత !

కూడు, గుడ్డ, కొంప
అవి భౌతి కావసరాలు,
సంగీతం, సాహిత్యం, శిల్పం
ఇవి ఆత్మావసరాలు ,
ఈ త్రివేణి సంగమ సంసార సుధను
హృదయాని కందిచ్చే వాడే కవి :
కవు లందర్నీ చూడు ;
నన్ను కూడా చూడు !

❋ ❋ ❋

## 35. విత్తనాల మడి

కాల ప్రవాహం లో
ప్రతిక్షణమూ ఒక అల !
అది లేచి పడడమే వర్తమానం !

బ్రహ్మ క్షేత్రంలో
ప్రతి కణమూ ఒక బీజం !
అది వికసించడమే జీవితం !

కాల గర్భంలో
గతం ఎలా ప్రసుప్తమో
భవిష్యత్తూ అలానే ప్రసుత్తం !

వర్తమానం అనే ఉభయ భారతి
గతాన్ని నిద్ర పుచ్చుతూ -
భవిష్యత్తును లేపుకొంటూ పోతుంటుంది
విరామం లేకుండా -
నమస్సు కనో, నాస్తా కనో
మధ్యలో పని వొదిలి పోకుండా !

ఉన్న దెక్కడికి పోతుంది ?
లేని దెక్కడి నుంచి వస్తుంది ?

''తమసులో దాగి కాన్పించ దంతె కాని
లేని దన్నది విశ్వాస లే దొకింత''
అన్నాను నేను నా ''దీపసభ'' కావ్యంలో
ఒక పాతికేళ్ళ క్రితం !
చదువ లేదు కదూ నీవు ?

మా తాతయ్య నేడు లేడు,
నూరేళ్ళ క్రితం కూడ లేడు !
అటు అనంత కాలంగా లేడు ,
ఇటు అనంత కాలంగా లేడు !
ఈ మధ్యలో –
చటుక్కున ఎక్కడి నుంచి వచ్చినట్టు ?
తటుక్కుమని ఎక్కడికి పోయినట్టు ?

వర్షం కురిసింది –
ఎక్కడి నుంచి కురిసింది ?
బిందువు ఆకాశంలో ఉంది.

గడ్డి మొలిచింది -
ఎక్కడి నుంచి మొలిచింది ?
బీజం భూమిలో వుంది !

వెలు గెక్కడి నుంచి వస్తున్నది ?
ఆరి, ఎక్కడికి పోతున్నది ?
అది ఎక్కడి నుంచీ రాదు
ఎక్కడికీ పోదు
అది అక్కడే వుంది !

పిలవగానే ప్రత్యక్ష మయ్యే నౌకరు
అంత వరకూ ఎక్కడ వున్నాడు ?
అక్కడే వున్నాడు !
కనిపించకుండా వున్నా డంతే !

ప్రవాహానికి భూమి లాగే
కాల ప్రవాహానికి ఆధారం బ్రహ్మ.
ప్రవాహా లనేకం
కాల ప్రవాహా లనంతం !
ఈ అన్నిటికీ బ్రహ్మ ఒక జీవ క్షేత్రం -
ఒక విత్తనాల మడి !

ఈ నిరంతర కాల వేగంలో
ప్రతి క్షణమూ ఒక వర్తమానం,
క్షణంలోని ప్రతి అలా ఒక వేకువ,
అలలోని ప్రతి బిందువూ ఒక సర్గ !

బిందువు లోని పరమ బీజాణువులు
అనంతకోటి జీవరాసులు !
ప్రతి జీవిదీ ఒక ప్రత్యేక కార్యపరిధి !
ఒక ప్రత్యేక జీవితం !

బీజ క్షేత్రం నుంచి వచ్చిన అంకురం
పెరిగి, పూచి, పండి, బీజమై -
మళ్ళీ వచ్చిన చోటికే వెళ్ళి పోతుంది !
ముందూ అది బీజమే
తర్వాత అది బీజమే !
గతమూ బీజమే
భవిష్యత్తూ బీజమే !

అయితే-భవిష్యత్తు నుంచి గతానికి
బీజాణువు లేచి పడే టప్పుడు
కమనీయమైన ఆ కదలికలో
జిగేలు మన వచ్చు ఎన్నో రంగులు !

ఎన్నో రుచులు, వాటి వాసనలు !
ఆనందం పంచవచ్చు
అన్యో న్యాలింగనాలతో !
పూర్ణా ద్వైత పర బ్రహ్మ నుంచి
పుష్పించ వచ్చు రసాద్వైత జీవబ్రహ్మ !

వెలుగు అదెంత గొప్పదైనా
ఆరిపోక తప్పదు !
చీకటి ఎక్కడి దక్కడిదే ,
సచ్చిదానంద యోగ సమాధి !

చీకటి గృహస్థు –
వెలుగు అతిథి !
చీకటి పొలం –
వెలుగు పైరు !

సృష్టిలోని ప్రతి పరమాణువూ
ఒక జీవ ద్దీపం !
అంతకు ముందూ అది శక్తే,
ఆ తర్వాతా అది శక్తే,
శక్తి సత్యం, దీపం శివం ,
వాటి విలాస విన్యాసం సుందరం !

సౌర కుటుంబానికి సూర్యుడే యజమాని ,
మానవ జీవితానికి మధుమాసమే దొరసాని !
విశ్వం నిండా అనేక లోకాలు, కుటుంబాలు ,
రకరకాల జీవులు, కాలాలు !

జీవిత కాలం –
జీవిని బట్టి విరచితం !
మల్లెకు ఒక రోజు
మనిషికి ఒక శతమానం !

సూర్య గమనం ఆగిపోతే –
కాల ప్రవాహం నిలిచి పోదా ?
అప్పుడు –

భవిష్యత్తు పుట్టదు
వర్తమానం గిట్టదు
ప్రాణం ఆడదు
అజరామర స్థితి !

కాల గమనం ఎదురు మళ్ళితే ?
అప్పుడు జీవులు –
గతం నుంచి పుట్టుకు రావచ్చునా ?

మనిషి సమాధి నించి వృద్ధుడుగా పుట్టుకు వచ్చి
ప్రౌఢుడై, యువకుడై, బాలుడై

శిశువై నవ్వుతూ, ఏడుస్తూ
తల్లి గర్భంలో పిండమ్మై, బీజమ్మై
ప్రణయమ్మై, ప్రణవమ్మై
పరమ భావమ్మై పోవచ్చునా !

పుట్టిన బీజం గిట్టి బీజమ్మై పోయినప్పడు
వృద్ధుడుగా పుట్టుకొచ్చే ప్రశ్న ఎక్కడది ?
బాల్య యౌవన వార్థక్యాలు భౌతికరూపం తోడివి !
అవి రగిలి, రాలి, మిగిలిన బీజాణువు
తనే స్వయంభు వైన బ్రహ్మాణువు !
అది మళ్ళీ అంకురించవలసి నట్టిదే
కాల గమనం ఎటు మళ్ళినా !

అందువల్ల – సృష్టిని అర్థం చేసుకో !
ఆశ్చర్య పడవద్దు దేనికీ !

గులాబి తీగ–గులాబి పూలే ఎందుకు పూస్తున్నది ?
గుర్రం– గుర్రం పిల్లనే ఎందుకు కంటున్నది ?
తేటి ఎందుకు మధుమత్త మవుతున్నది ?
తేనెటీగ ఎందుకు శ్రమపడుతున్నది ?

నీ ప్రగతి నీ బీజగతం ,
నీ ప్రాభవం నీ కృషి స్థితం !
పరబ్రహ్మ అని మనం అంటున్న దంతా
ఒక పరమానంద బీజ క్షేత్రం !
బీజం భువనేశ్వరం !
భావం బ్రహ్మబంధురం !

భావం భవ్యతరం అయ్యే కొలదీ
భవం భాగ్యవంతం అవుతూ వుంటుంది !
విత్తనం చెట్టైతే ఎంతో
చెట్టు విత్తన మైనా అంతే !

❋ ❋ ❋

## 36. వాకిట్లో వసంత లక్ష్మి

ఒక ప్రక్క -
పంపులో నీళ్ళు లేవు
మార్కెట్లో కూరలు లేవు
జేబులో పైసలు లేవు !

మరో ప్రక్క -
వసంత లక్ష్మి వచ్చి
వాకిట్లో నిలబడింది !
ఏమి టలా చూస్తావు ?
ఒత్తేసుకో కళ్ళల్లోని దైన్యాన్ని !
హత్తేసుకో వసంత లక్ష్మి హృదయాన్ని !

గతరాత్రి చచ్చిపోయింది పాత ఏడాది,
దాని చితినుంచి పుట్టుకొచ్చింది కొత్త ఉగాది !
పాత కన్నీళ్ళు రాలిపోక పోతే
కొత్త వెలుగులకు చోటెక్కడిది ?

మన కే మున్నదో, ఏం లేదో
పండగ కేం తెలుస్తుంది ?
పండగకు కావలసింది గుండె !
అది మన కుంది, చెప్పు స్వాగతం !

కాలి పోతున్న గుడిసెల్ని కాలిపోనీ !
వాటి సమాధులే పునాదులుగా
లేచే భవనాలకు రూపం కల్పించుకో !

పాత ఏడాదీ ఏడాది క్రితం
కొత్తగానే పుట్టింది కాదా ?
పుట్టడం కాదు ముఖ్యం
పుట్టుక సార్థకం కావాలి !
కాలిపోయిన గుడిసె స్థానంలో
మరో గుడిసె లేస్తే ఏం లాభం
అభ్యుదయం ఎలా సాధ్యం
అని కదూ నీ ఆలోచన ?

వందలు వేలు ఉగాదుల్ని
మనమే వ్యర్థం చేసుకున్నాం,
లోపం ఉగాదిది కాదు.
అది ప్రతిసారీ నవ్వుతూనే వస్తున్నది,
మనమే దాన్ని ఏడ్పించి పంపేస్తున్నాం !

మన కష్టాలు మనకే వుండనీ,
మన సుఖాలను మధులక్ష్మికి పంచు !

నిత్య కల్యాణం పందిరి కింద
నెరసిన తలలూ వుంటై,
పచ్చ తోరణం ప్రణయ పంక్తిలో
పండిన కలలూ వుంటై !

మల్లె పూల తీగల కింద
మంటి పెల్లలు కెలక్కు !
కాకుల లోక గోలకు విసిగి
కోకిళ్ళను తరిమి కొట్టకు !
ఎంతో గడ్డి తింటే కదా
ఒక సేరు పాలివ్వడం గొడ్డు ?
వన జ్యోత్స్నవు నీవు

వద్దు మృత్స్నా పరిశోధన !
నవోదయ లక్ష్మితో కలిసి
నవజీవన ప్రణాళికలు నిర్మిస్తాం !
నాదోపాసనతో కీటకమే
నవ భ్రమర మవుతున్నప్పుడు
రసోపాసనతో మానవుడు
రాజేశ్వరుడే ఎందుకు కాడు ?

మనది రసాద్వైతం, మనమే ఆనంద బ్రహ్మ ?
ఎందుకు చూస్తా వలా ఉగాది పచ్చడిలా ?
తీపితో చేదూ, చేదుతో వగరూ
కాపురాలు చెయ్యక తప్పదు !
అవిగో వస్తున్నై పంపులో నీళ్ళు !
ఇక కడిగి కళ్ళకద్దుకో వసంత లక్ష్మి కాళ్ళు !

❋ ❋ ❋

# పాపం ప్రజలు

## 37. ఒక వోటు పోయింది !

వోటరు గారికి నమస్కారం !
మస్కా కాదండి, బాబు !
దేవుడు గా రన్నట్టే అన్నారే !
ఆయ నెవ రంటారా ?
మా గ్రూపు నాయకుడు గారు లెండి !
మస్కా అంటే ఆయనకు తెగ ఇష్టం -
నాకూ ఇష్టమే అనుకోండి !

అన్నట్టు - పంటలు బాగున్నాయా ?
పెద్ద పిల్లకు పెళ్ళి చేశారా ?
అవును, మీ కంతా మగ పిల్లలే కదూ !

పెద్దవా డెక్కడ పని చేస్తున్నాడు ?
ఉద్యోగమే దొరక లేదా !
మరి, నన్ను చూడలేదేం ?
చూశారా ? ఎప్పుడూ ?

అవునండోయ్, అవును !
టాక్సీలకు తెగ తగలేశాం కదూ ?
అప్పుడు మీ రిచ్చిన పార్టీ ఏం మజాగా వుంది !
ఇంకా పని ఏం కాలే దన్న మాట !

ఇప్పుడు డబ్బుద్ది లెండి !
ఎన్నిక లయాక, ముందు మీ పనే చూస్తా !
మంత్రి ఛాన్సు కూడ వుంది లెండి !
అన్నట్టు – నాన్నగా రెలా వున్నారు ?
పోయి నాలుగే ళ్ళయిందా !
అయ్యో, ఒక వోటు పోయిందే !

❋ ❋ ❋

## 38. రోడ్మ్యా దొర బిడ్డే

దయచెయ్యండి, దయచెయ్యండి !
ఎంత కాలానికి ! ఎంత కాలానికి !
మళ్ళీ నిలబడ్డారా యేమిటి ?
అయి దేళ్ళుగా కూర్చునే వున్నారుగా !

నిజమే, పాపం –
ఒకటే కూర్చోవడం కదూ !
బొజ్జ బాగా పెరిగింది !
కాళ్ళకు నీరు కూడ చేరిందే !

అది నీరు కాదు, బీరా ?
నిప్పు లాంటి తాటి చిగురులో
పుట్టి పెరిగిన మీకు
బీరేం ఖర్మండీ ?

అందుకే ఇప్పుడు మళ్ళీ నిలబడుతున్నారా ?
హోదా మామూలు బీరు నుంచి
స్కాచ్ విస్కీకి పెరగా లంటారా ?
కట్టుకొంటున్న మేడలు పూర్తి కావా లంటారా ?

నిజమే సుమండి !
ఇన్ని పంచవర్ష ప్రణాళికలు మా కోస మని వేసి
కొన్ని వేల కోట్లు మా పేర ఖర్చు పెట్టారు కదూ ?
మా గుడిసెలు ఎలాగున్న వలాగే వుండిపోయాయి !

కనీసం ఆ ఇసక రోడ్డైనా
పోనీ - ఆ కరెంటు తీగైనా
మీ వూరు చివరింటి దాకా వచ్చిందే కాని
మా పేటలోకి అడుగు పెట్టగలిగిందా ?
అబ్బో, అది మాత్రం దొరబిడ్డ కాదూ ?

మా గుడిసెలు ఇక కోలుకోవు లెండి !
వీటి ఆకలి చచ్చిపోయింది !
మీ మేడలు బకాసురుడి జఠర జ్వాలలు !
కోట్లే కాదు, బూట్లే మింగి అరుపుకోగలవు !

మీరు కట్టించిన ఇసక ప్రాజెక్టులు కూలిపోతే
పోతే పోతారు యెదవ రైతుకూలీ గొర్రెలు !
యముడి గారి దున్నలన్నీ దూకి ఢీ కొట్టినా
కూల గూడదు మీ అసలు సిమెంటు మేడలు !

ఇవిగో పట్టుకు పొండి, మా వోట్లు !
మీ రైనా తొడుక్కోండి రత్నాల కోట్లు !

కొట్టండిరా, గుడిసెల గొర్రెల్లారా !
జై కొట్టండి, మన శార్దూలం గారికి !
శార్దూలంగారు ఎన్నికల్లో గెలవాలి !
వారు మంత్రో, ముఖ్యమంత్రో కావాలి !
వారూ, వారి పార్టీవారూ కుబేరులై -
మా బిచ్చగాళ్ళ దోసిట్లో దాన కర్ణులు కావాలి !

❋ ❋ ❋

## 39. దుక్కి టెద్దువు కాదు

అన్నం పుట్టించే వాడు
తానే అన్నమై బ్రతికే వాడు
జాతికి వెన్నెముక అయిన వాడు – రైతు !

రైతు వెన్నెముకే వజ్రాయుధం
అతడు నిరంతర నిత్య దధీచి !
తనను తాను త్యాగం చేసుకొంటూ
విత్తనానికి వెలు గిస్తున్న జీవజ్యోతి !

దివిలో సూర్యుడు –
భువి మీద ఆర్యుడు !
ఏ కోరికా లేని వాడు
ఎల్ల కోరికలూ తీర్చేవాడు !
సూర్యుడు జీవన దాత
ఆర్యుడు జీవిత నేత !

దినకరుడు కార్మికుడు
ధాన్యకరుడు కర్షకుడు
ఆ పై వాడితో ఈ క్రింది వాడు
వియ్య మందే కత
నరుడి నాగరికత !

ఈశ్వరుడికి ఒకే ఎద్దు
రైతుకు రెం డెద్దులు !
విష్ణువుకు ఒకే చక్రం
రైతుకు రెండు చక్రాలు !

బ్రహ్మ చతుర్ముఖుడు
రైతు బహు ముఖుడు !
మానవుడి సమస్యలు శతాధికం
ఒకో సమస్యను
ఒకో ముఖంతో పరిష్కరిస్తాడు రైతు !

త్రిమూర్తులకు ప్రతినిధులు
పరస్పరం ప్రతిబింబాలు
ఈ దినకర ధాన్యకరులు !
మానవుని అభ్యుదయానికి
మధు మయూఖులు, మహాత్ములు !

అవును నిజమే, మహాత్ములు !
లోక మాన్యులు, నేతాజీలు,
రాం మోహనులు, వివేకానందులు !
గాంధీజీలు, అంబేడ్కరులు,
ఝాంసీ లక్ష్మలు, దువ్వూరి సుబ్బమ్మలు !
వాల్మీకులు, వ్యాసులు, రవీంద్రులు,
బుద్ధులు, శంకరులు, మార్క్సులు !
వేమన్నలు, భీమన్నలు, బ్రహ్మం గార్లు !
ఒక్కొక్కడూ ఒకొక్క మహా యుగాన్ని
చెమ టోడ్చి పండించిన మహా కర్షకుడు,

పనే పరమాత్మగా,
ప్రతీ పనీ ప్రజా శ్రేయంగా,
పని చేసిన ప్రతిక్షణమూ
ఒక పండగ రోజుగా,
పండిన ప్రతి గింజనూ
పలికిన ప్రతి మాటనూ
విశ్వ సంక్షేమం కోసం యజిస్తూ,
నిన్ను నీవు యజించుకొంటూ,
నిర్వికారంగా, నిష్కామ యోగివై
శ్రమిస్తున్న అన్నా ! రైతన్నా !
సృష్టి స్థితి దేవతవు నీవు
సాక్షాత్తు నీవే జీవ జగత్తువు !

ఒక్కజాతి భారాన్నే కాదు
నానా జాతుల భారాలను, దూరాలను కూడ
విశ్రాంతి లేకుండా మోస్తున్న నీ వెన్ను
వంగి, కుంగి, చిక్కి, శిథిల మైపోతున్నా
ఆదుకొనే నీతి ఏ జాతికీ లేదన్న
ఖిన్నత నీకు వద్దన్నా !

క్విట్ ఇండియా అన్నాడు గాంధీ
వైదొలగి పోయింది పారతంత్ర్యం !
క్విట్ పవర్టీ అన్నది ఇందిరా గాంధీ
తోక ముడిచేస్తుం దిక పేదరికం !

పాతికేళ్ళకా ఈ నినాదం అంటావా ?
పాతికేళ్ళైనా నిండకుండా
ప్రతిజ్ఞలు నెరవేర్చ గల వారెవరు ?
ఇప్పుడైనా వచ్చింది నినాదమే !
పని ఇంకా ప్రారంభం కావలసే వుంది !

అయితే – వ్యవసాయ మహాశయా !
క్విట్ ఇండియా ఉద్యమం వెనుక
అశేష ప్రజాసైన్యం వుంది –
క్విట్ పవర్టీ ఉద్యమం వెనుక
కనీసం నీ వొక్కడవైనా ఉన్నావా ?

ఏ ముళ్ళ మొక్కల్ని పెరికి పారెయ్యా లన్నా
ఏ పళ్ళ తోటల్ని పెంచా లన్నా
ఏ దరిద్రాలను నిర్మూలించా లన్నా
ఏ సౌభాగ్యాలను నిర్మించా లన్నా
నీవు కచ్చ బిగించకుండా
ఏ ముప్పుద్ది ?

ఇదం బ్రాహ్మం, ఇదం క్షాత్రం అంటూ
నీ తొల్కికే తుపాకిగా
నీ మాటే తూటాగా
ముందుకు నడు !

సమ్యక్ కృషితో, సంకల్ప సిద్ధుడవై
సంప త్సృధను
సమంగా పంచి యిడు !

నీవు దుక్కిటెద్దువు కాదు,
జీవజ్జగతికి నలుమోముల పెద్దవు !
ఇక వద్దు నిద్ర,
అందుకో రాజ ముద్ర !

* * *

## 40. నిరంకుశాః ప్రౌఢ్యూసరాః

పాట తయా రైందా, కవి గారూ ?
అయిం దండి, అయినట్టే నండి !

ఏదీ, ఇలా పట్రండి !
ఇదిగో నండి –
పల్లవి కుదిరితే, పా టెంత లెండి !

పది వారాలు కష్టపడి
ఒక పల్లవిని కుదిర్చా రన్న మాట !
మా నాయుడుశాస్త్రి కంటె నయమే లెండి !
ఏదీ వినిపించండి !

"నీ కాటుక కంటి నీరు
చనుకట్టు పయిన్ బడి జారు !"

బ్రహ్మాండంగా వుందండి ?
ఎక్కడో విన్నట్టు కూడ –

వుందాండి ?
ఎక్కడో విన్నట్టు కూడ వుందాండి ?

అదేనండి నిజమైన గొప్ప కవిత్వం !
విన్న ట్లుండడం కంటె –
వినే వుండడం ఇంకా గొప్ప కవిత్వ మండి !

అంత పాండిత్యం మా కెందుకు లెండి !
కావలిసింది సెక్సు –
పచ్చి సెక్సు
మాకు కాదండోయ్, ప్రజలకు !

స్పాంజిని నీళ్ళలో ముంచి పిండి నట్టుగా
పాటలో ప్రతి మాటనూ
సెక్సులో ముంచి పిండాలి మరి !

ముఖ్యంగా క్లాస్ ఫోర్ వుంది చూశారూ –
ఆ గుడిసెల వాళ్ళు వాళ్ళ జన్మలో
తెల్ల తోలును మోకాళ్ళు దాటి చూసుండరు !
ఇక – కుర్రకారు సరే సరి –
వాళ్ళకు ఏ దెక్కడుందో తెలీదు !

దృశ్యాల్లోనే కాదు, పాటల్లో మాటల్లో కూడ
కొంగుల, కుచ్చెళ్ళూ తొలుగుతూ వుండాలి !
తెర మీద తడి బట్టలు ఎంత నీళ్ళు కారిస్తే
అంత చొల్లు కారుస్తై మన ప్రేక్షకుల నోళ్ళు !

ఇళ్ళల్లో వాస్తవంగా అనుభవించలేక కాదు ,
అనుభవించడాని కక్క ఱేముంది ?
ఆకలితో ఆవు రావురు మంటూ వచ్చి
మన హాళ్ళలో కుత తీర్చుకు పోతారు , పాపం !
మరి, వాళ్ళకు నిరాశ కలిగిస్తే ఎలా ?
మనది బిజినెస్సే కాదండోయ్, కవీ జీ !
ప్రధానం సేవ ! దరిద్ర నారాయణ సేవ !

ఎన్ని దరిద్రాల కైనా తట్టుకోవచ్చు ,
సెక్సు దరిద్రం మహా దుర్భర మండి !
పిండండి, వండండి, వడ్డించండి
ఎంత సెక్సునైనా తాగేయ గలరు
మన ఆధునిక ప్రేక్షక మహా జనులు,

ఎడారు లండీ, బాబు, ఎడారులు !
మీ తొలకరి జల్లు లేమూాలకు ?
కురిపించండి కుంభ వర్షాలు !
అప్పుడు కదా మన కుర్ర రైతులకు
కాడెలు భుజాల దాకా లేవడం !

అందుకే – చూపండి మీ మగసిరి !
సిరితో నింపండి మా బాక్సులు మరి !

❋ ❋ ❋

# 41. వర్షాల కమిటీ

వర్షాలు పడడం లేదు !
అవును, ఎందువల్ల పడడం లేదో ?
బహుశా, అవి -
మరెవరి వలలోనో పడివుంటై !

ధర్మరాజు పరిపాలనలో
నెలకు మూడు వర్షా లట !
కావచ్చు -
ఆ నాడు ఒక్కడే ధర్మరాజు !
ఈ నాడు
అందరూ ధర్మరాజులే - యమ !

పాపం పండుతున్నది
పైరు ఎండుతున్నది !
ధరలు ఆకాశానికి
ధర్మం పాతాళానికి !
న్యాయానికి స్థానం లేదు
స్థానానికి న్యాయం లేదు !
కంచెలు చేలను మేసేస్తున్నై
లంచాలు కంచెలను కాజేస్తున్నై !

ఆ నా డంతా దుర్భిక్షం
నాటికీ నేటికి, కూడ
మనల్ని వదలకుండా వున్న దొక్కటే – భిక్షం !

ప్రజల దీపాలతో
ఇక్కడ దేవుడు ఊరేగుతున్నాడు,
దేవుడి (గుడిలో) దీపంతో
అక్కడ పూజారి ఇల్లు సర్దుకొంటున్నాడు !
ప్రజల సంగతి దేవుడికి తెలుసు
దేవుని రహస్యం పూజారికి తెలుసు
ఈ ఇద్దరూ అధికారులకు అలుసు !

ఇంతకి – వర్షాలు ఏమ్మైనై ?
అవి ఎవరి వలల్లో పడ్డినై ?
ఆ ఎవరు ఎవరు ?
ఆ వలలు ఎవరి కలలు ?

ఏది ? ఎవరు ? ఎప్పుడు ? ఎందుకు ?
వగైరా లక్ష ప్రశ్నలతో
ప్రశ్నావళి జారీ అయింది !
ప్రజాభిప్రాయం కోరబడింది !
అనావృష్టి, అతివృష్టి కూడ
అధికారులకు అపరంజి వృష్టే !

వర్షాల దర్యాప్తుకు ఒక కమిటీ,
వలల దర్యాప్తుకు ఒక కమీషన్ !

ప్రజల వద్దకు పెద్దల పాదయాత్రలు,
విమానాలపై నాయకుల పర్యటనలు !
వాటి కయ్యే ఖర్చు లెక్కల మోళీ లో
కరువు నివారణ నిధులు ఖాళీ !
చివరకు తయారైన రిపోర్టు ముద్రణకు
రైతుపై అదనపు పన్నులు.

నోరు లేని బెల్లం ముక్క చుట్టూ
ఎన్ని ఈగలు ! దోమలు ! చీమలు !

ఇంతకూ–అవి ఏవి ?
అవి అంటే ?
అవే–ఆ వర్షాలు ? ఆ వలలు ?
ఓహో, అవా ?
వాటి సంగతి రిపోర్టులో వుంది !

రిపోర్టులో ఏం వుంది ?
ఏం వుందో వెతకటానికి
ఒక ప్రత్యేక డైరెక్టరేటు
వచ్చే ఎన్నికల లోగా
ఏర్పడబోతూ వుందిట,

ఒక ఐఎఎస్ డైరక్టరు క్రింద
ఏనమండ్రు డిప్యూటీలు,
ఆరుగురు అసిస్టెంట్లు,
నలుగురు సూపర్నెంట్లు
ఇద్దరు క్లార్కులు
ఒక ప్యూను ?

ఖర్చు ఎక్కువగా వున్నదని
అసెంబ్లీలో ప్రతిపక్షాలు గోలపెడితే
ప్యూను పోస్టు రద్దుచేయబడ వచ్చుట !
ప్రజా ప్రభుత్వం
ఇన్ని మహత్కార్యాలు సాధిస్తుంటే
ప్రజ లేం జేస్తున్నట్లూ ?
వరుణ దేవుడికి
కప్ప కన్యను బేరం పెట్టి
వర కట్నాలు చెల్లిస్తున్నారు !

హోమాలు, ఊరేగింపులు ,
ఖర్చుల కోసం భిక్షా పాత్రలు ,
చందా పుస్తకాలు, వసూళ్ళు !
వసూళ్ళ కోసం
వర్షం ముందు తూనీగల్లా
సోషల్ వర్కర్లు !

పుణ్యమూ, పురుషార్థమూ
తీర్థమూ, స్వార్థమూ
కలిసివచ్చే దొక్కటే -
అదే సోషల్ వర్కు !

డబ్బు, కీర్తి, గౌరవం !
అంతేనా -
విధాన పరిషత్తు నుంచి రాజ్యసభ దాకా
నామినేషను సభ్యత్వాలు !
భారత ప్రజా స్వాములకు-జై !
భారత ప్రజాస్వామికం-జిందాబాద్ !

ఈ లోగా -
యమ ధర్మరాజు హెలికాప్ట రెక్కడం
ఆయన వాహన రాజ సంతానమూ, భటులూ
కరువు ప్రాంతాలపై పడి
అందిన మట్టుకు ఊడ్చుకు పోవడం
జరిగే పోతుంది !

ఆ తర్వాత రాగల వరదల కమిటీకి
క్షేత్రం సిద్ధం అవుతుంది !

❋ ❋ ❋

## 42. రైల్లో సంత్రాలు

సంత్రాలు, సార్, సంత్రాలు
తియ్యటి సంత్రాలు !

ఎలా ఇస్తున్నా వోయ్ !
రూపాయికి నాలుగు, సార్, నాలుగు !
ఆ రివ్వు !
కిట్టదు, సార్ ! బేరం లేదు.
అయితే ఒక రూపాయి వివ్వు,

సంత్రాలు, సార్, సంత్రాలు
పంచదార లాంటి సంత్రాలు !

ఎలా ఇస్తున్నా వేమిటి ?
రూపాయికి ఎనిమిది సార్, ఎనిమిది !
అరె ! సరే –
ఒక అర్థరూపాయి విటు పడేయ్,

సంత్రాలు, సార్, సంత్రాలు
చెరకు రసం లాంటి సంత్రాలు !

వీ డెలా ఇస్తున్నాడో ?
రూపాయికి పదహారు సార్, పదహారు !
అరరె ! సరే -
ఒక పావలా విలా తే !

వీడు మొదటే వస్తే
ఎంత బాగుండును !

సంత్రాలు, సార్, సంత్రాలు
చందమామ ల్లాంటి సంత్రాలు !

అయితే-తొసలు
ఆ మామల కూతుళ్ళా ఏమిటి ?
అవును, సార్, తీసుకోండి సార్ !
రైలు కదిలి పోతున్నది, సార్, సార్,

ఏమిటి ధర ?
ఇరవై సార్, రూపాయికి ఇరవై !
అరరరరే-రెరెరెరే -

చివరి సంత్రాలు వాడు దూకేశాడు -
రైలు కదిలి పోయింది !

భ్రాంతిలో పడివున్న నా ఒడిలో
ఒయ్యారాలు పోతున్నై సంత్రాలు !
ఏ గంప నుంచి ఏ ఫలం వచ్చిందో
దేని కే వెల చెల్లించానో
నాకే గుర్తు లేదు !
ఒకే తోటలోని ఫలాలు అన్నీ !

❋ ❋ ❋

## 43. విశ్వశాంతి

శాంతి, శాంతి, శాంతి అంటూ వినబడేది
వేద కాలం నుంచీ వస్తున్న నినాదమే !
కొంచెం కూడ నిజాయతీ లేని నినాదం అది !

యుద్ధానికి ముందున్నదీ శాంతే
యుద్ధం తర్వాతదీ శాంతే అయితే
మరి యుద్ధాలు ఎందుకు వస్తున్నట్టు ?

ఎలకలు పెట్టుకునే శాంతి దరఖాస్తుల్ని
మన్నిస్తా యంటావా పిల్లులు ?
మన్నిస్తే, మరి–మాపటి కేది భోజనం ?

కనుక –
శాంతి అనే దేం లేదు లోకంలో,
నీ బలం ఒక్కటే నీ శాంతి !

అస్త్ర ధరుడైన అర్జునుడిదే
పాంచాలీ ప్రణయ హస్తమూ,
పరమ శివుని పాశుపతమూ.

నౌకరు కున్న శాంతి యజమానికి లేదు,
గుండ్రాతి కున్న శాంతి గులాబీకి లేదు,
దాసుడి కున్న శాంతి దైవానికి లేదు,

శాంతి, శాంతి, శాంతి అంటూ అరవడం
అశాంతిని ఎలుగెత్తి పిలవడమే !
కర్ర లేనప్పుడు గొర్రైనా కరుస్తది !

మన దైవం చతుర్భుజు డెందు కైనట్టు ?
అభయ వరద హస్తా లుంటే చాలదు !
అశక్తుడు ఆర్తుల కిచ్చే దేం వుండదు.

షండుని బ్రహ్మచర్య వ్రతం వలెనే
బలహీనుని ధర్మప్రచారం అర్థరహితం !
లోకాన్ని సంస్కరించగలది లోకోత్తర శక్తే !

పెద్దపులులు రేగి పశుల మందను ముట్టడిస్తే ,
అస్త్రం పట్టక అంజలి ఘటిస్తావా ?
శాంతి ఇవ్వవలసింది, పుచ్చుకోవలసింది కాదు.

చక్రధారి కాకుండా సారథి కాలేడు,
చేత విల్లు లేకుండా గీతకు పనికిరాడు,
ఆగ్రహించలేని వాడు అనుగ్రహించనూ లేడు.

అందుకని –
ఇదం బ్రాహ్మ్యం, ఇదం క్షాత్రంగా
కచ్చ బిగించి ముందుకు పద !

కృణ్వంతో విశ్వమార్యం అన్న పేద జాతికి
వారసత్వం నా దంటున్న నీవు
ఆర్యత్వాన్నే నెట్టేస్తున్నా వెందుకు ?

విశ్వాన్నే ఆర్జించ వలసిన నీ పెత్తనం
ఉన్నది కాస్తా తగలేస్తున్న దేం కర్మ ?
నీ మడిలో నీవైనా మిగిలేవా ?

చెడిన పుట నెల్లా చించి పారవేస్తూ పోతే,
చివరకు అట్టైనా మిగులుద్దా ?
నీ పుస్తకానికి నీవే చెదపురుగువు కాకు !

ఇంట గెల్చి రచ్చ గెల్వడానికి బదులు,
ఇంట ఓడి రచ్చ కెక్కుతున్నాం మనం !
శాంతి ఉండ వలసింది లోపల, బైట కాదు !

శాంతి ప్రకృతి సిద్ధం కాదు,
అశాంతే జీవిత ధర్మం !
పూర్తిగా జీవించి, ప్రకృతిని అధిగమించు !

❋ ❋ ❋

## 44. పాతికేళ్ళ పెంపు

విప్లవం వర్ధిల్లాలి వద్ద నుంచి
దారిద్ర్యం నశించాలి దాకా
నినాదాలు పెరిగాయి !

ప్రాజెక్టులు పెరిగాయి
ప్రాఫిట్టులూ పెరిగాయి ,
ఆదాయాలు పెరిగాయి
పై ఆదాయాలూ పెరిగాయి !

జీతాలు పెరిగాయి
ధరలూ పెరిగాయి,
తిండి గింజలు పెరిగాయి
తినే నోళ్ళూ పెరిగాయి !

భక్తీ, భజనలూ పెరిగాయి
సెక్సూ, సినీమాలూ పెరిగాయి,
కుల తత్వాలు పెరిగాయి
కుమ్ములాటలు పెరిగాయి !

* * *

మేడలు పెరిగాయి
మురికి వాడలు పెరిగాయి ,
లంచాలు పెరిగాయి
చీకటి మంచాలూ పెరిగాయి !

ఇలా–ఎన్నని చెప్పను ?
ఈ పాతికేళ్ళ ప్రజా రాజ్యంలో
అన్నీ పెరిగాయి -
ఒక్క నీతి నిజాయితీలు తప్ప !

పాతి కేళ్ళే కాదు
పాతిక శతాబ్దా లైనా పర్వాలేదు -
లక్ష నినాదాల స్థానంలో
ఒక్క నిజాయితీ వర్ధిల్ల గలిగితే !

❋ ❋ ❋

## 45. గోల గోల

తాతయ్య తద్దినానికి
పనసకాయ దొరకలే దని అవ్వ గోల !

ముత్తాత దగ్గుతున్నాడు
చింతామణి తెమ్మని అత్త గోల !

జానపద కళ చచ్చిపోతున్నది
ఉద్ధరించ మని వేషగాడి గోల !

పాల సముద్రంలో భూకంపం వచ్చింది
చందా లివ్వమని సోషల్ వర్కరు గోల !

మంత్రుల పర్యటన రద్దీలో
మతి పోయిం దని మామయ్య గోల !
ఉప్పు సత్యాగ్రహం నాటి
పప్పుచారు కల్తీ కేసు దర్యాప్తు ఫైలు
కనబడడం లే దని నాన్న గోల !

రాళ్ళ నుంచి బియ్యం ఏరలేక
అమ్మ గోల !

అయితే-పిల్లలకు మాత్రం
ఈ గోల లేమీ పట్టినట్టు లేదు !
జీతాలు లేక గొంతులు పూడిపోయిన గురువులను
అల వైకుంఠపురం లోని
అమృత సరోవర తీరాలు చేర్చడం కోసం

కాగితం విమానాలు నిర్మిస్తూ
చెట్ల నీడల్లో ఆడుకొంటున్నారు !

వాళ్ళను చూస్తూ ముసురుకొంటున్నై
పండిటాకు పరదాల నుంచి ఈగళ్ళు !
వాళ్ళ మీద రెట్టలు వేస్తున్నై
కాలంతో కదల లేని కాకులు !

❋ ❋ ❋

# 46. రేసుకోర్సు

మానవ సమాజం ఒక మహారణ్యంలా
ఉండాలంటాడు కేపిటలిస్టు !
సింహానికి బర్రె, తోడేలుకు గొర్రె,
డేగకు పావురం, గోవుకు గడ్డి
స్వేచ్ఛగా దొరకా లంటా డతడు !

నిజమే అనిపిస్తున్నది కదూ !
అవును–నిజమే !
స్వేచ్ఛ లేక పోతే వికాసం లేదు !
గడ్డి ఏడుస్తుం దని
గోవును ఎండగడతామా ?

మానవ సమాజం ఒక మంచి "జూ" లా
ఉండా లంటా డొక కులతత్వ వాది !
గోవు, సింహం, నక్క, కుక్క, గాడిద –
అన్నిటికీ ప్రత్యేక ప్రత్యేకంగా
కటకటా లుండా లంటా డితడు !
కటకటా అంటాడు కులనిర్మూలన వాది !

కుల నిర్మూలన వాదిని పెండింగులో వుంచితే -
ఇదీ నిజమే అనిపిస్తున్నది కదూ ?

అవును-నిజమే
పోలీసులే లేక పోతే
పొద్దు పొడవదు సామాన్య ప్రజలకు !

బర్రె సింహంపై, గొర్రె తోడేలుపై
పావురం డేగపై, గడ్డి గోవుపై
ప్రభుత్వం చెయ్యా లంటా డొక
కొత్తగా కారు కొనుక్కున్న కార్మిక నాయకుడు !
న్యాయమే అనిపిస్తున్నది కదూ ?

బర్రె, సింహం, గొర్రె, గడ్డి
అన్నీ భగవ త్సంతానమే అయినప్పుడు
సంతానం అందరికీ
సంపదలో సమ వాటాలు వద్దా ?
కావాలి- న్యాయమే ?

అయితే -
గొర్రె సింహవాహన కావాలంటే !
గడ్డి గోపాలన చెయ్యాలంటే !

సృష్టి వ్యవస్థలోనే
విప్లవం రావాలి !

నిజానికి, ఈ మానవ సమాజం -
మహారణ్యమూ కాదు, మృగశాలా కాదు,
ఇదొక రేసు కోర్సు ,
కలిసి కాంబినేషన్లు కడితేనే కాని
కరుణించదు జోక పాత్ర లక్ష్మి !
కలిసి కాండిడేట్లను ఎంచుకొంటేనే కాని
కనీస అవసరాలు కూడ తీరవు ప్రజలకు.

మతం పిశాచంలా పట్టుకొన్నది
ఎదగనివ్వడం లేదది మానవ మేధను !
తానూ ఒక మహా పిశాచ మవుతున్నాడు
వర్ణ వర్గ కఠోర కుడ్యాలను కట్టుకొంటున్నాడు
ఎవడికి వాడు తన చుట్టూ !

మానవుడితో ఆగిపోరాదు జీవ వికాసం !
సంస్కృతి, సంప్రదాయం అనబడే సంకెళ్ళను
త్రెంచు కొంటేనే కాని లేదు స్వేచ్ఛాప్రగతి !

కులం, మతం, ప్రాంతం, ఏదైనా కానీ -
పరిమితి పరిచే దేదీ
ప్రగతికి మార్గదర్శకం కాదు,

సుం దోప సుందులు కాకండర్రా
మందమతి యువకుల్లారా !
మిమ్మల్ని భ్రమింపజేసే ఆ రంభ
వట్టి పయోముఖ విషకుంభ !

పోటీ తప్పకపోతే -
భీమాంజనేయులు కండి !
ఐశ్వర్య పరమార్థాన్ని
ఐకమత్యంతో అనుభవించండి !

❋ ❋ ❋

# 47. పాపం, ప్రజలు

ఈ రాజ్యాన్ని పాలిస్తున్న దెవరు ?
ప్రజలు !

ప్రజలా !
అదే–వాళ్ళు వోట్లిచ్చిన ప్రతినిధులు !

ప్రతినిధులా !
అదే–వాళ్ళు ఎన్నుకొన్న మంత్రులు,

మంత్రులా !
అదే– వాళ్ళ నాయకుడు !

నాయకుడా,
అదే–అతడి కార్యదర్శులు

కార్యదర్శులా !
అదే వాళ్ళ గుమాస్తాలు !

గుమస్తాలా !
అదే – వాళ్ళకు కీ ఇచ్చే పైరవీ ప్రభువులు !

పైరవీ ప్రభువులా ?
అదే-వాళ్ళను ఎంచుకొన్న ప్రజలు !

మళ్ళీ ప్రజలా !
అవును-పాపం, ప్రజలు !

తమ ఒకొక్క వోటును
ఒకొక్క లక్ష రూపాయల నోటుగా
తమ ప్రతినిధులు మార్చుకొని
సౌభాగ్యపు కోటలు కట్టుకొంటుంటే
కళ్ళార చూస్తూ కూడ
కాసంతైనా కంటగించుకోని ప్రజలు !

ప్రారబ్ధం అనబడే కర్మసిద్ధాంతపు సారాతో
కళ్ళు మూసుకుపోయిన కల్లు కాంపౌండ్ ప్రజలు !

తమ ప్రతినిధుల చలువరాతి మేడల క్రీనీడలో
మురికి గుడిసెల్లో, దోమల పై
తొడలు చరిచి కుస్తీలు పడుతున్న ప్రజలు !

ఉద్యోగుల పెరిగే జీతాలతో పోటీపడి
పెరిగిపోయే ధరల మాయా బజార్ల
సందుల్లో, గొందుల్లో, పందుల్లా -

తమ ప్రతినిధులు తినిపారేసిన పులివిస్తళ్ళ కోసం
ఎగబడి కొట్టుకు చచ్చే ప్రజలు !

అవును–అదే ప్రజలు !
ఎన్నటికీ ఎదగని ప్రజలు !
నిన్నటికీ, రేపటికీ తేడా లేని ప్రజలు !

సత్యం, అహింస, ప్రేమ, త్యాగం
వీటితో తమను రక్షించ వచ్చిన
ఒక లింకనును, ఒక క్రైస్తును, ఒక గాంధీని
గడ్డి పరకల్లా మేసేసిన ప్రజలు !

బుచ్చెర్ల నాయకత్వంలో
భువనాలను జయిస్తా మంటూ
గొల్లల్ని పొడిచి చంపేసే ప్రజలు !

నరమాంస భక్షకుల వారసత్వం వదలక
నవనాగరికత అనే గొర్రెతోలు క్రింద
తోడి సోదరుల కంఠాలు కొరికేస్తూ,
నరకంలో సీటు కోసం పరస్పరం
నరుక్కొంటున్న ప్రజలు !
పాపం, ప్రజలు !

❋ ❋ ❋

# 48. హోం వర్క్

ఆవులింతలు మొదలైనై
నిద్ర వచ్చేస్తూ వుంది,
చెయ్యవలసిన హోం వర్క్
ఇంకా చాలా వుంది !

చమురు తరిగిపోతూ వుంది
కాంతి తగ్గుముఖం పట్టింది
ఇల్లింకా సర్దుకో లేదు !

తెలిసిన ఇల్లు సర్దుకోడానికి
దీపమే వుండక్కర లేదు కాని
టీ మీద టీ తాగైనా
హోం వర్క్ పూర్తి చెయ్యక తప్పదు !

ఏమిటో -
కాలంతో కాలు కలిపి
కదల్లేక పోతున్నది బ్రతుకు !
మనస్సు బాణంలా పోక
బొంగరంలా తిరుగుతూ వుంది !

ఎంతో పని
ఎక్కడి దక్కడే పడి వుంది !

నేను నిద్రలో పడిపోతే
లోకం నాకు కనపడదు ,
నేను చీకట్లో పడిపోతే
లోకానికి నేను కనపడను !

నిద్రా చీకటీ లేకుండా
నిరంతరం పనిచెయ్యవలసి వుంది !
రెండూ ఒకటై ముంచకుండా
జాగ్రత్త పడవలసీ వుంది !

ఇదంతా ఎలా జరుగుతుంది ?
బ్రతుకే ఒక బొంగరమై పోయింది !

జరగ వలసిన పని
జగతీ వలయ మంత ,
జరిగిన పని
బొంగరం ముల్లు మొనంత !

❋ ❋ ❋

# మారని వాడు

## 49. మారని వాడు

వాడా ?
వాడు ?
చచ్చినా మారడు ?

మనిషి మారినా
సమాజం మారినా
లోకమే మారినా
వాడు మాత్రం మారడు ?

అంత మారని ఆత్మారాముడు
ఎవరు అంటున్నారా ?
వాడు ఆత్మారాముడు కాదండీ ?
హరి జనుడు !
పట్టి అంటరాని వాడు
అడుక్కు బ్రతికే వాడు !

వాణ్ని మీ రెప్పు డైనా చూశారా !
చూ సుండరు, వాడు చూడరాని వాడు,
వాడి మూకుట్లో మీ రేదైనా వేశారా
వేసుండరు, వాడు చేరరాని వాడు !

వాడి చేతి లోది -
అదేమిటనుకొంటున్నారు ?
అది మట్టిముూకుడైనా కాదు
పుర్రె ! పుర్రె !
గొర్రెదో, బర్రెదో అయినా కాదు -
మనిషిది; అది మనిషి పుర్రె
అబ్బ ! ఎంత అసహ్యం !

ఎప్పుడైనా చూశారా, వాడి కాళ్ళు !
ఆ కాళ్ళ కింద ఎంత చండాలం !
అందుకే వాణ్ని చండాల డన్నా రేమో !
లోకంలోని సమస్త పంకిలాన్నీ
తొక్కేసు కొస్తున్న ట్టున్నాడు !

వాడు కట్టిన ఆ మురికి తోలు -
ఏ నాడు చచ్చిన ఏ జంతువుదో !
ఉండడానికే కాదు, కట్టడానికి కూడ ఏమీ లేని వాడు

కావా లంటే - మన కంపెనీ గోదాంలో
పన్నీట పిండి, అత్తరు అద్ది ఆరేసిన
తాజా తో ళ్ళెన్ని లేవు ?

ఒక తోలు వాడి ముఖాన పారేసి
హరిజన సేవ చేసినందుకు
అవార్డు పుచ్చుకోవచ్చు - కాని -
అందుకు, ఒక పదవి గల ప్రెసిడెంటు
ఒక స్వజను డైన విలేకరి
ఒక తెలిసిన ఫోటో గ్రాఫరు
సమయానికి దొరికి చావాలి కద !

లేకపోతే - ఎందుకూ దండగ ?
పబ్లిసిటీ లేని ప్రజాసేవ
పనిలేని మంగలితనం ?

బాబోయ్ ! పాములు, పాములు !
వాడికి శ్మశానం ఇల్లు కానూ -
వాటి నిక్కడికే తెచ్చా డేమిటి ?
ఎప్పు డొచ్చాడు వా డిక్కడికి
ఇదే తన ఇల్లన్నట్టు కూర్చున్నాడు !

అబ్బా ! వాడి పాములు కస్సు మన్నప్పు డెల్ల
నా వెన్ను పాము బుస్సు మంటున్నదే !

ఆ జడల్లో దేమిటో తెలుసా ?
గంగా తీర్థమా ? వాడి శ్రాద్ధం !
అది కల్లండీ, కల్లు !
ఆ పక్కది లేదూ -
అది ఏ శ్రీమంతుడి ఇంటి నుంచో
కొట్టుకొచ్చిన బాపతు
కాక - ఈ పాదరసం మగసిరి గాడికి
ఆ వెన్నెల వెండి చషకం ఎక్కడిదీ ?

బహుశా, అది నెలవంకలా వంచికట్టిన
కల్లు పాయ కావచ్చు !
మధ్య నిషేధం రద్దుచేశారు కాని -
వాణ్ని ఇప్పుడే అరెష్టుచేయించి వుందును !

చూడండి, ఆ ముడులు కట్టిన జడలు !
ఆ సుడులు చుట్టిన ఒడలు !
వాటి నిండా ఎక్కడెక్కడి ధూళిదూగరో !
ఎవ ళ్ళెవళ్ళ బుగ్గి బూడిదో !

ఈ ఒంటెద్దు వ్యవసాయం గాడు
మింగడానికి మెతుకైనా లేనివాడు
కడుపూ, కన్నూ నకనక మండుతున్నా

ఎదటి దుకాణం నుంచి ఒక్క కబళం
లాక్కుతినడ మైనా చేతకాని వాడు -
వీడికి వెంట నాలుగు కుక్కలు కూడానా ?

అరె-అటు వెళ్ళకండి ?
కరుస్తై !
వాడిలాగా అవి కూడ
ఎప్పుడూ మత్తెక్కి వుంటై !

వీడు చచ్చు హరిజనుడే కాదు -
పచ్చి గిరిజనుడు కూడ !

వీడు మారకపోతే - పోయె -
మారుతున్న సమాజాన్ని కూడ
తన కేసి మార్చుకొంటున్న
పరమ ధూర్తుడు వీడు !

ఇప్పటికే మీరు గుర్తించి వుంటారు -
ఈనాటి నవ నాగరిక
అత్యాధునిక హిప్పీ కుంక లందరికీ
వీడే ఆది పురుషుడు కా దంటారా ?

ఇంతకూ –
ఈ దెస మాలిన దిసమొలవాడు
ఈ అంటరాని అవర్ణ భిక్షాందేహి గాడు
ఈ సంప త్కులీన సవర్ణ వీధి కెందు కొచ్చినట్టు ?

వీడి కెన్ని రిజర్వేషనులు కల్పించినా
ఎంత సానుభూతితో రాసుకు తిరిగినా
ఎన్ని చట్టాల రాజ్యాంగ రథాలపై వీణ్ని
కాస్త ముందుకు తోలుకుపోదా మనుకొన్నా
వీడు ఒక్క అడుగైనా
ముందుకు కదలడు !

వీడికి –
తన జీర్ణాంధ తమస్సే
పూర్ణేందు శ్రేయస్సు
వీడి గతి ఇంతే –
వీడు పట్టి మారని వాడు !

❋ ❋ ❋

## 50. మేం ఆధునికులం

ముందుకు పదం డంటూ వెనకనుంచి తరుముతాం
ముందుకు పోయేవాళ్ళను ద్రోహు లంటూ చంపుతాం
ఇందిరతో కలిసి సోషలిజం ప్రకటిస్తాం
హిరణ్యాక్షుడు ఒడిలో దూరి దాక్కుంటాం !
మేం ఆధునికులం !

ఎక్కడి కయ్యా ఆ పరు గంటే, ఏమో – ఎరగం !
వేగాన్ని సృష్టించాం, వెంటబడి ఒగురుస్తున్నాం !
యంత్రాన్ని నిర్మించాం, అందులో పడి నలుగుతున్నాం
అణువును పగలగొట్టాం, దానితో చస్తున్నాం ?
మేం ఆధునికులం !

"ఈశావాస్య మిదం జగ" త్తంటాం
చీకటి గుడుల్లో అతణ్ణి బంధించేస్తాం
మానవ సేవే మాధవ సే వంటాం
అందుకని మమ్మే సేవించం డంటాం !
మేం ఆధునికులం !

ఇంట్లో పని ముట్టుకోం, వంట జోలికే పోం
ఇంటి నౌకరూ, బైటి నౌకరూ అన్నీ భర్తే అంటాం
సిల్కులు సింగారిస్తాం, చివరికి పిల్లల్నయినా కనం
బుర్రకు తాళం వేస్తాం, నోటికి సెలవే ఇవ్వం !
మేం ఆధునికులం !

రోజుకు రెం డాటలు సినిమా చూస్తాం,
దేవుడి పటాలు చించి, ఆప్రేములు తారలకు పెడతాం
రేడియో వుంటే వింటాం, పేపరు దొరికితే చదువుతాం
రెడీగా వుంటాం, ఎక్కడికో చెప్పలేం
మేం ఆధునికులం !

బిచ్చగాడి క్కాని ఇవ్వం, కుబేరుడికి విందులు గుడుపుతాం
సంసారాలకు నిప్పెడతాం, చుట్టూ చేరి చలికాగుతాం
స్వచ్ఛమైన శీలంపై సిరాబుడ్లు దిమ్మరిస్తాం
ఒంటరిగా ఆడది పోతుంటే కోతులమై పోతాం
మేం ఆధునికులం !

తిండి లేదని అఘోరిస్తాం, కాళ్ళకు మొక్కుతాం
తిన్న ఇంటి వాసాలే లెక్కెడతాం
తెలియని దెల్లా వాగుతాం, తెలిసిన వాళ్ళ నోరు మూయిస్తాం
బాజా భజంత్రీలతో ఊరేగుతాం
మేం ఆధునికులం !

అన్నం సున్నం ఒకటే - పరబ్రహ్మ అంటాం
అన్నం మేం తిని, సున్నం ఇతర్లకు వొదిలి పెడతాం
పని చెయ్యం, చేసేవాళ్ళపై స్వారీ చేస్తాం
మెదడును డిస్మిస్‌చేసి, నోరెట్టుకు బ్రతుకుతాం
మేం ఆధునికులం !

ఇంట్లో కంపు కొడతాం, బైట గుబాళిస్తాం
హృదయాన్ని ఎండగడతాం, శరీరాన్ని మేపుతాం
బుద్ధిని బహిష్కరిస్తాం ! దురాశకు డిన్నర్లిస్తాం
స్వార్థాలకు పతాకలు కట్టి ఎగరేస్తాం
మేం ఆధునికులం !

పనికొచ్చే క్రొత్తవాడితో స్నేహం చేస్తాం
పని తీరిన పాత స్నేహితుణ్ణి తరిమి కొడతాం
ఎక్కడైనా మంచి జరిగితే అది మాదే నంటాం
అతణ్ణి ప్రెసిడెంటు చేసింది మావోటే నంటాం,
మేం ఆధునికులం !

వేదిక లెక్కుతాం, వాగ్దానాలు వర్షిస్తాం
కులతత్వాన్ని ఖండిస్తాం, సమత్వాన్ని ప్రకటిస్తాం
మీరు మేమూ అంతా ఒకటే నంటాం
మా గదిలో దూరి మేం మడిగట్టుకొంటాం !
మేం ఆధునికులం !

పిల్లల్ని కంటాం, వాళ్ళని వేలం వేసి అమ్ముకొంటాం
మానవుల్ని తినేస్తాం, మృగాల కోసం కంట నీ రెడతాం
నడివీధిలో చట్టాలు పుక్కిట పడతాం
సందుకు మళ్ళి ఉమ్మేసేస్తాం,
మేం ఆధునికులం !

పదిలక్షల పని వుందని లెక్క కడతాం
పాతిక లక్షల వరకూ టెండరు పెడతాం
ఐదు లక్షలే చివరికి ఖర్చుచేస్తాం
అబద్ధాలతో ప్రాజెక్టులు కట్టేస్తాం
మేం ఆధునికులం !

మా క్కనిపించవు పట్నాల్లో మురికి పేటలు
మాకు వినిపించవు పల్లెల్లో పేదల యేడ్పులు
మేం పైకే చూస్తుంటాం స్పుత్నిక్కుల్ని
రేడియోల్లో వింటుంటాం బుల్విక్కుల్ని
మేం ఆధునికులం !

కాకుల్ని కొడుతుంటాం, గెద్దలకి వేస్తుంటాం
మా కోడిపిల్లలు తన్నుకు పోబడుతుంటే ఏడుస్తుంటాం
గతం నుంచి నేర్చుకోం, భవిష్యత్తు ఆలోచించం
కళ్ళు మూసుక దూకుతాం, కంచెల్లో పడతాం
మేం ఆధునికులం !

ప్రచార సాధనాల్ని గుప్పిట్లో పెట్టుకొంటాం
మా డబ్బా మేమే కొట్టుకొంటాం
వీణాలు గీణాలు పేట్నీ వినిపించనివ్వం
మే మే దేవతలం, మీరే మా కవ్వం
మేం ఆధునికులం !

కుర్ర వాళ్ళ వీక్నెస్‌ని ఇట్టే పసిగడతాం
వాళ్ళ కేరక్టర్‌ని ఖూనీజేసి గోరి కడతాం
ఆ గోరీపై మా బాక్సాఫీసు పెడతాం
ఏడ్చే తలిదండ్రులికి విరాళాలు దయచేస్తాం
మేం ఆధునికులం !

జీతాలు పెంచా లంటాం, బళ్ళో చదువులు చెప్పం
ట్యూషన్లకు ఇంటికి రమ్మంటాం, వాళ్ళకే మార్కులు వేస్తాం
స్టాండర్డు తగ్గిం దంటూ మేమే గోలచేస్తాం
తప్పంతా రాజకీయ పార్టీలపై తోసేస్తాం
మేం ఆధునికులం !

వెన్నకాచిన నెయ్యంటాం, డాల్డా తూచేస్తాం
బియ్యంలో సన్నరాళ్ళు కలిపి అమ్మేస్తాం
కోట్లు గడిస్తాం కొబ్బరి కాయ కొట్టేస్తాం !
కోటి పాపా లొక కానీ ధర్మంతో చెల్లుపెట్టేస్తాం !
మేం ఆధునికులం !

మేం వెనక్కి నడిచినా అది పురోగమనమే,
ఇతర్లు ముందుకు దూకినా అది తిరోగమనమే,
ఉడికీ ఉడకని మెతుకులు వడ్డిస్తాం
అదేదో అధివాస్తవిక విందంటాం !
మేం ఆధునికులం !

నిరుద్యోగి, వీధి మనిషి, బిచ్చగాడు, తిరుగుబోతు
వీళ్ళనే స్టాండర్డుగా తీస్కొంటాం
తక్కిన వాళ్ళెవళ్ళూ ప్రజలే కాదంటాం
మొత్తం సమాజాన్నే వీళ్ళ స్థాయికి దింపేస్తాం
మేం ఆధునికులం !

నవ్వులో ఏడ్పును, ఏడ్పులో నవ్వును నటిస్తాం
మనసులోని రొచ్చుకు మచ్చుసెంట్లు పూస్తాం,
మా వంకలను కళ లంటాం, మీ కళ్లకు వంకలు పెడతాం
అధికార్లకు మా కార్లే సరస్వతులని నమ్మిస్తాం
మేం ఆధునికులం !

కాలేజీ విద్యార్థే మాకు నాయకుడు
చదువు పూర్తి చేసిన వాడెల్లా బడ్డు వినాయకుడు
ఉద్యోగం సంపాదించిన వాడొక బానిస కుక్క
ముప్పై దాటిన వాడు ముసలి నక్క
మేం ఆధునికులం !

ఎదురు పార్టీ వాళ్ళు ఆడే దంతా జూదం
మా పార్టీ ఆమోదిస్తేనే అది వేదం ,
మేం ఎలా చచ్చినా అది పెళ్ళే
ఇతర్లు ఎంత బ్రతికినా అది చావే !
మేం ఆధునికులం !

బ్రతిమాలి రైలెక్కుతాం, వెనకవాళ్ళని ఎక్కనివ్వం !
ఏడ్చి చోటు గుంజుకొంటాం, మరొకళ్ళకి చోటివ్వం !
లంచం పేరిట ఇతర్లని పట్టిస్తాం
అందుకు బహుమానాలు మేం పుచ్చు కొంటాం !
మేం ఆధునికులం !

❋ ❋ ❋

# 51. నర విషం

నవ యువకుల నీతిని పూడ్చి కట్టిన సమాధులపై
బాక్సాఫీసులు పెట్టుకొంటున్న ప్రభూ !
సంపెంగ మొగ్గలపై కెగదోలి, తుమ్మెద నిసుగుల్ని
అకాలాగ్నికి బలిపెడుతున్న ప్రభూ !

ఎడమ చేత గుండెల్ని వేపుడు చేసి
కుడిచేత మెదడుకు తినిపిస్తున్న ప్రభూ !
చర్మాన్ని వొలిచి బుష్ కోట్లు కుట్టి
నెతుర్తు కళేబరాలకు అమ్ముతున్న ప్రభూ!

అమృతాన్ని నిషేధించి, హాలాహలం త్రాగించి
పెండ్లిపాడెపై దక్షిణ మూటగట్టుకొంటున్న ప్రభూ !
నాగరికతా కత్తితో నాడుల్ని నారతీసి
నమ్మించి గొంతు కురితాళ్ళు పేనుతున్న ప్రభూ !

నీ మెవరివో తెలియని ఓ ప్రభూ !
మానవుని ప్రగతి పథం ఇదేనా ? ప్రభూ !

అయ్యో -
ఎవర్ని నేను ప్రభు వంటున్నది ?

ఎవరితో నేను మొర పెట్టుకొంటున్నది ?
నా మనస్సులోని అభిలాషకు
నేనే ఒక రూపం కల్పించుకొని,
దానిని విగ్రహంగా చెక్కుకొని
వీధి మొగలో నిలుపుకొని
దానినేనా నేను ప్రభు వంటున్నది ?

అది నేనే కాదా ?
నాకు నేనే ప్రభువునా ?
అయ్యో - ఈ గోలంతా
నన్ను గురించి నేను
నాతో మొర పెట్టుకొంటున్న దేనా ?

అయ్యో -
మానవ ప్రగతి పథం నిండా
పచ్చి విషం కక్కుతున్న వాణ్ణి
మానవు ణ్నాయిన నేనేనా ?

❋ ❋ ❋

## 52. సృష్టికర్తనే మార్చాలి

కర్మ సాక్షి నిద్రపోయాడు !
అతని కను రెప్పల దుప్పటి కింద
జీవజ్యోతి ముడుచుకు పడుకొన్నది !

నిదరలో మున్గి, కలలలో తేలే మానవులు
ఇక స్వర్గంగ తీరాలు చేరి, అమృత తీర్థాలలో
సరిగంగ స్నానాలు చెయ్యవలసి వుంది !

కాని– ఇంతవరకు ఎవరూ రాలేదు !
ఎందుకు రాలేదు ?
ఎవరూ నిద్ర పోవడం లేదా ?
నిద్ర పోయినా–కలలు కనడం లేదా ?
కలలు కనినా–అవి స్వర్గం దాకా లేవడం లేదా ?

ఆలోచనలు తారాస్థాయికి చేరినై
తారా పథం ముఖంలో మబ్బులు క్రమ్మినై ?

ఎలా వున్నారు మానవులు ?
ఏమై పోయినై వాళ్ళ కలలు ?

వంగి చూచింది నింగి
వాంతి చేసుకొన్నది వొళ్ళు కుంగి !
బాధతో తల నరాలు
భగ్గు భగ్గు మనసాగినై ,
ఉల్లంలోని ఆవేదనలు
ఉరమడం మొదలిడినై !

పూరి గుడిసెల్లోని కూలీలు
అలసి పోయి పడివున్నారు !
వాళ్ళ కలలు -
దోమలతో దెబ్బలాడుతున్నై
కుక్కల్ని ఘెరావో చేస్తున్నై
బోర్లించి వున్న కూటి కుండలపై కూర్చుని
ఎలకలపై కర్ఫ్యూవుత్తరువులు జారీచేస్తున్నై ?

మధ్య తరగతి సామాన్యుల కలలు -
గ్రామం పొలిమేర పుంతల్లో
ఉద్యోగాలు వెతుక్కొంటున్నై
అధికారుల బంగారు పాదుకలను

అశ్రు జలంతో అభిషేకిస్తున్నై
వయ సొచ్చిన ఆడపిల్లల్ని భరించలేక
వరకట్నాల మొసళ్ళకు వదిలేస్తున్నై !

ప్రజానాయకుల పద్మవ్యూహాలలో చిక్కుకొని
ఎడాపెడా పోరాడుతున్నై,
ఆడంబరాల ముళ్ళకంచెలపై పడి
ఆత్మ వస్త్రాలను చింపుకొంటున్నై !

సమాజం నెత్తిమీద
కొలువు తీర్చిన నయా కోటీశ్వరుల కలలు -
క్రింద వున్న ఆల్సేషియన్ కుక్కల చెవుల్లో
విశ్వాస ధర్మం ఉపదేశిస్తున్నై !
ఆ కుక్కలు నిద్రపోతుంటే
తామే మేల్కొని వాటి స్థానంలో కూర్చున్నై !

కాకుల్ని కొట్టి గద్దలకు వేస్తూ
గద్దల్ని కొట్టి రాబందులకు వేస్తూ
రాబందుల్ని కొట్టగల ఒక బంధువు కోసం
ఎన్నికల ప్రచారపు రిహార్సల్సు వేసుకొంటున్నై !

ప్రజా నాయకుల కలలు
ప్రజల నుంచి పారిపోయి
ప్రధాన మంత్రి ప్రత్యేక ఫైళ్ళలో దూరి
ఊపిరాడక కొట్టుకొంటున్నై !

సాక్షాత్తు గురుదేవు లైన టీచర్ల కలలు
జీతం రాళ్ళు లెక్కచూచుకొంటున్నై ;
భావి పౌరులైన విద్యార్థుల కలలు
బస్సులపై రాళ్ళు విసురుతున్నై !
బుచ్చెమ్మ కాలేజీ చౌరస్తాలో
పిచ్చెక్కి తిరుగుతున్నై !

ఎందరో మహానుభావులు ,
అందరికీ కల లున్నై !
ఉన్న దురదృష్టం ఏమి టంటే
అందులో ఒక్కదానికీ రెక్కలు లేవు !

తమ ఆశలే తముకు సంకెళ్ళు కొందరికి,
ఆశలకు దురాశలు గుదిబండలు కొందరికి !
ఇం కెక్కడి స్వర్గంగ తీరాలు ?
ఇం కెక్కడి సరిగంగ స్నానాలు ?

భౌతిక శరీరం ఎలాగూ మట్టే !
ఆకాశాన్ని అంటే శక్తి ఆత్మకు లేకపోతే
స్వప్నాలకు కూడా స్వర్గసుఖం కరువైతే
ఇంకా ఎందుకు బ్రతుకుతున్నట్టు మానవుడు !

పూరి గుడిసెల్ని సృష్టించింది మేడ లైతే
మేడల్ని నిర్మించింది పూరి గుడిసెలే !
స్వార్థానికి అమాయకత్వం బలి
అమాయకత్వానికి స్వార్థం పులి !

గుడ్లురిమి చూచింది నాకం
కుంభ వృష్టిలో మునిగింది లోకం !

పూరి గుడిసెలు పడవల్లా లేచినై
కలలతో పాటు కడలి పాలైనై !
అమాయకత్వం అట్ట బొమ్మలా
పీసుగు పెంటల్లో కలిసిపోయింది.

పండిన స్వార్థం లాంటి మే డొకటి
పగిలి ప్రక్కకు కూలిపోయింది,
దాని కింద తల దాచుకొంటున్న ఒక పూరి

గుడిసెకు –
రెండో ఆట సినీమా బృందావనం నుంచి
అందాల పాపతో పందాలు వేసుకొంటున్న
ఒక పడుచు జంటను ఎక్కించుకొని
వాళ్ళ ఇంటి నందనంలో క్షేమంగా దింపేసి
తడిసి ముద్ద అయి, చలితో ఆకలితో వణుకుతూ వచ్చి
ఆ గుడిసెలో దూరి, తన పాపను హత్తుకొని,
తన ప్రేయసి కాసిన అంబలిని
అమృతంలా అందుకొంటున్న
ఆ రిక్షా వాలాకు –
అతడి ప్రాణ ప్రియకు–వాళ్ళ పాపకు
అదే జీవ సమాధి అయింది !

అలా చచ్చిపోయిన ఆ కుటుంబం సమష్టి ఆత్మ
అద్వైత సిద్ధిలా లేచి

వియద్గంగా తీరం చేరినప్పుడు –
మానవుణ్ని మార్చగలిగా ననుకొన్న దివి
పగ ఉన్నచోట తాను కొట్టిన దెబ్బ
భక్తి వున్న చోట తగలడం చూచి
భోరున ఏడ్చింది ?

మేడ కూలినా
ప్రమాదం గుడిసె కేనా ?
తప్పు యజమాని దైనా
శిక్ష బానిస కేనా ?
మార్చ వలసింది సృష్టిని కాదా ?
అసలు సృష్టి కర్తనే మార్చవలసి వున్నదా ?

దివి ఏడ్చే కొలదీ
భువి విలయంలో కొట్టుకు పోసాగింది ?
కర్మ సాక్షి మళ్ళీ నిద్ర లేచే సరికి
జీవ జ్యోతి ఇంకా పండుకొనే వుంది ?

❋ ❋ ❋

## 53. వాల్మీకి వనిత అయివుంటే

వాల్మీకి వనిత అయి వుంటే
వనితకు ఆత్మ ఘనతే వుంటే –

శతరథిక అనే మహారాణికి
ముచ్చటగా ముగ్గురు భర్తలు !

ఆ ముగ్గురు భర్తలూ మహారథులు
మూడు లోకాలకూ మొనగాళ్ళు !

అయినా –
మహారాణికి సంతానం లేదు !

సామాన్య మానవ సంతానం చచ్చు గొర్రెలు,
రాజవంశపు బిడ్డ వాటిని పాలించే తోడేలు !
తోడేలు పుట్టలే దని గొర్రెల మందకు బెంగ !

శతరథిక చేసింది పుత్రి కామేష్టి,
పంచింది భర్తలకు రసాయన పుష్టి,
పుట్టారు సీత, ఊర్మిళ, మాండవి, శ్రతకీర్తి !

శ్రీరామ స్వయంవరం, సీత శివధనుస్సును విరవడం
వంటి ఆ తర్వాత దంతా మామూలు కథే !
సీత పట్టాభిషేకం వనవాసం అయింది
శ్రీరాముణ్ని మండోదరి ఎత్తుక పోయింది.
సీత లంకకు వెళ్ళింది, మండోదరిని ఓడించింది !

అయితే-శ్రీరాము డెక్కడ ?
అశోక వనిలో కూర్చుని వున్నాడా ? లేడు !

అరణ్యా వాసం, అన్వేషణా క్లేశం
యుద్ధ విన్యాసంతో సహా అంతా
మగిసిం దయ్యా ! ప్రియతమా ! రామా,
మండోదరిని చంపా నని కోపమా ?
అలాంటి పదారువేలమంది నిస్తా, ఇటు రమ్మా ?

ఒక్క సీతే కాదు, స్త్రీజాతే అంత ,
ప్రతి వనితా పతివ్రతే, మినీ జగన్మాతే !
పుష్పం స్థిత ప్రజ్ఞ, తుమ్మెదే తిరుగుబోతు,
చంచలముల్ మగవాంండ్ర చిత్తముల్ !

శ్రీరాముడు వచ్చాడు సిగ్గు నటిస్తూ ,
ప్రణ మిల్లాడు శ్రీసీత పాదపద్మాలకు !

అగ్ని పరీక్ష లక్కర్లేదు, ఆత్మకు పరమాత్మే సాక్ష్యం,
లేవయ్యా, రామా ! నీవే నా పరమ లక్ష్యం !

పునస్సమాగమం, సీతా పట్టాభిషేకం,
అంతటితో రామాయణం సమాప్తం !
ఉత్తర కాండ లేదు, రాముణ్ని సీత అనుమానించదు,
లోకం అనుమానించినా, ఆమె లెక్కచెయ్యదు.

* * *

## 54. రసాద్వైతం

కర్మకాండే సమస్తమూ అయిన కర్మిష్ఠికి
కర్మాద్వైతం ఉంది
చిత్తం దైవాయత్తమైన భక్తుడికి
విశిష్టాద్వైతం ఉంది.

శుభస్నేహ పరమధర్మియైన భావుకుడికి
శుద్ధా ద్వైతం ఉంది
అప్రతిహత యోగస్థిరుడైన జ్ఞానికి
అద్వైతమే ఉంది.

జీవేశ్వర పరమైక్యం కోసం ప్రతి జీవికీ
త్రోవేదో ఒక టుంది ?
శ్రీ కైవల్యం చెందే మార్గం – మరి
నీకూ, నాకూ ఏముంది ?

ఆత్మ ప్రియా ! ఎందుకు నీ కా జిజ్ఞాస ?
ఆనం దావధినే పై కొన్నది నీ ధ్యాస !
పారవశ్యమే నీ పద మంజీర స్పందనమో ?

పారమ్యం ఒక రంగపూజ మాత్రమేనో నీ కేళికి ?
నా ఇచ్ఛా స్పందన సౌందర్య పథం నీవు
నీ ఐశ్వర్య కళా ప్రదర్శన రథం నేను !
రసానంద బ్రాహ్మీ బ్రహ్మలమే మనం
బ్రహ్మానంద విహార వనీ సబ్రహ్మచారులం !

మనకే ఏదీ లేకపోతే –
మహిలోనే ఎవరికి ఏముంది ?
నిజానికి – మనమే లేకపోతే
జగాలకు స్థితే ఉంటుందా ?

నీవూ, నేనూ – అంటే ?
నీవూ, నేనూ మాత్రమేనా ?
అసితా, అస్మితా మాత్రమేనా ?
అవధీభూత ప్రాణతరంగం మాత్రమేనా ?

ఈ పరమ ప్రకృతి కంతకూ ప్రతినిధివి నీవు,
నీ పమిటె కొంగుకు వేసుకున్న ముడిని నేను ?
ముడిలో ఏముంది వట్టి శూన్యం అంటావో ?
ముడినే కల జీవన మధు
పర్యంకం కనుగోవో ?

ముడిని త్రెంచి, భువినే విలయంలో
ముంచే యత్నం తత్త్వ జ్ఞానిది !
ముడిపై నీవూ, ముడిపడి నేనూ
మురియడమే రస నైరంతర్యం !

అదిగో, వసంత పూర్ణానందం – పై శాఖి !
ఇదిగో, శరన్నవోజో జీవన ధార – శారద !
నయ నానందంగా నర్తిస్తున్నది రసవ చ్చిత్ర,
నవరసాలు వర్షిస్తున్నది అభిజి ద్వీణ!

ఆ నృత్యానికి ఈ గానం !
ఈ గానానికి ఆ నృత్యం !

చారుకేశి రాగంలో రస రమ
స్వర్ణ రాశుల్ని పండిస్తున్నది ?
తెలుగు పొలాల్లో కామధేనువై
దివ్య దుగ్ధాలు చేపుతున్నది !
ఆనందానికి చన్ను కుడుపుతూ
అపరాజిత వెన్నెల కాస్తున్నది !

రస కేదారం ఇటు, ఆనందోద్యానం అటు !
రస పరిపుష్టి ఇది, రాగ సంతుష్టి అది !

అటు ఆరూ, ఇటు ఆరూ కల పూర్ణిమలే
రథాంగాలై సాగే నిత్యాభ్యుదయ రథంలో
సర్వ విశ్వచైతన్య బిందువే తానై, తానే
సహస్రారమ్మై వికసించే, ముకుళించే మూర్తికి
ఇటు నాదం – అటు కళ !
ఇటు నీవు – అటు నేను ?

రెండు కోసలలో రెండు గుండెలం మనం,
గుండెలు రెండూ ఒకే గుండె కాగలం !
ఏక హృదయ సంసిద్ధే రసాద్వైతం !
లోక హృదయ సంబుద్ధే దాని తత్త్వం !

అర్థం కావడం లేదా నీకు ?
అర్థం కావడానికి - అసలు వింటున్నావా నీవు ?
నా దంతా ఒక వ్యర్థ వేదాంత ఘోషేనా ?
నాదానికి రొదలూ, నా దానికి వ్యథలూ నా ?

ఓహో , ఎవరీ అపూర్వానంద రసైందవి ?
ఉమా రమా పరమైశ్వర్య కళాదేవి ?
నా కౌగిట్లో, నా దేహంలో, నా హృదయంలో
నా రసాద్వైత రమ్యతకే ఒక ప్రమాణమై
పరవశించి ఉన్నావా నీవు ?
పరమ రసాద్వైతానివే నా నీవు !
అయితే -
అమృత యోగమై నాలో పొంగి
ఆనంద ధారవై విహరించు !

* * *

## 55. మళ్ళీ ఒక ఉగాది

అంధకారం అగాధంలో ఏదో ఒరపు
ఆకాశం మస్తిష్కంలో ఏదో మెరుపు !
రోదసీ మనో మేఖలపై ఏదో జలజల
నిశా మూర్తి ఆశారేఖలపై ఏదో గలగల !

పురుష సమాధి చెదిరింది
ప్రకృతి స్వప్నం కరిగింది,
రిరం సా చిదంబరం
దిగంబరం అయింది !

చీకటి చిక్కం చించుకొని
బైటపడా లన్న ఏదో గిజగిజ !
లింగోద్భవ పుణ్యా క్షణం
బాణంలా దూసుకు పోయిన అజ !

ఉద్యమం వెల్లి విరిసింది
విప్లవం ముంచెత్తింది,
స్వాతంత్ర్య మహా సమరాంగణంలో
స్వప్రయోజన కామ దహనం జరిగింది !

ధనుర్భంగంలా శిశిర భంగం
సీతారామంలా చిత్రా సుధాకరం ,
ఆకులు రాలుతున్నై జిలజిల
చీకట్లు కొట్టుకుంటున్నై గిలగిల

అంతలో మేఘం ఉరిమింది
మళ్ళీ చీకటి కమ్మింది !
సర్వజన శ్రేయ స్సర్వోదయ నిమిషంలో
స్వార్థం వడగళ్ళతో మొత్తింది !

రాజ్యాలు పోయిన పగటి దర్జాలు
చీకటి కన్నాలలోనే కిరీటాలు పెట్టుకొన్నై !
కనకపు సింహాసనాలపై చేరిన శునకాలతో
సృగాలాలకు సహకారాలు కుదిరినై !

భూదేవి గగ్గో లెత్తింది,
జీవధర్మం తిరగ బడింది,
ఊళ్ళు పంచుకొన్న చీకటి బజార్ల
దొంగాటకం గంగలో కలిసింది !

అహోబిలం గుండెల గుబురుల్లో
కుహూ కూహూ ప్రణయ కూజితం !

దివి భువుల ఒడళ్ళ నిండా
అరుణోదయ శ్రీ వసంతం !

ఫాల్గున అమావస్య గర్భం ఫలించింది
చైత్ర శుద్ధ పాడ్యమీ బాల ఉదయించింది !
మహానంది కామధేనువు పొదుగులో
మధు మహార్ణవం పొంగింది !

సనాతనుడైన మహాదేవుడి చుట్టూ
ఆధునాతన అయిన వసంతరమ  నృత్యం !
ఉషస్సు నుంచి మళ్ళీ ఉషస్సుకు వస్తూ
ఎంతో తమస్సును ఉత్తరించిన ఔద్ధత్యం

మృత్యువు నుంచి జీవం కురిసింది
అమావశ్య నుంచి నెలవంక మొలిచింది,
షడ్వర్గ యాతన నుంచి షడ్రసోపేతంగా
మళ్ళీ ఒక ఉగాది విరిసింది !

❋ ❋ ❋

## 56. నా పురోగమనం

సరస్వతి సేవలో పడి
పువ్వులూ, పళ్ళూ ఏరుకొంటూ
కొండల్లో, కోనల్లో
అడవుల్లో , పడవల్లో
అలా–అలా–
సాగిపోతున్న వాణ్ని నేను !

ఎక్కడికి, ఎంతదూరం, ఎందుకు
అ నేం లేదు !
నా క వేం లేవు !

ఎక్కడ ఏ పిన్న పువ్వు వికసించినా
తుంచి సరస్వతి పాదాలపై వుంచుతాను,
ఎక్కడ ఏ చిన్న పండు ఫలించినా
అందుకొని శివుడి కంచంలో పెడతాను !

కొండల్లో గుండెలు అవిసి నప్పుడు
కోనల్లో ఎలనీరు దొరుకు తుంది ,
అడవుల్లో ఆ పత్తులు తరిమి నప్పుడు
పడవల్లో పై తీరం అందుతుంది.

నా సుఖాలూ, సంతోషాలూ, గౌరవాలూ,
సమస్తమూ సరస్వతీ ప్రీత్యర్థం !
నా కష్టాలూ, నష్టాలూ, దురదృష్టాలూ
అన్నీ శివార్పణం !

ఇంతకూ –
శివు డంటే నేనే, నా లోని లీల !
సరస్వతీ నేనే, నా లోని కీల !

నన్ను నేనే ఆరాధించుకొంటూ
ఎక్కడికి పోతున్నాను ?
ఎక్కడికి ? ఎక్కడి నుంచి ?
మేం విడిపోయిన దగ్గర నుంచి,
మేం తిరిగి కలుసుకునే దాకా !

❋ ❋ ❋

## 57. టుమ్రీలు

బలం కలవాడు పులి,
తెలివి కలవాడు నక్క,
ఈ ఇరు వర్గాలకూ ఆహారంగా
బ్రతుకుతున్న మూర్ఖులు గొర్రెలు !

2

నాలుగు వర్ణా లన్నది హిందూయిజం,
రెండు వర్గా లన్నది కమ్యూనిజం,
ఈ వర్ణ విభజనా, వర్గ విభజనా చేసింది
పులీ నక్కా యిజం !

3

కర్మ సూత్రంపై విశ్వాసం ,
చచ్చిన అవతారాల పట్ల భక్తి,
పులికి పాదసేవ, నక్కకు దాసోహం –
గొర్రెల కివే మోక్ష మార్గాలు !

4

వేదయుగం మనిషికీ, నేటి మనిషికీ
స్వభావంలో తేడా ఏ ముంది ?
నా డెంతో, నేడూ అంతే -
అదే పులి ! అదే నక్క ! అవే గొర్రెలు !

5

మనిషి గుణం మారడం లేదు
కారణం మతం !
మనిషి మెదడు పెరగడం లేదు
కారణం భక్తి !

6

ప్రార్థనలు, భజనలు అన్నీ
వట్టి శవ జాగరాలు !
మతమూ, భక్తీ నశించకుండా
ప్రగతి లేదు మనిషికి !

7

మతం-అది ఏ మత మైనా సరే -
పులీ, నక్కా కలిసి పన్నిన వల !
భక్తి-ఇది ఏ దేవుడి మీది దైనా సరే -
గొర్రెల కోసం పెట్టిన ఎర !

**8**

లోకంలో నే డున్న దుస్థితి కంతకూ
గొర్రెల బుద్ధి హీనతే కారణం !
అందుకే, హెచ్చరిస్తున్నాను, వినండి !
ఓ, గొర్రె సోదరుల్లారా ! కళ్ళు తెరవండి !

**9**

వద్దు మతం, వద్దు మతబోధలు
వద్దు భక్తి, వద్దు భజనలు !
ఏది పులో, ఏది నక్కో కనిపెట్టండి ?
మనశ్శక్తిని పెంచుకొని మనుషులుగా బ్రతకండి !

**10**

రావణాసురుడు చచ్చా డన్నారు ;
దుర్మార్గుడు అన్నారు ప్రజలు !
రావణాసురుడు బ్రతికా డన్నారు,
ధర్మ ప్రభువు అన్నారు అదే ప్రజలు !

**11**

సత్యం, అహింస, త్యాగం–వీటితో
గొర్రెల్ని ఉద్ధరిస్తా నన్నాడు క్రైస్తు !
నేనూ ఉద్ధరిస్తా నన్నాడు గాంధీ !
గొర్రెలు మాత్రం బుచ్చెర్లను ఉద్ధరిస్తున్నై !

## 12

ఇంటి గుట్టు పొక్కే రావణుడు చచ్చాడు,
అబద్ధాన్ని నమ్మే ద్రోణుడు చచ్చాడు,
రాజకీయ రంగంలో ఎవణ్నీ నమ్మకు -
అతడు తమ్ముడైనా సరే, శిష్యుడైనా సరే !

## 13

బలహీనులూ, మూర్ఖులూ, పిరికివాళ్లూ -
నాడూ, నేడూ, ఏ నాడూ గొర్రెలే !
గొర్రెల్ని నమ్ముకొని ఏ పనీ చెయ్యకు
అవి డబ్బుకు అమ్ముడు పోయే సరుకు !

## 14

దైవం, దెయ్యం, అదృష్టం, కర్మ ,
అదేదైనా-నీలోదే, బైటిది కాదు !
నీ మెదడు జబ్బుకు గల కాంతి నైశిత్యమే
నీ జీవిత సాఫల్యంలోని శాంతి వైశిష్ట్యం !

## 15

ఏది అందం ? ఏది ఆనందం ?
నీ కన్నును ఆకర్షించింది అందం,
నీ మనస్సును ఆకట్టుకొన్నది ఆనందం !
ఆ రెండూ కలిసింది జీవిత రస పారమ్యం !

## 16

నా పుస్తకాల గది నిండా ఎలకలు !
నా ఒకొక్క పుస్తకమే ఎలకల పాలవుతూ వుంటే
చెమ్మగిల్లిన కళ్ళతో నే ననుకొంటుంటాను -
మనుషుల కంటె ఎలకలే రసగ్రహణ పారీణు లని !

## 17

మనిషి ఆలోచిస్తే జిత్తులమారి నక్క
ఉద్రేకపడితే ఆకలిగొన్న పులి
నిరాశకు లోనైతే వట్టి గొర్రె !
మరి-అతడు మనిషిగా వుండే దెప్పుడు ?

## 18

సామాన్య మానవుడికి పరమ శత్రువు ఎవరు ?
పదవుల వెంటబడే రాజకీయ నాయకుడు !
పాదసేవలు కోరే ఉన్నత మతాధిపతి !
ఈ ఇద్దరినీ మించి-తనను తాను మరచిన తానే !

## 19

మానవ సమాజం ఒక రెండెడ్ల బండి
అందులో ఒకటి సంప్రదాయం ముసలెద్దు !
రెండోది అభ్యుదయం-పడుచు గిత్త,
ఫలితం-జీవచ్ఛవాలు, నక్కలు, రాబందులు !

20

జనరేషన్ గేప్ అంటే –
ముసలి గుర్రాల కునికిపాట్లు ,
పడుచు రౌతుల మిడిసిపాట్లు !
ఈ మధ్యలో పంటర్ల పాట్లు !

21

నీ మెదడు శక్తి ఎంత ఎక్కువ దైతే
అంత ఎక్కువ లోతుకు చూడ గలవు నీవు !
తపస్సుతో కాంతిని పెంచుకోనూ వచ్చు,
తమస్సులో శాంతిని ముంచుకోనూ వచ్చు !

22

ప్రతి మెదడూ ఒకో ట్రాన్సిస్టరు !
తలపును ఏ అల కొలికికి పెడితే
ఆ స్థాయిలో లభిస్తుంది భావమూ, ఆనందమూ !
ఆనందాన్ని బ్రహ్మాస్థాయిలో పట్టుకోనేది కళ !

23

గుడి – అది ఏ మతం వాళ్ళ గుడి అయినా
మేలుకొన్న మానవాత్మకు నిద్ర మాత్ర !
యుగాలుగా మనిషి పెరగక పోవడానికి కారణం
ఈ గుడ్డి గుడి మాత్రలే !

## 24

ఆనందం కోసం ఎప్పుడైనా ఒక పెగ్గు పుచ్చుకుంటే
ఆ తర్వాత ఒకటే తలనొప్పి అన్నాడొక మిత్రుడు !
ఆనందం కోసం మనిషి చేసే ప్రతి పనీ
ఆ తర్వాత తలనొప్పి కలిగించేదే !

## 25

ఒకో మనిషికి ఒకో కోరిక ఆత్మ అయివుంటుంది
దాన్ని తీర్చుకోవడంలోనే అతడికి ఆనందం వుంది !
కోరికను చంపుకొన్నవాడు మహాత్ముడే కావచ్చు
కోరికను తీర్చుకొన్నవాడే మహాశివుడు !

## 26

కోరికను చంపుకో మంటుంది ప్రతి మతమూ,
చంపుకోలేక చస్తున్నాడు ప్రతి మనిషీ !
అంతరాత్మకే గొంతెత్తి చెప్పే శక్తి వుంటే –
మధూ వధూ సేవకులే మహితాత్ములని చాటే దది !

## 27

మొన్న ఒక మహానాయకుడు మరణించాడు !
బ్రతికుండగా అతడి వీపున దూసిన కత్తులే
అతడి శవం మీద పెద్ద పెద్ద పూలగుత్తులైనై !
కపాల మోక్షం దాకా కనిపెట్టుకొని వునై !

**28**

ఆశలు చంపుకో అనే వాడు
ఆశ లుడిగిన వృద్ధుడు మాత్రమే -
అతడు హఠయోగ సిద్ధు డైనా సరే,
సోషలిస్టు బుద్ధు డైనా సరే !

**29**

శివు డుండేది శ్మశానంలో,
ప్రతి శ్మశానమూ ఒక శివాలయం !
ఒకో శ్మశానం ఒకో సోషలిస్టు రాజ్యం !
సర్వభూత సమతా వాద ప్రయోగ శాల !

**30**

గ్రీష్మంలో గొడుగులై, శీతంలో తొడుగులై
జోకొట్టే పూలచెట్ల నీడల్లో నిద్రించే
ఆ సమాధులు మా గుడిసెల కంటె సుభద్రం !
శివుడి రాజ్యరథం భారత రాజ్యాంగ రధితం !

**31**

అది మర్రో, మామిడో, పొన్నో, పొగడో -
ఏ చెట్టైనా ఒకటే–ముఖ్యం అది ఇచ్చే నీడ !
ముందు ఈ మండుటెండల నుంచి బ్రతికితే -
ఆ పైది పుష్ప ఫల మధు రసాస్వాద ప్రసక్తి !

32

ఆరిపోతున్న ఆ పాత కాష్ఠం పక్కనే
అగ్గి ముట్టించ బడుతోంది ఏదో కొత్తకాష్ఠం !
అదికదా అఖండ శివారాధన !
అదికదా అకాండ తాండవ ప్రదర్శన !

33

కల్లు కాంపౌండ్లు, పడుపు గృహాలు, సినీమాలు
అధికార పదవులకు ఎన్నికలు – ఇవీ
మానవ మూషికాలకు ఉప్పు చేప బోనులు !
ఋషి వాటికల్ని మురికి పేటలు చేస్తున్న అచ్చర వాసలు !

34

కమ్మని కంఠాలకు కన్నెవలపుల్ని ఎరగా గుచ్చి,
మగ సిరుల్ని బైటికి లాగి, గంపల కెత్తి,
సొమ్ము చేసుకొంటున్న చిత్రపరిశ్రమ –
కళా కేంద్రమా ? పచ్చి చేపల బజారు !

35

ఉత్తమ కళ, స్కాచ్ విస్కీ, భగవంతుడు
ఇవి మూడూ చాల ఖరీదైన భోగ వస్తువులు!
విలాస పురుషులకో, వీతరాగులకో తప్ప
సామాన్య ప్రజల కివి సర్పభోగాలు !

**36**

సుఖం, సౌందర్యం, ధనం, భోగం
అన్నీ కావాలి నాకు సమగ్రంగా !
తనువు క్షణ భంగుర మని తెలియక కాదు ,
ఆ క్షణ మైనా సార్థకం కావా లనే కాంక్ష !

**37**

జీవితానికి పరమార్థం ఏమిటి ?
సుఖంగా జీవించడం,
సుఖం ఎక్కడ లభిస్తుంది ?
అది నీ వాంఛాసిద్ధిలో వుంది !

**38**

పువ్వులు, ముళ్ళు, గొర్రెలు, సింహాలు,
ఆకలి, అన్నం, ప్రేమ, విరోధం -
ప్రకృతిలోని అన్నీ బ్రతుకులోనూ వుంటై !
మందులు కోసం మతి పోగొట్టుకోకు !

**39**

ధనికుడు వోటర్లను కొంటాడు,
ప్రభుత్వం విద్యాధికుల్ని కొంటుంది
నిర్మాత కళాభిజ్ఞుల్ని కొంటాడు
ప్రజలు మాత్రం ఎప్పుడూ పరమ సన్యాసులే !

40

సెక్సుపాట లెందుకు పాడుతున్నా వంటే
శ్రోతలు కోరుతున్నా రంది అశరీర వాణి !
సెక్సే కోరతారు ఇస్తావా అంటే
నా కంతటి అదృష్టమా అంది మూగ గొంతుతో !

41

యువ వాణి - ఫిలిం రికార్డులు
భక్తి రంజని - ఫిలిం రికార్డులు
వివిధ భారతి - ఫిలిం రికార్డులు
పండగ ప్రత్యేకత - ఫిలిం రికార్డులు !

42

రామాయణాన్ని మరో భాషలో చెప్పేవాడు
అనుకర్తో, కథకుడో అవుతాడు,
వాల్మీకికి మెరగులు దిద్దడం
గొప్ప మేకప్ మన్ కావడం !

43

రాముడికి సూటూ, బూటూ తొడగవచ్చు,
కోతులికి కొమ్ములు పెట్టవచ్చు,
అవన్నీ తమాషాలు - రామాయణం కావు !
రామాయణం ఒక్కటే, వాల్మీకిది !

## 44

కాడపై పుష్పం వున్నంత వరకే
పోటీపడి మూగుతై తుమ్మెదలు,
అది వాడినాక - అవి ఎందుకు వస్తై ?
విసర్జిత నన్ను ఏడ్పు కాడకు దేనికి ?

## 45

మానవ మన శ్శిఖరాలకు
ఎన్నో మెరుపు తీగలు ఒరుసుకు పోతుంటై,
అందులో మనం పట్టుకొనే వెన్ని !
నాటి పెంచుకొనే వెన్ని ?

## 46

ఎప్పుడు కలిగిన భావాన్ని
అప్పుడే అక్షరగతం చేసుకో !
ఎప్పుడు దొరిగిన అందాన్ని
అప్పుడే ఆనందంగా మార్చుకో !

## 47

ప్రేమంటే ఏమిటి ?
అది జీవిలోని ఈశ్వ రాంశ !
హృదయగత మైనప్పు డది ఆనందం,
ఆత్మగత మైనప్పుడు మోక్షం !

## 48

ఊపిరి సలపడానికి విక్కు,
ఉద్రేకం సడలడానికి సెక్సు !
భార్యాభర్తల సంసారం
ఈ రెంటి మధ్యా సివిక్సు !

## 49

ఎంత హోరుగా డ్రైవరు లారీ హారన్ను నొక్కినా
వినిపించుకోవు హద్దులేని బర్రెలు,
ఎంత జోరుగా నాయకుడు రక్త మాంసాలు మెక్కినా
కనిపెట్టలేవు బుద్ధిలేని గొర్రెలు !

## 50

పై కెక్కేసి నిచ్చెనను తోసెయ్యడం
ఏరు దాటి తెప్ప తగలెయ్యడం
దివాలాతీసి శ్రీమంతుడై పోవడం
కొత్తేం కాదు లోకానికి.

## 51

రాముడో, కృష్ణుడో, బుద్ధుడో, క్రైస్తో
మార్క్సో, మహాత్ముడో, అంబేడ్కరో
ఒక్కొక్క మహాపురుషుడి జీవితం
ఒక్కొక్క కురుక్షేత్రం !

52

యశః పటహ భేరీ ఢక్కాదులు
లయజ్ఞానం కల ఎవరు కొట్టినా మోగుతై !
లలిత మనోజ్ఞ భావ స్పర్శకు తప్పు
కచ్ఛపి కాదు - కళావతి కూడ పలకదు.

53

పూల దండల పీఠాలపైకి
కాయగూరల గుదలాలు ఎగబడుతున్నై !
కమలాన్ని గద్దె దించి, కాలీఫ్లవరు
గౌరవ పదవులలో నెలకొంటున్నది ?

54

ఉపకారాన్ని జ్ఞాపకం పెట్టుకోడం కష్టం,
అపకారాన్ని సహించడమూ కష్టమే !
మానవుడి  అహంకారం
నరకం కంటె భయంకరం !

55

ఆ తా డంత ఎత్తు మీద
ఆ గరిగమ్మల ముళ్ళ మీద
ఆ తపస్వి ! హఠ యోగా ?
మనలో మాట - అది రాబందు !

**56**

తెలుగు రాబందుకు సంస్కృతం ఏమిట్రా ?
రామ బంధు వండి, మాష్టారు !
అయితే - మాష్టారూ ! అది పీక్కొని
చచ్చిన గొడ్లను తింటుం దేమి టండీ ?

**57**

రాం బంధువుకి స్నేహితు డెవ్రా ?
నక్కండి ! నక్క !
రాజ బంధువుకి ?
కుక్కండి ? కుక్క !

**58**

భోజనం ముందు కూర్చున్నట్లు
పుస్తకం ముందు కూర్చుంటే కాదు !
ఎక్కడ ఎప్పుడు ఏ పేజీ తెరిచినా
అక్కడి అప్పటి దాహం తీర్చేది కవిత !

**59**

ప్రవరుడు కూడ వరూధినిని తోసెయ్యడానికి
చెయ్యి ఎక్కడ వేశాడో చూశావా ?
కాని - అతడే ఒక దొంగ అయివుంటే ?
చెయ్యి మెడలో గొలుసుపై పడేది ?

60

దొంగకు కనిపించేది మెడ కాదు
మెడలో గొలుసు !
విరసుడికి కనిపించేది రచన కాదు ,
రచనలోని రాజకీయం !

61

యువకు డైనా విరసుడు వృద్ధుడే !
వృద్ధు డైనా సరసుడు యువకుడే !
జీవ నైజం తెలిసి మసలని వాడు
తన శవాన్ని తానే మోసుకు తిరిగే వాడు !

62

నేను కవిని కాదు, కాని
కవి సమ్మేళనాలలో పాల్గొంటాను !
నాకే సభ్యతా తెలీదు, కాని
అన్ని సభలకూ అధ్యక్షత వహిస్తాను !

63

నాకు రూపం లేదు, గుణం లేదు,
శిక్షణ లేదు, లక్ష్యం లేదు !
మంచి లేదు, చెడ్డ లేదు !
అందుకే నేను సర్వాధినేతను!

64

పోకిరీ అవుతాడేమో అని
పాలివ్వడం మానుతుందా తల్లీ ?
ఏ గయ్యాళి తుంచుకు పోతుందో అని
పూయడం మానుతుందా మల్లి ?

65

ప్రతి కుటుంబ చరిత్రా ఒక నవల
ప్రతి వ్యక్తి బ్రతుకూ ఒక నాటకం,
దేన్నీ సీరియస్‌గా తీసుకోకు
నీ పాత్రను నీవు ఔచితితో నిర్వహించుకో !

66

ఏనుగు బ్రతికినా వెయ్యే, చచ్చినా వెయ్యే !
ఏనుగును మించింది ఆఫీసులో ఫైలు !
ఫైలు పుట్టక ముందు కూడ వెయ్యే !
ఒకో గండం గడవడానికి ఒకో వెయ్యి !

67

దేవు ళ్ళవతరించారు, ప్రవక్త లుద్భవించారు,
నెత్తురు చిందించారు, నీతులు బోధించారు !
మానవ నైజం మాత్రం గొంగళిలా
ఎక్కడి దక్కడే పడివుంది !

## 68

నేను వైరుద్ధ్యాల చౌరస్తాను !
వైశిష్ట్య చాతుర్విద్యాన్ని !
నా నుంచి పోవడం సంసారం,
నా కేసి రావడం సన్యాసం !

## 69

నే నేమి చేస్తే అది కళాఖండం,
నే నేమి చెపితే అది వేదం !
ఓ, వచ్చే పోయే యాత్రికుల్లారా !
ఇవిగో మీకు నా శుభాశీస్సులు !

❋ ❋ ❋


కేదారగౌళ
బోయిభీమన్న

ప్రపంచ తెలుగు మహాసభల

సందర్భంలో

ప్రచురణ

1975

రాక్షస ఉగాది 12.4.1975

ప్రతులకు:

సుఖేలా నికేతన్,

ఐ.సి 85, ఇర్రంమంజిల్ కాలనీ,

హైదరాబాదు - 4

హక్కులు రచయితవి

వెల రూ. 2.50

ముద్రణ:

లలితా ప్రెస్

# అంకితం

తెలుగు జాతి ఒక సంఘటిత శక్తిగా రూపొంది, ప్రపంచ స్థాయికి పెరిగి, తన తొలి వసుధైక మహోదయ జయంతిని జరుపుకొంటున్న ఈ శుభ మహూర్తంలో:

మన మధ్య భౌతికంగా లేకపోయినా, ఉన్నట్టే హార్దికంగా ఏ తెలుగు పెద్దలను గురించి మనం ఫీలవుతామో, అట్టి మహా వ్యక్తులలో కొందరు–

దేశం పారతంత్ర్య శృంఖలాలను తెంచుకోడానికి చావు బ్రతుకుల పోరాటం జరుపుతున్న రోజుల్లో రాజకీయ, సాంఘిక మహోద్యమాలను ముందుండి నడిపించిన అగ్రశ్రేణి విప్లవకారులు–

నన్ను అవ్యాజ అనురాగంతో తమ హృదయాల దాకా రానిచ్చి, ఉన్నత మానవతా వాత్సల్యాన్ని రుచి చూపి, నాకు నా అమాయక జీవితంలో ఎప్పుడు ఏది అవసరమో తామే ఊహించి, అప్పుడు అట్టి సహాయాన్ని అందజేస్తూ, నా సమున్నతికి తోడ్పడుతూ వచ్చిన మిత్రరూప గురుతుల్య పూజ్యపాదులు–

శివైక్యం చెంది, విశ్వచేతనా రూపులై, ఈ మహా సభల నావేశించి ఆనందిస్తూవున్న బ్రహ్మమూర్తులు–

కళావెంకటరావు
అయ్యదేవర కాళేశ్వరరావు
మాడపాటి హనుమంతరావు
వేముల కూర్మయ్య
తాపీ ధర్మారావు
కల్లూరి సుబ్బారావు

గార్లకు ఈ చిన్ని గేయ గీత పద్య కావ్య సంపుటిని భక్తితో అంకితం చేస్తున్నాను.

బోయి భీమన్న

# లఘు భూమిక

కేదారం అంటే వరి పొలం.

వరి పొలాలను పాలించే పచ్చని తల్లినే కేదారేశ్వరి అన్నాను.

కేదారుడు అంటే అర్థం శివుడు. రైతు కూడ. కేదారనాథుడు, కేదారేశ్వరుడు అంటేనూ శివుడే. రైతు కూడ.

తెలుగు భూమి వరి పొలాల భూమి. అందుకే దీనిని కేదార భూమి అన్నాను. ఈ తెలుగు భూమిని పాలించేవాడు కేదారేశ్వరుడు శివుడైతే, కేదారేశ్వరి శివ. ప్రతి రైతూ శివుడే అయితే, ప్రతి రైతు కాంతా శివే, శివ శక్తే.

ప్రతి జీవికీ ప్రాణాధారం అన్నం, అన్నం తరువాతనే భోగాలు, వ్యసనాలు, పదవులు, అధికారాలు, కళలు, కాంతులు.

ఆర్యుడు అంటే రైతు. అనాదిగా మన ఆర్యభూమి సూర్యభూమే, అన్న భూమి. అందులోనూ మన తెలుగు భూమి సూర్యుడికి మరీ దగ్గరిది. సూర్యుడు సముద్ర గర్భం నుంచి తలెత్తి, కళ్లు తెరిచి, తొలిసారిగా, సూటిగా చూచేది తెలుగు తల్లి ముఖమే. అందుకే తెలుగు తల్లి అన్ని విధాలా అన్నపూర్ణ అయింది.

శివుడంటే ఎక్కడో కైలాసంలో కూర్చునే ఒక దేవుడనుకొని, అలాంటి వాడెవడూ లేడనుకొనే నాస్తికులకు ఈ భావన అవగాహన కాకపోవచ్చు. నేనూ నాస్తికుణ్నే. అయితే నేనే శివుణ్ణనీ, నా కంటె ఇతరుడైన దేవుడెవడూ లేడనీ భావించే నాస్తికుణ్ని నేను. నా భావకోణం నుంచి పరికిస్తే – ఈ కేదారేశ్వరి సర్వసంపత్సంపూర్ణ సుందరేశ్వరిగా ఎవరికైనా సరే సాక్షాత్కరిస్తుంది! సానంద మధుర అవుతుంది.

ఇంతకూ – ఈ దేవి మనలో ప్రతి ఒక్కరమూ, ప్రతి నిత్యమూ దర్శిస్తున్నట్టిదే. తేడా అంతా దృక్పథంలో వుంది. మెదడుతో చూస్తే అదివట్టి వరి పొలం. హృదయంతో చూస్తే సాక్షాత్తు జీవన ధాత్రి, కేదారేశ్వరి!

ప్రతి వరి పొలమూ కేదారేశ్వరే. అయితే – ఈ వరి పొలాలనన్నిటినీ, నిజానికి పంట పొలాలనన్నిటినీ, నీటి వనరుల్నీ, కాయగూరల్నీ, మొత్తం మీద అన్నమయ

ప్రపంచ సమస్తాన్నీ పాలించే ఒక శివంకర శక్తిగా కేదారేశ్వరిని ఊహించాను. రూపకల్పన చేసి, తెలుగు ప్రజల ముందుంచుతున్నాను.

ఈమె తల్లి – ఏ ఒక్కరికో కాదు. తెలుగు ప్రజలందరికీ తల్లి. అందరికీ తల్లి అయిన దానినే దేవత అంటాం. ఇందులో వైపరీత్యం ఏమీ లేదు.

## వీణాపాణి

ఇక్కడొక విషయం చెప్పాలి. "కేదారేశ్వరి" శీర్షిక కవితలో మొదటి పద్యం కొంత క్లిష్టంగా వుంటుంది. అది ఆలోచనామృతం. అందులో ఓం, ఐం, హ్రీం, శ్రీం అనే బీజాక్షరాలు వాటంతట అవే ప్రత్యక్షమైనై. శివంకరమైన పద్యబంధం అది.

ఆకాశంలోకి చూడండి. మనకు శ్రావణ భాద్ర పదాలు వర్ష ఋతువు. శ్రవణా నక్షతం సమీపంలో వీణా మండలం వుంది. అక్కడ మనం సరస్వతిని స్పష్టంగా చూడ వచ్చు. ఆమె ఈ పద్యంలో కేదారేశ్వరి. ఆమె యొక్క వీణా వాదన మాధుర్యంచే మబ్బు తునకలనే తుమ్మెదలు ఆకర్షింపబడి, ఆ పాడబడుతున్న గీత పాదాల చుట్టూ చేరి, మధువులు గ్రోలి, పొదుగులు నిండిన కపిల గోవులై, మన తెలుగు భూముల నిండా పాలూ, తేనెలూ వర్షిస్తూ, ఆనందం పండిస్తున్నాయి! అట్టి దేవికి, తెనుగు నేల సిరికి, హేమగర్భకు, కేదారేశ్వరి అయిన మాణిక్య వీణా పాణికి నమస్కారం చేస్తున్న పద్యం ఇది.

ఇందులోని అన్ని పద్యాలను, గేయాలను కూడ ఇలానే అర్థం చేసుకోవలసి వుంది.

ఈ గేయ గీత పద్య కావ్య సంపుటిని ఈ ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో తెలుగు ప్రజలకు అందజేస్తున్నాను.

## భావబీజం

1959 ప్రాంతంలో, నవ్య సాహితీ సమితికి నేను అధ్యక్షుడుగాను, పోతుకూచి సాంబశివరావుగారు ప్రధాన కార్యదర్శిగాను వున్న కాలంలో – మా సమితి

ఆధ్వర్యంలో అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు జరపాలనుకొన్నప్పుడు, పేరు దగ్గర పేచీ పెట్టారు మా మిత్రులలో కొందరు.

''అఖిలాంధ్ర'', ''విశాలాంధ్ర'' వంటి పేర్లు పెట్టాలికాని, అఖిలభారత ఏమిటి అని వారి వాదం. ''అఖిలభారత'' అంటేనే కాని సభలకు ఆలిండియా హోదా రాదు అని నా వాదం. చివరకు అందులో కొందరు విసిగి (బహుశా - భాస్కరభట్ల కృష్ణారావుగారో, తురగా కృష్ణమోహనరావుగారో - బాగా జ్ఞాపకం లేదు) హేళనగా అన్నారు ''అఖిలభారత ఏమిటి, అఖిల ప్రపంచ అనండి'' అని! ''సమయం వచ్చినప్పుడు అఖిల ప్రపంచ సభలు కూడ చేస్తాం'' అన్నాను నేను. నవ్య సాహితీ సమితిలో చీలిక ఏర్పడడానికి ప్రధాన కారణం అదే కూడ.

ఏమైనా సరే అఖిలభారత అనే అనాలని సాంబశివరావుగారు కూడ పట్టుపట్టడం వల్ల, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి సహకారంతో - అంతవరకు మామూలు మంత్రిగా వున్న మా ఆహ్వాన సంఘాధ్యక్షులు సంజీవయ్యగారు అంతట్లో ముఖ్యమంత్రి కావడంవల్ల ద్విగుణీకృతోత్సాహంతో - అఖిలభారత తెలుగు రచయితల మహాసభలను అత్యంత వైభవోపేతంగా జరపగలిగాం.

నేడు జరుగుతున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలకు - అట్టివి జరపవచ్చునన్న ఊహకు - బీజావాపం ఎప్పుడు ఎలా జరిగిందో జ్ఞాపకం చెయ్యడానికే నేను ఇక్కడ ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నాను.

ఆ తర్వాత ప్రపంచ సభలను జరపాలనీ, అందుకు ప్రభుత్వం పూనుకోవాలనీ తీర్మానాలు చేస్తూనే వచ్చాం. డా. బెజవాడ గోపాలరెడ్డిగారి ప్రోత్సాహంతో సాంబశివరావుగారు. రామానుజరావుగారు, నేను ఈ విషయంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారిని రెండు మూడు పర్యాయాలు దర్శించినట్టు కూడ జ్ఞాపకం.

అప్పుడు విద్యామంత్రిగా వున్నప్పుడూ, ఆ తర్వాత ముఖ్యమంత్రి అయినప్పుడూ కూడ శ్రీ పి.వి.నరసింహారావుగారు - రాజకీయ పరిపాలనా రంగాలలో క్లిష్టత అధికం కావడంవల్ల కాబోలు - ఎంత ప్రయత్నం చేసీ ఈ విషయం మీద తమ దృష్టిని కేంద్రీకరించలేక పోయారు.

# కొత్త వెలుగు

రాజకీయాలు, పరిపాలన తొందరలూ గతానుగతికాలే. ఎవరున్నా, ఎవరు లేక పోయినా అవి సాగిపోతూనే వుంటై. ఏ వ్యక్తికీ అందులో గర్వకారణాలేమీ వుండవు. ఏదో ఒక చరిత్రాత్మకమైన పనిచేసినప్పుడే అట్టి వ్యక్తి ప్రతిభా ప్రాభవాలు లోకానికి వెల్లడవుతాయి, ప్రయోజనకరాలవుతాయి. మానవజాతి ప్రగతి పథంలో ఒక కొత్త వెలుగును చూపగల్గిన ఆత్మే మహాత్మ.

అట్టి కొత్త వెలుగును చూపడానికి కేవలం ప్రతిభా ప్రాభవాలూ, శక్తి సామర్థ్యాలూ మాత్రమే చాలవు, హృదయమూ, ప్రజాసేవాసక్తీ వుండాలి. అవకాశాలను కల్పించుకోవాలి. అట్టి అవకాశాలను ఉపయోగించుకోవాలి. అట్టి స్థితప్రజ్ఞులు లోకంలో ఏ కొద్ది మందో!

ఈనాడు ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు, విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు ఈ విషయంలో అట్టి స్థితప్రజ్ఞులు. తెలుగు లోక కల్యాణార్థం తిరిగి పుట్టిన కృష్ణార్జునులు. గోపాలరెడ్డి గారన్నట్టు నరనారాయణులు. వీరికి ధర్మరాజు లాంటి దేవులపల్లి రామానుజరావుగారు తోడై అర్థాన్ని శాసించడంవల్ల, ఈ సభలకు త్రైమూర్తక శక్తి సంపూర్ణత సమకూరి, తెలుగు జాతి మహత్తర చరిత్ర త్రిలోక విఖ్యాత శిఖరాల నందుకొన్నది. తెలుగు జగతికే వెలుగైంది.

తెలుగు సంస్కృతీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని ఒక మహోద్యమంగా చేపట్టిన యుగ పురుషుడు శ్రీ మండలి. మానవులను ఒక జాతిగా కూడగట్టేదీ, జాతిని బల పరిచి స్థిరపరిచేదీ, జగద్విఖ్యాతిని సమకూర్చేదీ, సకల సుఖ సంపదలతోను అజరామరం చేసేదీ ఒక్క సంస్కృతే.

భారతదేశం స్వతంత్రమై, త్రిలింగం ఏక ప్రదేశమైన తర్వాత ఇంత కాలానికైనా – తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవన కార్యక్రమం ఒక మహోద్యమంగా చేకొనబడడం, అది పునాదిగా ప్రపంచ తెలుగు మహాసభలు అత్యంత శోభాయమానంగా నిర్వహించబడడం – నిజంగా తెలుగు ప్రజల అదృష్టం. అట్టి అదృష్టంలో పాలుపంచు

కోడానికే ఈ కావ్య సంపుటిని తెలుగు గాయనీ గాయకుల, తెనుగు సాహితీ దర్శకుల, తెలుగు సమ్యక్సహృదయుల చేతులకందిస్తున్నాను.

## ముఖ చిత్రం

ప్రపంచ మహాసభల సందర్భంలో జరిగే ప్రింటింగు పనివల్ల నగరంలోని ప్రెస్సు లన్నీ 24 గంటలూ పనితో ఉక్కిరి బిక్కరైవున్నాయి. ముఖ చిత్రం గీయించుకొందా మంటే ఆర్టిస్టు మిత్రులందరూ కూడ చిత్ర శిల్ప నిర్మాణాలలో మునిగిపోయి వున్నారు.

విద్యామంత్రి శ్రీమండలివారితో ఏధైనా చెప్పుకుందామంటే – ఇందుగలడందు లేడన్న సందేహం లేకుండా, ఎందెందుకు వెదకనక్కరలేకుండా, అందందు సాక్షా త్కరిస్తూ, వారు నిర్విరామంగా చేస్తున్న పనిని చూస్తుంటే – వారికి ఇంకా ఎందుకు అదనపు శ్రమ ఇవ్వాలనిపించింది, సహృదయులైన వారందరికీ. నాకు కూడ!

ఈ నా కేదారేశ్వరి అనావృష్టి బాధిత అవుతుందేమో అన్నంత భయం వేసింది నాకు కొన్ని బలహీన క్షణాలలో.

అట్టి దిగులుతో, మిత్రులు భూషి రామదాసుగారితో కలిసి కళాభవనం ఆవర ణలో తిరుగుతూ, జయదేవ అష్టపదుల చిత్రప్రదర్శనను చూద్దామని పైకి వెళ్ళాను. లోపలికి ప్రవేశించి, ఒక్కసారి ఆ చిత్రశాలను తిలకించగానే – కళ్ళు చల్లబడి, మనస్సు కుదుటపడి, హృదయం ఆనంద వివశమయింది. నిజమైన కళ ఇవ్వగలిగిన ఆనందం ఎలాంటిదో, మానవాత్మ కళ నుంచి ఆశించే ప్రయోజనం ఏమిటో ఆ క్షణంలో నాకు అనుభూతమయింది.

ప్రదర్శనంలోని చిత్రాలను ఒక్కొక్కదాన్నే చూసుకొంటూ ఎంతోసేపు గడిపా నక్కడ. ఒక చిత్రంవద్ద చాలసేపు నిలబడ్డాను. కొద్ది మార్పుతో అది నా కేదారేశ్వరి కాగలదు! అయితే, అది ఎలా సాధ్యం? చిత్రకారుడితో నాకు పరిచయమే లేదే!

సరస్వతీ మూర్తి అయిన ఎవరైనా, తెలియడమేమిటి? తెలియకపోవడమే మిటి? అసహన లోభులైన మిత్రులు శత్రువులుగాను, గుణగ్రహణ సమర్థులైన శత్రువులు మిత్రులుగాను ప్రవర్తించడం లేదా?

చిత్రకారుడెవరు? అదిగో, ఆయనే టి.ఎస్.కృష్ణ. తుమ్మల సాయికృష్ణ. నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. నా కోరిక వెల్లడించాను.

''నేను కూడ ప్రపంచ తెలుగు సభల పనిలో మునిగివున్నాను. అయినా - రేపు ఇటు వస్తారా?'' అన్నారాయన. ''తప్పకుండా'' అన్నాను. నాకు కావలసిన మార్పును సూచించాను. ఆ మరునాడు ఆయన నాకందించిన చిత్రం ఇది – ఈ ముఖచిత్రం! సరస్వతి నా పట్ల ఎంత కరుణామయియో! చిత్రశిల్పి శ్రీ టి.ఎస్.కృష్ణగారికి నేను చూపవలసిన కృతజ్ఞత ఎంతో!

–భీమన్న

❋ ❋ ❋

# తెలుగు నేల సిరి

## తెలుగు సరస్వతి

ఎంత దివ్యమైనది
ఈ తెలుగు సరస్వతి !
ఏదో ఒక మధువేనా ?
ఎల్ల రుతువులను తానై
నా ఆరామము నిండా
నవ రుచులతో వికసించు ! ॥ ఎ ॥

ఆకలి కొక దానికేన ?
ఆ కాంక్షల కన్నిటికీ
పూల, పండ్ల గిన్నెలతో
పురుషార్థము లందించు ! ॥ ఎ ॥

ఒక భౌతిక జగతి నేన ?
సకల సౌఖ్య లోకాలను
ఆత్మ దారమున గుచ్చి
అఖిలేశ్వరి కర్పించు ! ॥ ఎ ॥

## ఉగాదికి స్వాగతం

ఓ – మధు మాస నామ్నా
ఓ – అధునా మహిమ్నా

తెలుగౌ ఉగాది, రావమ్మా!
వెలుగుకు ప్రోదే నీవమ్మా! ॥ ఓ ॥

తెలుగు ఉగాదివె కాదమ్మా!
తెలివి యుగాదే నీ వమ్మా!

అధునాతన ఆంధ్రప్రదేశ ఈ
శా! నిత్య శుభాశా! రావమ్మా! ॥ ఓ ॥

అసువుకు అరుణోదయ వమ్మా!
అవనికి నవజీవన వమ్మా!
శుక పిక మధు పానంద గీతముల
సుమన స్స్వాగత మిదె కొమ్మా! ॥ ఓ ॥

## ఎన్నాళ్ళకు ! ఎన్నాళ్ళకు !

ఎన్నాళ్ళకు ! ఎన్నాళ్ళకు !
ఇన్నాళ్ళకు ! ఇన్నాళ్ళకు !

కాలం వక్రించి, ఖండ
ఖండాలై పోగా–
ప్రతీ తెలుగు వాడూ ధ
న్వంతరిగా రూపొందుట ! ॥ ఎ ॥

చివరికి ఒకటై లేచిన
శ్రీమ దాంధ్ర భూ లక్ష్మి
చెదరి వున్న బిడ్డల నొక
చెరగు నీడ లాలించుట ! ॥ ఎ ॥

ప్రపంచంలో దశ దిశలా
పరిమళి స్తున్న మణులు
రాశులుగా వచ్చి, తెలుగు
రాజ్యేశ్వరి నర్చించుట ! ॥ ఎ ॥

# దేశ మాత

దేశ మాత భూ మాత,
తెలుగు తల్లి గో మాత
అసలు మాత కంటె ముందు
ఆరాధ్యులురా ! ॥ దే ॥

భూ మాతను సేవించగ
గో మాతను పోషించగ
ప్రజలందరి సంక్షేమమె
ప్రథమ ధర్మమౌ కదరా ! ॥ దే ॥

ప్రజలనగా ఎవరురా ?
పైసలున్న పది మందా ?
హలముల, కలముల నడుమ
అన్నార్థులె ప్రజలు రా ! ॥ దే ॥

దేశ మాత భూ మాత
తెలుగుతల్లి గోమాత
ఈ మాతల సంతృప్తే
నీ మనుగడ సఫలతరా ! ॥దే ॥

# నాగార్జున సాగరమా

నాగార్జున సాగరమా !
నవ దేవాలయమా !
నవ దేవాలయమా ! మా
నవ జీవాలయమా ! ॥ నా ॥

మానవ విజ్ఞానానికి
మకుటాగ్రపు మణి దీపము !
శ్రమ శక్తికి, జన శక్తికి
జయ సంకేత పతాకము ! ॥ నా ॥

సాగరాల హృదయాలకు
సస్యేందిర సందేశము !
క్షేత్ర దేవి అడుగడుగున
శ్రీ రంజిలు మంజీరము ! ॥ నా ॥

తెలుగు నేల పండింప
వెలుగు నేల కందింప
పర తెంచిన కృష్ణ రమా !
పరమాన్నపు పళ్లెరమా ! ॥ నా ॥

## మామిడి తోరణాలు

మల్లెల దండలు
మామిడి తోరణాలు !
బంగరు పంటలే
పంటల పండగ లే ! || మ ||

ఏ ఇంట ఆగినా
ఏ వీధి కేగినా
కపురపు దీపాలే !
కమ్మని ధూపాలే ! || మ ||

ఏ మోము చూచినా
ఏ కంట కాంచినా
చల్లని వెన్నెలలే !
సరసా నందము లే ! || మ ||

పండగ ఏ దైనా
గుండెకు ప్రతిబింబమె !
గుండె ఎవరిదైనా
పండగ కోసమే ! || మ ||

దసరా వేడుకలా ?
సరదా సంక్రాంతుల ?
సమాయిత ప్రపంచాంధ్రుల
సమీకృత కళాకాంతులు ! || మ ||

## బ్రతుకే ఉద్యమం

వీరుడ వగుదువా ?
శూరుడ వగుదువా ?
　　దేశ దేశముల వెలిగే
　　ధీరుడ వగుదువా ?　　|| వీ ||

సంఘర్షణ సహజం, బ్రతు
కంటేనే సమరం,
　　వెర పెరుగక నిల్చి గెల్చి
　　విక్రమించి మించనిచో　　|| వీ ||

మృత్యువునకు భయపడుట
సత్యమునకు భయపడుటే,
　　శాంతి సత్యములకై నీ
　　సత్త్వము చూపించనిచో　　|| వీ ||

ఊహల, చేతల నీ వొక
ఉద్యమమై బ్రతకనిచో
　　మహిమలు కల మహికే నీ
　　మహనీయత పంచనిచో　　|| వీ ||

# సైనికులం

సైనికులం - మనం
శ్రామికులం ! ॥ సై ॥

జాతి ప్రాణ రక్షణకై
సమర భూమి లందు,
బంటుతనం పోషించే
పంట భూమి లందు ॥ సై ॥

రాజ్య రమా ప్రభుతకై
రక్త తర్పణం చేసే
యువ వీరుల పుష్టికై
ఒడలు వంచి చెమ టోడ్చే ॥ సై ॥

దానవతను తెగటార్చి
మానవతను రక్షించే,
ముళ్ళ పొదలు తెగనరికి
ముత్యాలను పండించే ॥ సై ॥

# మనిషి మారాలి

మారాలి–
మనిషి మారాలి !
మనిషికి మనిషికి నడుమ
మంథరాలు తిరగాలి
ద్వేషాగ్నులు చల్లారి
ప్రేమ సుధలు ఊరాలి ! ॥ మా ॥

తోడివాని శ్రమ ఫలమును
దోచుకొనుట తొలగాలి,
పనీ, తీరికా, వేడుక
ప్రతి మనిషికి కలగాలి ! ॥ మా ॥

పొట్ట కూటికై మనిషి
పోరాటం ఆపాలి,
ప్రజలందరి ఆనందమె
ప్రగతికి విధి కావాలి! ॥ మా ॥

పేద వాని కుండలలో
వేద మధువు నిండాలి,
వేద మాత గుండెలలో
విశ్వ జనత పండాలి ! ॥ మా ॥

## తెలుగు ఆత్మ

వీణ కంటె విన సొంపు
మా తెలుగు వాణి,
　　వాణి కంటె వరలక్ష్మి
　　మా తెలుగు బాణి ! ॥ వీ ॥

బృంద మించి రమణీయ
మా తెలుగు తోట,
　　నందనమే ప్రతి పెరడూ
　　మా తెలుగు వీట ! ॥ వీ ॥

రత్న గర్భ, అన్న పూర్ణ
మా తెలుగు నేల,
　　రాజసగుణ, రవి కిరణ
　　మా తెలుగు బాల ! ॥ వీ ॥

# గోపాలనం

గోవుల గాసేవో ?
గోళీ లాడేవో ?
గోదావరి వరి పొలములలో
గోవుల గిట్టల గుంటలలో ! ॥ గో ॥

పాటలు పాడేవో ?
ఆటలు ఆడేవో ?
పాటలలో, ఆటలలో మునిగి
పని పాటులు మరిచేవో ? ॥ గో ॥

అమృతం పితికేవో ?
ఆత్మను వెతికేవో ?
గోళీ ఆటల గుంజాటనలో
గోవులనే వదిలేసేవో ? ॥ గో ॥

# ఇళ్ళకు గోవులు

తరలె నొహో !
తమ తమ ఇండ్లకు గోవులు
తరలె నొహో ! ॥ త ॥

కడుపుల నిండా పచ్చిక మేసీ
కన్నుల నిండా కాంతులు క్రోలీ
తరలె నొహో ! ॥ త ॥

పశు పతియే గోపాలుడు కాగా
పరమానందమె చేపులు రాగా
తరలె నొహో ! ॥ త ॥

తెలుగు నేలయే గో లోకముగా
దివ్య తారలే దిగి వచ్చిన వన
తరలె నొహో ! ॥ త ॥

## బాలయోగి

ఆకాశ గంగతో అభ్యంగ మొనరించి,
పమిట చెరగులతోడ తమిమీర తడులొత్తి,
ఉడులోకముల వెలుగు పొడు లలది, ప్రతి ప్రొద్దు
లక్ష్మీ సరస్వతులు లాలింత్రు నిన్ను

బాల యోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు.

సురవన సుమాల అత్తరులతో తల దువ్వి,
నెలవంక ముడిచి, పాముల కండువా చుట్టి,
తండ్రి వాలక మెట్లు తప్పునని శివు నెంచి,
ముదముతో జగదంబ ముద్దాడు నిన్ను !

బాలయోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు!

తన పసితనము నాటి తానె కాబోలు నను
కొని, కాళి చూడవచ్చిన గుట్టు చెడు నంచు,
పాములను పుట్టలకు పారదరిమే శివుడు
తెలివొంది, నవ్వుకొని, దీవించు నిన్ను !

బాల యోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు !

బాల సూర్యుని దీప్తి, బాల చంద్రుని కాంతి,
బాలకృష్ణుని గీతి, పరముమున యోగించి,
బాల యోగిగ నీవు ప్రభవించినావు !
ఆత్మ పారమ్యమును ఆర్జించినావు !

బాల యోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు !

యో గాసనమున నీ వుండు నదియే గుండె,
ధ్యాన మందున నిన్ను ధరియించునదె బుద్ధి,
ఆనందమున నీతొ ఐక్యమౌనదె ఆత్మ,
నీ పూజె శివపూజ ! నీ దర్శనమె శివుడు !

బాల యోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు.

## కూలీ - రైతూ !

దిన కరుడే కార్మికుడు,
ధాన్య కరుడు కర్షకుడు !
కార్మికుడే సూర్యుడు,
కర్షకుడే చంద్రుడు
ఆత్మ శక్తి నేత !
అన్నామృత దాత ! ॥ ది ॥

పై వాడితో క్రింది వాడి
బాంధవ్యమె జీవనం,
శ్రమికుల, కర్షకుల ఆత్మ
సంయోగమె జీవితం !
పొలమె ఆది శక్తి,
హలమే శివ శక్తి ! ॥ ది ॥

చెమటోడ్చే వాడె రవి,
చిద్వి లాసియే శశి!
రస బ్రహ్మ దిన కూలీ,
రాగాత్మే సినీవాలి !
కార్మిక కర్షకులదే
ధార్మిక జీవన మహి ! ॥ ది ॥

# నమస్కారం

నమస్కారం-
నమస్కారం !
తెలుగు బీజం మొలక లెత్తిన
దివ్య గోదావరి పొలాలకు !
తెలుగు జీవం తేజరిల్లిన
నవ్య కృష్ణాఝరి హలాలకు ! ॥ న ॥

తెలుగు వాణికి రూప మిచ్చిన
తెలుగు బాణికి దీప మొసగిన
నన్నయకు, తిక్కన్నకును, పో
తన్న, వేమన, త్యాగరాజుకు ! ॥ న ॥

తెలుగు వీరం దెసలు నిండిన
తెలుగు ధీరం పసలు పండిన
రాణి రుద్రమ దేవికి !
రాజ సామర జీవికి ! ॥ న ॥

# అభ్యుదయేశ్వరి

అభ్యుదయేశ్వరీ !
అవనికి దిగు మరీ ! ॥ అ ॥

చీకటి నుంచి
వెలుగును సృష్టించి,
రాత్రిని కరిగించి
పగటిని నిర్మించే ॥ అ ॥

పగటినె మూసి
వెలుగును మేసి
నల్ల వారిన మనిషి
తెల్లవారే కొరకు ॥ అ ॥

మొగ్గ – పెగలనీ
పువ్వు – పేలనీ
తావి – నిండగా,
పిందె – పండగా || అ ||

రక్తం జ్వలించ నీ
రాగం ఫలించ నీ
రాతిరి కడుపున
రవి ఉదయించగా || అ ||

# వరిలక్ష్మి పుట్టిల్లు

రమ్మ, దేవి ! మా తెలుగు పొలమ్ము లందు
లక్ష్మివై, తెల్గు పాఠశాలలను వాణి
వై, తెలుగు గేహములను భవాని వగుచు
రమ్మ ! సిరు లెల్ల నీవుగా రమ్మ, దేవి !

కృష్ణ, మంజీర, గోదావరియును, పెన్న,
వంశధార, మూసీ, తుంగభద్ర – ప్రముఖ
వాహినీ సరస్వతులు నీ స్నేహమునను
పూర్ణ జీవన సౌభాగ్యముల రహింత్రు !

తొలకరికి కేలు మోడ్చి, ఊడ్పులు ముగించి,
గడ్డిగంపలతో బోదెగట్లు చేరి,
ఏలలన్ నిను గొల్చు మా మాల పిల్ల
లమృత రూపిణి ! నీకు అద్దములె సుమ్ము !

ఏడు కొండల శిఖరాల కెదిగి, దివికి
ఓ సరిల్లి, పిల్లన గ్రోవి నూదు కొనెడు
తెలుగు వెంకన్న నీ కాతిథేయు మొసగ
చూచెదవు గాని – అచ్చ యశోద సుతుడె !

శేషగిరి నుండి సింహాద్రి శిఖరమునకు
కల్ప మంజరు లూయెల గట్టి, తెలుగు
కడలి తరగల చెలులు రంగార నిన్ను
మించుల యెడంద లడర నూగించ గలరు !

బోదెలన్ తూటి, చేమయు, పొన్నగంటి;
గట్లపై బెండ, బీర; లంకలను వంగ
గోగు, గుమ్మడి - ఎవొ కాయ గూర లెల్ల
చేయి చాచిన నందు మా సీమ నెందు !

సెనగ, ఉలవ, పెసర, కంది, అనుము, మినుము
పనస, మామ్డి, నారింజ, కొబ్బరి, అనాస-
ఈత, తాడి, విప్ప, చెరకు - ఇన్ని అన్ని
అనగ నేల, తెలుగు దేశి అమృత రాశి !

జొన్న, వరి, చోడి; పాలును, జున్ను, పెరుగు;
పాయసమ్ములు, వడలు, ఊర్గాయ దినుసు;
నిత్య సాహిత్య సంగీత నృత్య కళలు;
కలిమి చెలువకు పుట్టిల్లు తెలుగు ఇల్లు !

అన్నమున కింత లోటు లేకున్న గాని
ఏమి టీ లేమి అంచు చింతించ వలదు;

స్వార్థమున, మౌఢ్యమున నరు డార్తినొందు !
ఆతని స్వభావ మది, మన చేత లేదు !

కొందరికి గుండె చిన్నది, కొందరికి మ
నస్సు చిన్నది, బ్రతుకె కొందరికి చిన్న;
దంత మాత్రాన ఇల చిన్నదనము లేదు,
పెత్తనము చేయు నీ కన్ను పెద్ద దైన !

అరటి యాకుల విస్తళ్ల అన్నపూర్ణ
పరచి నట్లుండు మా తెల్గు వరి పొలాలు !
వచ్చి వడ్డింపు మెల్ల జీవన రుచులను
శార దైందవి ! సరి పంక్తి జనత కెల్ల !

## 1

శ్రీ మాణిక్య విపంచికా నవ రవ
హ్రీ ముగ్ధ గీతాంఘ్రులన్
జీమూ తాళుల నిల్పి – సోంభిత గవా
నీ కమ్ములై అవ్వి మా
భూమిన్ పొలును, తేనెలున్ కురియ – స
మ్మోదమ్ము పండించు తత్
హైమాభ్యంతరి ! తెన్గు నేల సిరి ! కే
దా రేశ్వరీ ! తే నమః !

## 2

ఇది వైకుంఠము – వెంకటేశ్వరుడు ల
క్ష్మీశుండు కొల్వుండు టన్;
ఇది కైలాసము – మల్లి కార్జునుడు అ
ర్యేశుండు చెల్వొందుటన్;
ఇది బ్రహ్మోర్వి – సరస్వతీ చరణ పం
కే జాతమై యుండుటన్;
ఇది మా ఆంధ్రము, నీకు పీఠము, త్రి శ
క్తీ ! పూజ గైకో గదే !

## 3

ప్రాణాధార పదార్థ మన్నమె, పర
బ్రహ్మమ్ము సాక్షాత్తు; అ
న్నానన్ పుట్టును, పెంపు నొందును ప్రపం
చ మ్మెల్ల; అద్దాని కె
ద్దానన్ రూప గుణమ్ము లెక్కు, నదె కే
దారమ్ము; కేదార ల
క్ష్మీ నారాయణి ! తెల్గు చిత్తముకు సం
కేతమ్ము నీవే కదా !

## 4

తెలు గన్నన్ వెలు గౌను; లోక జన శ
క్తిన్ పెంచి, పోషించి, కాం
తులు పండించు శివంకరుండు ప్రతి రై
తున్ ఇందు కేదారుడే;
సెల యేళ్ళా ? అవి లేళ్ళు, ఇందు ధవళా
శీర్వాదముల్, నీవె ! మా
కల మాన్నమ్ములలో ప్రతీ మెతుకు నీ
కల్యాణ సౌభాగ్యమే !

## 5

గంగకు వంక లుండినవి;
గౌతమి కున్నను, రమ్యవాః కళా
భంగిమ లవ్వి; కృష్ణయు ను
భంజిత కృష్ణయె ప్రాణి సేవలో;
నింగిని నేలనున్ గలుపు
నెయ్యపు వియ్యపు పేరటాంధ్రు త
క్కుం గల వాహినుల్; తెలు గొ
కో? ఇది స్వర్గపు వెల్గు కాదొకో !

## 6

ఇతి హాసమ్ము సృజించు వీరుని కరా
సే కాదు, అందాల రా
ణి తలంటుస్ విరియించు మానవుని గుం
డెన్ నిండు రోజా పువుల్ !
సత తాభ్యున్నత సర్వ సంస్కృతికి బీ
జం బీవ ! నీ చేతిలో
ప్రతి పూవున్ ఒక బంతి పూవె అయి సం
వాసించు మా తోటలన్ !

## 7

మా పొలముల్ శరద్గగన
మండలముల్; ఫల పుష్ప సస్య రా
శీ పథముల్; సుపర్వ మధు
శీధు పయః పరిపూర్ణ జీవికల్;
రూపము గొన్న పాల్కడలి
రో ! వెలు గొందుము, సర్వ సంపదల్
దీపములై భవచ్చరణ
దేశము లెల్ల మదీయ దేశిగా !

## 8

చెరుకున్, కొబ్బరి, జొన్న, మామిడులు వం
శీ రాగపుం బైరలన్
వరి లక్ష్మిన్ అలరింప; మబ్బులు మృదం
గ శ్రీలు వర్షింప; శం
కరు డాడన్; నిఖిలాంధ్ర దేశము త్వదా
నంద ప్రియ క్షేత్రమే !
సరదా మంతులు మా తెలుంగులు; రస
స్వామ్యమ్ము పాలింపుమా !

## 9

ఆకుం బచ్చన, ఇంద్ర నీల రుచి, సూ
ర్య స్వర్ణ తేజమ్ము, జ్యో
త్స్నా కల్హార పరాగ శోభ – తములో
నన్ తాము స్పర్థించుచున్
నీ కాల్దారుల గొల్చి వచ్చు ప్రగతిన్
నిత్యమ్ము; మా తెల్గు భూ
మీ కామేశ్వరి ! నీ ప్రభుత్వ కృషు లీ
మృష్టాన్న శిష్టోన్నతుల్ !

## 10

కలతలు లేక, తా మొకరి
        కష్ట ఫలమ్ములు దోచ, కందరున్
కలిమిని కాంతినిన్ సమము
        గా గొను, చెల్ల ప్రపంచ మాన వా
ళులకును లక్ష్య జాతిగ తె
        లుంగు ప్రజల్ వెలుగొందు నట్లు అం
కెల గొని, ముద్దుచేసి, కరు
        ణింపుము, దేవి ! సదా రస స్థితిన్ !

## 11

వాణియె తీరవాటిక, భ
        వానియె రాయల సీమ, శ్రీ తెలం
గాణము; పూర్ణ రాజ్య రమ
        గా ముగురమ్మల మూర్తి దాల్చి, గీ
ర్వాణ పథమ్ములన్ కదలి
        వచ్చితి, వేలు కొనంగదే ఇకన్ !
ప్రాణము లొచు మా తెలుగు
        ప్రాలు జగత్ స్థితి కాత్మలై తగన్ !

## 12

ఈ వన వీధు లందు నటి
యించు సదా మధు దేవిగా కళా
దేవి త్వదర్థమై; ప్రగతి
తెర్వులలో వికసించు విప్లవా
రావము కచ్ఛపిన్; తెలుగు
రాజస మందు భజించు నిన్ను ఉ
జ్జీవిత సంస్కృతీ మహిత
శిల్ప మహోదయ సర్వ శ్రేయముల్ !

## 13

పాగా చుట్టి, జలత్రమున్ గొని, వయో
భద్రుండు మా ఆంధ్రు డు
ద్యోగ ప్రౌఢిమ గట్టుపై నిలువగా-
ద్యో వీధి కే ల్మోడ్చి, కృ
ష్ణా గోదావరులన్ మలంచి, నజరా
నా పెట్టదే ! క్షేత్ర గం
గా గార్హస్థ్యము మా కృషీశ్వరుని లో
కారాధ్యు గావింపదే !

## 14

పరమ కవిత్వ మందు ప్రతి
బాలుడు పచ్చని పోతరాజె, సుం
దర వరగాన మందు ప్రతి
తమ్ముడు నిచ్చలు త్యాగరాజె, స
త్వర ఫల దానమందు ప్రతి
వాడును అచ్చపు భోజ రాజె, నే
డరయ నవాంధ్ర మందు ప్రజ
లందరు రాజులె ! రాజ మౌళులే !

## 15

దేశము చుట్ట బెట్టి, తల
దిండుగ పెట్టుక నిద్ర పోవు ఆ
వేశము తెల్గు వానిది; ప్ర
వేశము తక్కువ కార్య నైపుణిన్;
ఏ శిఖరాల పైకి పయ
నించునొ ! ఏ శశికై గమించునో !
ఆశల కళ్లెముల్ కొని, శ్రి
యశ్శివసుందరి ! దారి చూపవే !

## 16

శ్యామల సస్య పుష్కలము,
స్వాదు ఫలోప వనాలయమ్ము, ల
క్ష్మీ మహనీయ నాట్య సర
సీజము, మా విపులాంధ్ర; మీ సుధా
ప్రేమ రసమ్ము క్రోలి మధు
రిల్లుమ్ము, అన్నరసేశ్వరీ! తదా
శా ముకుట ప్రభా లస దు
ష స్సుమన స్సుమనోజ్ఞ శయ్యలన్ !

## 17

రస పూర్ణమ్ము, వసంత ధామము, కళా
రామమ్ము, కల్యాణ కా
వ్య సుమారాధ్యము, భావనా కుహు కుహూ
వాదమ్ము, వాగ్గేయ సా
ర సమారంజిత శింజినీ ఝణ ఝణా
రమ్యమ్ము మా ఆంధ్ర; మీ
వసుధా వేదిక నీది, దిద్దుకొను మం
బా ! మమ్ము నీ ఇచ్ఛమై !

❋ ❋ ❋

# రాధతో ఎగ్జిబిషనుకు

రచన:

బోయి భీమన్న

సుఖేలా ప్రచురణ
హైదరాబాదు

రెండవ ముద్రణ : 1979
ప్రతులు: 1000

హక్కులు రచయితవి
వెల: రూపాయి

ప్రతులకు
సుఖేలా నికేతన్,
ఐ.సి. 85, ఇరంమంజిల్ కాలనీ,
హైదరాబాదు – 500 004
ప్రగతి హైదరాబాదు – 4

# ప్రవేశిక

(మొదటి ముద్రణ, 1970)

"విశ్వ కళా ప్రదర్శనంలో

స్త్రీల ప్రత్యేక దినంలా ఉంది నభం"

చీకటి రాత్రులలో నభో మండలం ప్రదర్శించే దివ్య సౌందర్య హేలను వర్ణిస్తూ నేను "అనాది కొస నుంచి అనంతత్వంలోకి" అనే గద్యకావ్యంలో వ్రాసిన ఈ పంక్తుల్ని మిత్రులు శ్రీ నిడదవోలు సుందరేశ్వర రావుగారు తరచు కోట్‌చేస్తూ ఉంటారు. ఆయన నా ముఖం మీద వాటిని కోట్ చేసినప్పుడెల్లా, నా ముఖం కోటికోటీశ్వరశిరోభూషణ ప్రభలతో వెలిగిపోతూ ఉంటుంది.

కవిని కదా! ముఖస్తుతికి ఆ మాత్రం వికసిత ముఖారవిందుణ్ణి కాకుండా ఎలా ఉండగలను? పైగా – ఆయన అలా కోట్ చేసి – "ఎవరండీ ఈ మాత్రం కవిత చెప్పగలుగు తున్న వారు ఈ రోజుల్లో?" అని ప్రశ్నించినప్పుడు – ఓహో, ఇంకేముంది పారవశ్య దివ్యాశ్వాన్ని అధిరోహించి, ఏడేడు పద్నాలుగు లోకాల సమస్త కళా ప్రదర్శనల్నీ, అందాల ఎగ్జిబిషన్లనీ క్షణంలో చూచి వచ్చేస్తాను భూమి మీదికి.

అలా భూమి మీదికి రాగానే, నాకు అన్నింటికంటే ఆనందాతిరేకాన్ని కలిగించేది – అనుభూతికి అంది, ఆలింగనంలోని ఆత్మేశ్వరిలా, అన్ని రుచులూ తానే అయి, అమృతమే తానై ఆస్వాదింపజేసేది–ప్రతి సంవత్సరమూ హైదరాబాదులో జరిగే ఇండస్ట్రియల్ ఎగ్జిబిషను!

ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అంటే!

మిరపకాయ బజ్జీలు చెయ్యడం దగ్గర నుంచి, శుక్రగ్రహ యాత్రకు రాకెట్లు తయారుచెయ్యడం వరకూ – అన్నీ ఇండస్ట్రీలే. అవన్నీ పరిశ్రమలే. అన్నిటికీ ఆయా రంగాలలో సంపూర్ణ విజ్ఞానమూ, సమగ్ర నైపుణ్యమూ, సనిష్ఠా నిర్వహణమూ అవసరమే. ఈ మూడు తపఃక్రియలతో కూడినదే ఈ ఎగ్జిబిషను!

లక్ష మంది రంభోర్వశుల కంటె ఒక్క ప్రియురాలు శ్రేష్ఠం. లక్ష మంది ప్రియురాండ్ర కంటె ఒక్క లక్షణమైన భార్య శ్రేష్ఠం. లక్ష మంది భార్యలకంటె ఒక్క లక్ష్యం కోసం త్యాగం శ్రేష్ఠం. లక్ష త్యాగాల కంటె ఒక్క ఆత్మానంద పారవశ్యం శ్రేష్ఠం.

ఈ విధమైన ఆలోచనలతో నేను ఒంటరిగాను, జంటగాను, హితమితంగాను, స్నేహ బాహుళ్యంగాను, ఏ విధమైన భావాలతో తిరిగినప్పటికీ ఎగ్జిబిషన్‌లో మైమరచి తిరుగు తున్నప్పుడెల్లా – ఎగ్జిబిషనే విశ్వసమస్తముగా భావిస్తాను. కనుక ఈ సమస్తానికీ నేనే పరమేశ్వరుణ్ని అనుకొంటూ వుంటాను సబ్జెక్టివు (Subjective)గా!

అలా అనుకొంటూ వ్రాసిందే ఈ కవిత.

ప్రతి ఏడాదీ ఎగ్జిబిషను సమయంలో, ఎగ్జిబిషను సొసైటీ వారు – తమ కార్యక్రమ పరంపరలలో – తెలుగు కవి సమ్మేళనం కూడ ఏర్పాటు చెయ్యడం లోగడ పరిపాటి అయింది. ఆ విధంగా అక్కడ తెలుగు సరస్వతికి ప్రతిష్ఠ జరిగింది. అట్టి కవితా సమారోహాలలో ఒకదానికి నేను (1969లో) అధ్యక్షత వహించే భాగ్యం కలిగింది. అప్పుడు నేను గానం చేసిందే ఈ ''రాధతో ఎగ్జిబిషనుకు'' కవిత. దీనిని కుందుర్తి మెచ్చుకొని గోపాలచక్రవర్తికి చెప్పడం, ఆయన హుటాహుటిగా రప్పించుకొని ''ఆంధ్రప్రదేశ్'' పత్రికలో ప్రకటించడం ఆ తర్వాతి కథ.

ఇప్పుడీ కవితను పుస్తకంగా ప్రకటించి, కళాహృదయులందరికీ అంద జేస్తున్నాను. ఇందుకు ప్రోత్సాహం అందజేసిన ఎగ్జిబిషన్ సొసైటీ వారి సారస్వత హృదయానికి కృతజ్ఞత చెల్లిస్తున్నాను. ధ్వని ప్రధానమైన ఈ కవితలోని అందాలను గుర్తించి ఆస్వాదించగల రసజ్ఞు లందరికీ అంజలి ఘటిస్తున్నాను.

ఈ కవితను ఇంకా ఎంతో పెంచవచ్చు. ప్రతి స్టాలును గురించీ ఎంతో వర్ణించవచ్చు. ఎన్నో అందాలను, విలువలను ఆవిష్కరించవచ్చు. ఆ పని తర్వాత.

(రెండవ ముద్రణ, 1979)

''రాధతో ఎగ్జిబిషనుకు'' అనే ఈ కవిత 1970 జనవరిలో వ్రాయబడి, నాటి కవి సమ్మేళనంలో గానం చెయ్యబడి, ఎగ్జిబిషను సొసైటీవారి సహాయంతో

ముద్రించబడింది. మళ్ళీ తొమ్మిదేళ్ళకు ఇప్పుడు పునర్ముద్రించబడుతున్నది - సపరిష్కృతంగా.

ఈ తొమ్మిదేళ్ళలోనూ ఈ చిన్న కవిత నా స్నేహ పరిధిలోని భావుకులు, రసజ్ఞులు అయిన యువతీ యువకులకు కలిగించిన కావ్యానందం కొలత కందనిదే.

మనిషికి కావ్యం ఇవ్వవలసింది కౌగిలిలోని కాంతవలె - ఆనందోపదేశం, ఆనందం కలిగిస్తూ అభ్యుదయం కేసి నడిపించడం.

అట్టి కావ్య గుణం, రసవత్తత ఈ చిన్న కవితలో వున్నదన్నారు సరసులు.

''ఆ కవితా ప్రతులింకా వున్నాయా?'' అన్నారు మిత్రులు జయసేనగారు మొన్న ఒక రోజున – నన్నూ, నా శ్రీమతినీ ఎగ్జిబిషనులో చూచి. మోహనరెడ్డి, చెన్నారెడ్డి, రాంరెడ్డి, రమణరావు మున్నగువారు కూడ అదే ప్రశ్న వేసి, దాన్ని పునర్ముద్రణకు ఇవ్వండీ అన్నారు. అందరూ కూడ ఎగ్జిబిషను సొసైటీ ప్రముఖులే.

ఈ కవిత కాపీలు ఏనాడో అయిపోయాయి.

నాలుగేళ్ళ క్రితం కాబోలు, సభ్యుల కోరికపై, దీన్ని ఎగ్జిబిషను కవి సమ్మేళనలో నేను చదివినప్పుడు, తిరుమల రామచంద్రగారు చమత్కారంగా అన్నారు ''ఇది కొత్త రాధా? పాత రాధా?'' అని.

ప్రతియేడూ ఒక కొత్త రాధ ఎక్కడి నుంచి వస్తుంది? పైగా నా దృష్టిలో తెలియని కొత్తకంటె తెలిసిన పాతే ఇతోధికానందకరం. ప్రపత్తికి అదే మూలం.

''ఎగ్జిబిషనులాగే ప్రతిసారీ కొత్త అందాలు సింగారించుకొనే పాత రాధ'' అన్నా నాయనకు జవాబుగా.

నవ నవోన్మేష రాగ సౌందర్యశాలిని అయిన ఈ సనాతనానంద రసధారతో ఈసారి కూడ ఈ నవకవి సమ్మేళనకు హాజరవుతున్నాను. కవి మిత్రుల, సహృదయ చంద్రుల ప్రశంసా దరహాస సుధా సమాకాంక్షినై. అనుగ్రహింతురుగాక!

భాగ్యనగర్
జనవరి, 1979

బోయి భీమన్న

# 1. అందమైన సాయంత్రం

ఎగ్జిబిషనుకు పోదామా, రాధా?
అందమైన సాయంత్రం కాగూడదు వృథా!

ఉదయం కంటె సాయంత్రం అందమైంది,
ఉదయం క్రాంతి పథం
సాయంత్రం విశ్రాంతి విమానం.
ఉదయం నుంచీ పనిచేసి అలసిన జీవికి
సుభగ సుందర సాయంత్రమే పరమైశ్వర్యం!

అందుకే అలంకరించుకోవాలి
అందంగా సాయంసమయాన్ని–
పౌరోద్యానాల విహారాలతో
సంధ్యారాగ అంగరాగాలతో
సాహితీ సదస్సులతో
సంస్కృతీ విన్యాసాలతో.
పగలంతా పనిచేసిన చెమట కంపును
సాయంకాలపు పూలగాలి కెరటాలలో
కడిగేసుకోవాలి.
కర్తవ్యాల నిర్వహణలో కరిగిపోయిన
మనోదారుఢ్యాలను మళ్ళీ సంతరించుకోవాలి,
సిద్ధం కావాలి
ఆనంద చేతనా సమాలింగనం కోసం!

## 2. రవీంద్ర భారతి

అయితే-
రవీంద్ర భారతికే పోగూడదా?
సంగీత సాహిత్య సుధా పూర్ణకుంభ
కదా ఆమె, అంటావా?

ఎందుకు పోగూడదు?
ఇన్విటేషనే లేదు!

ముతాలు కడితేనే కాని
ముందుకు పోలేని ఈ రోజులలో
ప్రజాస్వామ్యపు వి.ఐ.పీ.ల లిస్టులలో
మనలాంటి పేద కళాకారుల పేర్లుండవు..

విదేశీ సాంస్కృతిక రంభలు యెత్తిపోసే
రంభోరు నైగ నిగ్యపు రుచులు
సచివాలయం సరసులకే తప్ప
కవులకూ, కళాకారులకూ ఎలా తెలుస్తై?
అందుకే ఆ ఆహ్వానాలు మనదాకా రావు!

మొన్నటి రష్యా రంగులకు పిల్చారా?
నేటి కాశ్మీరీ కంగులకు పిలుస్తారా?
అది ప్రజారాజ్య రాజ దర్బారులే,
రాజ బంధువులకే అక్కడ ప్రవేశం!

ఎగ్జిబిషనుకే పోదాం పద, రాధా!
అందమైన ఈ సాయంత్రం కాకూడదు వృధా!

## 3. పంచేంద్రియాలకూ పండగ

ఇరవై పైసలకే అరవై కోట్ల అందాలతో
పంచేంద్రియాలకూ పండుగ చేసే ఎగ్జిబిషన్!
కనిపించే, వినిపించే, తినిపించే, త్రాపించే
ఏ ఆనందానికీ లేదిక్కడ ప్రొహిబిషన్!

చీరలూ, చెప్పులూ, బొమ్మలూ, బొమ్మలూ
మిరపకాయ బజ్జీలూ, పచ్చి చేప వేపుడులూ,
మినీ రైలూ, జెయింటు వీలూ, సినీ షోలూ,
రేడియో కేంద్రంలో తప్పిపోయిన పిల్లల ఏడ్పులూ,

ఇంతేకాదు నిమాయిష్-
ఇంకా ఉన్నై ఇఫ్ యూ విష్!
కాఫీ త్రాగవచ్చు – చేతైతే
కప్పులు జేబుల్లో వేసుకు పోవచ్చు,

ఏడో, మూడో పైసలకు
ఎడారి ఓడలు ఎక్కవచ్చు
రంగుల రాట్నాలపై రాసక్రీడలు నెరపవచ్చు

రగడ తినవచ్చు. చెరకురసం త్రాగవచ్చు
మాయా కుటీరాల్లో మైరేయం ఎఫెక్టు చూడవచ్చు

ముఖాల పోలికలు లేకుండా
ముప్పావులా ఫోటోలు తీసుకోవచ్చు!

చీరకొంగు పిండుకొంటున్న ఆ సింగారి చిత్రం చూడు!
కేలండరు ఉచితం, జోడు ఖరీదు మాత్రం పదిహేడు!
ముత్యపు చిప్పలో ఆ మౌక్తిక మోహిని!
కేలండరైతేనేం, కళ కుంటే ఒక బాణీ!

## 4. యావత్ భారతానికే అద్దం

కాశ్మీరీ కనకాంబర చుంబి శిరస్ ఝరీ అంచుల్లో
కన్యాకుమారీ చలచ్చరణ శంఖారవ హారాల్లో
లక్నో చికిన్ జిలుగుల్లో, రాజస్తాన్ హర్యానా
తళుకుల్లో, అస్సాం బెంగాల్ పింగాణీ హంగుల్లో
కన్నడ రమా, పంజాబీ ఉమా ఆడే
చెమ్మ చెక్క ఆటల గలగలల్లో,
గంగా, యమునా, కావేరీ కాంతలు
అలంకరించుకొన్న రక రకాల
తెలుగు చేనేత సింగారం రంగుల్లో
యావద్భారతమూ ఒక అద్దంగా-
యావద్భాషామతల్లులూ తల్లులై తీర్చి దిద్దగా
కొండవాగుల్లా, కోడె నాగుల్లా,
రాజహంసల్లా, రామ చిలుకల్లా,
అలా అలా ఆ కదిలిపోయే అమృతరూపాలు-
ఆనంద దీపాలు - చూస్తేనే చాలు!

వికసించవా కన్నుల్లో
వేయి బృందావనాలు!
తారల్ని మించిన లైట్లు, చీరల్ని మించిన సైట్లు,
ఈ రంగులూ, రుచులూ, హంగులూ, హాబీలూ
ఏ మేడలలో మోడలు దిద్దుకొన్నవో చూడు!
ప్రతి స్టాలూ ఒక మెరుపుల వీడు!
ప్రతి మెరుపూ నీ ఈడు,
ప్రతి ఈడూ మన జోడు,
ప్రతి జోడూ ఒక అర్ధనారీశ్వరుడు!

## 5. కన్యల వెంట తేళ్ళు

మిథునాల వెంట పీతలూ, సింహాలూ,
కన్యల వెంట చలితేళ్ళూ-
మోచేతులే ధనుర్బాణాలైన మానినీ మకరాలు-
బూటు కాళ్ళతో కాళ్ళు తొక్కుకుపోయే
పొగరు పొట్టేళ్ళు, అచ్చులేని ఆబోతులు-
రాశులు రాశులుగా పోతున్నారు చూడు!

రాసుకొంటూ దూసుకువస్తున్నారు చూడు!
సిగరెట్ల పొగమబ్బుల్లో, పరిహాసపు జడివానల్లో
నాజూకైన కుర్రవాళ్ళు నవ్వుకొంటూ పోతుంటే-
వాళ్ళ నీడల్లో చూశావా-
నక్కిన నల్లత్రాచుల్ని?
ఉష్ణకాంతుల క్రీనీడల్లో
బుసకొడుతున్న విష తమస్సుల్ని?

గ్రహబలం సమస్తం నీ ముందే ఉంది?
ఎవడు మనిషో, ఎవడు పామో-
చూచుకొంటూ, కాచుకొంటూ పద!

## 6. ప్రతి స్టాలూ ఒక మయసభ

అదిగో, వ్యవసాయ శాఖ వారి ప్రదర్శనం,
మన పెరటి తోటకు విత్తనాలు కొందాం.

చూశావా మన ప్రాజెక్టుల ప్రగతి?
రైల్వేల పురోగతి!
పెద్ద చిన్న గృహ కుటీర పరిశ్రమల సుగతి?

నిర్మల్ కళాఖండాలు, మైసూరు చందన సౌందర్యాలు!
ఆనంద స్వర్గాలు కావా
ఈ ప్రతిస్టాలూ ప్రదర్శించే శ్రీలు?
చోర కళాప్రపూర్ణు డెవడో
చేతి రుమాలు కొట్టాడు చూడు !

కారాగృహవాసికే కదా ఏదో దేశంలో
కవిత్వానికి బహుమతీ వచ్చింది మొన్న?

కాని పనులకు అత్తిల్లేకాదు జైలు గది-
ఎన్నో కళలకు పుట్టిల్లు కూడా అది!
శ్రీకృష్ణ జన్మ స్థానం
సమస్త సౌభాగ్యాలకూ ఆస్థానం!

ఒక్కొక్క స్టాలూ చూడాలంటే-
ఒక్కొక్క రోజు కూడా చాలదు,
రెండు వేల స్టాల్సు చూడాలంటే
రెండు వందల రోజులైనా కావద్దా?

ఏడాది పొడుగునా సాగవలసిన ఇంద్ర సభ
నలభై రోజుల మండలానికే
మయ సభగా ముగియడం ఏం న్యాయం?
అమృతం లాంటి చంద్రబింబం నుంచి
అమెరికా వాళ్లు రాళ్లు తెస్తూ ఉంటే-

పాతాళపు రాళ్ల పొరల్లో నుంచి
అమృతం తెస్తున్నారు మనవాళ్లు!
చూడు ఆ ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాలు!
పల్లె పల్లెకు పయనిస్తున్న ఆ రిగ్గులు
పాతాళ గంగాధరుడి వేడుక విగ్గులు!
లక్ష్మీ సరస్వతుల తొలి కలయిక సిగ్గులు!

# 7. ఆరు కోట్ల దేవతలు

తెలుగు వెలుగుల్లోని దేవత లంతా
కొలువుతీరి ఉన్నారిక్కడ దేవస్థానం దర్బారులో!

కైలాస శిఖరం మీది శివుని మాసిన తల నుంచి
వైకుంఠం మీదుగా, సత్యలోకం దాకా-
తిరుమల, కాళహస్తి, శ్రీశైలం, మహానంది,
అహోబిలం, ఓంకారం, లేపాక్షి, సింహాచలం,
అన్నవరం, ద్రాక్షారామం, అంతర్వేది, భద్రాచలం
బెజవాడ, యాదగిరి, వేములవాడ, అలంపురం,
రామప్ప, కాళేశ్వరం, ఓరుగల్లు-
ఎన్నెన్నో మహాక్షేత్రాలను ఆవిష్కరిస్తూ!
గోదావరి తీరంలో, వాసర క్షేత్రంలో
వెలసిన జ్ఞాన సరస్వతిని చూడు!
నమస్కరించి కుంకం తీసుకు నడు!
మన దేశంలో ఇదొక్కటే సరస్వతీ క్షేత్రం
ఈ మహాశక్తే లేకుంటేనా-
ఇక్కడ మనకు పప్పు కూడ పుట్టేదేనా?
ఇక్కడి క్యూతో సరితూగే క్యూ - ఏమిటది?
ఓహో, అది డాల్స్ (బొమ్మల) ప్రదర్శన కదూ!
భగవంతుడి రాజ్యానికి యువరాజులు బాలలు!

చూదాం పద, ఆ పౌరాణిక చారిత్రక లీలలు!
జగన్మిథ్యగా వున్న అభ్యుదయాన్ని
ఫోటోలలో అయినా దర్శించి తరిద్దాం!
ఓహో వెంకటేశ్వర సుప్రభాతం!
చూడు ఆ చిత్రశాల శ్రీ వైభవం!
సచ్చిదానంద సుందర వైకుంఠ శోభను
రంగుల్లో పట్టిచ్చిన శ్రీధర్ కళాప్రతిభను!
వట్టి ప్రతిమలే కదా అనుకోవద్దు
ఒకో ప్రతి ఒకో గుండెకు ప్రతిరూపం!
ఒకో రసానికి ప్రతి ఫలం!
ఒకో భావానికి ఆదర్శం!
తీసుకో ఒక చిత్రం,
అది లేకుండా కాదు గృహం పవిత్రం!

## 8. రంగు రంగుల సాలెగూళ్లు

అటు చూడకు - అది మోడరన్ ఆర్ట్,
కళా రామాయణంలో అదొక పీడకల వేట!

అటు వెళ్ళకు - అది గాంధీ సాహిత్యపు స్టాలు,
స్వరాజ్య బహుపక్ష కురుక్షేత్రంలో అది అరణ్యరోదనం!
ఆ ప్రక్క బుక్‌స్టాల్స్ అన్నీ మనం ఎరిగినవేగా?
సృజనాత్మక తెలుగు సాహిత్యానికి లేదక్కడ స్థానం!
కాగా-
మన పుస్తకాలేం వుండవక్కడ!
ఎవరి పార్టీ నినాదకుల్ని వాళ్ళు
ఎవరి భజన మండలుల్ని వాళ్ళు
ఎవరి అభిమాన పాత్రధరుల్ని వాళ్ళు
కనకపు సింహాసనా లెక్కించుకునే
విపణి ఫణ మణి వీధు లవి!
మత మంత్ర తంత్రాంగాలు తెలిసిన వాళ్ళం కాం మనం
అందుకే ఆ గాలి మనకు ప్రమాదకరం!

అలా చూస్తున్నా వేమిటి?
అవి చీరలు కాదు, పాము కూసాలు!
పైసల ఈగల కోసం అల్లిన
రంగు రంగుల సాలెగూళ్లు!
కొనలేని వాళ్ల గుండెల్ని కాల్చి కరిగించే
కోరికల కన్నీళ్లు!
అవిగో అవి గోల్డు కవరింగుల పూత మెరుంగులు
వాటిని నీవు చూస్తే
అందరూ నిన్ను చూస్తారు!

## 9. ప్రగతి దర్శనం

అలా చూడు ఆ భారత దర్శనం!
అది ఒక తరం స్వతంత్ర భారతం
సాధించిన ప్రగతి ప్రదర్శనం!

జనాభాలో సగం మంది స్త్రీలు
ఎగ్జిబిషన్‌లో సగానికి సగం చీరెలు!

శాసన సభల్లో సంసారాల్లో జరగని న్యాయం
పితృ ప్రేమలో, పిత్రార్జితంలో
నిషేధించబడిన సమతా ధర్మం
వనితల కిక్కడ జరుగుతున్నది, చూడు!

అలా పద, ప్రభుత్వ ప్రదర్శన శాలల్లోకి!
అవే నిజమైన జాతి ప్రగతి దర్పణాలిక్కడ!
వాటిలో నీ ముఖాన్ని చూచుకొంటూ,
మన ఇరుగు పొరుగు శ్రీమంతుల
అమెరికా రష్యా వదనబింబాలతో పోల్చుకొంటూ,
లోపాలు సరిదిద్దుకొంటూ, పద!
లోపమేదైనా వుంటే-

అది అద్దానిదో, నీ ముఖానిదో చూపే
ఆధునిక దర్శనం ఈ ప్రదర్శనం!

దీన్ని ఎవరు ఎప్పుడు ప్రారంభించారో
ఆ మానవతా మహర్షులకు అంజలి ఘటించు!
అటు "హుడా" కేసి పోదాం, పద!
స్వప్రయోజక భూస్వాము లెంత నిరోధిస్తున్నా,
నగరాభివృద్ధి శాఖ చేస్తున్న పని అనిరుద్ధం!
మురికి పేటల్ని నిర్మూలించి అది నిర్వహిస్తున్న
నాగరిక గృహ నిర్మాణ క్రియ నిహత సకర్మకం!

# 10. విద్యా మహా సరస్వతి

అటు పద, ఆ ఎగ్జిబిషను క్లబ్బు కేసి!
బేడ్జీ లేకుండా రానివ్వ రంటావా?
క్లబ్బు సభ్యులంతా మన మిత్రులే లే!
కళాకాంతుల జగన్మిత్రులు వాళ్ళు.

ఈ ప్రదర్శన ఏర్పాట్ల సమస్త విశ్వానికీ
కేవల బ్రహ్మకల్పులు!

వనితల కోసం వనితా మహా విద్యాలయాలు,
పాలిటెక్నిక్‌లు, విజ్ఞాన కళాశాలలు,
ఆధునిక విద్యా వికాస మందిరాలు,
ఒక్క భాగ్యనగరంలోనే కాదు-
రాజ్యం పలు ప్రాంతాలలో నిర్వహిస్తున్న
జ్ఞాన సరస్వతీ ప్రతిమూర్తులు!

ఇక్కడ మనం ఖర్చుచేసే ప్రతిపైసా
ఆ మహా సరస్వతి నొసట
ఒకో కస్తూరీ కుంకుమ తిలకం!
పుష్ప ప్రదర్శనలు, ఫల ప్రదర్శనలు,

పశు ప్రదర్శనలు, క్రీడా ప్రదర్శనలు,
సాంస్కృతిక ప్రదర్శనలు
కేవల ఆత్మోత్తేజకా లేనా?
యావత్ జాతికీ మార్గదర్శకాలు కావా?
ఈ ఎగ్జిబిషన్‌ను దర్శించడం
మనల్ని మనం గుర్తించడం!
భారత మహా మహత్ బ్రహ్మను
అణువులో పొదిగి ఆరాధించడం!

# 11. మానవ సౌందర్య మహార్ణవం

ఎన్నో అందాలు, చందాలు, అమృతాలు
ఆస్వాద్యాలు, అనుభవాలు, అభ్యుదయాలు!
ఈ సంతోష సౌందర్యాలన్నీ ఎందుకోసం?
నీ కోసమూ, నా కోసమూ!
నీ లాంటి నా లాంటి మనందరి కోసమూ!
ఎన్ని సౌందర్యాలైనా మానవ సౌందర్యాన్ని మించవు!
మానవ సౌందర్య మహార్ణవం ఈ ప్రదర్శనం!

ఎంత అందమైన, ఖరీదైన చీరైనా
దానిని కట్టుకొన్న కాంతను మించదు కదా?

క్లబ్బులో కొంచెం ఐసుక్రీం తిని
అక్కడ జరుగుతున్న కవితా గానం విని,

ఆ అటవీశాఖలో ఒక సీసా తేనె తీసుకొని,
ఆ మహిళా విభాగంలో పాపకు ఒక గౌను కొని,
మత్స్యశాఖ స్టాల్లో ఒక పార్శిలు చేపలు విలుచుకొని
పోదాం పద, అయిందప్పుడే పది!
తొమ్మిదికే మూసేసే రూలున్నా-

పన్నెండు దాటుతూనే వుంటుంది రోజూ!
రూల్సుకు కట్టుపడే పూల్సు
ఎంత మందీ నరమానవుల్లో?
ఆ సంగతులన్నీ మనకెందుకు కాని,
అలా చూడు పైకి!
స్వర్గంగా తీరంలో చల్లని పచ్చికబయళ్ళలో
గోమాతలు పిలుస్తున్నై కాదా, రాధా!


ఈ భూమ్యాకాశాల వెలుగు నీడల ఎగ్జిబిషన్లు
నీ అందచందాల చెక్కుటద్దాల రిఫ్లెక్షన్లు!

కొత్తదేం కాదు ఈ నిమాయిష్ తమాషా
నీలో నేను చూస్తున్నదే ఇది హమేషా!

ఇది మినీ జగత్తు,
మనీ అగరొత్తు!

అయినా, ఇది భాగ్యనగరం
భాగ్యమతీ భూషణాగారం!
త్రోవలో ప్రతి స్టాలునూ తొక్కి చూద్దాం,
ప్రతి అందాన్నీ అనుభవిస్తూ పోదాం!

❋ ❋ ❋


భీమన్న
ఉగాదులు

ప్రథమ ముద్రణ

ముద్రణ

1983

పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్

హైదర్‌గూడ, హైదరాబాద్-1

హక్కులు రచయితవి

వెల: రూ॥ 18-00/-

ప్రతులకు

1. ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001

2. సుశీలా నికేతన్

ఐ.సి. 85, ఇర్రం మంజిల్ కాలనీ

హైదరాబాద్- 500 004

# వసంత వేదిక

నేను కవిగా గొంతు విప్పినప్పటి నుంచి, కవిగా కలం పట్టినప్పటి నుంచి, కవిగా వెల్లడైనప్పటి నుంచి, ఇంతవరకూ వందలకొలది వసంత కవితలు, డజన్లకొలది ఉగాది కవితలు వ్రాసి ఉంటాను. వసంత రుతువు ప్రారంభమూ, తెలుగు సంవత్సరారంభమూ ఒకటే తెలుగు వాళ్లకు.

తెలుగు సంవత్సరాదిని ఉగాది అని కూడా అంటారు. నా చిన్నప్పుడూ, మా ప్రాంతంలోనూ సంవత్సరాది అనేదే వ్యవహారం. నేను కాలేజీకి వెళ్లే వరకూ ఉగాది అనే మాటను నేను వాడలేదు.

మొత్తం మీద నా వసంత కవితలన్నీ ఉగాది కవితలే. ప్రత్యేకంగా ఉగాది అని పేరు పెట్టి వ్రాసిన కవితలు మాత్రమే డజన్ల కొలదీ వుంటాయి. అవి ఎక్కడెక్కడో వుంటాయి. నా సాహిత్యోద్యానంలో వెతికితే అక్కడక్కడ దొరుకుతాయి.

అయితే ఆ మధ్య నాకొక చిత్రమైన భావం తట్టింది – నా ఉగాది కవితలన్నీ కలిపి ఒక సంపుటిగా వేస్తే బాగుండదా అని. ఉగాదులన్నీ ఇంచుమించు ఒకే రూపంలో వుంటాయి. కనుక, ఉగాది కవితలలో కూడ సారూప్యత ఎక్కువ వుంటుంది. కనుక అవన్నీ కలిపి ఒకచోట చేరిస్తే, వైవిధ్య లోపంవల్ల బోరు కొడతాయేమో కదా!

పైకి ఒకేలా కనిపించినా, సూక్ష్మ పరిశీలనకు దేని వ్యక్తిత్వం దాని కుంటుంది. సరసులకు, సహృదయులకు, సాహితీ ప్రియులకు, విద్యాంసులకు అందులోని వైవిధ్యం అర్థమవుతుంది. కనుక బోరు కొట్టడమనే ప్రమాదం వుండదు. దేని వ్యక్తిత్వం దానిది. ఒకేలా కనిపించే కవలలకు సహితం ఎవరి బ్రతుకు వారిదే కదా!

అందువల్ల నా ఉగాది కవితలన్నిటినీ చేర్చి ఒక సంపుటిగా ప్రకటించాలన్న నిర్ణయానికే వచ్చాను. అలా ఒక నిర్ణయానికొచ్చాక, వెదికి చూస్తే కొన్ని మాత్రమే దొరికాయి. అందులోనూ కొన్నిటికి సంవత్సరాల పేర్లున్నాయి. కొన్నిటికి లేవు. సంవత్సరాల పేర్లతో ఉగాది కవితలుగా వున్నవాటిని తరచూ ఎవరికోరిక మేరకో

ప్రత్యేకంగా వ్రాసి వుంటాను. పత్రికలకో, కవి సమ్మేళనలకో, ఆకాశవాణికో. అటువంటి సందర్భాలకోసం వ్రాసిన వాటి కాపీలు సాధారణంగా నా దగ్గర వుండవు. నాకు నేను వ్రాసుకొనే కవితలు తప్ప, మరేదో ప్రత్యేక ప్రయోజనాన్ని ఆశించి వ్రాసిన కవితలను నేను శ్రద్ధగా భద్రపరచుకొనే అలవాటు నాకు లేదు.

ప్రక్రియ పరంగా చూస్తే నా కవిత నాలుగు విధాలు. పద్యం, గేయం, వచనం, వచన (గద్య) కవిత. ఈ నాలుగు ప్రక్రియలలోనూ నా ఉగాదులున్నాయి.

కాలం నిత్య సంతోషి. నిరంతర పురోగామి. దానికి అన్ని ఋతువులూ సమానమే. దానికి ఏ అవస్థా లేదు. మన అవస్థలను దానికి ఆపాదిస్తాం. ఎండ, వాన, శీత కాలాలను మన యౌవన, ప్రౌఢ, వృద్ధాప్య అవస్థలతో పోల్చుకొంటాం. మన సుఖదుఃఖాలనే ప్రకృతిలో ప్రతిబింబాలుగా దర్శించుకొంటాం. అంతే.

మన భూగోళం మీద కాలానికి ప్రత్యక్ష కర్తలు ఇద్దరు. సూర్యుడు, చంద్రుడు. ఈ ఇద్దరిలో సూర్యుడు సార్వభౌముడయితే, చంద్రుడు స్వతంత్రించిన సామంతరాజు. అనేక జాతుల ప్రజలు డైరెక్టుగా సూర్యపాలన క్రిందే వుండగా మన తెలుగు, కన్నడ, వంగ, కాశ్మీర వంటి జాతుల వాళ్లు చంద్రపాలనను అభిమానిస్తున్నారు. అందుకే వీళ్ళ కాలం చంద్రుణ్ణి బట్టి వుంటున్నది. కొందరికి పూర్ణిమ నుంచి పూర్ణిమకు మాసమైతే, మరికొందరికి అమావాస్య నుంచి అమావాస్యకు మాసం. మన తెలుగు వాళ్ళ సంవత్సరారంభ మాసం, అదే చైత్రమాసం, ఫాల్గుణ బహుళ అమావాస్య మరునాటి నుంచి మొదలవుతుంది. ఆ దినమే మన ఉగాది.

సూర్యచంద్రుల కాలగతులలో తేడా లుండటంవల్ల, చాంద్రమానాన్ని అనుసరిస్తున్న మనకు ఋతువుల ప్రకృతి ధర్మాలలో కొన్ని వైరుధ్యాలు కనిపిస్తావున్నై. నా దృష్టిలో వసంతోదయం ఫాల్గుణ పూర్ణిమ (కామ పూర్ణిమ, హోళి)తోనే జరుగుతుంది. మన దేశం మొత్తం మీద వసంతారంభం అదే. వసంతాగమనంతో విజృంభించి వచ్చిన కాముణ్ణి శివుడు దహించిందానాడే. దహించినా, రంగు రంగుల వసంతా లాటలు, వేడుకలు, యౌవనోత్సాహాల సంరంభాలు లోకానికి తప్పలేదు. కాముడు చావనూ లేదు. పైగా, విశ్వరూపం ధరించాడు!

మన కాలమానంలోని ప్రభవ విభవాది అరవై సంవత్సరాల పేర్లతోనూ అరవై ఉగాదులూ వుంటాయి. ఈ నా సంపుటిలో అన్నీ చేరలేదు. చేర్చబడ్డ ఉగాదులకు రకరకాల శీర్షికలు పెట్టాను. ఇవి కూడ ఒక వరుస క్రమంలో వుండకపోవచ్చు. దేనికదే స్వతంత్ర సమగ్ర కవిత అనే సత్యం సహృదయులకు తెలుసు.

నేను కవిగా కళ్లు తెరిచి చూచిన ఉగాది బహుశా దుందుభి (1922). అంతకు ముందు పదేళ్ళ క్రితం నేను విరోధికృత్ (1911 సెప్టెంబరు)లో పుట్టాను. నేను పుట్టిన తరువాత వచ్చిన మొదటి ఉగాది పరీధావి. నా 11వ ఏట దుందుభి ఉగాది నుంచి నా కవితా ప్రస్థానం ప్రారంభమయిందనుకొంటే, మళ్లీ మొన్న దుందుభి ఉగాది 1982 ఏప్రిల్‌లో వచ్చి, నా చేత కవిత వ్రాయించుకొంది. అంటే ఆ ఉగాదితో ఉగాది కవితా షష్టి పూర్తి కూడా అయిందన్నమాట. 1983 ఏప్రిల్ 14న వచ్చిన రుధిరోద్గారి ఉగాదిని కూడ ఇందులో చేర్చగల్గడం నా అదృష్టం.

ఇదొక తమాషా సంపుటి, నా ఇంటి తోట, నేను ఆనందించే పరమ వసంతం, నేను ఆరాధించే మహా సరస్వతి. మీకూ హృదయోల్లాసకం కాగల్గితే ధన్యుణ్ణను కొంటాను.

## కొన్ని వివరణలు

ఈ ఉగాదులు వరుసక్రమంలో లేవు. లేకపోయినా పరవాలేదు - దేనికదే స్వతంత్ర కవిత కనుక. ఇందులో నా అన్ని ఉగాది కవితలూ లేవు. న్యాయంగా చూడాలంటే ఇందులో 62 ఉగాది కవితలుండాలి. 1922 నాటి దుందుభి ఉగాది నుంచీ కవిత వ్రాయడం ప్రారంభించాననుకొంటే, నేను ఆనాటి నుంచీ కవిత వ్రాస్తూనే వున్నవాణ్ని కనుక అన్ని ఉగాదులూ ఇందులో వున్నట్టే భావించవలసి ఉంది. నిరంతర పరిణామ శీలమైన సృష్టిలో ప్రతిక్షణమూ ఒక ఉగాదే నా దృష్టిలో.

ఉగాది అనగానే వేపపువ్వు, మామిడిపిందెలు, కొత్త చెరకు మొదలైనవన్నీ వుంటాయి. మనకు ఉగాదే వసంతారంభం కనుక వసంత రమణీయతలన్నీ వుంటై.

ఇవన్నీ అన్నీ ఉగాదులకీ సమానమే. నా ఉగాదులలో ఈ వర్ణనలు కాక, దేశకాల పాత్రలకు సంబంధించిన సమస్యలూ, విమర్శలూ, పరిష్కార సూచనలు కనిపిస్తూ వుంటై. వాటిని సహృదయులు గుర్తించగలరు.

ఉదాహరణకు – బాంగ్లా యుద్ధ విజయం తరువాత కొద్ది సంవత్సరాల పాటు మన దేశంలో ఎమర్జెన్సీ విధించబడింది. ఆ కాలంలో కొన్ని ఉగాదులొచ్చాయి. అప్పటి పరిస్థితుల కనుగుణంగా ఆయా ఉగాది కవిత లుంటై. ఏదైనా ఒక సంఘటన మంచిదా, చెడ్డదా అనేది ప్రధానం కాదు. ఏదీ పూర్తిగా మంచిదిగానూ వుండదు, చెడ్డదిగానూ వుండదు. కొందరికి మంచిదైతే, మరికొందరికి చెడ్డది అవుతుంది ఏదైనా. మనం ప్రధానంగా చూడవలసింది అట్టి సంఘటన చరిత్రలో ఒక భాగమా కాదా అనేది. ఎమర్జెన్సీ చరిత్రలో ఒక భాగమే. అందుకే ఆ కాలంలోని ఉగాదులకు అందుకు తగిన గుణానుభూతులు వుంటై.

మన దేశాన్ని కులమతాతీత శ్రేయోజాతిగా రూపొందించాలంటే సర్వజనీన సమాదర్శంకల ఎమర్జన్సీ లాంటి పరిపాలనే తగి వుంటుందని నా విశ్వాసం. ఎమర్జెన్సీని బడుగు వర్గాల అభివృద్ధికి, దుష్ట శిక్షణ శిష్ట రక్షణకు ఒక అవశ్య కర్తవ్యంగా భావించాను. భగవంతుడి అవతారాలన్నీ ఇలాంటివే కదా! దుష్ట విజృంభణలతో లోకం తల్లడిల్లిపోతున్నప్పుడు భగవంతుడు సందర్భానికి తగిన ఏదో ఒక అవతారం ఎత్తేవాడు. దుష్ట సంహారంచేసి, లోక సంక్షోభాన్ని మాన్పేవాడు. ముప్పై ఏళ్ల స్వరాజ్య పాలనలో కూడ ధనిక వర్గ దోపిడీ తగ్గకపోతే, పేద వర్గాలకు అభ్యుదయం కలగకపోతే, పరిస్థితిని అదుపు చెయ్యడానికి ఎమర్జెన్సీని విధించడం కంటె గత్యంతరం ఏముంది? ఈ ఆలోచనా ధోరణితో ఆనాటి నా ఉగాది కవితలు నడిచినై. నేను వూహించినట్లు జరిగిందా, లేదా అంటే అది వేరే విషయం. ఊహించడం వరకే కవిచేయగల పని. దాని అమలు విజ్ఞతగల రాజకీయ పార్టీల చేతిలో వుంది.

సిసలుగా, స్వేచ్ఛగా వూహించగల అవకాశాలు కవికి లభింపచెయ్యాలి. కవి వూహలను ప్రజాభ్యుదయం కోసం ప్రభుత్వాలు వాడుకోవాలి. ఇదీ నా సిద్ధాంతం.

అలాగే డాక్టరు చెన్నారెడ్డి గారు ముఖ్యమంత్రిగా వుండగా ఉగాది ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. అప్పటి నా ఉగాది కవితలు అందుకు సంబంధించి వుంటై. మొత్తం మీద నా ఉగాదులు ప్రకృతి ధర్మాలనే కాక కాలవైపరీత్యాలనూ, దేశ పరిస్థితులనూ, అధి నాయక ప్రభావాలను కూడ ప్రతిబింబిస్తూ చారిత్రక మైనట్టివిగా కూడ వుంటై. ఈ సత్యాన్ని సహితం సహృదయులు గమనించగలరు.

## కవిత్వపోషణ బాధ్యత

లతా, వనితా, కవితా ఇవి ఏదో ఒక ప్రాపు, ఆశ్రయం లేకుండా రాణించవు. ఇది సార్వకాలిక సత్యం.

వివిధ లలిత కళలూ, సాహిత్యమూ, శాస్త్ర విజ్ఞానమూ మొదలైన మానసిక కృషికి సంబంధించిన అంశాలన్నిటినీ సౌలభ్యంకోసం ఇక్కడ కవిత కిందనే పేర్కొంటున్నాను. కవిత్వమూ, సంగీత నృత్య నాటక చిత్రలేఖనాది లలితకళలూ, గణిత వైద్యాది శాస్త్ర విజ్ఞానమూ – ఇటువంటివన్నీ కూడా ఆలోచన ప్రధానమైనట్టివి. సృజనాత్మకమైనట్టివి. లౌకిక, భౌతిక విషయాలవలె కాక ఈ మానసిక విషయాలకు ధ్యానం, ఏకాగ్రత, తపస్సూ తప్పనిసరి. అందుకే వీటన్నిటినీ యోచనా ప్రధానమైన కవిత కిందకు చేర్చి పేర్కొంటున్నాను.

వేదకాలం నుంచీ కూడ కవిత రాజాశ్రయంలోనే పెరిగింది. ప్రకృతి రహస్యాలను పట్టి పైకి తీయవలసిన కవి, అభ్యుదయం కోసం వాటిని ప్రజలకు అందించవలసిన కవి నిరంతరం ధ్యానంలో, మననంలో సమాధిగతుడై కూర్చోవలసి వుంది. ఏకాగ్రత చెదరకూడని పరిస్థితి.

మరి, అట్టి తపస్వికి తిండి లభించడమెలా? మరెవరో సమకూర్చి పెట్టవలసి వుంది కదా! వేద పురుషులు అరణ్యాలలో ఆశ్రమాలు కట్టుకొని, కంద మూల ఫలాదులతో బ్రతికేవారు. వాటిని శిష్యులు సేకరించి తెచ్చేవారు. రాజులు ఆశ్రమ రక్షణ చేసేవారు. అవసరాలు తీరుస్తూ వుండేవారు. అందుకే, ఆనాడు ఋషులకు తిండి సంపాదన బెంగ లేనందువల్లనే, అంతలేసి మౌలిక సాహిత్యాలూ, విజ్ఞాన

రహస్యాలూ వెలుగు చూడగలిగాయి. వేదాలు, ఉపనిషత్తులు, సంగీతం, నాట్యం, ఆయుర్వేదం, ధనుర్వేదం, గణితం మొదలైనవన్నీ ఒక్క తపస్సు తప్ప మరే బెంగా, ఏ బాధా, ఏ భయమూ లేని రుషులవల్లనే పుట్టి పెంపొందడం జరిగింది.

కావ్య ప్రబంధ యుగాలలో కూడా కవిత రాజాశ్రయంలోనే పెరిగింది. రాజ్య రక్షణ, పరిపాలన, వాణిజ్యం, వ్యవసాయం, పరిశ్రమలు మొదలైన భౌతిక విషయాలలో అధిక సంఖ్యాకులైన ప్రజలు నిమగ్నులై వుంటారు. ధ్యాన పరమైన ఆధ్యాత్మిక విషయం ఒక్కటీ ఏ కొద్ది మంది మేధావులనో వరించి వుంటుంది. అట్టి కొద్ది మంది మేధావుల కృషి ఫలితమైన ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సంపద మొత్తం జాతికంతకూ ఉపయోగ పడుతున్నప్పుడు, మొత్తం జాతి ఉత్పత్తి చేస్తున్న భౌతిక సంపద మేధావికి ఎందుకు ఉపయోగించబడదు?

కవిది ఆధ్యాత్మిక కృషి. వైజ్ఞానిక పరిశోధన. అతని కృషి ఫలితం జాతి సంస్కారాన్నీ, సంస్కృతినీ, ప్రగతినీ, నైతిక స్థాయినీ పెంచుతుంది. ఆనందాన్నిస్తుంది. అట్టివాడికి తిండి పెట్టవలసిన బాధ్యత జాతికి లేదా? ప్రతి వ్యక్తి ఏదో ఒక పనిలో నిపుణుడై వుంటాడు. అందరి పనుల ఫలితాన్నీ ఉమ్మడిగా అనుభవించవలసి వుంది. గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతంలోని ఉద్దేశమిదే కదా?

ఆనాడు రాజులు పోషించిన కవిత్వాన్నీ, కళలనూ ఈనాడు ప్రజా ప్రభుత్వాలు పోషించవలసి వుంది. ఆనాడు రాజుల డబ్బూ ప్రజల నుంచి వచ్చిందే. ఈనాడు ప్రభుత్వాల డబ్బూ ప్రజల నుంచి వస్తున్నదే. తేడా ఏమీ లేదు. కవిత్వమూ, కళలూ తమ ఆరాధన తప్ప మరొక వ్యాపారాన్ని చెయ్యనివ్వవు. కవి ధన సంపాదన కోసం రాజకీయమూ, వ్యాపారమూ నడిపితే కవిత్వం పోతుంది. ఆనాడూ, ఈనాడూ, ఏనాడూ కూడా ఇది పరమ సత్యం. అందుకే ధనవంతులు, ప్రధానంగా ప్రభుత్వం కవులను, కళాకారులను పోషించక తప్పదు. ఈనాటి ప్రజాస్వామికంలో ప్రజల కష్టార్జితం చాల వరకు రాజకీయ నాయకుల చేతుల్లో వుంటున్నది. ధనం మీద పెత్తనం వాళ్లదే. భోగభాగ్యాలు, గౌరవ సన్మానాలు, లావుపాటి దండలు, బరువైన పర్సులు, ట్రస్టులు,

స్మారక చిహ్నాలు, నిలువెత్తు విగ్రహాలు, అన్నీ వాళ్లకే ప్రత్యేక హక్కులుగా వుంటున్నై. జాతి నైతిక జీవనస్థాయిని ఉన్నతంగా నిలపవలసిన బాధ్యత మాత్రం కవులది! వీళ్లకు జాతి సంపదపైన ఏ హక్కూ లేదు.

ఈ దుర్మార్గం మారకుండా ఈ జాతి ఆదర్శమార్గంలో ఎలా పురోగమించ గలుగుతుంది?

## అంకితాలు-చరిత్ర

రాజుల కాలంలో కవులు తమ కావ్యాలను రాజులకు అంకిత మిచ్చేవారు. అందులో ఆయా రాజుల వంశాలనూ, విజయాలనూ వర్ణించేవారు. అది ఒక మాదిరిగా ఆయా రాజుల సమకాలీన చరిత్ర వ్రాయడం లాంటిది. ఆ కాలంలో రాజుల చరిత్రే రాజ్యాల చరిత్ర, దేశ చరిత్ర. అది కవులు తమ కావ్యాంకితాల ద్వారా చేసేవారు. తమ రచనల ద్వారా ప్రజా జీవితంలోని ఆధ్యాత్మిక రంగాన్ని సుసంపన్నం చేసే అట్టి కవుల బ్రతుకు తెరువుకోసం ఆయా రాజులు శాశ్వతమైన ఏర్పాట్లే చేసేవారు – పెద్ద పెద్ద మొత్తాలలో ధన కనక వస్తు వాహనాలను ఇవ్వడం ద్వారానూ, మాన్యాలనూ, అగ్రహారాలనూ బహూకరించడం ద్వారానూ. అటువంటి ఏర్పాట్లను ప్రభుత్వాలు కూడా చేయవలసి ఉంది. అగ్రహారాలు కాకపోతే, వాటికి నేటి ప్రత్యామ్నాయమైన ఏర్పాట్లు – ఎడతెగని ఆదాయం వచ్చే జీతభత్యాలు లాంటివి. లేకపోతే మానవుడు అభ్యుదయ స్వభావాన్ని పోగొట్టుకొని, కేవలం భోజన మాత్రోపజీవి యైన ఒక జంతువుగా దిగజారిపోయే ప్రమాదం ఉంది.

ఆ విధంగా ప్రారంభమయింది మన అంకితాల చరిత్ర. మౌలికమ్మైన ఏ రచన అయినా విశ్వ ప్రయోజక మైనట్టిదే. రచన చెయ్యడానికి, దానిని వెల్లడించడానికి, ప్రజలలో ప్రచారం చెయ్యడానికి ఆనాడు రాజులు తోడ్పడేవారు. అందుకే రాజాశ్రయం కావలసి వచ్చింది. అప్పుడు కూడా స్నేహాన్నీ, ప్రేమనూ ప్రకటించడానికి, అనుబంధాలను గట్టి పరచుకోడానికి అంకితాలిచ్చి పుచ్చుకొన్న సందర్భాలు లేకపోలేదు. అట్టి సందర్భాలు ఈనాడెక్కువగా కనపడుతున్నాయి.

పేదలైన కవులు తమ కావ్యాల ప్రకటనకోసం ధనవంతులైన మిత్రుల్నీ, శ్రేయోభిలాషుల్నీ ఆశ్రయించడం తప్పడంలేదు. ప్రజా ప్రభుత్వాలను నిర్వహిస్తున్నవాళ్లు ఎక్కువగా సంస్కార విహీనులుగా ఉండడంవల్ల, ధనాధికార మాత్రులుగా ఉండడంవల్ల సాహిత్య సాంస్కృతిక రంగాలలో ప్రభుత్వాలు తమ ధర్మాల్ని నిర్వహించడం లేదు. అందువల్లనే ప్రతిభావంతులైన కవులు తమ కృషిని ప్రజలకందివ్వడం కోసం భిక్షా పాత్ర పట్టవలసి వస్తున్నది. నా స్థితి కూడా సుమారుగా అలాంటిదే. అయితే, నా భిక్షా పాత్రలో వాగ్దానాలే తప్ప, పడ్డ పైసలు బహుకొద్ది.

అయితే, నేను ఇంతవరకూ మొత్తం మీద ముప్పది ఐదు కావ్యాల వరకూ స్వయంగా ప్రకటించగలిగానంటే, ఎవరి సహాయమూ లేకుండా చెయ్యలేదు. అన్నీ కూడ మిత్రులకు అంకితాలివ్వబడ్డట్టివే. అందరూ కూడ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నా సాహిత్య కృషికి, ప్రకటనకు కొంతలో కొంతైనా తోడ్పడిన వాళ్లే. అందుకు ఆ అందరికీ కూడ నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడ్ని.

నా కావ్యాంకిత ప్రణాళికలో, నేను తప్పకుండా ఏదో కావ్యాన్ని అంకితం ఇవ్వాలనుకొన్న పేర్లలో మాన్యులు దేవులపల్లి రామానుజరావుగారి పేరు ఒకటి. ఆయన నాకు చాలా ఆత్మీయులు. కష్టసుఖాలన్నిటిలో కూడ మేము తోడు నీడగా పయనించుకొంటూ వస్తున్న వాళ్లం. "భీమన్న ఉగాదులు" అనే ఈ విశిష్ట కావ్య సంపుటిని ఇప్పటికైనా అంకితం ఇవ్వగలుగుతున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. కాదనకుండా ఈ కృతిని స్వీకరిస్తున్నందుకు రామానుజరావుగారికి నేనెంతో ఋణపడి ఉన్నాను.

## దేవులపల్లి రామానుజరావుగారికి

సాహిత్య కళా ప్రపూర్ణుడై
విద్యా శిఖరాల నందుకొన్నవాడు

త్రిలింగ దేశ పునస్సమైక్యం కోసం
అహోరాత్రాలు సూర్యచంద్రులై నవాడు

ప్రజాభిప్రాయాన్ని ప్రగతి పథంలో పెట్టడానికి
గోల్కొండ వాస్తవ సంపాదకుడై
అపర భగీరథుడై నవాడు

తెలుగు తోటలో, సాంస్కృతిక వసంతంలో
వివిధ రచనా ప్రసూనాలను పూయించినవాడు

పలు ముఖాలుగా పలచబడిపోతున్న
సారస్వత సంస్థా శకుంతలాలను పట్టి
ఒకే అకాడమీ కిందకు తెచ్చి పెంచినవాడు

ఆధునిక ఆంధ్ర సాహిత్యోద్యానానికి
నిరంతర కృషితో ఏకైక వనమాలి అయినవాడు

అన్ని భాషలలోని అన్ని అతిశయోక్తులకు
సమ్మాన్యుడైన సహజోక్తి అయినవాడు

సరసుడు, సహృదయుడు, రసాభిజ్ఞుడు
కుల, మత, వర్గ విభేద రహితుడు

సమస్త జన ప్రేమాస్పదుడు
కార్యదక్షుడు, దీక్షా కంకణ బద్ధుడు

ఆడితప్పనివాడు
వెనకడుగు లేనివాడు

దూరదర్శి, సూక్ష్మ గ్రాహి
చతుర వక్త, సజ్జీవన ప్రవక్త
నాకు అత్యంత ఆత్మీయుడు
దేవులపల్లి రామానుజరావు

అంతటి వాడికి
ఇంతటి ఉగాదుల కావ్య సంపుటిని
అంకిత మిస్తున్నాను
ఆనంద పడుతున్నాను.

రుధిరోద్గారి
ఉగాది

బోయి భీమన్న
14-4-83

## కొత్త కోకిల

కొత్త కోకిల గొంతు విప్పి
కోటి వేణువు లూదెనే !
గున్నమావుల గుండె లన్నీ
వెన్న వెన్నై కరిగెనే !
పద్య కవితల పద్మవనులు
వచన కవితల వరిపొలాలు
గేయ సుందరవాణి చల్లని
చాయలో విశ్రమించెనె !
పల్లవములా ? కావు కావవి
భావి రుతువుల ప్రాభవములే !
కారుటెండలు, గాలివానలు
కత్తిదూసిన ఫలితమేమే ?
క్రొత్త కాలిడి నప్పుడెల్లా
ప్రాత బుసకొట్టుచునె యుండు ;
నిత్య శంఖావర్తి విధి ఇది,
నీది నిచ్చెన మెట్ల పథమే !

## 2. అలరించాలే కాని

అలరించాలే కానీ – నీవు నను
అలరించాలే కానీ –
అలరు తీవలో ఆమని కానా ?
ఆమనిలో ఆనందమె కానా ?
పొగముంచునె పో,
అగరు దీపమై
నీ చుట్టూ వె
న్నెలలు కాయనా ?
కారాకునే పో,
కరిగిపోయి నీ
పదములపై నవ
పద్మము కానా ?
చిరు మబ్బునె పో,
మెరుపు తీగనై
నీ యెద గుడిలో
నిలిచి వెలుగనా ?
నిరుపేదనె పో,
పరమ శివుడనై
పూర్ణదేహ మిడి
పూజ చేయనా ?

## 3. తుమ్మెదబోయీ

పిల్లలు పుడుతుంటారు
పెద్దలు గిడుతుంటారు
పైని చిగురాకు మొలుస్తుంటే
క్రింది కారాకు రాలిపోతుంటుంది.

క్రొత్త సంవత్సరాన్ని కనేసి
పాత సంవత్సరం కన్నుమూసింది,
తెలుగు సంవత్సరం, పాపం, మంత్రిపదవి లాంటిది !
స్వాగత సన్మానాలే తప్ప వీడ్కోలు ఉత్సవా లుండవు !

ఉత్తరాయణం ఉత్తరాదికి పుణ్యకాల మైతే
దక్షిణాదికి పాపకాలం !
ఒకరికి కొత్త వెలుగు ఉగాదే
మరొకరికి మంచుచీకటి సమాధి !

ప్రతి ప్రేమగాథా కళ్యాణంతో సరి
ప్రతి వీరగాథా యుద్ధంతో సరి
ప్రతి ప్రజాగాథా ఎన్నికలతో సరి !
మిగిలేది పైని ఒక్కడు, క్రింద ఒక లోకం !

నా దృష్టి పైవాడిపై లేదు
నేనూ అతడి దృష్టికి అందను,
నా చింతంతా - ఈ నా లోకం
వట్టి మాలోకం కదా అని !

గెలిచేది ఒక్కడే, ఓడేది పలువురు
ఏ నియోజక వర్గంలో నైనా !
మానవ సమాజ లక్షణమే అంత !
ఊరేగేది ఒక్కడు, వోట్లిచ్చేది లక్షలు !

ఆ కొత్త వెలుగు, ఆ నవ వసంతం,
ఆ గెలిచినవాడు, ఆ ఊరేగేవాడు
తానే కావాలని ప్రతి వాడూ కోరతాడు !
అవకాశం దొరికితే ఎవడూ వదులుకోడు !

కాలపు సుడిగుండంలో, చీకటి లోతుల్లో నుంచి
పైకి తేలివచ్చిం దీ నా డీ ఉగాది !
బాకాలు, బాజాలు, విందులు, వినోదాలు !
ఈ మల్లెల మేనాకు నేనొక తుమ్మెద బోయీని !

## 4. నిత్యా వసంత సీమ

స్థావర జంగమ ప్రకృతి
　　　　సంఘములో వికసించు స్వేచ్ఛగా
జీవ సమస్తమున్ రుతు వ
　　　　శీకృతమై ; మన నారి కేళ కే
ళీ వనిలోన నిత్య సర
　　　　ళిన్ విహరించు వసంత మొక్కటే ;
హే, వన సుప్రియా ! ఇచట
　　　　నే స్థిరవాసివి కాగదే ఇకన్ !

మన కొబ్బరి తోటలు నం
దన వనములు, కల్పతరు సుధాసంబరముల్ :
ఘన సేవ్యము లీ పొలములు,
ధన ధాన్య క్షీర నీర ధర్మాలయముల్.

తీయ కొబ్బరి పూల పొత్తిళ్ల నుండి
ఆరు రుతువుల నొకరీతి ననుభవింతు
గాని, రావమ్మ కోకిలా ! కోనసీమ
సర్వ శోభా లలామ ! భూ స్వర్గధామ !

అడుగు లిడినది విభుజేరు నవసరమున
సప్తగోదావరీదేవి సప్త పదిగ ;
ఇది మహాపుణ్య సుక్షేత్ర, మిందె కలడు
బాలయోగిగ వెలసిన పరమ శివుడు ;
రమ్ము, వాసంతి ! మానవ ప్రాంగణమున
అందుకొందువు నవ జీవ నామృతమ్ము !

## 5. బొమ్మల బజారు

పాత బొమ్మల్ని అమావస్యలోకి విసిరేసి
కొత్త బొమ్మల బజారులో తిరుగుతున్నాం
మా ఆవిడా, మా ఇద్దరు పిల్లలూ –
ఆ సంవత్సరాది పండుగ ఉదయం !

ఓహో, ఎన్నిబొమ్మలు ! ఎన్ని బొమ్మలు !
బజారునిండా అన్నీ బొమ్మలే !
"ఈ బొమ్మలన్నీ ఎక్కడివి, నాన్నా ?
ఎక్కడి నుండి వస్తై ?"
అదిగో అక్కడినుంచి వస్తై !

అల్లంత దూరంలో అదొక మహాశైలం ;
శైలాన్ని కొట్టి, తవ్వి, వెలువరిస్తున్నారు
రకరకాల శిలల్ని కార్మికజనం.

శిలల్ని శిల్పాలుగా చెక్కుతున్నారు
ఇదిగో, ఈ శిల్పక్షేత్రంలో శిల్పులు !

మహాశైలం సామీప్యంలోనే
తీరికలేకుండా పనిచేస్తున్న కళాక్షేత్రం,
దానిచుట్టూ విస్తరించివున్న బజారు అది.

ఆ శిల్పక్షేత్రంలో తయారయ్యే బొమ్మలు
ఈ బజారుకు వస్తూవుంటై నిరంతరంగా,
పోతూవుంటై నిదానంగా.
రావడంకంటె పోవడం తక్కువ కనుక
బజారు క్రిక్కిరిసే వుంటుందెప్పుడూ.

బజారునిండా ఎన్నో షాపులు,
అన్ని షాపుల్లోనూ అవే బొమ్మలు.

ఒకే శైలం శిలల శకలాలు
ఒకే శాస్త్రం కింద చెక్కబడ్డాయి,
ఒకే కేంద్రం నుంచి సప్లయి అయాయి.
ఒకే వెలకు లభించాలి న్యాయంగా,
అయినా-వాటి వ్యాపారంలో
ఈ షాపులమధ్య ఎంత పోటీ !
వెలలో ఎంత వ్యత్యాసం !
రోడ్డుపక్క రూపాయికి దొరికే బొమ్మ
మోహన శిల్పశాలలో మూడు రూపాయలు,

హస్తకళల కౌముదిలో అయిదు రూపాయలు !
మౌలికంగా ఏ తేడాలూ లేని బొమ్మల్లో
స్థాన విశేషాన్నిబట్టి

ఒకో బొమ్మకు ఒకోవిలువ !
ప్రచార విశేషాన్నిబట్టి
ఒకో బొమ్మకు ఒకో ప్రఖ్యాతి !
బలప్రయోగ నైపుణ్యా విశేషాన్నిబట్టి
ఒకో బొమ్మకు ఒకో రాజపూజ్యత!

మేము ఈ బజారులో
సరదాకు తిరుగుతున్నామా ?
మాకు అవతల బోలెడు పను లున్నై.
అందమైన ఏవైనా రెండు మూడు బొమ్మలు
కొనుక్కుపోవడానికి మా ఈ షాపింగు !

చూచేకొలదీ చూడా లనిపిస్తున్న బొమ్మలు
ఉండేకొలదీ ఉండా లనిపిస్తున్న బజారు,
ఒకదానిని మించి ఒకటి
ఆకర్షిస్తున్న షాపులు
తమ అరచేతులలో
మనకు చూపుతున్న స్వర్గాలు !
అరచేతిలో పెట్టి
మోచేతివరకూ నాకిస్తున్న అప్సరలు !

"నాన్నా, ఈ సరస్వతిని కొందాం"
అన్నది, మా ఎనిమిదేళ్ల చిన్నపిల్ల
మై మరచి తిరుగుతూన్న నన్ను గుంజుతూ !
"నాకు ఆ లక్ష్మి కావాలి" అన్నది
మా పెద్దపిల్ల వెనువెంటనే !
"అది చదువు లేకుండానే
డబ్బు గడిస్తుందేమో" అన్నది చిన్నది
చుర చుర చూసింది పెద్దది-
మహా కవుల్ని పోషిస్తున్న
వేలిముద్ర జమీందారు వలె !

సరస్వతినీ, లక్ష్మినీ కూడా కొన్నాం !
"మరి, పార్వతో?"
"నే నున్నానుగా?" అన్నది వాళ్ల మ్మ,
"నీవు అలమారాలో పట్టవు" !
పార్వతి బొమ్మకోసం వెతికాం,
ఏ దుకాణంలోనూ లేదు !

"పార్వతి అంటే శక్తి కదా, నాన్నా?"
"అవును, ఆ ఇద్దరినీ మించిన శక్తి."
"మనకు లక్ష్మి సరస్వతీ వున్నారు,
కాని శక్తి లేదు !"

అదిరిపడ్డాను, ఆ పిల్ల అభ్యుక్తికి !
ఎంతటి సత్యావిష్కరణ !

అవును !
మనకు లక్ష్మి వుంది
సరస్వతి కూడా వుంది
శక్తే లేదు !

పైరవీల పంచలలో
లంచాల కంచాలలో
చీకటి బజార్ల లాకర్లలో
అధిక ధరల బొజ్జలలో
పదవీ రాజకీయాలలో
ప్రపంచ పర్యటనలలో

ఓహో, లక్ష్మి !
లక్ష్మికి సేవ చేస్తూ సరస్వతి !
అవును, నిజమే !
మనకు శక్తే లేదు !

"ఇదిగో ఇక్కడున్నది పార్వతి!
శైలజ ! శక్తి !"
"ఏదీ, ఏది, నాన్నా!"

అదిగో, అలా చూడు!
ఆ కొండ నుంచి బండల్ని
తవ్వి పడవేస్తున్న శ్రమ జీవుల కండల్ని,
ఆ శిలల నుంచి శిల్పాలు
చెక్కి పడవేస్తున్న బొమ్మల్ని,
వాళ్ల ముఖాలలో చిందుతున్న దేమిటి ?
వాళ్ల నఖాలలో మ్రోగుతున్న దేమిటి ?
చెమట కాదు, శివ !
శ్రమ కాదు, శక్తి!
ఇక్కడున్నది శక్తి,
బజారులో ఎక్కడుంది ?

"మరి, మరి, "
"మరి, అది
మన చేతికి రావడ మెలా" అంటావా ?
అదే వస్తుంది, పద !
రాకేంజేస్తుంది
తప్పక వస్తుంది.

## 6. ఉపజ్ఞా కోకిల

ఏమిటే కోయిలా
ఏమాయె నీ గొంతు?
పోయెనో ఆమనులు,
పూయవో మామిడులు?
చింతతో కూర్చుంటివే, కోకిలా!
చింత చిగురులు తింటివే?

స్వేచ్ఛా విహారివే
శ్రీ తనయు సహచరివి,
ఆంధ్రీజన స్థాన
ఆస్థాన గాయనివి,
ప్రజ్ఞలెక్కడ పోయెనే, కోకిలా !
ప్రాభవ మేమాయెనే?

బేల పడకే, బాల !
పోలేదు నీ పరువు ;
కాలచక్రపు నీడ
కాంతి తగ్గిన దంతె !
హిమ నిశీథులు కరగునే, కోకిలా !
సుమ రోదసులు విరియునే !

(భీమన్న కాలేజీ విద్యార్థిగా వ్రాసిన పాట ఇది. విదేశీ పాలన బానిసత్వంలో దేశం ఉన్నప్పుడు, జాతి ఆత్మ మూగవోయి ఉన్నప్పుడు, దానిని కోకిలగా ఊహించి ధైర్యం చెబుతాడు కవి).

# 7. నవోదయ వైతాళిక

(నవోదయ విభాతం ప్రపంచాన్ని మేల్కొల్పుకొంటూ వస్తూంది. విశ్వకృషికుడైన మానవుణ్ణి సమీపిస్తుంది. తట్టి లేపుతుంది.)

రాత్రిని కౌగిలించుకొని,
రాజువలెన్ శయనించి, స్వాప్నిక
క్షేత్రము పైరుపెట్టిన కృ
షీవల మిత్రమ ! లెమ్ము ! ప్రాఙ్మహో
గోత్రములందు చేపు లవి
గో! ఫలసాయపు మాధురుల్ సుధా
పాత్రములందు తీసె సువి
భాతము నీ కని ! లెమ్ములెమ్మయా !

నిద్దురలో నీయూహల
ముద్దులు కురిపించి, నిన్ను ముంచెత్తిన ఈ
ప్రొద్దునుగైకొని కన్నుల
కద్దు కొనన్ లెమ్ము ! లేచినది జగ మెల్లన్ !

శ్రీలు కోటిమంది క్షీరాబ్ధి నుదయించి
రనగ, తెల్ల తామరసము లందు
ఇంపు గొల్పవిరిసె ఎర్ర దామర పూలు !
మాధవునిగ లెమ్ము, మధురమూర్తి !

చీకటి తీగ పూచి వికసించిన దీ ఉదయప్రసూన, మీ
రేకలపైని వాలినవి రిక్కలు చక్కని మంచుచుక్కలై!
నాక రమా సువీక్షణ ఘనా కృతు లయ్యవి తేంట్లు కావు ; నీ
కోకిల గొంతుతో కొలుచుకో శ్రుతి మాధురు లాత్మ నిండుగా!

చేనులో రేయి రేయెల్ల సేవ చేసి
కోడి కూతనె కను మూసుకొన్న కష్ట
జీవివే యైన, ఏమిటి చేతు నేను?
మానవుడు తప్పినను, తప్పలేను క్రమము !

చెలులన్‌గూడి, సుఖమ్ములన్ బొదలి, తుష్టిన్ బొంది, దివ్యమ్ము లా
కలలన్ గాంచుచు, గాఢ సుప్తి ని శ్శైక్యానందమున్ గొంట జీ
వులకున్ కార్యము రాత్రులందు, క్రమమున్ బోనాడి జీవింప - దు
ర్బలమై వేళలు లేని తీవల గతిన్ బ్రాల్మాలవే మన్గడల్ ?

కుండపోతగ కురిసి, లేకుండపోయి,
మరల పై కొనుచున్నది మబ్బుతున్క!
మూలశక్తిని మరి మరి మునిగిరాక
ఆత్మ వికసింప జాల దితోధికముగ.

బావిలో మున్గి, పై కేగి, పూవుదోట
తడిపి, క్రిందికి పోవు ఏతమ్ము పగిది
నిండుగా వచ్చి వట్టిగా నిష్క్రమించు
బ్రతుకు భాండము తిరిగి నింపంగ వలదె ?

యా మినిలో అనంత హ్రాద
యమ్ములు చిందిన సూత్నభావ రా
గామృతమే విభాత రము
గా ప్రభవించుము రోజురోజు, త
ద్భూమికలోన నీది నొక
పోలికయున్నది చూచుకొమ్ము- క్రొం
దామరపూల, చేల, రస
దాళుల, తోటల, శిలియెన్నులన్!

జలజాలయ కోడలు, మన
జలజాసను రాణి, బాల జలజాప్తునకున్
పులు గడిగి, పురుడు పోయగ
కలహంసము నెక్కివచ్చె! కనుగొను మువసిన్!

ఒక్కొక్క ఉషస్సును హృది
కొక్కొక్క నవానుభూతి నొసగుచు జీవన్
ఒక్కొక్క మెట్టు పెంచును !
దిక్కులు కలనేల ? బైలుదేరుము నాతో !

పరమ విష్ణుమోసి, బ్రహ్మను ప్రసవించి,
తనువుదొరగి చనియె తాను రేయి;
కాల రుద్రమూర్తి కనువిచ్చుటకు ముందె
లోకబాంధవునిగ సాకుకొమ్మ !

పురు లంటుకొనగ పేలాల్
కొర కురికెడి మూక భంగి క్రుమ్మరు నదే ప్రా
గ్గిరి తటముల, తొగతోటల,
అరవిందములందు రేగి అలి బృందమ్మల్ !

డెందమును దోసిటన్ గొని
వందన మిడు ముదయరవికి; ప్రాత స్సంధ్యా
వందనమే సుందరమో,
నందనమో; శతవిధాల నవ మందిరమో ?

# 8. వాకిట్లో వసంత లక్ష్మి

ఒక ప్రక్క-
పంపులో నీళ్ళు లేవు
మార్కెట్లో కూరలు లేవు
జేబులో పైసలు లేవు ?

మరో ప్రక్క-
వసంతలక్ష్మి వచ్చి
వాకిట్లో నిలబడింది !

ఏమి టలా చూస్తావు ?
ఒత్తేసుకో కళ్ళల్లోని దైన్యాన్ని
హత్తేసుకో వసంతలక్ష్మి హృదయాన్ని.

గత రాత్రి చచ్చిపోయింది పాత ఏడాది,
దాని చితినుంచి పుట్టుకొచ్చింది కొత్త ఉగాది !
పాత కన్నీళ్ళు రాలిపోక పోతే
కొత్త వెలుగులకు చోటెక్కడిది ?

మన కేమున్నదో, ఏం లేదో
పండగ కేం తెలుస్తుంది?
పండగకు కావసింది గుండె !
అది మనకుంది, చెప్పు స్వాగతం !

కాలిపోతున్న గుడిసెల్ని కాలిపోనీ !
వాటి సమాధులే పునాదులుగా
లేచే భవనాలకు రూపం కల్పించుకో !

పాత ఏడాదీ ఏడాది క్రితం
కొత్తగానే పుట్టింది కాదా ?
పుట్టడంకాదు ముఖ్యం
పుట్టుక సార్థకం కావాలి !

కాలిపోయిన గుడిసె స్థానంలో
మరో గుడిసె లేస్తే ఏం లాభం
అభ్యుదయం ఎలా సాధ్యం
అని కదూ నీ ఆలోచన ?

వందలు వేలు ఉగాదుల్ని
మనమే వ్యర్థం చేసుకొన్నాం.
లోపం ఉగాదిది కాదు

అది ప్రతిసారీ నవ్వుతూనే వస్తున్నది,
మనమే దాన్ని ఏడ్పించి పంపేస్తున్నాం !

మన కష్టాలు మనకే వుండనీ,
మన సుఖాలను మధులక్ష్మికి పంచు !
నిత్యకల్యాణం పందిరి కింద
నెరసిన తలలూ వుంటై,
పచ్చతోరణం ప్రణయ పంక్తిలో
పండిన కలలూ వుంటై !

మల్లెపూల తీగల కింద
మంటి పెల్లలు కెలక్కు !
కాకుల లోక గోలకు విసిగి
కోకిళ్ళను తరిమిగొట్టకు !
ఎంతో గడ్డి తింటే కదా
ఒక సేరు పాలివ్వడం గొడ్డు?

వనజ్యోత్స్నవు నీవు
వద్దు మృత్స్న మాలిన్యచింత !
నవోదయ లక్ష్మితో కలిసి
నవజీవన ప్రణాళికలు నిర్మిస్తాం !

నాదోపాసనతో కీటకమే
నవభ్రమర మవుతున్నప్పుడు
రసోపాసనతో మానవుడు
రాజేశ్వరుడే ఎందుకు కాడు ?

మనది రసాద్వైతం, మనమే ఆనందబ్రహ్మ !
ఎందుకు చూస్తా వలా ఉగాది పచ్చడిలా?
తీపితో చేదూ, చేదుతో వగరూ
కాపురాలు చెయ్యక తప్పదు !
అవిగో వస్తున్నై పంపులో నీళ్ళు !
ఇక కడిగి కళ్ళకద్దుకో వసంతలక్ష్మి కాళ్ళు !

## 9. త్రిలింగోదయం

శ్రీ కాళేశ్వర సూర్యచంద్ర మతులన్,
శ్రీశైల మల్లీశ్వరే
చ్ఛా కల్యాణ గుణామృత ద్యుతుల, ద్రా
క్షారామ భీమేశ్వర
ప్రాకామ్య స్థితులన్ రహించెడి నవాం
ధ్ర శ్రీ – త్రిలింగోర్వి – అ
న్నాకా రేశ్వరి మా జనాళికి సమ
స్తానందముల్ పంచుతన్ !

వెతుకుతున్నాను నేను
దేనికోసమో తెలీదు
ఎంతకాలం నుంచో తెలీదు
కలలోలా అస్పష్టంగా ఉంది,
కల మాత్రం కాదు.

చంటిబిడ్డ కోరికలా ఉంది,
మాటలు రావు, జ్ఞాపకం చాలదు.

నా ముందూ, నా వెనకా, నా చుట్టూ
నాతోపాటు వెతుకుతున్నా రెందరో !

మే మంతా కలిసే వెతుకుతున్నాం
వాళ్లంతా ఎవరో తెలీదు.
నే నెవరనో నాకూ తెలీదు !
అంతా జడస్థితి !

ఆ ! దొరికిం దిక్కడ !
ఎక్కడ? ఎక్కడ?
ఏమిటి ? ఏమిటి ?
త్రిలింగేశ్వరి ! త్రిలింగ ధాత్రీశ్వరి !
ఆహా ! దొరికిందా నా తల్లి !
నా జనని ! జన్మభూమి !
ఇప్పుడు తెలిసింది నాకు
నే వెతుకుతున్న దేమిటో !

తీరాంధ్రంలో ద్రాక్షారామంలో
భీమేశ్వరుని సన్నిధిలో
దొరికిందా అన్నపూర్ణ !
ఏదీ ? ఏదీ ?
అయ్యో ! ఇదొక ముక్క !
ఒక ఖండం ! ఒక వరుణభంగి !

అదిగో అక్కడ ! అక్కడ !
ఎక్కడ ! ఎక్కడ !
రాయలసీమలో, శ్రీశైలంలో
మల్లికార్జుని సన్నిధిలో
కువలయానంద కుంకుమ రూపిణి !
దొరికింది మహాశక్తి, మా భూమి !
ఓహో, దొరికిందా ? ఏదీ !
అయ్యో, ఇది కూడా ఒక ముక్క !
ఒక ఖండం ! ఒక శీతుభంగి !

ఎక్కడి కీ పరుగు ?
ఏమిటీ కోలాహలం ?
నేను పరుగెడుతున్నా నెక్కడికి ?
రజాకార్లు ! రజాకార్లు !
ఎవరా భక్తజన రక్షకులు ?
నిద్రపోతున్న జాతిముఖం మీద
నెత్తురు కల్లాపు చల్లిన అరుణోదయంలో
జన్మ జన్మాల దాస్యపు బూజు తొలగిపోగా,
నెత్తురుబొట్లే రత్నాలై మెరుస్తూ
కోటి రత్నాల వీణ ఖంగుమనగా,
అమ్మయ్య, దొరికిం దిక్కడ !
తెలంగాణలో, కాళేశ్వరుని సన్నిధిలో

దొరికింది మహాశక్తి !
నవశక్తి ! యువశక్తి !
దొరికిందా ? ఏదీ ? ఏదీ ?
అయ్యో, ఇది కూడా ఒక ముక్క !
ఒక ఖండం ! ఒక వసంత భంగి !

మూడు లోకాలు పాలించ గల
ముక్కోటి తెలుగు శక్తిని
ఇలా మూడు ముక్కలు చేసి
ఎడాపెడా విసిరేసిం దెవరు ?
ఎవరికుంది మనల్ని గెల్చే శక్తి ?
అనంత జీవజ్యోతి –

జ్యోతిర్లింగ రూప విభూతి –
ముక్కంటే మూడు ముక్కలై
ఇలా చేశాడా తెలుగు శక్తిని ?

అలా వీల్లేదు, వీల్లేదన్నాం,
పట్టం డంటే పట్టం డన్నాం,
మూడు ముక్కలైన తెలుగు సీమను
ఏక భూమిగా చేసేశాం !
మూడు ముక్కలైన మహేశ్వరుణ్ణి
ఏకేశ్వరుణ్ని చేసేశాం !

రెండు కళ్ళుండడం సామాన్యం,
మూడు కళ్ళున్నప్పుడే ముజ్జగాలు పాలించడం !
కోస్తా, రాయలసీమ, తెలంగాణ -
మూడూ మూడు కళ్ళు తెలుగు నేలకు.

ఖండ మాత్రం కా దిప్పుడు ఏక ఖండం !
ఏకనేత్ర కా దిప్పుడు, త్రిలోచన !
త్రివక్ర కా దిప్పుడు, త్రిభంగి !
త్రిభంగిగా నిల్చి త్రినేత్రాలూ అరమోడ్చి,
తీయని ఫలా లందిస్తున్న త్రిలింగ దేశలక్ష్మి !
త్రిధా శతధా భిన్నులై ఖిన్నులై వున్న మాకు
వేంగీ, ఏకశిలా, విజయనగర
సామ్రాజ్యపు ఆదర్శాల ముందు
వీర తిలకం దిద్దుతున్న
పూర్ణ వసంత రాజ్యశ్రీ !

## 10. ప్రగతీ ! ఓ ప్రగతీ !

ప్రగతీ, ప్రగతీ, ఓ ప్రగతీ !
సర్వలోక మానవోన్మన స్వగతీ !
ఎవరు దేవీ, నీవు ?
ఏది నీ వుండే తావు ?

అందరూ నిన్నే కోరుతున్నారు
ఎందరో నీ వెంట పడుతున్నారు
నీ కోసం పోటీలు పడుతున్నారు
పార్టీలు కడుతున్నారు
మీసాలు తీసేసి, రోసాలు పెంచుకొని
సుందోపసుందులే అవుతున్నారు
ఎవరు దేవీ నీవు, ప్రగతీ ?
ఎక్కడా కనిపించదు నీ అతీగతీ !

రేడియోలో నీవు నాద రాధవు
పత్రికల నిండా నీవు అక్షర రంభవు
సభావేదికలపై సాక్షాత్ మోహినివి
హరిజనులకు ఆకాశ సౌధానివి
బలహీనవర్గాలకు బంగారు లేడివి
ఓహో, నీ వోరచూపుల వొంక నవ్వు
అయిన వాళ్లకు అమృతం !
కానివాళ్లకు కల్లు !

అరవైకోట్ల గుండెలు
నీ కోసం కొట్టుకొంటుంటే
ఇరవైకోట్ల గుడిసెలు
చీకట్లో పొగచూరి చస్తుంటే
కోటల్లో రత్నకింకిణులూ
కూలీపేటల్లో ఇనప గజ్జెలూ
గల్లు మనిపిస్తున్న రాజమోహినీ !
కోట్ల ప్రణాళికల పసిమినంతా మేసేసి
ఎండిపోతున్న పల్లెటూళ్ల నోళ్లకు
పండు గవుతున్న మృగతృష్ణా !

జాతి దారిద్ర్యం మహాసముద్రంలా
విలయతాండవం చేస్తుంటే
కొద్దినోళ్లకు మాత్రమే
ముత్యా లందిస్తున్న స్వాతీ !
ప్రగతీ, ఓ ప్రగతీ !
ఏది నీ ప్రగతీ ?
ఎవరి కోసం నీ/ తథాగతి ?

"సామాన్యుడు చైతన్యవంతుడు కాకుండా
గంగకూడ మురిక్కాలవే నయ్యా, కవీ !
నీ గుడిసెను నీ భుజాలపై మోసుకొంటూ
నీ వెంట పరిగెత్తినా నీకు నే నందను !
ఆ చీకుచెత్త నంతా పారేసి నిలబడు,
అప్పుడు ~~ఈ~~ ప్రగతి సమస్తం నీదే !"

## 11. నిత్య వసంత నగరం

గ్రీష్మ మెంతగ లోక ప్రభీష్మమైన -
గిరి నిపాత ధారా నిరంతర ఝరులతో
ఝరి ఝరాసార శోభిత తరులతలతో
తరులతా పుష్ప గంధ శైతల్యములతో
శీతల రసార్ద్ర కేళీ విశేషములతో
శ్రీ వసంతమె వెలయు బృందావనమున
రామకృష్ణు లందున్న కారణము కతన
అనుచు వర్ణించినారు పోతన్నగారు !

రామకృష్ణుల మందిరారామ మగుట
మండువేసవె అట మధుమాస మగును,
చుర్రుమను నెండయే సుఖజ్యోత్స్న యగును,
ఉక్కపోతయె చందన యోగ మగును,
చింతనిప్పుల మంటలు చిమ్మునట్టి
నట్టనడిమింటి సూర్యుడే నవ వసంత
శుభ్రశశియౌను, రామకృష్ణులకె కాదు -
వారితో నుండు వారికెవ్వరికి నంతె !

కృష్ణుడే తాను, తానె శ్రీకృష్ణు డగుచు
బ్రతుకె బృందావనమ్ముగ బ్రతికి నట్టి
పోతనామాత్యులకు, తదాప్తులకు కూడ
నిప్పుటెండయు పండు వెన్నెలయె కాయు !

భాగ్యమతి పేర వెలసిన భాగ్యనగరు
బృందకంటెను నేమిట క్రిందిదయ్యె ?
బాల గోపాలు డుండిన కాలమందు
బృందలలోనున్న వెల్ల నే డిందు లేవె ?
నిత్య నిపతిత గిరిదరీ నిర్ఝరులతో

నిర్ఝరీభూత మధుహిమానీ రుచులతో
రుచి మదామోద పురవనీ ప్రచురణలతో
ప్రచురసంపత్ రసాలినీ ప్రణయములతో
హ్లాద రమణీయ సాగరోల్లాసములతో
ప్రాణహిత సాహితీ సుప్రభాతములతో
అనవసర కళానంద సాయాహ్నములతో
మధుర మై రేయ రాత్రుల మైకములతో
నిత్య సంగీతసాహిత్య నృత్యవిధుల
పరమమోహనమ్మై, నిరంతర వసంత
శీధువుల నిన్ను నన్ను రంజించునట్టి
భాగ్యనగరుకు సాటి విశ్వమున కలదె ?

గోకులము గోకులమె రాధయై కుమార
కృష్ణు నర్చించినట్టిది బృందవనము ;
భాగ్యమతియును, కులీ కుతుబ్షాయు భువికి
ప్రణయసుధ పంచినట్టిది భాగ్యనగరు;
వారు నేగిరి, ఏగిరి వీరు కూడ
అమృత గంగా ప్రతీర విహారములకు ;
మనము, మన వంటి వారెంతొమంది నేడు
తెర్వరులమే తదానంద తీరములకు !

రాజ్యములు నిల్చునా ? ప్రేమరాజ్యమొకటె
పరమమై నిల్చు శాశ్వత బ్రహ్మపదవి !
రాజు లుందుర ? ప్రేమ సమ్రాట్టు లొకరె
ఏలుచుందురు ఎదనెద నెల్ల రతుల !
కాంచు మందుకె– ఈ నిదాఘమ్మునందు,
ఒక వసంతమె కాదు, పేరోలగముగ
ఋతువు లారును మన చుట్టూ నృత్యమాడు !

నవ్వుచుంటి వదేమె ఆనంద మధుర
రాగ వైశాఖి ? వైశాఖ రమ్య పూర్ణి
మాసి ? ఎందుకే సోత్సాసహాస మంత ?
ఆవిరులు లేచెనేమి నీ హాస మందు ?
చైత్రి వైశాఖి నెలలు వసంతమన్న

వాడి కంటెను మూర్ఖుడు లేడె యనుము,
ఫాల్గునియు చైత్రియును మధువగునె యనుము,
మండు వైశాఖ మొకటె గ్రీష్మమగు ననుము !
అంతమాత్రము చేత నేమాయె, సకియ ?

గ్రీష్మమందె వర్షర్తు విక్రీడ లేదె ?
ఘర్మధారలు కురిసి నీ గాత్రలక్ష్మి
కమల వాసిని కంది చికాకు పడదె ?
బృందలో వసంతమె నిల్చె గ్రీష్మమందు,
భాగ్యనగరున వర్షర్తు వయ్యె నదియె !

చారు శీతల చందన చంద్రికలతొ
నారికేళ తాళంబు తుషారములతొ
పక్వ పరిపన్న మకరికా పత్రములతొ
కోరి శరదాదులును నిన్ను పోల్చుకొనవె ?
కొంచె మటు నిటుగా సర్దుకొందు మేని,
సృష్టినైజము తెలిసి జీవింతుమేని,
బ్రతుకె నిత్యవసంత దివ్యస్మనోజ్ఞ
భాగ్యబృందావనమ్ములు పరగు మనకు !
ఎల్ల సుఖములు మనలోనె వెల్లివిరిసి
అందుకొందుము మనము ఆనందమధువు !

## 12. ఆమని మువ్వలు

ఎక్కడివీ మువ్వల గలగలలు ?
మువ్వల గలగలలు
రవ్వల రవరవలు ? ॥
ఏ మువ్వల గజ్జెలు
ముందడుగులు వేస్తున్నవో,
ఏ రవ్వల మొలత్రాడు
గారాము చేస్తున్నదో ? ॥
ఎటు నుంచి ?
ఎటు పొంచి ?
ఇటు తూరుపు నుంచి
అటు పడమర నుంచి
నానా దిక్కుల నుంచీ
నా కేసె వస్తున్నవి ? ॥
పై నుంచా ? ఆ
పై నందన వని నుంచా ?
క్రింది నుంచా ?
బృంద నుంచా ?
నా హృదయ స్పందనలే
నవ వాద్య బృందంగా
నా చుట్టూ, నను తట్టే
నవశోభా నృత్యాలు,
నవ లక్ష్యాలకు నన్ను
నడిపించే తత్వాలు. ॥

# 13. ఎప్పటి కప్పుడే కొత్త

ప్రతి వసంతము క్రొత్తదే, ప్రతి పిక స్వ
రమ్ము క్రొత్తదే సృష్టి ప్రారంభ మాది ;
క్రొత్తదై ప్రతి క్షణము నీ కొరకు విరియు !
నింపుకొనుచుంటివే గుండెనిండ మధువు ?

ప్రతి పసిపాప క్రొత్త, దది
పల్కెడి గొంతు ప్రతీది క్రొత్తదే !
ప్రతి రుషి వాక్కు క్రొత్త, దది
పంచిన సర్వసమాన జీవన
వ్రతమును క్రొత్తదే ; చెవుడు
పట్టిన దీ కులజాతి ! కానిచో
మతిసెడి లోక మానవ స
మాజపు వాకిట దోసి లొగ్గునా ?

నూత్న యుగములు, క్రొత్త గొంతుకలు సతము
వచ్చి పోవుచు నుండు ప్రభాతము లటు ;
మేలుకొనియుండుటే రాజ్య మేలుకొనుట !
జోగులాంధ్రకు లే వుషశ్శోభనములు !

సిరి వాల్జ్యాపు, సరస్వతీ ప్రియదర
స్మేరమ్ము, శైలాత్మజా
వరసత్త్వమ్ము సమానమై భువికి ల
భ్యంబౌ సదా ; నేడు తత్
కర పీయుషము గ్రోలు వంతు మనదా
కా వచ్చె ; మేల్కొల్పవే
భరత క్ష్మాజనయిత్రి శ్రీచరణ సే
వాసక్తికిన్ నీ ప్రజన్ ?

బహు జనమ్ముల చీకట్ల బడగద్రోసి
కువలయము నెట్లు గెల్తురు కొద్దిమంది ?
కులమతా లను పిచ్చుక గూళ్ళలోన
సంచరిలు టెట్లు వసుధైక జాతి రవులు ?

గాంధి చెప్పిన దేమిటి ? క్రైస్తు, మార్క్సు,
వ్యాసు, డంబేద్కరుడు, బుద్ధు డదియె చెప్పె !
వేద మేదైన, పలికిన నాద మొకటె !
సృష్టి రాహస్యమేమి గుర్తించినావు ?

మన అదృష్టేందిరాదేవి మనసు పండి
రాశులై నవి అవకాశ రాజనాలు !
దక్కునో ఇవు డివి బీద బిక్కి ప్రజకు ?
తెరచియున్నవి నరబకాసురుల నోళ్ళు !

ఆగస్ట్ విప్లవ లక్ష్యమేమిటి ? స్వరా
జ్యశ్రీని ఏ నల్గురో
భోగుల్ పట్టి చెరన్ గొనన్ గలుగుటో ?
బ్యూరోక్రసీ దాస్యమో ?
వాగర్థాల విడాకులో ? ప్రజకు సం
వాగ్దాన సంతర్పణో ?
త్యాగుల్ జానపదుల్ ; తదీయ ధన ధా
న్యశ్రేయముల్ ముఖ్యముల్ !

కావున డెందము నిండుగ
జీవన సుధ నొంచు కొమ్ము, చిత్సత్ గతిలో
నీ వంతు వచ్చె ; ననుగే
లా ? వీరముగొమ్ము, ముందు కడుగిడు మింకన్ !

## 14. జీవిత రామాయణం

వ్యాస వాల్మీకులే కవు లవని కెల్ల ;
కడమ వారు వారల పాదకముల గత మ
ధూళి సేవించి బ్రతుకు మధువ్రతాలె !
అందు కడపంక్తి నొక పసికందు నేను !

రసమయ మైన సృష్టి నొక
రామ చరిత్రగ తీర్చిదిద్ది, మా
నస సరసీ ప్రతీరమున
నాటిన వాల్మీకి ఎట్టి మాలియో !
అసదృశమ్మై, అనాదికి న
నంతతకున్ మొదలున్ శిరమ్మునై
ఎసగెడు నద్ది – జీవ పర
మేశ్వర పుష్పఫలప్రరోహమై !

ఆరు ఋతువులు కాండము లారు కాగ,
మధుర సంపూర్ణ ప్రకృతి రామాయణ కృతి !
చైత్ర చైత్ర మధ్యస్థ వత్సర మొకొకటి
ఒకొక పారాయణము కాల వికసనమున !

శైశవీ, బాల్య, తారుణ్యా, సత్త్వ, ప్రాజ్ఞ,
బ్రాహ్మ్య దశ లారును పదేసి వర్గములుగ
మానవుని షష్టిపూర్తి రామాయణమ్ము !
రస పరాకాష్ఠ ఉత్తర రామ చరిత !

రాముడు మానవుం ; డతని
రాగము ద్వేషముతోడి జీవితా
రామము కావ్యమిద్ది ; ముకు
రమ్మున చంద్రుని వోలె చూచి, నీ
భూమికి చూపి, దిద్దుకొను
మో నరుడా, బ్రతుకంచు – రామ నా
మామృత మిచ్చినాడు, పర
మాత్ముడు వాల్మికి ! మౌని మాత్రుడే ?

సామన్య మానవుడు శ్రీ
రాముడు, దేవతయె సీత ; రామ చరితకున్
ప్రేమ రస సిద్ధి సీతా
శ్రీమచ్చరితమ్ము, హృదయ శిల్పాలయమున్ !

సీత ! సమస్త భూతముల
జీవరసాన్నము తానెయౌ కృషీ
సీత ! సమస్త జీవులకు
చి ద్వికసన్మధు మాత జానకీ

సీత ! సమస్త విశ్వపరి
    సేవిత లక్ష్య పరాపరార్థ ఈ
సీతను గొల్చె మాధవ రు
    చిన్ గొని వాల్మికి మాధవాప్తికై !

జీవి రాముడు, సంస్కృతి సీత ; లక్ష్య
పథములో నడిపించు దీపమ్ము సీత ;
దీప మున్నంతవరకె అస్తిత్వ మెదియు
మాన వాభ్యుదయమ్మె రామాయణమ్ము.

## 15. పండగనాడూ-

పండుగనాడూ పాత కవిత్వమేనా?
కొత్త దేదైనా పలకవయ్యా, కవీ !
ఎందు కా పాడు విసుర్లూ, విమర్శలూ, తిట్లూ?
ఆత్మను కరిగించే దేదైనా వుంటే చూడు!

కోకిలకు వసంతం ఒక్క అర్వై రోజులు,
కవి కోకిలకు వసంతం అర్వై యేళ్ళు !
మనకు వసంతం మొత్తం కాలమే !
నీ పాట కావాలి బాట నిత్యనవోదయానికి !

మల్లెపూలు, మధువ్రతాలు, మామిడి పిందెలు
గోరింక పిల్లలు, కోకిల పిల్లంగ్రోవులు
కొత్తజంటలు, కోరికల మంటలు, పంటలు
పైరగాలులు, ఫలరసాలు, మధువులు !

మధువులో మళ్లీ మళ్లీ వికసిస్తున్న వన్నీ
అన్నీ పాతవే కావా అంటావా ?
ప్రభవకూ, అక్షయకూ తేడాయే లే దంటావా ?
నిన్న నేనూ, నేటి నేనూ ఒకే ఒక్కటంటావా ?

ఒక్క ఉషస్సుందరిగా తృప్తిపడేది గులాబీ,
లక్ష గులాబీల పరమోషస్విని ప్రేయసి,
ఒక్కసారి నాకేసి ఇటు చూడు!
నవనవోన్మేష శ్రేయస్సువే నీపై పాడు !

ప్రతి జీవలవానికీ ఒక ఆయుష్కాలం లేదా ?
ప్రతి విత్తనమూ చెట్టై, మళ్లీ విత్తనమై పోదా ?
విత్తనమూ, దాని విత్తనమూ ఒకటే కాదయ్యా !
వాటి నడుమ ఒక తరం అనుభవసారం ఉందయ్యా !

గత ఉగాది కోకిలది విషాదకషాయ కంఠం,
ఈ ఉగాది కోకిలది విజయావేశ మధురోక్తి !
మరి, నీవు ప్రభవనుంచీ పలుకుతున్నదంతా
అక్షయ దాకా అక్షయపాత్రే ఎందు కవాలి ?

పోయి కొత్త పాటలు పాడుకో అన్న ఎంకికి
వట్టి ఫోటోలు మాత్రమే తియ్యగలిగావు !
తెలుగు తోటల్లో వెలుగు తేనెలు తియ్యలేక
ప్రక్కకొట్ల నుంచి పానకం తెచ్చి అమ్ముతున్నావా ?

వైతాళికుడి నన్నావు –
పై యాకరణి వయ్యావు !
అభ్యుదయం అన్నావు –
అమావాస్యతోనే ఆగిపోయావు !

మానవుడు సూర్యుడు కాదయ్యా, చంద్రుడు !
దోషరహితుడు కాదు, దోషాకరుడు,
హాని వృద్ధు లున్నవాడు, అస్థిరుడు, అక్రముడు,
అయినా - అమృత హృదయుడు, అందుకే మానవుడు.

సూర్యుడు ప్రాణం, అది ప్రతి గాడిదకూ వుంది ;
చంద్రుడు హృదయం, అది ఎందరిలో వుంది ?
ప్రజ్ఞాన ప్రవేగానికి ముందుండాలి నీ ప్రభ !
కనీసం దానికి ప్రతిబింబం కావాలి నీ ప్రతిభ!

గులాబితోటలో ప్రేయసితో విహరిస్తూ
కొమ్మకు ముళ్ళున్నాయని విసుక్కొంటున్నావా, కవీ ?
కోకిలలో నీవు చూడవలసింది నలుపును కాదు,
దాని గానంలోని కొత్త ఉగాది మలుపును !

మామిడి కెంజిగురాకు ఒకరికి ఐస్‌ఫ్రూట్
మరొకరికి ఉగ్రకాళి నెత్తురు నాలుక,
ఇంకొకరికి విజయారుణ ఖడ్గ ధార,
కవికి మాత్రం అది నవజీవన రాగరేఖ!

మలయానిలానికి మానవుడు పులకిస్తాడు,
మానవస్పర్శకు మలయానిలమూ పులకిస్తుంది,
కాకపోతే - అది మనదాకా ఎందుకు వస్తుంది?
నీ కవితాస్పర్శతో కాలాన్నే పులకింపజెయ్యి !

కాలప్రవాహంలో ఒకో జీవితంలో ఒకో సుడిగుండం,
తనచుట్టూ తాను తిరుక్కొంటూ పోతుందది ముందుకు !
ఏ వీణారవం రేపిందో ఈ ఆవేగవలయాలను !
నీ కవితావేణువు నిలపాలి వాటికి దీప గృహాలను !

అరస మనీ, విరసమనీ అటూ, ఇటూ ఊగకు !
నీది సరసమైతే, అవి నీకే బొమ్మబొరుసులు !
అమ్మో, నాకేసి అంత గుచ్చిగుచ్చి చూడకు
నాలో నీ మైకం స్విచ్ ఆఫ్ అయిన లోకం !

పండగనాడూ పాత కవిత్వమేనా అనడం –
వికసిస్తున్న మానవాత్మకు నీకంతం ఇవ్వమనడం !
నిన్నటి నీవూ, నేటి నీవూ ఒకటి కాదయ్యా !
ఒకటే అయితే, అభ్యుదయమే అర్థరహిత మయ్యా !

## 16. తాకనా ?

తాకనా ఒకసారి
తన్మయత నొంద ?
అరుణోదయాలు నీ
చరణారవిందాలు ॥ తా ॥

ఉదయరవి చంద్రికా
ఉద్యాన రాధికా
మోవి మకరందాలు
ముద్ద మందారాలు ॥ తా ॥

ఆమోదమును గ్రోలి
ఆస్వాదమున తేలి
అందాల రుచులతో
ఆనందకందమ్మె ॥ తా ॥

(ఒక ఉగాదినాడు మధ్యాహ్నం నేను నిద్రపోతుండగా ఒక చిన్న కల. దేవత లాంటి బాలిక నా ఎదట నిలిచి, నాతో ఆడుకొంటుండగా, నేను ఆనందంలో "తాకనా ఒకసారి" అంటూ అందంగా తిలకామోది రాగంలో ఆమె నిండా చిరునవ్వుల గిలిగింతలు పూయిస్తుండగా, మెలకువ వచ్చేసింది. "తాకనా ఒకసారి" అని పాడుతూనే లేచి కూర్చున్నాను. "తన్మయతనొంద" అనే రెండో చరణం దానంతట అదే వచ్చేసింది, ఆ తర్వాత నన్ను చూడవచ్చిన లలితసంగీత కళానిధి పాలగుమ్మి విశ్వనాథంగారితో ఈ ఉదంతం ముచ్చటించి, పాటను వసంతవాణి పరంగా పూర్తి చేశాను.)

# 17. శిశిర వసంతం

నిత్య వసంతంగా
బ్రతుకుతున్న కవి అతడు.
ఇంటా, బైటా
చుట్టూ, లోనా
అంతా వసంతమే
కాముని పూర్ణిమ !

అయితే---
మంచు, పొగమంచు
ఎండలు, బండలు
వరదలు, తుపానులు
ఆకలి చావులు
రోగం, రొష్టు
నక్కలు, రాబందులు
ఏవీ లే వను కొంటున్నాడా?
వాటి బాధలకు దూరంగా వున్నాడా ?

అబ్బే!
నరకంలోనే
స్వర్గాన్ని సృష్టించుకొని,
ఎడారిలోనే
ఎలమావి నీడను కల్పించుకొని,
రాక్షస రణరంగంలోనే
రాసక్రీడ లాడుకొంటూ,
శ్రమిస్తూనే విశ్రమిస్తూ,
చస్తూనే జీవిస్తున్నాడు !
జీవస్వభావం ఎరిగినవాడు
అతడు నిజమైన కవి !

## 18. పైరగాలిలో పైరవీ కవిత

నాకు వోటుందో లేదో కూడ తెలీదు,
మా వూరివాడే ఒకడు ఎలక్షనులో గెల్చి
శాసన సభ్యు డయినప్పుడు మాత్రం
ఆ రోజంతా ఏడ్చాను !

నేను పరీక్షలో సైన్సు కాపీ కొట్టడం కోసం
హిస్టరీగైడు తీసుకెళ్లాను.
త లెత్తకుండా పేపరు వ్రాసేసిపోయిన ఒకడు
ఫస్టుగా పేసైనట్టు తెలిసినప్పుడు మాత్రం
నాకు తిండే సహించలేదు !

పిత్రార్జితం తలమున్కలుగావున్న దొరగార్ని నేను,
మావూరి మురికిపేట దరిద్రు డొకడు
ఆఫీసరై వచ్చిన రోజున
అందరితోపాటు నేను కూడ
అరుగు దిగవలసి వచ్చినప్పుడు మాత్రం
తల తీసేసినట్లైపోయింది నాకు !

కవికీ, కపికీ తేడా కనిపించదు నాకు
పద్యం కంటె మద్యమే తలకెక్కుతుంది నాకు,

అయితే - ఈమధ్య మా మిద్దెమీద
అద్దె కున్నవాడు ఏవో పద్యాలు వ్రాసి
శాలువాలు తెచ్చుకోవడం చూస్తుంటే మాత్రం
నా కళ్లు పండు మిరపకాయలై పోసాగినై!

ఎన్నైనా భరించగలిగాను, కాని-
ఈ కపిగాళ్ళ మెడల్లోని పూలమాలలు మాత్రం
నా మెడలో తెల్లతాచులై బుసలుకొట్టడం
శాలువాలు శవాల్లా వెక్కిరించడం
ఇక సహించలే ననిపించి –

ఎన్నో రాత్రులు ఆలోచించి
ఒక కొత్తకవి పాతపుస్తకం సంగ్రహించి
అక్కడొకటీ ఇక్కడొకటీ వాక్యాలు చించి
ఒకదాని కింద ఒకటి దించి
పేంటుజేబులో భద్రీకరించి –
ఇక ఏంచెయ్యాలో తోచక
వీధిని పడ్డప్పుడు –
హఠాత్తుగా కనిపించాడొక అధికారమిత్రుడు
చిన్ననాటి నా క్లాసుమేటుడు !

మర్నాడు జరిగిన అధికారిక
మాయాజయంతి ఉగాది కవి సమ్మేళనలో
మహాకవుల పంక్తిలో వెలిశాను నేను
ఖద్దరుపంచీ, సిల్కులాల్చీలతో !
లక్ష బీరుసీసాల బలంతో ఉబ్బి
తబ్బిబ్బై నిలిచాను మైకు ముందు !

మెడలోపడ్డ పెద్ద
ముద్దగులాబీల మాల
ఎడాపెడా ముద్దులు కురిపిస్తుంటే
తుడిచేసుకొంటూ కవిత కోసం
పేంటు జేబులోకి చేయి పోనిచ్చాను,
కాని, కాని--
అక్కడ పేంటు లేదు !

## 19. దేశం ముందడుగు వెయ్యాలి

దేశం ముందడుగు వెయ్యాలి
అవును వెయ్యాలి !
అయితే – ఇప్పుడు వేస్తున్నది ?
ముందడుగు కాదా ?

దేశ మంటే ధర లనుకొంటే
దేశ మంటే జనాభా అనుకొంటే
దేశ మంటే రూపాయి నోట్లనుకుంటే
దేశ మంటే వచన కవిత లనుకొంటే
ఇప్పుడు వేస్తున్న ఒక్కొక్క అడుగూ
ఒక్కొక్క స్కై రాకెట్టే కదా ?

దేశ మంటే ధన ధాన్యా లనుకొంటే
ఒక్కొక్క సిమెంటు మేడ చీకటి గదీ
ఒక్కొక్క రత్నగర్భే కదా ?
దేశ మంటే ప్రజాస్వామిక రాజకీయా లనుకొంటే
ప్రతి గ్రామపంచాయతీ చావడీ
ఒక్కొక్క ధర్మక్షేత్రమే కదా ?

దేశంలోని ప్రతిగుంట నీళ్లూ
పాలై ప్రవహిస్తున్నవి !
పల్లెల్లోని ప్రతి బెడ్డరాయీ
బియ్యం స్టేటస్‌తో బస్తాల కెక్కుతున్నది !
పెంటల్లోని ప్రతి పేడకడీ సాంబారు పొడై
విస్తట్లో గుబాళిస్తున్నది !

అంతర్జాతీయ రంగంలో
మన బేరసారాల నిజాయితీ, ఖ్యాతీ
మన క్రీడా వినోద విన్యాసాల శక్తీ, యుక్తీ
ఓహో! యమ!

ఇదంతా దేశం ముందడుగు వెయ్యడం కాదా ?
ఇదంతా వట్టి వక్రోక్తి అంటారా ?
చెప్పేదేదో సూటిగా చెప్పమంటున్నారా ?
అయితే – ఇదిగో వినండి!
ఇప్పుడు దేశం వెయ్యవలసింది–
ముందడుగు కాదు! వెన కడుగు!

పారతంత్ర్య పరమాంధకారంలో
ఇక తెల్లవారదేమో అన్నంత నిస్పృహలో
హఠాత్తుగా అర్ధరాత్రి

మిట్ట మధ్యాహ్న మైనప్పుడు
ఆ తీక్షణ కాంతి కిరణాలు
కళ్లల్లో గుచ్చుకుపోయి
మనలో ముందున్న కొందరు
అంధుల మైపోయినప్పుడు
ముందుకే అనుకుంటూ
కొన్ని దశాబ్దాలు తప్పుదారిని వచ్చేశాం.

అయ్యా, ఆగండి !
మనం ఇప్పుడు పోతున్నది
మనం పోదలచిన మార్గంకాదు!
ప్రమాదంలో పడిపోతున్నాం-
ఆగండి ! వెనక్కు మళ్లండి !

ఊతకర్రతో, ఉక్కుకాళ్ళతో
బోసి నోటితో, బుద్ధ దీక్షతో
సంపూర్ణ త్యాగంతో
సర్వజన శ్రేయోయోగంతో
భారతాత్మ వేస్తూ వచ్చిన ముందడుగు
ఎక్కడ ఆగిపోయిందో అక్కడికి !

ఆగస్టు ప్రజా విప్లవం
దాస్యవిమోచన మహావిప్లవం అయినచోటికి
స్వాతంత్ర్య చండభాస్కరుడు
మన సమదృష్టిని సంహరించిన చోటికి
స్మగ్లర్లు, హోర్డర్లు, కల్తీ విషపు పురుగులు
అధిక ధనాశాపరులు, కుల మతోన్మాదులు
పదవీ దురోదరులు ఇంకా పుట్టిపెరగని ఆనాడు
పవిత్ర భారత సమసమాజ నిర్మాణోద్యమం
ఎక్కడ ఆగిపోయిందో అక్కడికి
వెనుతిరిగి కదలండి !

దేశం ముందడుగు వెయ్యాలి
అవును, వెయ్యాలి !
అక్కడినుంచి వెయ్యాలి !
సర్వజన శ్రేయోరాజ్య నిర్మాణంకేసి
సర్వజన సుఖసంతోషాలలోకి వెయ్యాలి !
దేశం ముందడుగు వెయ్యాలి !
ఆ ఉగాదినుంచి వెయ్యాలి,
ప్రతి అడుగూ ఒక ఉగాదిగా వెయ్యాలి.

(1975 జాతీయ కవి సమ్మేళనం (ఢిల్లీ) తెలుగుకు ప్రాతి నిధ్యం వహించిన కవిత)

## 20. అమ్మ వస్తున్నది చూడు

అమ్మ వస్తున్నది చూడు !
కాళ్ళకు నీళ్లు పెట్టు !
గోదావరి గుండెల్లో ఇంకి
మన బావిలో ఊరిన నీళ్ళు –
అంతర్వాహిని అయిన సరస్వతిని
అభిషేకించి తేరిన నీళ్ళు –
అలసివస్తున్న అమ్మపాదాలకు
ఆహ్లాదం కలిగిస్తే చాలు !

పాదాలు కడిగి–
పైట చెంగుతో ఒత్తి –
కళ్ళ కద్దుకొంటావు కదూ ?
కంగారుపడి మరచిపోయేవు ?
దాహానికి ఏమిస్తున్నావ్ ?
మన గంగా బొండాల నీరేనా ?
ఆకాశ గంగ లంకలలోని
అమృత సరస్సులలో ఇంకి,
మన ఎలతోట తొలి బొండాలలో
ఊరిన పీయూషవారేనా ?

రసదాళి చెరుకు రసంతో -
లేత ముంజెల మధురాసవంతో -
హైదరాబాదు అనాబ్‌షాహీలను
విప్పకల్లులో పిసికి వడగట్టిన
తేటతెనుగు పానీయంతో -
వేప పువ్వు రేకలు కలిపిన
కొత్త బెల్లం పానకంతో -
గళాసులు నింపి ఉంచు !
గళం సవరించుకొని ఆహ్వానించు !
మిగిలింది తీర్థంగా పంచు !

ఆసనం ఎక్కడ వేసావ్ ?
మన గున్నమామిడి నీడలోనే కద ?
ఆ కోకిల గుంటడు
వీణ తెచ్చుకున్నాడో లేదో, చూడు !
పచ్చివగరు గొంతుకతో
ప్రాణం తీస్తుంటాడు వాడు !

దక్షిణాది గంధం తోటల నుంచి
వచ్చిన విసనకర్రల కుర్ర కుంకలు
అమ్మను వట్టి అమ్మమ్మ అనుకొని
తోక ఝాడిస్తారు, జాగ్రత్తపడు !

మళ్లీ అరవై ఏళ్ళకు
మనసుపడి వస్తున్నది అమ్మ !
నాకు రూపం ఇచ్చిన అమ్మ !
నీకు దీపం చూపిన అమ్మ !

విరోధికృత్తు అన్నారు అమ్మను !
ఎవరికి ఎవరు విరోధి ?
మనిషి తనకు తానే విరోధి !
ఆత్మీయులైన అన్నదమ్ములు
ఆస్తికోసం కొట్టుకు చస్తూ
అమ్మను నిందించి ఏం లాభం ?
తన దురాశా దుర్మార్గాల ఫలితాన్ని
ఏ పిల్లికో, బల్లికో అంటగట్టి –
ఆత్మవంచన చేసుకొంటాడు మనిషి !
అమ్మను ఆడిపోసుకుంటాడు కినిసి !
విషం మింగుతాడు చావాలని
విధిని నిందిస్తాడు చంపుతాడని !
అరవై ఏళ్లు !
రెండు తరాలు, మూడు యువతరాలు !
ఇన్నేళ్లూ ఎక్కడున్నదో అమ్మ ?
నా పూజా పుష్పాల బాలబతకమ్మ !

కాల ప్రభుత్వపు కేబినెట్టులో
అరవై మంది కల మంత్రిమండలిలో
నన్ను కన్న అమాత్య లలామ !
విరోధి కృన్నామ !

కాలతరంగడోలకు
బాలమాత హస్తఖేలగా,
జగద్వ్యాపార సమాసక్తికి
సమాసక్త పరాశక్తిగా,
పనుల్లో మునిగి ఉంటుంది !
పండుగలకు వస్తూంటుంది !
ఏ ద్వైదీ ప్రణయానంద హేలకు
ఏ రసాద్వైత పారవశ్య లీలకు
రూపంగా ప్రాణం పోసిందో నాకు !

మేనక శకుంతలనులా నన్ను
లోకానికి వదిలేసి పోయిన అమ్మ
మళ్లీ అరవై ఏళ్ల తర్వాత
చూచి పోదామని వస్తున్నది, చూడు !
మొత్తం స్వాగత సాహిత్యానికే
సర్వమంగళ సమతా సాహిత్యానికే
స్వరం కట్టి పాడు !!

(1971 లోని విరోధికృత్తు ఉగాది. నా జన్మవత్సరం. విజయవాడ ఆకాశవాణిలో ఆనాడు చదివాను.)

## 21. ప్రమాదం తప్పించిన ప్రమాదం

భాగ్యనగరంలో
ఒక విశాలమైన రోడ్డు,
ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ
మెల్లగా పోతున్నది కారు !

కారు ఎంత మెల్లగా నడిచినా
పరిగెత్తే ఎద్దుబండికంటె వేగతరమే !
కారుకు దారివ్వకుండా బండి మాత్రం
ఎడ్ల పేగులు తెంచేస్తూవుంది !

కారు వేగాన్ని నిరోధించాలని
ఎందుకో బండికంత ప్రయాస !
పోనీలే అనుకొన్నట్టున్నది
అనాసక్తంగా పోతున్నది కారు !

బేరు మంటూ పడింది హఠాత్తుగా బ్రేకు,
పక్కకుపడిపోయిం దొక ఎమ్ములగూడు !
ముఖం ముందు సీటుకు గుద్దుకొని
తొంగిచూశాడు వెనక సీట్లోని రామం.

పెద్దప్రమాదమే తప్పింది !
హమ్మయ్య అనుకొన్నాడు రామం,
ఒళ్ళు దులుపుకొంటూ లేచి
పేవుమెంటెక్కింది ఎమ్ములగూడు !

అప్పటికే జనం
చుట్టుముట్టేశారు కారును,
ఇప్పుడు కారు తలరాత
జనంచేతిలో ఒక పిచ్చిగీత !

అంతవరకు ఎవరూ కనిపించరు,
ఎక్కడైనా ఏదైనా జరిగితే చాలు
చచ్చిన ఎలకచుట్టూ కాకుల్లా
వచ్చిపడతారు జనం వందల్లో !

విమర్శలు, విసుళ్ళు, తిట్లు –
కొందరు డ్రైవరుమీదకు పోతే
కొందరు ఓనరుమీదకు దూకారు !
కారు ఔచిత్యాన్నే ప్రశ్నించారు కొందరు !

"ఎద్దుబండికే తప్పుకోలేం కదా
కార్లెందుకయ్యా మనమధ్య" అంటూ
నిగ్గదీసి అడిగేశారు వాళ్లు –
ప్రతివాడూ ఎదురైన ప్రతి మొగంమీదా !

వెట్టికి కర్మ క్రిందివా డైతే
ఆక్సిడెంటుకు కర్త పై వాడు.
న్యాయం చెప్పగల రోడ్డుకు నోరు లేదు,
నోరున్న జనానికి ఆలోచించే తీరు లేదు.

ఇ దేదీ పట్టినట్టులేదు రామానికి
చూస్తున్నాడు ఆ ఎమ్ములగూడుకేసే !
ఎక్కడో చూచినట్టుంది అతడిని –
తా నెరిగిన ఎవరి పోలికలోవున్నై అతడిలో !

ప్రమాదం తీవ్రమయింది కాకపోయినా
ప్రమాదం ప్రమాదమే కనుక –
ఎమ్ములగూడు ఎంతడిగితే అంత
ఇచ్చి పోదా మనుకొంటున్నాడు రామం !

ఇంకా కారుకిందే పడివున్న తన ఊతకర్రను
చేతిలోకి తీసుకొని ఆ ఎమ్ములగూడు

"ఆగండ్రా ! ఆగండి !" అన్నా డంతలో !
ఆశ్చర్యంలో మునిగిపోయింది అల్లరంతా !

"కారుకింద పడింది నేను,
పొరపాటు నాది, కారుది కాదు,
పోనియ్యండి దాన్ని" అనేసి, ఆ పేదవాడు
నడక సాగించా డా పేవుమెంటుపై !

ఆశ్చర్యచకితుడేఅయాడు రామం
పిట్టలే అయిపోయారు జనం
మెప్పుగా తల లూచిన్నై చెట్లు,
బ్రతికా ననుకొంది మానవత !

కారెక్కించుకొందా మనుకొన్నాడు రామం
ఏదైనా ఇద్దా మనుకొన్నాడు, కనీసం
అత డెవరో తెలుసుకొందా మనుకొన్నాడు,
ఏదీ సాధ్యం కాలేదు !

చప్పున జ్ఞాపకం వచ్చింది రామానికి
తన చిన్నప్పుడు తన పల్లెలో
తమ పక్కింటి కవ్వీశు
అచ్చం ఇలానే వుండేవాడు !

కారు ముందుకు సాగింది,
రాముం మనస్సు వెనక్కు దూకింది !
అవును– తన పక్కింటి కవ్వీశు
తన నెంత ప్రేమగా చూసేవాడు !

తన పల్లె అంటే –
తనకోపల్లె ఉన్నదా ?
అదే, సర్కారు పుంత !
పుంతలో హరిజనుల గుడిసెలు !

తమ గుడిసె ప్రక్కగుడిసె కవ్వీశుది
అత డొక్కడే వుండే వా డందులో,
అతడితోడు ఒక తంబురా,
ఒక ముసలి కుక్క !

ఒకరికి లోబడివుండే తత్వం కాదతడిది,
తమ పేటవాళ్లంతా కూలీలుగానో
పాలేళ్లుగానో బ్రతుకు లీడుస్తుంటే – అతడు
జంగం కథలు పాడుకుంటూ జీవించేవాడు !

చిన్నప్పటి జ్ఞాపకాలు–
మంచివైనా, చెడ్డవైనా
మనోహరంగానే వుంటై !
మధు వందిస్తూనే వుంటై !

తనకు తెలిసిన జానపద కథలన్నీ
కవ్వీశు చెప్పినవే !
అంటరానితనం కోరలనుంచి కూడ
ఎన్నోసార్లు కాపాడా డతడు తనను !

తన బాల్య మంతా వెండి తెరపై వలె
కళ్ళల్లోకి వచ్చి నిల్చింది రామానికి !
తాను పై చదువుల కని పట్నంపోయాడు,
కవ్వీశు ఏమైపోయాడో గుర్తులేదు !

ఆనాడు ఆ మురికిపేటలో
తా నొక పిరికి పిల్లవాడు,
ఈ నాడు ఈ భాగ్యనగరంలో
ప్రాభవ సంపన్నుడైన ఒక అధికారి.

మారాలి ఇక తాను
మరల్చాలి ఇక తన కారును,
కవ్వీశు తన కిచ్చిన ఉగాది సందేశం
ఈ కారు ప్రమాదం !

మొన్ననే కదా తాను
తన సొంతూరు వెళ్ళివచ్చాడు ?
ఇప్పుడు తనుపేట
అప్పటి సర్కారు పుంతకాదు !

ప్రధానగ్రామం వీధుల్లో
తమపేట ఒక క్రొత్తవీధి !
ఆ నాటి నిరుపేద బక్కకూలీలు
ఈనాడు సొంత భూముల పక్కా రైతులు !

ఆనాడు తమ పాదధూళిని
తన నుదురుతోకూడ తాక నివ్వని అరుగులు
మురుగులు తొడిగి మురిశా యంటే
ఎంతలో ఎంత మార్పు !

ఆర్ష హృదయం మళ్లీ స్పందిస్తున్నది,
భారతాత్మ మేల్కొంటున్నది,
నిరంతరదాస్యం కింద అణగారిపోయిన
ఉపనిష దంకురం ఉత్తేజిత మవుతున్నది !

కులం, వర్ణం, కలిమి, లేమి –
ఈ అనార్ష అవైదిక దుస్తంత్రం నుంచి
భారతీయుడు బయటపడుతున్నాడు !
సమ సమాజానికి పునాది వేస్తున్నాడు !

సంభవామి యుగేయుగే అంటే
ఇదేనేమో అనిపించింది రామానికి !
ఆ నాటి కవీశేనా
ఈ రోజున కారుక్రిందపడ్డ మాన్యమూర్తి ?

దైహికంగా అతడే ఇతడు కాదు,
దైవికంగా అతడే ఇతడు !
దేహమాత్రోపజీవి కాగూడదు తాను ఇక !

భాగ్యనగరంలో
అదొక విశాలమైన రోడ్డు,
గతాన్ని భవిష్యత్తుతో ముడిపెట్టుకొంటూ
కదిలిపోసాగింది మెల్లగా రామం కారు.

కష్టాల పుట్టనుంచి పుట్టాడు తాను
భోగభాగ్యాలలో మునిగిపోదా మనుకొంటున్నాడు,
కారు ప్రమాదం రూపంలో వచ్చి
జీవిత ప్రమాదం నుంచే తప్పించింది కవీశు స్ఫూర్తి !

తనపేట బాగుపడి వుండవచ్చు,
మురికిపేటల్లో తొంభై పాళ్లు
ఎక్కడి వక్కడే పడివున్నై ఇంకా !
వాటి ఉద్ధరణకు పూనుకోవా లిక తాను !

## 22. ఉగాది చేదు

నలనామ నవ నవోదయ
నలినాలయ వచ్చి నిల్చినది గుమ్మములో !
చెలి ! పిల్చి, సహృదయుల గుం
డెలు నిండ, ఉగాది పచ్చడిని పంచగదే !

కొత్త బెల్లపు రుచులతో మత్తు గూర్చి
ఎంత చేదైనగాని మింగించవచ్చు,
శివుడు కాగల్గు నెవ్వడు చేదు తినక ?
అమృత మన నేమి ? జీర్ణ మౌనట్టి విషమె !

ఇది యమర్జంసీ యుగం కనుక
యమ అర్జెంసీతో చేసెయ్యాలి ఏ పనైనా ?
నిజానికి - భగవంతు డెత్తిన ప్రతి అవతారమూ
ఒక్కొక్క ఎమర్జంసీయే కాదా ?

పెరకలేక నరికిపోయేవాడు భగవంతుడు,
పెరికే పారెయ్యాలి నీ విప్పుడు ముళ్ళడొంకల్ని
మన సంస్కృతి సీత మళ్ళీ ఒక మాయ లేడికి
బలి కాకుండా ఉండా లంటే !

స్మగ్లరో, హోర్డరో, బ్లేకుమార్కెటీరో,
లంచగొండియో, కులతత్త్వ వంచకుండో,
కంటకు డొక్కొ డొకొక లంకాధిపుండు!
పుండు మాననిచో శస్త్ర ముండు కాదే?

దేవతల పేర్లతో తమ దేబె నోర్లు
నింపుకొను రాహువులు పంక్తినిండ కలరు,
కనుగలిగి యేలుకొమ్ము! చక్రమును చేత
నుంచుకొను మెప్పు హక్కులు పంచునపుడు!

మిగులు భూమిని సమంగా పంచాలి,
హలక్కి భూమికి ప్రచారం పట్టా లివ్వడం మానాలి.
గ్రామం మధ్యలో హరిజనులకు ఇళ్ళు కట్టాలి,
ప్రత్యేక కుల కాలనీలను రద్దు చెయ్యాలి!

జాతిని విచ్ఛిన్నంచేసే తుచ్ఛతను నిర్మూలించేదాకా
సర్వసమత్వవైదిక సోషలిజాన్ని నెలకొల్పేదాకా
ఈ ప్రగతీశ్వరాంశిని ఉపసంహరించకు!
నలనామను అనల ధూమ కానివ్వకు!

## 23. సమర గీత

సత్యం వద, ధర్మం చర–
పాపాయ పరపీడనం–
ఆత్మ వ త్సర్వ భూతాని–
ఓం శాంతి, శాంతి, శాంతి–

ఇలాంటి నీతులూ, నినాదాలూ, లక్ష్యాలూ
తెలియకనా మనిషి దుష్టు డవుతున్నది ?
సుమతీ శతకం పద్యం ఒక్కటి చాలదా
ఆచరిస్తే అమృతం పొందడానికి ?

నిరంతరం శాంతి జపం చేసే ఈ ఆర్ష సమాజం
అశ్రాంతం అశాంతిలో మునుగుతున్న దెందుకు ?
స్వార్థాలకు కళ్లాలు పెట్టలేక !
అర్థకామాలకు అంకుశాలు పట్టలేక !

బిడ్డలు పసివాళ్ళూ, నిరాయుధులూ అయివుండి
దున్నలు ఊబిచిమ్ముతూ పైబడుతున్నప్పుడు
తల్లి మహాలక్ష్మి అయినా
బరిసెగొని బరి మీదకు రాక తప్పదు !

కించి దావేశమున పరికించిచూడు
వేదయుగముల నుండియు విశ్వచరిత !
మనుజ ప్రకృతికి చీడ పట్టినపు డెల్ల
ఆదుకొన గల్గినది చక్రమేదొ కాదె ?

రాక్షస స్వార్థ నిశితదంష్ట్రలకు చిక్కి
మానవతయె నశించు ప్రమాదముందు
తనకు కానట్టు లూరకుండు నటె ప్రభుత?
శాంతి సౌఖ్యమ్ములకు నేత సమరగీత !

స్మగ్లరో, హోర్డరో, బ్లేకు మార్కెటీరో-
కంటకు డొకొక్కడొకొక లంకాధిపుండు !
పుండు మాననిచో, శస్త్రముండు, సాధ
న మ్మదే దైన దుష్ట నాశమ్ము వలయు !

భగవంతుని ఒక్కొక్క అవతారం
మానవచరిత్రలో ఒక్కొక్క ఎమర్జన్సీ !
ముళ్ల డొంకల్ని పెరకడం సాధ్యం కానప్పుడు
నరికి పారేసి పోయాడు భగవానుడు !

మరి – ఈనాటి ఎమర్జన్సీ ?
నరకుల పాలిటి నారీతాంకృతే కాదు
హరిజనత కన్నుల్లో ఆశారుణ కిరణం !
బహుజనత బ్రతుకుల్లో ప్రగతి సుధారథం !

సంభవామి యుగే యుగే చదువు కాదు,
సత్కరామి క్షణ క్షణే చర్యవలయు !
సమరవేగాంశి యౌ ఎమర్జన్సి కాదె
మలుపు మలుపున వెలుగిచ్చె మానవునకు ?

ఖలుల, నరపీడకుల పాత కంపు డొక్క
చీల్చి, డోలు కట్టిన ఎమర్జెంసి మనది,
ద్రోహమును, దుర్వ్యవస్థను ద్రుంచు ఝాంసి !
ఈ ఎమర్జన్సీ నవ్యార్థకే విరించి !

## 24. భిక్షుక జాతి

"కొంచెం పెన్ను ఇస్తావా, వ్రాసుకొనిస్తాను ?"
పాపం, వ్రాసేవాడికి పెన్ను లేదు !
"కొంచెం దువ్వెన ఇస్తావా, దువ్వుకొనిస్తాను?"
పాపం, తలున్నవాడికి సంస్కారం లేదు !

"కొంచెం అద్దం ఇస్తావా, ముఖం చూచుకొనిస్తాను ?"
పాపం అద్దం లేకపోతే ముఖముండి ఏం లాభం !
"కొంచెం పత్రిక ఇస్తావా, చదివిస్తాను?"
పాపం, చదువుకొన్నవా డెంత దరిద్రుడు !

"కొంచెం పొలం ఇస్తావా, పండించుకొనిస్తాను ?"
పాపం దున్నేవాడిదే భూమి ఎన్నడవుద్దో !

అతడు ఆదిభిక్షువు కులంవాడు
ఆ త్రివిక్రముడి వంశంవాడు
అన్న సత్యం గుర్తుకు వచ్చి -
చేతులు మోడ్చి అన్నాను-

"నీకు కావలసిన సమస్త సౌకర్యాలూ
నేను సమకూర్చి పెడతాను, భిక్షూ !
నీవు పోయి ఆ పంచను కూర్చో" అని !

అవును–నిజం
అతడు ఈ మొత్తం జాతికి ప్రతినిధి,
ముష్టెత్తుకోవడం అతడి జన్మహక్కు !
ఈ జాతినంతా మేపడం నా కర్తవ్యం,
నేను మట్టినుంచి మధువును పిండే కార్మికుణ్ని !

## 25. ధర ధరలైన సంతలో

ఎన్నో వున్నై !
వెలుగే లేదు !
అర్వై కోట్ల సరుకు,
అవసరానికొకటీ కనిపించదు,
అంతా వుంది-
వెలుగే లేదు !

ధరపై ఏమీ లేనట్టుంది !
నిజానికి ధరెక్క డుంది ?
ధర బహువచనమై, ధరలై,
వినువీధుల్లో విహరిస్తోంది !
మట్టి, ఇక్క డేముంది ?

ఇది వట్టి సంత !
సంతగోల తప్ప, సరసమైన దేదీ లే దిక్కడ
కళా లేదు, కాంతీ లేదు ;
పూర్వం ఎంతో వుండేది,

అంతా అందరికీ దొరికేది
నా వాళ్లకే కాదు
నానా జాతులకూ అందేది !

అదిగో, ఏదో శాల్తీ ఇటు వస్తున్నది !
కాదు, అటు పోతున్నది !
అది మానవుడా? అతడి నీడా?
ఆ చేతులోది కూడా ఖాళీ సంచీయే !
సంతలో ఏవో వున్నట్లేవుంది కాని యేంలాభం ?
సంచీ దాకా రావడంలేదు !
వెతుక్కోందా మంటే–
వెలుగు లేదు !

ఎక్కడికోయ్, బాబూ ?
ఎక్కడికి పోతున్నావ్ ?
ఎక్కడికి ? ఎక్కడి నుంచి ?
గమ్యం ఏది ? ఎంత దూరం ?

బందరు నుంచి బైలుదేరి
భాగ్యలక్ష్మి మందిరంకేసి పోతున్నావా ?
అయ్యో, మోసపోయా వయ్య, ఆలస్యం చేశావు !
నీవుపోతున్న లక్ష్మీమందిరం బ్రతికి లేదు,
ఇప్పు డది కేవలం ఒక మమ్మీ !

ఆగవయ్యా, ఆగు !
ఆగి ఆలోచించు !
ఎక్కడ బైలుదేరావో –
ఎప్పుడు బైలుదేరావో –

నీవు తెచ్చుకొన్న తిండి పొట్లాలైపోయినై,
విస్తరాకులుకూడా నాకేసి నమిలేశావ్ !
కుక్కలు కూడా నీ వెంటరావు
కాకులుకూడా నీకు తోడులేవు !

అదేమిటి ?
జేబుల నిండా, బేగ్గుల నిండా,
సూట్‌కేసుల నిండా
ఏమిటి నింపుకొచ్చావ్ ?
రాళ్ళా ? రత్నాలా ? నోట్లా ? వోట్లా ?

నీ వెటు పోతున్నావో గుర్తుందా ?
నీ ముందున్నదేమిటో గుర్తించావా ?
చీకటి ! ఇంతకంటే కటిక చీకటి !
కీకారణ్యం ! మానవ మృగశాల !

అక్కడుండేది దొంగలో, దయ్యాలో,
పాడు గుడుల్లోని ఆకటి దేవతలో !
బియ్యం దుకాణంలోని బొజ్జ దొరలో !
నీ రాళ్ళకు విలువకట్టేది వాళ్ళే !
నీ వోట్లతో ప్రభువులయ్యేదీ వాళ్ళే !

వద్దు బాబు, వద్దు ! నా మాట విను !
అటు పారెయ్ ఆరాళ్ళను !
ఇటు మళ్ళు ఈ నాకేసి !
కూర్చో కాసేపు ఈ మామిడి నీడలో !

"నీ వెవరి వమ్మా," అంటున్నావా ?
నేను దిక్కుమాలిన తెలుగు తల్లిని,
భద్రతలేని భరతమాతను,
ఆశతో సంతకు వచ్చి
అన్నీ వుండీ ఏమీ కనిపించక
నిరాశతో నీరసించిపోతున్నదాన్ని !
ఎటు వచ్చానో –
ఎటు పోవాలో –
అంతా చీకటి !
సంత గోల !
వెలుగైనా దొరుకుతుందేమో
వెడదాం ఈ ఉగాదిలోకి !

## 26. ప్లస్సు - మైనస్సు

దేశంలో ఆహారోత్పత్తులు పెరిగాయి,
వాటిని తినే నోళ్ళూ పెరిగాయి ;
ఉద్యోగుల జీతభత్యాలు పెరిగాయి,
బజార్లో ధరలూ పెరిగాయి !

పాఠశాలల్లో పనిగంటలు పెరిగాయి,
ఉదయం పిల్ల క్లాసుల్లోనే నిద్రపోతున్నది,
సాయంత్రం పిల్ల ఆ చీకట్లో
ఎటు పోతున్నదో దానికే తెలియదు !

ఇక్కడ మున్నేరుపై ఒక ఆనకట్ట మొలిచింది
అక్కడ గోదావరి ఆనకట్టకు గండిపడింది ?
సకాల వర్షాలకు చక్కగా పండాయి చేలు
అంతలో తుపానుకొట్టి అయిందంతా గంగపాలు !

పేద రైతులకు పట్టా లొచ్చేసినై
భూములే కనిపించలేదు !
జగత్తంతకూ జాతీయ సమైక్యం,
హరిజనులు మాత్రమే ఊరికి దూరం !

విజ్ఞానం రాకె ట్లెక్కి
వినువీధుల్లో విహరిస్తున్నది,
మూఢత్వం మురికి మూలల్లో
మోసం కాళ్లకు మొక్కుతున్నది !

పరిశ్రమలు పెరిగాయి
పదవులూ, ఉద్యోగాలూ పెరిగాయి
ఫైళ్లూ, పైరవీలు పెరిగాయి
పనిలేనివాళ్ళ జాబితాలూ పెరిగాయి !

ఇరవై సూత్రాల ఇంద్రధనుస్సును చేతబట్టి
ప్రగతి రథం ఉరికింది ముందుకు,
అది ఏ దేవుడి రథమూ కాదే అని
వెర్రిగా నిలబడిపోయాడు సామాన్యుడు !

ప్లస్ గుర్తు ఎంత పెద్దగా పెరిగితే
అంత పెద్దగాను పెరుగుతున్నది మైనస్ !
ప్లస్సు, మైనస్సూ సమఉజ్జీ అయితే
ఏ దేశాభ్యుదయమైనా గొంగళే !

సామాన్యుడు చైతన్యవంతుడు కాకపోతే
గంగకూడ మురికి కాల్వే,
జాతికి సైంటిఫిక్ టెంపర్ రాకపోతే
ఉగాది కూడ అంధయుగమే !

## 27. పిట్ట గూళ్ళు ఈ మెదళ్ళు

ఏ మనిషీ ఒకేసారి పుట్టడు
క్రమ క్రమంగా పుడతాడు,
ఒకేసారి చావడు
మెల్ల మెల్లగా చస్తాడు.
ప్రకృతిలో ఏ లవాన్ని పరిశీలించినా
ఈ సృష్టి రహస్యం విదిత మవుతుంది !

### 2

మానవ జీవితాన్నే పరిశీలించు !
పుట్టుకతో వచ్చిన అనేకం
చచ్చేవరకూ వుండవు !
మధ్యలో వచ్చే కొన్ని
మధ్యలోనే పోతై కూడ ?
ఆ వృద్ధుణ్ని చూడు
ఇంద్రియాలు ఏ నాడో పని మానుకున్నై
మెదడు మూలబడింది

ప్రాణం శుష్కించింది
మిగిలివున్న దేమిటి ?
పోయిన తొంభై శాతం ఏమయింది ?
మిగిలిన పదిశాతం ఏ మవుద్ది ?

## 3

నూనె తరిగే కొలదీ
కాంతి క్షీణిస్తుంది,
శక్తి సరఫరాను బట్టి
జీవితం వికసిస్తూ, శుష్కిస్తూ వుంటుంది,
కోమాలో మనస్సు వున్నదా ?
అపస్మారంలో ఆత్మ వున్నదా ?
ఆశ, ఆత్మీయత ఏవి ?
డబ్బై యేళ్ళకు బాల్యం గుర్తులేదు
ఎనభై నాటికి యౌవనం జ్ఞప్తిలేదు
తొంభైకి తా నెవరో తెలియదు
ఇది సామాన్యుడి జీవిత క్రమం
మరి, పునర్జన్మ అవకాశం ఏది ?

## 4

పునర్జన్మ సిద్ధాంతం తప్పుడిది
కర్మ సిద్ధాంతం మోసగాళ్ళది
చచ్చిన తర్వాత ఏం జరుగుతుందో
బ్రతికున్నవాళ్లకు ఏం తెలుస్తుంది !
జీవం క్రమంగా వికసిస్తుంది,

క్రమక్రమంగా క్షీణిస్తుంది,
అదే జీవం మళ్లీ ఎలా పుడుతుంది?
క్రమంగా ఎండిపోయిన చెరువు
అదే నీటితో మళ్లీ ఎలా నిండుతుంది !

## 5

నమ్మకు, ప్రియా !
దేనినీ మూర్ఖంగా నమ్మెయ్యకు !
ఏ మనిషీ సర్వజ్ఞుడు కాదు !
ప్రతి మనిషికీ స్వార్థం వుంది.
యౌవనంలో కామమే పరమార్థ మను కొన్నవాడు
అది చచ్చిపోయిన చాల కాలానికి చచ్చిపోతే
పునర్జన్మ ఎత్తేది ఏది ?
మానవుడు అనేక శక్తుల సమాహారం,
ప్రతి శక్తీ దేని కదే స్వతంత్రం ;
ఏదీ కర్మకు నిబద్ధం కాదు
ప్రతి కర్మా సాపేక్షం, స్వతంత్రం కాదు.

## 6

ప్రపంచంలో పరస్పర విరుద్ధాలైన ఇన్ని మతాలు
పరస్పరం కొరుక్కొంటూ, నరుక్కొంటూ కూడ

ఎందుకు బ్రతికిఉంటున్నాయో తెలుసా ?
అన్నీ సత్యమే ప్రకటిస్తున్నాయి కనుక !
ఏమిటా సత్యం ?
తమ కేమీ తెలియ దన్న సత్యం !
చచ్చిన తర్వాత ఏం జరుగుతుందో
బ్రతికున్నవా ళ్లెవరూ ఊహించలే రన్న సత్యం !
భగవంతు డొక్కడే జగత్పిత అంటూనే
అతడికి ప్రియతమ వారసుణ్ణి నేనే అంటూ
ప్రతి ప్రవక్తా కరవాలం ఝళిపిస్తాడు కనుక!
ప్రతి ఉన్మాదీ మత యుద్ధాలు నడుపుతాడు కనుక !
భగవంతుడి సమాధిపై ఆధిపత్యం కోసం
అన్ని మతాలూ చావడానికైనా సిద్ధపడి
ఒకదానిపై ఒకటి మోహరించి వున్నై కనుక !

## 7

మన కాలంలో మన అనుభవంలోని
ఒక వాస్తవాన్ని పరిశీలించి చూడు !
జాతిపిత గాంధీమహాత్ముడు తెలుసు కదా ?
అతణ్ణి జాతిపితగా, మహాత్ముడిగా,
అహింసాయోధుడిగా, సత్యాగ్రహ ప్రవక్తగా,
రవి అస్తమించని మహాసామ్రాజ్యాన్ని ఓడించిన
భారత దాస్య విమోచకుడిగా,

అంతవరకూ పూజించిన జాతి
స్వాతంత్ర్యం వచ్చిన మరుక్షణమే
అతణ్నీ, అతని సిద్ధాంతాల్నీ, కార్యక్రమాల్నీ
ఒక్క దెబ్బతో కాల్చి చంపివేసింది !
అందరు ప్రవక్తలూ అలా
అనుచరుల చేతుల్లో చచ్చిపోయినవాళ్లే !
వాళ్ళ పేర్లతో మిగిలివున్న మతాలు
వట్టి మమ్మీలు, నిలవ శవాలు !

## 8

తెలీదు, తెలీదు, తెలీదు–
జీవితం గురించి
దాని పూర్వాపరాలను గురించి
ఎవరికీ ఏమీ తెలియదు,
తన కేమీ తెలియ దని తెలుసుకొన్నవాడు జ్ఞాని,
అట్టి జ్ఞానంతో వ్యాపారం చేసుకొన్నవాడు ప్రవక్త !
అట్టి ప్రవచనాల గుత్తవ్యాపారానికి
బ్రాంచి మేనేజర్లు, ఏజెంట్లు నాయకులు !
ఈ రహస్యం తెలియనివాళ్లు,
దానికి దూరంగా ఉంచబడినవాళ్లు,
తమ మార్కెట్టు సరుకే అసలు సరుకని

పెత్తందార్లచే బ్రెయిన్ వాష్ చెయ్యబడ్డవాళ్లు,
కా దన్నవాళ్ళని తన్నా లన్న ఉద్రేక విషం
రక్తం నిండా ఎక్కించబడ్డవాళ్లు ప్రజలు,
ఆ ముఠా సొంత ప్రజలు !
ఎంత ఖరీదైనా పెట్టి
అ దెంత నాసిసరుకైనా, అదే అమూల్య మనుకొంటూ,
దాన్నే కొనుక్కొని బ్రతికే కష్టమర్లు !
పట్టి మందలు !

## 9

ఏ మంద కా మందే స్వతంత్రం !
ప్రతి మందా తన కామందుకు బానిస !
ఏ మందలో పుట్టిన ప్రాణికి
ఆ మంద నియమావళి శిరోధార్యం !
మరో మందను గురించి తెలియదు !
మరో మంద తనకు జన్మశత్రువు !
రెండు మతాల మధ్య శత్రుత్వం
రెండు గుత్తవ్యాపార సంస్థల మధ్య పోటీ !
అంతే, అంతకన్న ఏం లేదు !
అంతకన్న ఎక్కువ ఎవడికీ ఏమీ తెలీదు !
అందుకే, దేవీ !

ఈ లోకంలో దేన్నీ గుర్తించకు !
అందరూ మనలాంటి మనుషులే !
అందరూ చచ్చి స్వర్గానికి పోయేవాళ్లే !

## 10

"స్వర్గానికా ?
మళ్లీ, అదేమిటి ?" అంటున్నావా ?
భయపడకు, అదొక సామెత.
చచ్చి స్వర్గానికి పోవడం ఒక లక్ష్యం,
మోక్షం మానవుడి ఒక పరమోహ,
ఆశ మానవుడి దైనందిన జీవితం !
అవి మూడే మత వ్యాపారానికి ముడిసరుకులు
జీవితం, స్వర్గం, మోక్షం !
ఈ మూటి గురించీ తెలియా లంటే
భవిష్యత్తు తెలియాలి,
అ దెవరికీ తెలియదు.
గతాన్నిబట్టి భవిష్యత్తును ఊహించవచ్చు,
ఊహ మెదడు సామర్థ్యం తోడిది,
మెదడు బల్బు ఎంత శక్తివంత మైతే
అంత విశాలంగా, విపులంగా,
నిశితంగా, సూక్ష్మంగా ఊహించగలదు,

మానవుడి అజ్ఞానాన్ని తెలుసుకొన్న జ్ఞాని
దేశ కాలాల పరిజ్ఞానం కల విజ్ఞాని
ప్రతి మనిషి మనస్సుకూ అనుకూలంగా
తన మనస్సును పోనివ్వగలడు
ప్రతి మనిషికీ భవిష్యత్తును నిరూపించగలడు
ప్రతి మనిషికీ స్వర్గమోక్షాలను అందివ్వగలడు !
మనిషి కతడే మహాప్రవక్త,
భవ సాగర తరణి, భగవంతుని అవతారం !

## 11

మతాలను, వాళ్ళ స్వర్గనరకాలను వదిలెయ్,
అన్నీ వట్టి భ్రాంతులు.
మరి, ఈ సృష్టి సంగతి ఏమిటి ?
ఈ జనన మరణాలు, హాని వృద్ధులు
గ్రహతారాదుల తిరుగుళ్ళు
ఋతు రాగాలు, రాగ ద్వేష భావోద్రేకాలు,
ఇ దంతా ఏమిటి? ఎందుకు జరుగుతున్నది ?
ఎవరికీ ఏమీ తెలియదు !
తెలియ దంటే చాలా ?
అజ్ఞాన ప్రకటనే అన్నిటికీ జవాబా ?
దేవుడి మాట ఇక్కడ వద్దు,

ఉన్నా డనడానికి ఎంత ఋజు వుందో
లే డనడానికి అంతే ఋజు వుంది!
ఈ మన జీవలోకం వున్నట్టే
ఆకాశంలో అనేక ఇతర లోకా లుండవచ్చుగా?
నేను పుట్టకముందు ఎవర్ని ?
చచ్చిన తర్వాత ఏ మవుతాను ?
భౌతికేతర పరాపర లోకానీకంలో
ఏదో లోకానికి చెందివున్న వాణ్నేమో !
అన్ని లోకాలనూ దర్శిస్తూ వుండి,
ఈ లోకానికి కూడ వచ్చిపోతున్న వాణ్నేమో !
ఎందుకు కాగూడదు ?

## 12

నీవు కూడ నా వెంటపడి
పూవును తావిలా అనుసరించి వస్తున్నావో యేమో !
పూవును తావిలా, కోకిలను పాటలా,
మబ్బును మెరుపులా, సూర్యుని కాంతిలా,
కాకపోతే– కాకరకాయను చేదులా,
గులాబీని ముల్లులా అనుకో !

ఈ అనంత సృష్టి క్రమంలో
ఏ జీవి బ్రతుకైనా పరిమితం,

క్షణమాత్రం, అణుమాత్రం !
అందుకే – నే ననుకొంటాను –
ఒకే అవకాశంలో, తెరలు తెరలుగా
ఒకే చోట ప్రవర్తిల్లుతున్న
అనే కానేక సూక్ష్మ లోకాలలో
ఈ మన భౌతిక జీవలోకం ఒకటేమో నని !
ఈ లోకంలో ప్రతి జీవీ
తాత్కాలిక విరామం కోసం
తలుపు తెరచుకొని వచ్చి
తలుపు మూసుకొని పోతున్న –
ఒక వినోద పర్యాటక వ్యక్తే నేమో అని !
ఎవరికీ తెలియదు కనుక –
నాకూ తెలియదు !
ఎవరికైనా తెలిస్తే
నాకు అంతకంటె ఎక్కువ తెలుసు !
నేను ఆత్మగా రూపొంది
పరిమితుణ్నై పోయాను,
ఈ పరిమిత పరిధి పోగానే
మళ్లీ అపరిమిత పరమాత్మనే అవుతాను,
అయితే, ఆత్మకంటె పరమాత్మ
ఎక్కువ క్రియాత్మక శక్తి కలిగినట్టిదా ?
జాగృతి కంటె స్వప్నం

స్వప్నం కంటె సుషుప్తి
ఎక్కువ శక్తిమంతాలు కావు.
మనకు తెలిసిన సత్యం ఇది !
ఆత్మ మంచుగడ్డ
పరమాత్మ ఆవిరి
నడుమ నీరావస్థ ఏమిటి ?
నారాయణుడా ?
ఆవిరి కూడా అంతిమత కాదు !
పరమాత్మకు పై దేమిటి ?
బ్రహ్మం !
అవాఙ్మానస గోచరం
ఆద్యంత రహితం
సచ్చిదానంద రూపం
నామరూప రహితం
ఆ ఏదో !

## 13

అందుకే, చూడు ఈ వసంతోదయాన్ని !
పరిశీలించు దీని ప్రవేశ నిష్క్రమణాలను !
నీ చూపులు బాల సమీరాలుగా
నీ ఆలోచనలు పరిమళించనీ !
ఎవడి విశ్వాసం వాడి దైవం

ఒకటి సమాధి మరొకడి దేవాలయం
విశ్రమించనీ ఎవడి గూట్లో వాణ్ని
అదే అతడి స్వర్గం !
ఈ మెదళ్లన్నీ పిట్ట గూళ్లే,
దేని గూడు దానిది !
కానీ మన గూడు
ఈ వసంతోదయ కలశోదధి !

## 28. ఆనంద నామ

పేరు బియ్యం
సరుకు తెల్ల రాళ్ళు.
పేరు సాంబారు పొడి
పొట్లం గుర్రపు లద్దె !
ఇది ఈయుగ ధర్మం-
మా దేశపు మగసిరి !
నీ పేరు-
ఆనంద కదూ, ఉగాదీ ?
ఊరికే అడిగాను-
ఉలిక్కి పడకు !
పుట్టి పద్దెనిమి దేళ్లైనా
ఓ న మా లకే నోచుకోని నా కోసం
ఇంత కాలానికి నీ వైనా
తెచ్చావొక పలకా, బలపం !
ఆనంద నామ ఉగాదే
ఆంధ్ర భాషకు నవశకాది చేశావు !
ఇంతకన్న మాకేం కావాలి ?
ఇదే నీకు స్వాగతం !

అ దేమి టలా వున్నావు !
కళ్ళు ఎఱ్ఱబడ్డా యేం ?
కాళ్ళనిండా ఆ నెత్తు రేమిటి ?
తెలుగు రాజధాని వీధుల్లో
తెలుగుతనం కోసం వెతికి వుంటావు !
తెలుగే కనపడక ఏడ్చివుంటావు ?
అవునా ?
అరవై ఏళ్ళకోసారి వచ్చే
నీకే అలా వుంటే–
ఎప్పుడూ ఇక్కడే పడిచచ్చే
నా కెలా వుంటుంది చెప్పు ?
ఇప్పు డెంతో నయం
అదృష్టవంతురాలివి నువ్వు !
ఈ పద్దెనిమి దేళ్లూ
రాజకీయాల రాత్రే తప్ప
పాడిపంటల పగ లెక్కడివి నాకు ?
పాపం, ప్రమాదీచ పోతూ పోతూ
తెలుగుతనం రూపుకట్టిన ఓ ముఖ్యమంత్రిని
ఇచ్చి పోయింది కాబట్టి
ఈ వాకిట్లో
ఈ మాత్రం ముగ్గులైనా కనిపిస్తున్నై !
పిచ్చితల్లి ప్రమాదీచకు

కన్నీటితో వీడ్కోలిచ్చా నందుకే !
ఏ ఉగాది అయినా ఒకటే నాకు !
కన్నూ చెవీ పనిచెయ్యని ప్రజాస్వామికంలో
ఎన్నికల మేనిఫెస్టోలా
ఆర్భాటంగా వస్తుంది !
అనామకంగా పోతుంది !
మరి – నీవు –
నీవూ అలానే
ప్రజల మధ్యకు వచ్చావు !
నీ ఎదుట వున్నది కురుక్షేత్రం
నక్కి వున్నది రాక్షస వర్గం !
గతం సుఖాంత మయింది
భవిష్యత్తు భయంకరంగా వుంది !
అధిక ధరల, విషపు కల్తీల,
కులమత ద్వేషాల, కుక్షింభర రాజకీయాల,
ఆకలి మంటల, అరణ్యారోదనాల
అంధకాసురుల్ని ఎలా తుంచుతావో !
ఆనంద సుధను ప్రజల కెలా పంచుతావో !
తెలుగు బిడ్డవు నీవు
తెలుగు తల్లివి నీవు–
నిత్యానంద వసంత వైభవంతో
తెలుగుజాతిని కలకాలం పాలించు !

## 29. ఎవరు జగజ్జనని

జగజ్జనని భవాని-
ఆమెకు సొంత పిల్లలు లేరు !
విశ్వజన హృదయేందిర ఇందిర-
ఆమెకు సొంత బిడ్డలు లేరు !
సర్వజీవ జీవనవతి సరస్వతి -
ఆమెకు సొంత సంతానం లేదు !

అమ్మలగన్న అమ్మకు
ఈ ముగురమ్మల మూలపు టమ్మకు
చాల పెద్దమ్మకు - కూడ
నా అనే ఒక అమ్మాయైనా లేదు !

సొంత పిల్ల లుంటే-
తల్లిదండ్రుల్నే సంతలో అమ్మేస్తారు
అనే సత్యం ముందే తెలుసుకొని కాబోలు
మన త్రిమూర్తుల్లో ఒక్కడూ
కనుక్కోలేదు ఒక్క కొడుకునీ !

ఎందుకని ?
చేతగాకనా ?
శక్తి లేకనా ?
ఉన్న పుష్టి అంతా
ఆఫీసు ఫైళ్ళలోనే
కారిపోవడం వల్లనా ?

అపచారం ఉపశమించుగాక !
త్రిమూర్తులు, త్రిశక్తులు అంటే
జగజ్జనకులు, జగజ్జననులు !
తమకు సొంత మనే దేమైనా వాళ్లకు వుంటే
తక్కిన దంతా మరెవరి దౌతుంది ?

ఒక్క కొడుకున్న దేవు డైనా
విశ్వజనకుడు కాలేడు !
ఒక్క కూతురున్న దేవత అయినా
విశ్వజనని కాజాలదు !
అందుకే –
సొంతం అనేది వున్నవా డెవడూ
భగవంతుడు కాలేడు !

ఈ రహస్యం తెలియని ధరణి
ఇచ్చ వచ్చిన ట్టెల్లా కనిపారేసి,
అక్షరాలా కని పారేసి
వాళ్ల గతికి వాళ్లని వదిలెయ్యడం వల్ల
భూభారం పెరిగిపోయింది !
ధర్మగ్లాని ఏర్పడింది !
పాల సముద్రంలో ఉయ్యాల పాన్పుపై
హాయిగా నిద్రపోయే భగవంతుడు
యుగ యుగానికీ ఉలిక్కిపడవలిసి వచ్చింది !
నానా అవతారాలు ఎత్తవలసి వచ్చింది !

ఏ నియమ నియంత్రణలూ లేకుండా
కనీసం నిరోధులు, విరోధులూ కూడా లేకుండా
ధరణి కని పారేసిన భూభారాన్ని
తగ్గించడానికి ఆ భగవంతుడు
ఎన్ని పుట్టుకలు పుట్టాడో
ఎన్ని చావులు చచ్చాడో
మనందరికీ తెలుసు !

ఎందరు మరిడమ్మలు !
ఎందరు మహా మారులు !
ఎన్ని భూకంపాలు
ఎన్ని తుఫానులు, ఉప్పెనలు
ఎన్ని ఊసరక్షేత్రాలు
ఎన్ని కురుక్షేత్రాలు !

భగవంతుడితో పోటీపడి
మానవుడు విజృంభిస్తున్న ఈ రోజుల్లో
ఈ భూభారానికి పరిష్కారం ఎలా ?
ధరణీ ! ఓ ధరణీ !
నీవు కనడం తగ్గించుకుంటావా ?
నీ సంతాన భారంతో నీవే
కుప్పగా కూలిపోతావా?
ఆలోచించుకో, ధరణీ !
నీకు సాయం చెయ్యలేడు ఏ కరణీ !

బలవంతుడే రా జనేదీ
భగవంతుడి శాసనమా !
మానవుడే భగవంతుడై నప్పుడు
మా నాభిమానాలే జీవాత్మలవుతై !
బానిసగా బతకడం కంటె
యజమానిగా చావడం మంచిది !
పందిలా పదిమంది బానిస ల్నెందు క్కంటావ్ ?
స్వసంతానాన్ని తగ్గించుకో !
సార్వజనిక జగన్మాతవుకా !
నీ కడుపున పుట్టితేనేనా నీ బిడ్డలు ?
లోకం సమస్తం నీ సంతానమే కాదా ?

## 30. కాలయుక్తి - సాలశక్తి

ఇది వైకుంఠము, వెంకటేశ్వరుడు ల
క్ష్మీ శుండు కొల్వుండుటన్
ఇది కైలాసము, మల్లికార్జునుడు ఆ
ర్యేశుండు చెల్వొందుటన్
ఇది బ్రహ్మోర్వి, సరస్వతీ చరణ పం
కే జాతమ్మై యుండుటన్
ఇది మా ఆంధ్రము, నీకు పీఠము, త్రిశ
క్తీ ! పూజ గైకోగదే !

వాణియ తీరవాటిక, భ
వానియ రాయలసీమ, శ్రీ తెలం
గాణము; పూర్ణ రాజ్య రమ
గా, ముగు రమ్మల మూర్తి దాల్చి, గీ
ర్వాణ పథమ్మునన్ గదలి
వచ్చితి ; వేలుకొనంగదే ఇకన్
ప్రాణము లౌచు మా తెలుగు
పాలు జగత్ స్థితి కాత్మలై తగన్ !

పింగళ పోతూ పోతూ
ఇంత నెత్తురు ముఖాన కొట్టిపోయింది,
కాళయుక్తి వస్తూ వస్తూ
కాలానుయుక్తితో
ముఖం కడిగి ముద్దులు కురిపించింది.
ఇది మామిడే కాదు, మర్రి కూడా అని నిరూపించింది.

స్వాగతమోయి వసంతా !
స్వామీ, వసంతా !
స్వాగతమోయి వసంతా !
సుందర సురభిళ సరస వసంతా
సుమనో వికస న్నిఖిల దిగంతా
సారాసార సమాన రసోదయ
సర్వశ్రేయో భాస్వంతా ! ॥ సా ॥

మావి కొమ్మ, మల్లె కొమ్మ
వేప కొమ్మ, విప్ప కొమ్మ
ఏ కొమ్మను చూచినా
రమ్మంటున్నది ! ॥ సా ॥

పండి రాలిన ప్రతి ఆకూ పల్లవితమై
మొరసి ముగిసిన ప్రతి స్వరమూ వికస్వరమై
ప్రతి జన్మా ఒక ప్రగతి సోపానంగా ఎక్కివస్తూ
ఎన్ని యుగాలుగా సాగుతున్నదో ఈ ఉగాది యాత్ర !
ఏమిటి ఈ తెలుగు నేల ప్రత్యేకత ?
ఏమిటి ఈ కాళయుక్తి విశేషోక్తి ?

ఎల్ల జగమ్ము నేలు హరి
నేలు మహా వట పత్రమాత, ఈ
యెల్ల తెలుంగు నేల నన
లెత్తిన నాలుగు కోట్ల తల్లి మా
పిల్లల మఱ్ఱి; మఱ్ఱి – బల
వీర పరాక్రమ రాజలక్ష్మియై
చల్లని నీడ గూర్చు సమ
సమ్మతి నెల్లర కెల్ల వేళలన్ !

అందువల్ల–
అక్కడ శ్రీ మహావిష్ణువుకు ఉయ్యాల
కట్టిన మఱ్ఱి, ఇక్కడ యువజ్యోతికే
అభయ హస్తం పట్టిన మఱ్ఱి !

రాగ మధుర మధు జీవన తేజా
రావోయీ, ఋతురాజా !
శతదాదులు నీ సచివులు, మంత్రులు
జనసేవా పరతంత్రులు ॥ స్వా ॥

బిగ్రులోన మ్రగి, ప్రేమార్ద్రవాత్సల్య
మధువులోన గున్నమావి చెన్ను,
వ్యంగ్య వైభవమ్ము, ధ్వని మాధవత్వమ్ము
మూర్తి గొన్నవాడు ముఖ్యమంత్రి !

మహిత విహిత మూర్తి మా మ్రగి చెన్నయ్య
ఉక్తి, యుక్తి, రక్తి, శక్తి కలుగు ;
కాలయుక్తి నామకా ! వత్స ! వత్సరా !
కలిసి నడువ వయ్య ! కలదు జయము !

ఎండలు మాడ్చి, వరదలు ముంచి
గుండెలు పగిలిన కువల యేందిర
అశ్రుజలధిలో స్నానమాడి, నీ
అడుగుల మడుగై పరచినదోయి !
స్వాగతమోయి వసంతా !
స్వామీ, వసంతా !

# 31. రాజకీయం నుంచి రాగోదయం

ఎంతటి విరహాగ్ని నుంచి
ఎంతటి ఆనంద సుందర సంవృష్టి!
ఎంతటి నిరాకృత
నిరీక్షా శూన్యం నుంచి
ఎంతటి పురాకృత పుణ్య పున స్సృష్టి!

తాను కాలి బూది అయిపోయి కూడా
ఎంతటి విబూదిని ప్రసాదించాడు
లోకానికి మన్మథుడు !
ఎన్ని కోపతాపాల శాపాల
ఎన్ని రాజకీయ రహస్యాల రగడల
యజ్ఞకుండాల అబ్ధిమథనాల
ఆత్మహుతుల ఫలసాయం ఇది !
ఈ నవరసాల రసాల సంపదల
గాది ! ఈ ఉగాది !

కామ దహనం జరిగి ఎన్నాళ్ళయింది ?
మొన్న పాల్గున పూర్ణిమ నాడే కద ?
పరమశివుడు చేసిందొకటి !
జరిగింది మరొకటి !
కామ్మునణ్నే దహించి వేసిన పరమ రుద్రుడికి

కారుణ్యం అనే గయ్యాళి గంగ
నెత్తికెక్కి వుండడం వల్ల,
రతీదేవి కన్నీటి కణం
ప్రళయకారుని పరమాగ్ని బాంబునే
చల్లార్చి వెయ్యగలదై వుండడం వల్ల,
బూడిదైపోయిన పక్షం రోజుల్లోనే
భువనేశ్వరుడై వెలిశాడు కాముడు !
అంతవరకు ఒకే చిరునామా కలవాడు
ఈ నాడు అన్ని చిరు మానసాలూ
తన చిరునామాలే అయి కూర్చున్నాడు !

ఈ వసంతోత్సవ పల్లవ కోరక
పుష్ప ఫల రసరాగం అంతా అదే -
ఆ మహా చితాభస్మ పరమాణు పరాగం !
శివు డెంత మంచిపని చేశాడు !
ఒక్క శివుడే కాదు -
మంచివాడికి కోపం వచ్చినా
మంచే జరుగుతుంది లోకానికి !

రాజకీయాలు వేరు
రాగోదయాలు వేరు,
పైసల పైరవీల ఎన్నికలు వేరు

వలపుల పులకాంకురాల మన్నికలు వేరు !
అటూ, ఇటూ చూడకు -
అక్కడ గుమిగూడిన రకాలు
అతనుడి చిరునవ్వుల కోరకాలు కాదు !

ఇటూ, అటూ వినకు
అక్కడ రేగుతున్న నాదాలు
శుకపిక శారికా నినాదాలు కాదు !
అటూ, ఇటూ ఆలోచించకు
ఇది మన గృహోపవనం కాదు !
ఆర్థిక సాంఘిక రాజకీయ పదవీ
చతుర్ముఖ బ్రహ్మల సమాఖ్యలు
ముఖాముఖీ, మైకా మైకీ
కురుక్షేత్రం ఆడుకొంటున్న
చతురంగ రంగ పారోద్యానం !
మన గృహోపవనం కాదిది !

ఇళ్లో, గుళ్లో, జైల్లో, రైల్లో
పదవులో, పెదవులో
ఎన్నికలో, మన్నికలో
పట్టుపరువులో, పేవుమెంట్లో
భిక్షాటనో, దేశాటనో

హీరోలో, షీరోలో -
ఎవడి విశ్వాసం వాడి దైవం !
ఒకడి సమాధి మరొకడి దేవాలయం !

ఆ వ్యష్టి వైవిధ్యపు గోలనుంచి
ఉపసంహరించుకో సర్వేంద్రియాలనూ !
ఈ సమిష్టి వసంతశోభా ప్రాభవంలోకి
ప్రవేశించు ఏకాత్మవై !
త్వమేవాహ రసాద్వైత పరమాత్మవై !

అదేమిటి - అలా అయిపోయావు ?
బాలేందు మౌళి పరమానుగ్రహం పొందిన
రతీ రమ్యాదేవిలా -
ఆర్షారణ్యాల
తపో దావాగ్నులు కాల్చిపారేసిన
నిష్కామ సేవా కామ్యచితా భస్మంలోని
అణువణువునా అవశవైపోతూ -
నీవే చెరకు విల్లువై
ఇలా వంగిపోతున్నా వేమిటి !
నీవు నవనవేక్షు రసదేవతవు !
నేను వట్టి చిరువేప పూ మొగ్గను !

## 32. ఇంత కాలానికి

ఇంత కాలానికి
మళ్లీ వెలిగించావు దీపం !
అబ్బ ! ఎంత కాలానికి !
అంధకారం అహంకారంపై ఎంత యుద్ధంచేసి !

యుద్ధ రంగంలో నీ హృదయం చిందిన
ఒకొక్క రక్తకణం ఒకొక్క రత్న దీపంగా
కారుచీకట్ల కోరలు పెరికిపారేసి
జ్యోతిః శ్రేయో నిశ్రేయస రాజమార్గంలో
మళ్లీ ఈ సనాతన మానవతా విజయరథంపై
అధునాతన పూర్ణసుధా కుంభాన్ని ప్రతిష్ఠించావు !

ఆమ్నాయ పౌరు షోక్తిని అమృతీకరించావు !
ఆత్మ స్వాతంత్ర్యంపై ఆనందజ్యోత్స్నను ప్రసరించావు !

ఇంత కాలానికి
మళ్లీ రాజేశావు పొయ్యి !
అబ్బ, ఎంత కాలానికి !
దురాక్రమించి మూర్ఛించిన పిల్లులపై ఎంతయుద్ధంచేసి!

అవి పట్టి పిల్లులే అంటుంది-
స్వయం నియంత్రిక స్వప్రయోజక నాయకత్వ లోకం !
అవి పిల్లులా ? రాకాసి నల్లులా ?
మహిషాసురుని అసికొమ్ముల దున్నలా ?
మహోరగాల కోరల కస్సుబుస్సు కసికన్నులా ?
వెలుగంటేనే కిట్టని నరకాంధ తమస్సులు
ప్రతి యింటినీ ఆర్పేసి, ఆవులించి, ఆ బూడిదలో
మృత్యుకింకరుల్లా ముడుచుకు పడుకొన్నప్పుడు-
ప్రతి చకిత దీపకళికనూ నీ కన్నుల్లో దాచివుంచి,
ప్రతి పీడిత జీవుణ్ని నీ గుండెల్లో కాపాడి ఉంచి,
జనాభ్యుదయ మందిరవై, సాహస సత్యేందిరవై
శత్రు తండాలను పట్టి తరిమికొట్టి,
ఏ యింటి దీపాన్ని ఆ యింట తిరిగి వెలగొల్పావు !
ఏ గూటి జీవుణ్ని ఆ గూట తిరిగి నిలబెట్టావు !

ఇంత కాలానికి
మళ్లీ పండించావు పొలం !
అబ్బ, ఎంత కాలానికి !
చీడలపై, పీడలపై ఎంత యుద్ధం చేసి !

పంటల్ని పీల్చేసి, చెట్లను కూల్చేసి,
మంచిని ముంచేసి, మనిషి నెత్తురును జుర్రేసే
కీటకాలపై, తుఫానులపై, ఉప్పెనలపై
యుద్ధంచేసి గెలిచి, ఉర్వర నుద్ధరించి నిలిచి

సర్వశూన్యాన్ని సస్యశ్యామలగా మలిచి
ఓహో, ఎంత కాలానికి మళ్ళీ పండించావు
ఈ ఉపేక్షిత ఉపనిషత్ భారతాన్ని !
ఈ పరాశ్రిత పరిత్యక్త రత్నగర్భను !
ఎన్ని శీతాతప బాధలు ! ఎన్ని నక్కల తోడేళ్ళ గాథలు !
ఈ శాంతి కాముక కాంతి క్షేత్రంపై ఎన్ని ఆకలి నాల్కలు !

అనంత శక్తివి –
అంధకారం ఉరఃకవాటాన్ని పగలదన్ని
వికల్పం గుండెల్లో సంకల్పాన్ని వెలిగించావు !
అన్నేందిరవు –
అన్ని అరివర్గాలను ఆత్మబలంతో అరికట్టి, మట్టుపెట్టి,
జాతి రాజనీతికి జీవధాతువుని అందించావు !
అపరోక్ష కళా భారతివి –
అధర్మం నుంచి రక్షించి, ఈ ధర్మక్షేత్రాన్ని
సంరక్షించి, మళ్ళీ సార్వజనికం చేశావు !
త్రిశక్తీశ్వర నవశక్తీ !
నవ భారత యువశక్తీ !
యువ యుగాల జనశక్తీ !
సర్వదేవ సర్వ మంత్ర పరాశక్తీ !
నీ చేతి ఈ ఉజ్వలదీపం
ఇక అఖండంగా ప్రకాశించుగాక !
ఈ జాతి ఉద్ధత రూపం
ఇక అనంతంగా విస్తరించుగాక !

## 33. ఇంటర్వ్యూ

వసంత కవితల ఎన్నికలో
అభ్యర్థుల్ని ఎంపికచేసే కమిటీ ఇది.
ఒక సభ్యుడికి సంబంధించిన కొడుకో,
అల్లుడో, తమ్ముడో ఇంటర్వ్యూకి వస్తే
ఆ సభ్యుడు ఆ కాస్తసేపూ
లేచి బైటికి పోతూవుంటాడు.
మీ కందరకూ తెలుసుకదా ?
అదొక మర్యాద-సంప్రదాయం.
అదే సంప్రదాయాన్ని అనుసరించవలసిందిగా
ఈ సదస్సులోని ఒక వ్యక్తిని కోరుతున్నాను !
ఆ వ్యక్తి మా ఆవిడ !
ఈ సభలో ఆవిడ లేకపోతే సమస్యేలేదు,
ఏ మూలనైనా వుండివుంటే మాత్రం -
ఒక మూడు నిమిషాలపాటు
బైటుండి రావలసిందిగా ప్రార్థన !
ఈలోగా నా కవితను ముగించేస్తాను !

ఇలా ఎందుకు కోరుతున్నానంటే
ఈ నా కవితా నిర్మాణ కార్యక్రమ
నిర్వహణోద్యోగంలో చేరడాని కని
ఆమెకు చెందిన రెండు చరణాలు
ఇంటర్వ్యూకు వచ్చి వున్నై !
నేను అద్దంలో నా ముఖం చూచుకొంటూ -
"నా అంత అందగాడు ఈ లోకంలో
మరెక్కడా వుండడు కదూ ?" అంటాను
వెంటనే అనేస్తుం దామె -
"'ఏడిశావ్ ! దున్నపోతు మొగమూ, నీవూను" అని !
మీరే చెప్పండి నిజం !
ప్రతి కుర్రవాడూ అద్దంలో తన మొగాన్ని
అన్ని కోణాల నుంచీ చూచుకుంటాడా? లేదా?
తన అంత అందగాడు కనీసం ఆ ప్రాంతంలో
మ రొకడు లే డనుకుంటాడా ? లేదా ?
కాకపోతే -
ఆ మహిళా కళాశాల గేటు ముందున్న
చౌరస్తా కెందుకు పోతాడూ?
ముఖంమీద ఉమ్మినా
అది స్నో అనుకొని ఎందుకు రుద్దుకుంటాడూ ?
వనితా విద్యాలయ ప్రాంగణంలో
వానర వేషా లెందుకు వేస్తాడూ ?

మీరే చెప్పండి నిజం,
కనీసం నా ముఖం చూచి చెప్పండి !
ఇంటర్వ్యూ ఫెయి లయింది,
అభ్యర్థి సెలక్టు అయాడు !
అవునా ?
కొట్టండి మరి చప్పట్లు !
జై, దున్నపోతు ముఖానికీ !
"మరి, అమ్మాయిల సంగతో ?"
అంటున్నారెవరో !
నాకు తెలీదు
వాళ్ళ ముఖాలు నిజంగా ఎప్పుడూ నేను చూడలేదు ?

## 34. రౌద్రి

రౌద్రి !
మంచి సమయానికే వచ్చావు !
నీ కోసమే ఎదురుచూస్తున్నాం !
రా, కూర్చో !
అక్కడ కాదు, ఇక్కడ !
ఈ అధ్యక్ష పీఠం మీద !
ఈ పీఠం నీ కోసం
ఇప్పుడే ఖాళీ చేయబడి
పున ర్వసంతీకరించబడి
ఆమోద సుభగం చేయబడ్డ అధ్యక్ష పీఠం.
ఎల్లప్పుడూ తా నొక్కడే పట్టుకు వ్రేలాడా లన్న
అహమ్మతీ తపనా పంకిలం కాని పీఠం ఇది,
సామ్రాజ్యవాద సింహాసనంలా
శవ వాసన కొట్ట దిది,
ప్రజాస్వామిక పదవీ దాహంలా
నెత్తురు నాల్కలు చాచ దిది,
ప్రతీ యేడు క్రమానుసారంగా
కొత్తకు తావిస్తూ
పాత వైదొలగిపోయే
సనాతన ధర్మ పీఠం ఇది,
అధిష్ఠించు !
అధికారహస్తం అభయంకరించు.

అ దేమిటి, అలా
వేపపువ్వు మొఖం పెట్టావు ?
సమయానికి నీరందని చెరకు గడలా
అలా ఎండి పోయా వేమిటి ?
నిరుద్యోగ యువకుల చిరునవ్వుల్ని కూస్తూ
ఫైళ్ళలో పైసలు వెతుక్కొనే
ముసలి ఉద్యోగి కోకిల లా
ఎవరి మీద అలా కసురు కుంటున్నావు ?
వద్దు, రౌద్రి వద్దు !
గతాన్ని చూచి బెంగ పడవద్దు !
ఎవళ్ళ మీదా కస్సు, బుస్సు మనవద్దు !
నీ కొక అవకాశం వచ్చింది,
ప్రతీ పల్లెనూ ప్రతీ ఇల్లునూ,
మందార వనాంత రామృత సరః
ప్రాంతంగా మార్చు !
ప్రతీ ఇల్లాలినీ నవ విద్రుమాభగా
శరదిందు శోభగా తీర్చు !
తమాల నీలపై మా తెలుగు రాజధానిని
భాగ్యనగరంగా వెలార్చు !
రౌద్ర మూర్తివైన నీవు
ఇ కారాంత పుంలింగానివో
ఈ కారాంత స్త్రీ లింగానివో గానీ -

వట్టి నపుంసక లింగాలమై పోయిన మాకు
కించిత్ మగతనాన్ని సమకూర్చు !
నిజం రౌద్రీ !
మేం వట్టి నపుంసక లింగాలం !
పుంలింగాల మని చాటుకోవడం కోసమే
ఆడపిల్లల హాస్టళ్ళపై పడి
అల్లరి చేస్తాం !
సినిమాల్లో మగసిరి పాటల్ని వింటాం,
పంట్లాం జేబుల్లో చేతులు దోపుకుంటాం !
పత్రికల్లో రేపుల్ని చూస్తూ
మాపుల్ని గడిపేస్తాం !
నీవే చెప్పు -
సిసలైన మగవాడు
స్త్రీ మూర్తిని ఆరాధిస్తాడు
అల్లరిపరచి అవమానిస్తాడా, రౌద్రీ ?
నీవు రౌద్రివి !
రౌద్రంతో పాలించి
మమ్ము విరాట్ పురుషసూక్తుల్ని చెయ్యి !
రుద్రాణివై విజృంభించి
మాలోని మహిషాసురుల్ని మర్దించు !
తెలుగుజాతికే కాస్త వెలుగు చూపించు
మనం తెలుగు వీరులం అనే స్ఫూర్తి కల్గించు.

స్వాగత సత్కారాలే తప్ప
వీడ్కోలు విందులు లేని
సంవిధానం నీది,
నీ పదవీకాలం పన్నెండు నెలలే అయినా
పండ్రెండు పంచవర్ష ప్రణాళికలకు సరిపడే
ప్రగతిని సాధించు
ప్రజలను బోధించు !
ఉద్బోధించు !

## 35. నెత్తురుతో వసంతా లాటు

పులిని అవమానించా లని
నక్కకు వాతలు పెట్టి ఊరేగిస్తున్నా
అడవిలో అలగా జంతువు లన్నీ !
మరి, పు లేదీ !
ఉగాది పచ్చడి తిని, ఒళ్లు మరిచి
గుర్రు కొడుతోంది దాని పొదలో అది !

ఎర్రటి మోదుగ పూల మాలల్లాంటి
వాతల్ని నాకుకుంటూ నక్క
సన్మానోత్సవ మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ
మైకంలో పడి పోయింది !

స్వరాజ్యం లాంటి ఈ వసంతాన్ని
ఈ అడవికి తెచ్చిం దెవరు ?
పులిని త్రోసి రాజని, నక్కను
ఉత్స విగ్రహం చేసిం దెవరు ?

నే నంటే నే నను కున్నై దేని కదే,
బయటికే కూసేసినై దేని గొంతుతో అది !
కూతలు చేతలుగా మారినై

పంజా లెత్తి గుండెలు చీల్చుకొన్నై
కోరలు చూపి గొంతులు కొరుక్కొన్నై
ఒకళ్ళ నెత్తురుతో ఒకళ్లు
వసంతా లాడుకొన్నై !

ఉదయమే పుట్టిన ఉగాదిని
సాయంత్రానికి చంపేసినై
ఉమ్మడిగా తెచ్చుకొన్న వసంతాన్ని
మొగ్గలోనే తుంచేసినై !
పులిని ఏమి చెయ్యాలన్నది పోయింది
నక్క ఎవరి చేతుల్లో ఆడా లన్నది
సమస్య అయింది !
ఇది చిట పట మండి
చింత నిప్పులు చెరిగింది
చివరకి అడవికే నిప్పెట్టేసింది !
పాపం, అలగా జంతువులు !
విజ్ఞతలేని కుక్షింభర జీవులు !

## 36. దుర్మతి గారు

ఆయియే, హుజూర్ ! వెల్‌కం, సార్ !
రండి ! రండి ! అండి గారు !
అదేం సార్, అలా చూస్తారు ?
మీరు దుర్మతి గారేనా ?
మీకే సార్, నేను స్వాగతం చెపుతుంట ?

### 2

మీరు తెలుగువారే కదా ?
అందుకే సార్ –
మీకే భాష అర్థమవుతుందో తెలీక
నాలుగు భాషల్లో స్వాగతం చెప్పాను !
పరాయి భాషల ప్రభుత్వాల కింద
వాళ్ల పాదసేవ చేసుకొంటూ బ్రతకడాని కని
పూర్వం ఏ భాషలు నేర్చుకున్నానో
ఆ భాషలే ఇంకా నాకు గర్వకారణం, సార్!
ఆ భాషల్లో నేను ఉపన్యసించా నంటే –
అబ్బో, ఆ హర్ష ధ్వానాలు, మీరు వినాలి !

## 3

నాకు అధికార భాషలు నాలుగు, సార్ !
ద్రౌపది కంటె ఒక డిగ్రీ తక్కువ !
నవ్వకండి, సార్ !
నా ఏడుపు వినండి !
నాకు అధికార భాషలు నాలుగు,
ఇంగ్లీషు, ఉరుదూ, హిందీ, తెలుగూ !
ఉరుదూ, ఇంగ్లీష్, హిందీ, తెలుగు !
పతివ్రతల వంశంలో పుట్టిన నాకు
నాలుగు భాషల మగళ్లతో కాపరం
పరు వేనా ? బరువు కాదా, సార్ ?

## 4

మీ పేరు దుర్మతి కనుక
ఏవో దుష్ఫలితా లిస్తారని ఎవ రన్నారు ?
ఎవరో అంటారని ఎందు కనుకున్నారు ?
మరి, **1947** లో మీ అన్న సర్వజిత్తుగారు
తవ్వి మా తలకెత్తిన విజయోత్సాహం ఎంత ?
సర్వజయం మాట అటుంచండి,
ఆత్మవినాశానికి బీజం అప్పుడే కదా పడత

అయ్యో, భారతీయ రొటీన్ నవోదయం గారూ !
ఒక్క సత్యాన్ని చిత్తగించండి –
మా నిండా, మా చుట్టూ
మత పిచ్చీ, కుల రొచ్చూ
పేరుకుపోయి వున్నంత కాలం
మమ్మ లైవరూ ఉద్ధరించలేరు, సార్ !
మేం సదా–
దేశదేశాల ముచ్చట ముంగిళ్ల ముందు
నంగివేషాల గంగిరెద్దుల్ని తిప్పుకొంటూ
అడుక్కు తినవలసిందే !

## 5

వర్షాలు లేవు కనుక
మా కోకిల గొంతుల్లో తడి లేదు,
కోట్లు పెట్టి కొన్న విదేశీ రిగ్గులతో
పాతాళగంగను కూడ తోడేశాం కనుక
పురాణ వృక్షాలు సైతం ఎండిపోతున్నై.
చక్కెర కోటా మొత్తం లక్ష్మికే కనుక
పార్వతికీ, సరస్వతికీ మిగిలింది
మామిడి పిందెలూ, వేప పువ్వూ మాత్రమే.
తీపి లేని పులుపూ, చేదూ
ఈ నాటి మా ప్రజా జీవితం !

మా కున్నదాంతోనే మిమ్మల్ని సన్మానిస్తాం
సన్మానం ఖర్చు మిమ్మల్ని అడగం
మీ రేదైనా ఇస్తే సంతోషంతో పుచ్చుకుంటాం.

## 6

ఏదైనా ఇస్తే అంటే, ఎందు కివ్వరు, సార్ ?
ఏ విలువా లేని వాళ్ళే వేలు విరాళా లిచ్చి
సన్మానాలు చెయ్యించుకొంటున్న ఈనాడు
మీ రెందు కివ్వరు ?
మీ పేరు దుర్మతిగారు అయినా
మీరు తెచ్చింది వసంతమేగా ?
శుష్కప్రియాలు, శూన్యహస్తాలు కావు మీవి.
తిండిలేక ప్రాణం కొడిగట్టినా
తీయగా పాడే కోకిల మీదే కదా !
మీ పరివారం పాడకపోతే
ఈ లోకానికి వసంత మెక్కడిది ?
మీ ఆస్థానం ఆడకపోతే
తొలకరికి వేదిక ఏదీ ?
అని మోదుగ పువ్వులా ?
మీ ప్రేమానురాగ పులకాంకురాలు !
అవి మల్లెలూ, సన్నజాజులూనా ?
మా వాత్సల్య దరహాస మధుబిందువులు !
రండి, ఇదిగో ఉగాది పచ్చడి,
మా సంస్థ చేసింది,
చేదు ఎక్కువగా లేదు.

## 7

నా దొక్క కోరిక, సార్ !
ఉగాది కోరిక కాదు కాని-
మీ అరవై మంది అన్నదమ్ములూ
ఏడాది కొకరు చొప్పున పాలిస్తారు !
అంతకన్న ప్రజాస్వామిక మేముంది, సార్ ?
కుల సంకుచితుల మైన మేము
అలాంటి రొటేషను పద్ధతి చేబట్టే టట్టు
ఆశీర్వదించి పొండి, సార్ !
సార్, సార్, అటు పోకండి,
అవి గొప్పవారి కొత్త భవనాలు !
ఏ ప్రాజెక్టుల కడుపుకొట్టిన సిమెంటుతో
రాజసం వెలగబెడుతున్నట్టివో అవి
అ వెప్పుడు కూలతవో తెలీదు,
ఆ పాపం మన కెందుకు ?
ఇలా రండి, ఈ తోటల్లోకి
ఇవే మా గ్రామీణుల నీడలు, గూడులు,
సహజ సుందరాలు
సుఖైక మందిరాలు !

## 37. అందరిదీ ఈ వసంతం

మామిడి పూచింది
కుంకుడు చెట్టూ పూచింది,
కోకిల క్యోం అంటే
కాకి క్యా అంది !

కొత్త చిగుళ్ళ మీదికి దూకింది లేడిపిల్ల
లేడిపిల్ల మీదికి దూకింది పులిపిల్ల,
వేప పువ్వును చూచి
మల్లె మొగ్గ ముక్కు మూసికొంది
మల్లె మొగ్గను చూచి
పల్లె పడుచు జడ సవరించుకొంది !

ఇదీ వసంతం !
దేని స్వేచ్ఛ దానిది,
దేని ఆనందం దానిది,
స్నేహాలు, శత్రుత్వాలు
విరిసే నిచ్చెనలు
కరిచే పాములు
జీవ లక్షణాన్ని మార్చలేవు
జీవి లక్ష్యాన్ని మలప లేవు.
అన్నిటికీ ఒకే వసంతం
దేని పరిధిలో అది కేంద్ర బిందువు
దేని క్రియా క్షేత్రంలో అది స్వేచ్ఛా సింధువు.

పులి పిల్ల బ్రతుకుతున్నది
లేడిపిల్లా బ్రతుకుతున్నది
దేని వ్యూహంతో అది,
దేని హక్కుతో అది.

మానవుడేనా బ్రతకలేనివాడు ?
మానవుడూ బ్రతుకుతున్నాడు
మధుమాసాన్నే సొంతం చేసుకొని,
అందరి హక్కుల్నీ ఆహారంగా గొని !

కత్తి, గొడ్డలి, బాణం, తుపాకీ
ఆటవికుని ఆహార సాధనాలు ;
మతం, మంత్రం, దోపిడి, దౌర్జన్యం
నాగరికుడి భోగ సోపానాలు,
వసంతం మాత్రం అందరిదీ,
ఎవరికీ దీనిపై ప్రత్యేక హక్కు లేదు.

మధుప్రియ కోకిల జీవితం కంటె
మానవ మేధావి జీవితం గొప్పదేం కాదు.
అందుకే, ఆనందించు,
సుందర వసంతంలో ఒక బిందువైనా కా !

# 38. దుందుభితో నవ శకం

ఓహో !
దుర్మతిని తరిమికొట్టు కొంటూ
దుందుభి వచ్చేస్తున్నది !
ఏం అతిలోక రమణీయ దృశ్యం !
రాక్ష సాంధకారాన్ని చీల్చి చెండాడే
రామ బాణంలా
ఫాల్గున అమావాస్య చీకట్లను
నరికి కుప్పలు పోస్తూ
ఉగాది ఉషః కిరణం
ఎంత మనోజ్ఞంగా వుంది !

## 2

ఏమోయ్, నిన్నే, ఇదిగో !
ఇలారా ఒక సారి !
వంటగది ఎప్పుడూ వుండేదే లే,
అవును, అసలు –
ఈ లోకానికి ప్రాణాధారమే వంట గది,
సూర్యుడే పొయ్యి !

నీవు జగదంబవు !
ఆ కుర్ర కుంకల్ని ఇక లేపు
చదువూ లేదు, సంధ్యా లేదు,
నిద్ర ముఖాలు !
మన మేధావిగాణ్ణి కూడ లేవగొట్టు
కాస్త ఈ నాడైనా
లేచి వీధి మొగం చూడ మను,
పిరికి వెధవ ?

## 3

మన తెలుగు వాళ్ళకు
సంవత్సరాదీ, వసంతారంభమూ ఒకటే !
అది నిజంగా మన అదృష్టం !
వసంతం ఫాల్గునంతోనే వస్తుందనీ,
కోకిల ఏడాది పొడుగునా కూస్తుందనీ,
బజారులో మామిడి పళ్ళు కనిపిస్తున్నా
మన కవి కోకిలలు లలిత రసాల పల్లవాల
వగరు గొంతుకలతోనే అరుస్తారనీ
పండితులు విమర్శిస్తూ వుంటారు.

కవుల స్వేచ్ఛనూ, సన్మానాలనూ, శాలువాలనూ చూచి
పండితులు ఏడ్చుకొంటారు, నిజమే కాని -
ఈ విమర్శలో మాత్రం నిజం వుంది !
మనకు వాస్తవంగా
ఫాల్గున చైత్ర మాసాలే వసంత ఋతువు.

## 4

అయితే-
మనకు కనిపించే దంతా వాస్తవమేనా ?
వినిపించే దంతా నమ్మ దగిందేనా ?
కొంచెం ఆలోచించి చూడు !
మానవుడు మధుర స్వప్నాలను కంటున్నా డంటే
ప్రజలు పండుగలు చేసుకొంటున్నా రంటే
ప్రవక్తలు తమ సమకాలీన సమాజంపై
ప్రాణాలకు తెగించి తిరుగుబాటు జరిపా రంటే
గుడిసెల్లో, పేవుమెంట్లపై కూడ
పడుచువాళ్ళు పిల్లల్ని కంటున్నారంటే
వాస్తవాలను ఎదిరించే కాదా ?
వాస్తవం ఒక్కటే జీవితం కాదు
కూడు గుడ్డ కొంప ఇవే కాదు జీవితం
అవి లేనివాళ్లు కూడ జీవిస్తున్నారు.

## 5

ఈ పసందైన వసంతోదయ రస కందంలో
ఈ శాస్త్ర చర్చ లెందుకు కాని -
మొత్తం అరవై సంవత్సరాల కాల అక్షమాలలో
ఏభై ఆరోది దుందుభి !
రాముడనే శిష్ట మానవత
రావణు డనే దుష్ట రాక్షసత్వంపై
విజయం సాధించిన శుభ వార్తను
లోకానికి చాటిన విజయ దుందుభి ఇది,
ఫాల్గున అమావాస్య ముగిసిన
చైత్ర పాడ్యమి ఉషః కిరణ మిది !
నా ఊహలో ఇది ఏభై ఆరోది కాదు
మానవ మహా విజయ పురోగమనంలో
ఇదే మొదటిది !
ఇదే శ్రేయోరాజ్య శకాది!

## 6

సరే కాని -
నీ వెప్పుడైనా ఉగాదిని చూశావా ?
ఉగాది పచ్చడిలో
వేప పూవ్వులా వుంది కదూ నీకీ ప్రశ్న ?

యుగం అంటే జంట
ఇద్దరు కలిసిన క్షణం యుగాది !
మనం కలుసుకొన్న క్షణం నుంచీ
ప్రతి క్షణమూ నీకూ ఉగాదేనా ?
అవును -
నీకు నేను ఉగాదిని
నీవు నాకు ఉగాదిని
సీతారాముల, రాధాకృష్ణుల, శక్తీశ్వరుల
యుగ ధర్మం మనది !
నీవు నన్నూ, నేను నిన్నూ ఆరాధించుకొనే
సత్యం సుందరం = శివం మనం !
సమతకు సదా ఉగాది పండుగ మనం !

## 39. గుడ్లగూబ ఆరాటం

ఒరే, ఎందుకురా కూస్తావు ?
ఓరి, పరభృత ముష్టిం పచా !
పని లేని పంబా ! నోరు మూసుకో ?
నీ రాజ్య మింకా రాలేదు పడుకో !

ఈ తమో రాజ్యానికి అధినేతను నేను
ఈ ఎగురుబోతు వర్గంలో మేధావిని నేను
నక్కలకు, నాగులకు, పిల్లులకు, పీడలకు,
దొంగలకు, దెయ్యాలకు, హంతకులకు
రెండో ఆట సినీమాలతో సహా
మొత్తం చీకటి వ్యవహారా లన్నిటికీ
నాయకుడిని నేను ఆజ్ఞాపిస్తున్నాను విను,
అరవకు !

అరె, నా రాజ్యంలో నన్నే ధిక్కరిస్తున్నావే !
ఏం చూసుకొనిరా ఆ ధైర్యం ?
ఆ కూతల వెనక ఎవరా నేతలు ?
వసంత కంతులా ? కళా కాంతులా ?
ఏమి టవి ?
బలిసిన వాళ్ళ ఊహాపోహలు కాక ?
ఇంతలేసి పెద్ద పెద్ద కళ్ళున్న నాకే
కనిపించని దేదైనా వున్నదా, లోకంలో ?
చీకటి కంటే సత్యం ఏముందిట ?

వెన్నెలే అభ్యుదయ నిరోధక ప్రతిపక్ష
మాయావాదం అనుకొంటే -
అంతకంటె మహావిప్లవ మహోదయం
ఏమిటిరా, ఆ దిక్కున కనిపిస్తున్నది నీకు ?
నీ వంటి పాటగాళ్ళకు, ఆటగాళ్ళకు
కలలు దున్నుకొనే వాళ్ళకు
కవిత లమ్ముకొనే వాళ్ళకు
స్వేచ్ఛారాజ్యం వచ్చేస్తున్నదా ఏమిటి ?

ఇదేమిటి ? నాకళ్ళు మూతలుపడిపోతున్నై !
అదేమిటి ? ఆ... రక్త పాతం ఆశాపరిధిలో ?
లోకంలోని చీకట్లన్నీ ఉవ్వెత్తున పారి వచ్చి
నా కన్నుల్లో దూరి
తలుపులు మూసేసుకుంటున్నై !
జగత్తులోన రణ గొణ ధ్వను లన్నీ
నా చెవుల్లో మర మేకులు కొట్టేస్తున్నై !

ఒరే, నీవే గెలుస్తున్నట్టున్నావు !
ఆ వచ్చిందేమిటో !
అది తెచ్చిందేమిటో !
నా కెలా తెలుస్తుంది ?
నే నేం మేధావిని ?

* * *

## 40. త్రిమూర్తులు పుట్టిన ఉగాది

ఏమి టలా కూర్చుండి పోయావు ?
వినిపించడం లేదా ఆ వసంతాగమన గీతం ?
మధుదేవతకు ఆ కోకిల పలుకుతున్న స్వాగతం ?

★ ★ ★

కోకిల !
కాకుల గూటి పిట్టే,
కాకులు తన్ని తరిమేసినదే,
కాకుల మూకలతో పోలిస్తే
సంఖ్యాబలం లేనిదే,
సైజులో చిన్నదే.
అయితే –
దాని పంచమ వర్ణంలో (స్వరంలో)
విశ్వ చైతన్య విపంచినే మీటగల
నవోదయ సమ్మైశ్వర్యం లేదా ?

★ ★ ★

పాపం, ఒకే ఒక కోకిల మిగిలింది !
ఇది కూడపోతే, ఇక -
ఈ తోటకు వసంతమే రాదేమో !

★ ★ ★

వె య్యెకరాల తోట !
ప్రపంచానికే రసదానం చేసిన ఫలాగారం !
సగమ్మై, పావై, పరకై
సీలింగుతో భిన్నాభిన్నమై,
మనకు నాలుగు చెట్లైనా మిగలకపోగా -
తోటంతా ఇళ్లై, రోడ్లై, ఫేక్టరీలై
పొగలు కక్కుతున్నై !

★ ★ ★

దున్నేవాడిది భూమి,
దున్నని వాడిది పంట!
ఇదీ మన నినా దాభ్యుదయం !
భూమిని జాతీయం చేయడానికి బదులు
ముక్కలు చేసి వ్యక్తులకు పంచడం -
వాళ్ల పంటను దున్నని దొరలు
దోచుకు తినడానికి కాక మరెందుకు ?

★ ★ ★

ఈ ఉన్న ఒక్క వేప సైతం స్వేచ్ఛగా ఎదగకుండా
కొమ్మలు నరికేశారు కరెంటు తీగల వాళ్లు !
ఆ మామిడి పిందెలు చూడు -

మన డెందాల లాగే ఎలా కందిపోయున్నాయో !
అవును -
పాతాళ గంగను కూడ
ఫారిన్ రిగ్గులతో తోడేస్తుంటే
మహా వృక్షాల కైనా
మాన ప్రాణా లెంతకాలం నిలుస్తై ?

★ ★ ★

దుశ్శాసన వధానంతర
భీమసేన రక్తాట్టహాసంలా వుంది ఉదయ సంధ్య !
నెత్తురు చిమ్ముకొంటూ వచ్చేసింది రుధిరోద్గారి !
ఏమి టలా చూస్తున్నావు ?
పంపులో నీళ్ళు రావడం లేదు కదూ ?
ఈ తెలుగు దేశంలో నీళ్లెక్క డున్నై
ప్రజల కళ్లల్లో తప్ప ?

★ ★ ★

అన్నట్టు, ఇది
మన చంద్రుడి జన్మదినోత్సవమే కాదు,
ఏప్రిల్ పద్నాల్గు సూర్యుడి జన్మదినోత్సవం కూడ,
మన అంబేద్కర్ జన్మదినోత్సవం కూడ !
ఓహో, ఎంతటి పవిత్రోత్సవం !
నవభారత జన జీవన ధార్మిక త్రిమూర్తులు
కలిసి చేసుకొంటున్న ఉమ్మడి పండుగ !

★ ★ ★

సత్య సౌందర్య దర్శన మధువ్రతా లైన నీ చూపులు
మధు మక్షికాలై శ్రమిస్తున్నై !
అయినా లభించడం లేదు సుఖశాంతులు లోకానికి !
గండిపేట హిమాయతసాగరు ఎండిపోతే నేం ?
మహా సాగరే లేదా మన కోస్తా పొడుగునా ?
ఉప్పు సత్యాగ్రహం ప్రకటించి
తీపి నీరుగా మార్చి తీసుకొద్దాం, లే !
ఉగాది ఉపోష్యం కాదు.

★ ★ ★

"నా కుగాదులు లే" వన్న కృష్ణశాస్త్రి నిర్వేదం,
ఉగాదులే కాదు, సర్వసంపదల గాదులూ
ఇక మీవే అన్న అంబేద్కరు జ్యోతిర్వేదం,
మన సర్వజన శుభంకర సామ్యవేదం -
కలిపి అందించు ఉగాది పచ్చడి !
రుధిరోద్గారి ఎవరో కాదు,
మన ఇలవేల్పు విజయ రుద్రాణి!

★ ★ ★

(1983 ఏప్రిల్ 14న ఆకాశవాణిలో ప్రసారమైన కవిత. తెలుగు ఉగాదితోపాటు తమిళ ఉగాది, అంబేద్కర్ జన్మదినం కూడా కలిసి వచ్చినై. అందుకే చంద్రుణ్ణి, సూర్యుణ్ణి, అంబేద్కరుణ్ణి భారతీయ ధార్మిక త్రిమూర్తులు అన్నాను.)

## 41. రస రాగ వైవిధ్యం

కొత్త సినీమా విడుదలైన మొదటి రోజుకూ
కొత్త ఏడాది తొలిరోజుకూ ఏమిటి తేడా ?
ఏం లేదు, తేడా ఏమీ లేదు.

అక్కడ టిక్కెట్లకోసం, సీట్ల కోసం తొక్కిసలాట
ఇక్కడ వేపపువ్వు వగైరాల కోసం హడావుడి
రెండూ ఒకటే, తేడా ఏం లేదు.

సినిమా టికెట్లు రేపు కూడా దొరుకుతై
వేపపువ్వు రేపు కూడా దొరుకుతుంది
ఈనాడే ఎందుకింత తొందర ?

ఇదే మానవ మనస్తత్వంలోని రహస్యం !
దేనికైనా మొదట పంక్తిలో తానుండాలి
పంక్తిలో మొదటివాడు తానే కావాలి
ఏ చెట్టు దైనా తొలి ఫలం తనకే దక్కాలి
ఏ రుచి నైనా తొలిగా తానే ఆస్వాదించాలి !

ఈ ఉగాదులు
ఒకొక్కటి ఒకొక్క మహోదయం

ఒకొక్కటి ఒకొక్క ఆత్మ విమర్శనం
ఒకొక్కటి ఒకొక్క రాధామాధవం
ఒకొక్కటి ఒకొక్క ఆనందమార్గదర్శనం !
దేని కదే కొత్త, దేనికదే ప్రత్యేకం
అన్నీ ఒకేలాగే కనబడుతున్నా
అందాలు వేరువేరు,
అన్నీ ఒకేలాగ వినబడుతున్నా
రాగాలు రక రకాలు,
ఆస్వాదించండి
ఆనందించండి !

# 42. వసంత వరణం

( శిశిర రుతువు చివర ఘడియ గడిచిపోయింది. వసంత రుతువు తొలి ఘడియ ప్రారంభం కాబోతున్నది. ఒడలెల్ల కనులుగా ఎదురు చూస్తున్నది ప్రకృతికాంత వసంతుని కోసం. ఆ చూపుల కొసలు ఏదో వార్తను మోసుకు వస్తున్నాయి. అది బృంద గానంగా వినిపిస్తున్నది )

బృందగానం :

అది గదిగో కెందామర పువు బోడిపె !
అదిగదిగో మావి చిగురు జెండా !
అదిగో మధుపూర పూర్ణ కుంభం !
అదిగో నవ వసంతోత్సవ రథం !
బైలుదేరె ! బైలుదేరె !
బైలు కొసల నుండి !
మలయానిల పత్రముపై
మధుపాక్షర లేఖ ఇదే !
వసంతుని విలాసాలను
దెసలు చదివి వినిపించె !
వచ్చె నదే ! వచ్చె నిదే !
వసంతోత్సవ రథం !
కోకిల స్వాగతము చెప్పె తొలుత,
కుంకుమ మిడె మంకెన పువు నెలత,
ఉగాది పల్లకి లోనికి
ఉరికె కొత్త పెండ్లి కొడుకు !

తరలి వచ్చె ! తరలి వచ్చె !
తన నొసటనె ప్రొద్దు పొడిచి !

(వసంతుడు ప్రవేశించాడు. ప్రకృతి పదహారు వేల వనలక్ష్మలై అతణ్ణి వరించి వచ్చింది. ఒక్కొక్కరినే అతడు సమాదరిస్తూ వస్తున్నాడు. అంతట మధుప్రియ (కోకిల) అతణ్ణి సమీపించింది)

మధుప్రియ :

నీ వియోగ మహార్తవార్ణవ పంచకమ్ముమన
నావ దొరకని దాన నోయీ !
పంచ మమ్మును దాచుకొని, బ్రతుకోర్చుకొని, నీ
పంచ చేరిన దాననోయీ !

ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా !

అణగి, లోకపు కాకులతొ దశ మాసములు నే
నణువు వలె జీవిస్తి నోయీ !
శిశిరపుం గొసలందు నీ చిరునవ్వులే నా
చీకు చింతలు రాల్చె నోయీ !

ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా !

కంఠమున శివునిన్ ధరించిన విషముస్నై, నీ
కరుణకై మనుచుంటి నోయీ !
నీవ నన్ను ధరించి, ప్రకృతికి పురుషుడై, న
వ్యావనులు నిర్మింపు మోయీ !

ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా !

వసంతుడు :

నీ వటే కోకిలా ?
నీ వటే కాకిలా !
నా వియోగము లోన
నల్లనైనా వటే !
నవ్వరే, ఎవరైనా
నవ కవులు వింటే ?
నీవ కాటుక కాయ
వీ వన రముల కెల్ల,
నీవ బొగ్గుల కుంప
టే విరహ హృదయాల,
నాకు ప్రియు రాలవా ?
నవ్వరే యెవరైనా ?
విషపు బాణాసనము
వింటివా ? నీ గొంతు,
కలిపి కట్టు నొకప్డు
కలియ గొట్టు నొకప్డు
నీ వటే కోకిలా ?
భావాగ్ని పొగలా !

(కోకిలా సిగ్గుపడి దారి విడుస్తుంది. వసంతుడు పరిక్రమిస్తాడు. రసాలిని (మామిడి) ప్రవేశిస్తుంది.)

ర సా లి ని

నేను బాల రసాల లతనోయ్ !
నేను, మాధవ ! నీకు జత నోయ్ !
ఉగాది రుచుల గాదెను, నే
జగానికి మాధురిమ నోయ్ !
తావి తరగల షట్పదమ్ముల
నీవు వ్రాసిన ప్రేమ లేఖలు
నన్ను నన్నే త్రావి త్రేన్పుచు
నున్న వివిగో నోయ్ !
తీయ తేనియ పాత్రముల ఆ
తిథ్యమును సమకూర్చి పెట్టితి ;
పీపులా ? నీకేలు సోకిన
చేప వా రస పయోధునులు ?

వ స ం తు డు :

ఈ వగరు పిందెలా
నీ వలపు రసధునులు ?
ఈ తేనె టీగలా
నీ తలపు దూతికలు ?
నవ్వరే, యెవరైన
నవ కవులు వింటే ?

మనసులో కోకిలవు
మసి గూడుకట్టుకొని
శాంతి లోకమును జవ
జవ లాడ కవ్వించు
కెంజివురు బావుటా
రంజించునా నన్ను ?
ఎల మావి నా కొక్క
వలపు నెల వనుకొంటి ;
నింగి కే గురి పెట్టు
నిప్పు బాణపు మొనవె !
చూతులే తరువాత ;
చూతమా ! నిలువుమా !

(రసాలిని దారి తొలగుతుంది. నింబలత (వేప) ప్రవేశిస్తుంది.)

నింబలత :

ముద్దులొల్కు భూకాంతకు ముత్యాల్
ముగ్గులు పెట్టిన వాకిలి నేను
నింగి అద్దమున నా ప్రతిబింబమె
తొంగి చూడదా పాలపుంత వలె ?
రావోయీ, మధుదేవా ! కై
కోవోయీ, నా సేవ !

పికములు, శుకములు, కాకము లనుచున్
భేదము లేదోయ్ నా పంక్తి !
అందరి కాయు, స్సారోగ్యము, భా
గ్యము సమముగ కూర్చే రాణి నేనే !
రావోయీ, మధు దేవా ! కై
కోవోయీ, నా సేవ !

వ సం తు డు :

నీ పూల నవ్వు వె
న్నెల కాయునే కాని,
వెన్నెలల కడలిలో
విషము దాగిన దమ్మి !
చేదు విషమో లమ్మి !
చేర రా కోలమ్మి !
బేల చూపుల వలపు
పూల ప్రభ వనుకొంటి,
నీ గుండె చేదుతో
నింపు కొన్నా వటే ?
ఆయు రారోగ్యాలె
ఆనంద మగు నటే ?

( నింబలత నిష్క్రమిస్తుంది. ఇక్షుకాంత (చెరకు) ప్రవేశిస్తుంది )

ఇ క్షు కాం త :

చెరకు వింటి చెలి చెప్పగ
వింటిని, నిను కంటిని !
మల్లిక నీ మాట చెప్ప
ఊరితి, నిను కోరితి !
పువ్వు టమ్ము రివ్వు మనగ
నేను కూడ దాని తోడ
దూకి నిన్ను తాక లేక
విలపించితి విరహ బాధ !
విశ్వానికె రుచి, పంచమ
వేదానికె పర్వమునే !
కనికరించి చేకొనుమా,
కాంతా ! ఓయీ, వసంతా !

వ సం తు డు :

ఓసి, గడసాని ! నీ
బోసి నవ్వుల కేమి,
వాసి వన్నెల కేమి
వాలు చూపుల కేమి,
నా ప్రక్క నిను చూచి
నవ్వరే నవ కవులు ?
దీనురాలవు వరా
ధీను రాలవు నీవు,

ఆసనమువే గాని
అమ్ము వెట్లగుదువే ?
ఎత్తరా మగనాలు
ఏల గలదే మగని ?
నీ నిండ ఎంతెంతో
తేనె యున్నను గాని
నమిలి మ్రింగిన కొలది
నార సాగును పిప్పి !
వేణు ప్రియువె కాని
వినపడదు నీ పలుకు !

( ఇక్షు కాంత ప్రక్కకు తొలుగుతుంది. ఒక వెండి గిన్నెను చేత పట్టుకొని నాట్యం చేసుకొంటూ ఒక గోపిక ప్రవేశిస్తుంది. తన ప్రాణాలు ఆమె చేత నున్నట్టుగా వసంతుడు ఆమెను అనుసరిస్తాడు )

గో పి క :

ఉగాది దేవత,
యుగాధి దేవత
జగానికే అ
గ్ర గామి దేవత
దిగాలు పడ నేమీ ? వసంతుని
మొగాన ఎరు పేమి ?
ప్రణయ విహంగము
పరభృత మనుచు

ప్రియ మాకందము
పేదది యనుచు,
సిద్ధ నింబలత
చేదే యనుచు,
కోమలేక్షువే
కురూపి యనుచు,
    దిగాలు పడ నేమి ? వసంతుని
    నిగాకు ఫల మేమీ ?
ఆకులు రాలని
మ్రాకు లున్నచో,
శిశిరము సోకని
చేత మున్నచో,
చేదే యెరుగని
స్వాదు వున్నచో,
కుందు లేని ఆ
నంద మున్నచో
    జగాన దిగు లేమి ? వసంతుని
    జన్మకు ఫల మేమి ?
రసాధి దేవత
వసంత భూమిక
ఒసంగినవె ఈ
పసందు లన్నీ,

అసాధు వన నేమి ? వసంతుని
ప్రసాదమే భూమి !

( ఆమెతో కలిసి నాట్యం చేస్తూ వసంతుడు ఆమె చేతిలోని పాత్రను తన చేతిలోకి తీసుకొంటాడు. రుచి చూస్తాడు. తేజోవంతుడవుతాడు. ఆనందమూర్తి అవుతాడు.)

వ స ం తు డు :

అనిర్వచనీయ మిది, ఓహో !
అమృతమునకే అమృతమో !
అపూర్వము, అద్వితీయ మహో !
ఆత్మకే ఇది ఆత్మమో !
ఓ జగన్మధు మోహినీ ! నా
యాగమము నీ కోసమేనే !
కంఠమున కల కంఠములతో
కందొవల యెల వెన్నెలలతో
అధరమున శీధు రసములతో
అఖిల సౌందర్య రుచి వీవే !
ఓ జగన్మధు మోహినీ ! నా
యాగమము నీ కోసమేనే !

(ఆమె అతని కేలు గ్రహిస్తుంది. పాత్రను తిరిగి మెల్లగ అందు కొంటుంది.)

గో పి క :

ఇదేనోయీ, అమృత కలశం !
ఇదేనోయ్, జీవన రహస్యం !
తీపి, చేదు, వగరు, పులుపు
రూప మందిన విశేషం !

విడి విడిగ ఒక్కొక్క రుచి కే
ర్పడదు సంపూర్ణత్వము ;
అన్ని రుచుల సమైక్య మియ్యది,
ఆంధ్ర కిది ప్రత్యేకము !

బ్రతుకు భాండము నిండ నవరస
పాకములు నింపిన దిదే నోయ్
కష్ట సుఖముల నిగ్గు, తెలుగు ఉ
గాది పచ్చడి ఇదే నోయ్ !

వసంతుడు

బలే దానవే ! బలే జాణవే !
తెలుంగు వాసిని నిల్పితివే !
ప్రపంచ రుచికే అధినాథుడ నను
పచ్చడి గిన్నెను పట్టితివే !
మహీ మాధురీ ! మధుర రుచిరీ ! మ
న్మనో హరీ ! ఆంధ్రీ !

ఉగాది పచ్చడి నిగారములలో
జగజ్జీవమే గుబాళించెనే !
ఏ రుచి కందని వసంతునే నీ
పారాణికి పహరా పెట్టితివే !

జను స్సుందరీ ! జగా జహ్వారీ !
జనతా మాధురి ! ఆంధ్రీ !

(ఆమె ముందు అతడు, వెనుక నాట్యం చేసుకొంటూ నిష్క్రమిస్తారు. ప్రకృతి అంతా సుందరతరంగా వికసిస్తుంది.)

## 43. పూర్ణ మధు పూర్ణిమ

చాంద్రమాస కాలీను లందరికీ
చైత్ర మాసాది ఉగాది,
వసం తానం దాసక్తు లందరికీ
ఫాల్గుణ కామపూర్ణిమ ఉగాది,

### 2

రాధాపూర్ణిమ, మాధవ పూర్ణిమ
వ్యాసపూర్ణిమ, బుద్ధపూర్ణిమ
ఈ అన్ని పూర్ణిమలూ కలిసి
ఒకే ఒక పూర్ణ మధు పూర్ణిమ నాకు,
అది నీవే పై శాఖివి !
పూర్ణ సౌందర్య మధుశాఖివి !

### 3

ఫాల్గుణీ చైత్రీ సుందర చాంద్రీ శోభ లన్నీ
ఈ ఉగాది పర్వోత్సవ మాధుర్యా లన్నీ
నేను సేకరించేవీ, నిల్వ చేసుకునేవీ,

మానవుణ్ణి ముందుకు నడిపించే శక్తు లన్నీ
క్షణక్షణం నిన్ను రాధాపూర్ణిమగా
ఆరాధించడం కోసం !
వ్యాసపూర్ణిమగా తలదాల్చడం కోసం !

## 4

అహం బ్రహ్మాస్మి నీ సిద్ధాంతం
ఆత్మవత్ సర్వభూతాని నా జీవితం
అన్నం, సున్నం ఒకే బ్రహ్మ పదార్థం అయినా
అన్నమే తినడం నా స్వభావం
ఉల్లిపువ్వు, మల్లిపువ్వు ఒక తోటలోవే అయినా
మల్లెపూలనే నీ జడలో ముడవడం నా ఆనందం.

## 5

ఆకలి, నిరాశ, రోగం, పై కల్యం, దోపిడి, దుఃఖం
ఈ పీడా షడ్వర్గం పరమ విరోధులు నాకు,
నా పోరాటం అంతా వీటి నిర్మూలన కొరకే,
నేను సుఖాసక్తుణ్ణి, సౌందర్యోపాసకుణ్ణి, రసలోలుణ్ణి,
ప్రకృతి కళాకాంతులతోనే నా సాంగత్యం,
నిజ సౌందర్యం స్థానంలోకి నెగిటివ్‌ను చేరనివ్వను !

## 6

నేను మట్టిలో కలిసిపోతే, నీ కోసం -
మందార పుష్పంగా వికసిస్తాను,
వసంత కోకిలనై పాడతాను,
గంధవహుణ్ణై విహరిస్తాను,
పూర్ణెందు శేఖరుణ్ణై నృత్యం చేస్తాను !
నేను చచ్చినా శృంగార పురుషమూర్తినే !
సౌందర్య కళాకిరణ పుంజాన్నే !

# 44. కాంపౌం డేదైతే నేం

కోకిల కూస్తున్నది, ఎక్కడి నుంచో !
అది కూత కాదు, పాట !
కొందరికి కూత, కొందరికి పాట,
కొందరికి విశ్వైక ప్రేమగీత
వాళ్ళవాళ్ళ సంస్కారాన్నిబట్టి.
పోనీ, కాని -
అదెక్కడి నుంచి పాడుతున్నట్టు ?
చర్చి కాంపౌండు నుంచా ?
మసీదు కాంపౌండు నుంచా ?
శివాలయం కాంపౌండు నుంచా ?

ఏ కాంపౌండు నుంచి అయితేనేం ?
అన్నిటా వున్నై ఉద్యాన వనాలే,
ఎక్కడి నుంచి పాడినా కోకిల కోకిలే !
అది ఏమతానికీ అనుయాయి కాదు,
ఏ గుడికీ పూజారి కాదు.

చంద్రుడు వెన్నెల కాస్తున్న దే కాంపౌండులో ?
చల్లగాలి వీస్తున్న దే కాంపౌండు నుంచి ?
కాంపౌండ్లకు అతీతమైన కళాకాంతులలో
వసంతం ఒకటి, కోకిల వసంతప్రియ !

జీవాధారాలూ, జీవ నావశ్యకాలూ
జీవిత సుఖ సంతోషాలూ, అన్నీ
ఏ కాంపౌండుకో పరిమితమైనట్టివి కావు,
అందరినీ సమానంగా ముంచెత్తే పరమాత్మీయాలు,
కాంపౌండ్లు ఆత్మరక్షక దుర్గాలు మాత్రమే,
పై నుంచి వచ్చే గాలీ వెలుతురూ వీటికి లేవు.

ఆకులు, రాల్చేసి మోడైన
ఆ శిశిర వృక్షాన్ని చూడు !
సర్వసంగపరిత్యాగి వేమనలా లేదూ అది ?
ఆయన పద్యాలే కోకిల పాట లేమో ?
అందుకే మోడునుంచి కొత్త మొగ్గలు తలలెత్తుతున్నై
పాటలకు శ్రుతులై ప్రతిస్పందిస్తూ !

కోకిల వసంతప్రియ,
వసంతం నవనవాభ్యుదయ వికసనప్రియ,
అది ఏ దివ్యక్షేత్రం నుంచి అవతరిస్తున్నదో
ఏఏ రసరాగమాధుర్యాలను తెస్తున్నదో
అందులో అంజలి పట్టి !

కాంపౌండులకు కట్టుపడుండేవి పెంపుడు జంతువులు,
కొట్టాలు, కట్టుకొయ్యలు, దాణాలూ, వాటికోసం,
కోకిల దివ్యకళాజీవనమేధోధార,
పరబ్రహ్మగా ఆత్మను కరిగించే నాదబ్రహ్మ !

# 45. మానవ - నవోదయం

ప్రయోక్త : జగన్నాటక సూత్రధారి

కవి : మానవ ప్రగతి దర్శకుడు

అమరాత్మ : మానవ స్వాతంత్ర్యం కోసం పోరాడి, వీర మరణం పొందిన స్వాతంత్ర్య సమర యోధుని ఆత్మ

ధర్మసేన : అనేక మంది సమరయోధుల ఆత్మల బృందం

ప్రకృతిమాత: కనిపించే ప్రకృతి కంతటికి తల్లి అయి, కనిపించని శక్తి

ఉష : అయోమ యాంధకారంలో అభినవ ఆశారేఖ

ప్రయోక్త

కవి ఆవేదన పడతాడు
ఆ ఆవేదన నుంచి
అభ్యుదయం ఆవతరిస్తుంది
అనాది నుంచి
మానవ ప్రగతిలోని మలుపులను
అభ్యుదయ ప్రకరణాలను
పరిశీలించి చూస్తే
మానవ సమాజపు జీవనాడుల నిండా
అవినీతి అంధకారం క్రమ్ముకొన్నప్పు డెల్లా
గుండెలు పగుల్చుకొనేవాడు కవే
యువతరాన్ని హెచ్చరించేవాడు కవే,

నర సమాజపు నవనాగరితకు
కవే మార్గ దర్శకుడు.
నాగరికతా సమ్యక్ సంచిత ధర్మనిధులకు
కవే రక్షక భటుడు, ధర్మకర్త.

*కవి*

అమ్మా, నవ్యోషా ?
ఒరే నవ నవోదయం ?
(ఎవరూ పలకరు) ?

*ప్రయోక్త*

ఆతడే కవి
అర్ధరాత్రే అరుణోదయాన్ని పిల్చేవాడు
మధ్యాహ్నం కూడ మేలుకొల్పులు పాడేవాడు
కవి కాక మరొక డెలా అవుతాడు ?

*కవి*

ఎవరతడు ?
మానవుణ్ని దానవుణ్ణిగా మార్చి
అష్టకష్టాలకూ ఆలవాలం చేసి
మానవాత్మనే హతమారుస్తూ
విజృంభించిన వికటాంధకారంలో
ఊపిరాడక ఉషస్సు కోసం

ఆక్రోశించే నన్ను గురించి
ఏమిటో అంటున్న అత డెవరు ?

ప్రయోక్త

నేను, కవీ, నేను
కాల నేత్రాన్ని
కాల కంఠాన్ని
జగన్నాటక ప్రయోక్తను,
నీ ఊహకు రూప కల్పనను,
నీ మాటకు స్వరకల్పనను
నిను నే నేమీ అన లేదు
వాస్తవం ప్రవచించాను.

కవి

అయితే, స్వామీ
ఇప్పు డర్ధరాత్రి దాటిన తర్వాత
అరుణోదయ మెంత దూరం ?

అమరాత్మ

అవును కవీ అవును
అర్ధరాత్రి దాటిన తర్వాత
అరుణోదయం సన్నిహితమే.
అరుణోదయ కర్తవ్యాల కోసం

అర్ధరాత్రినుంచే సిద్ధ పడవలసి వుంది.
అరుణోదయమై
అరవిందాలు వికసించినా
కన్ను తెరవని జడుల కోసం
మధ్యాహ్నం వరకూ కూడ
మేలుకొల్పులు పాడవలసే వుంది.

*కవి*

మీరెవరు, మహాశయా ?
మానవ నవోదయ దీక్షా ప్రాంగణంలోనే
మనుగడ అస్తమించి పోయిన
ఏ దేశ భక్తి మహాత్మవో అన్నట్టు
ఏ యువ భారత శక్త్యాత్మవో అన్నట్టు
ధ్వనిస్తున్నది నీ వీరామర వాణి
జ్వలిస్తున్నది నీ లోకానుభవ ధోరణి !

*అమరాత్మ*

వద్దు కవీ వద్దు
అంతటి గొప్ప గొప్ప పేర్లు నాకు వద్దు,
స్వాతంత్ర్యోద్యమ మహాయజ్ఞాగ్నిలో
నే నొక తొలి సమిధను మాత్రం,
స్వరాజ్య సౌధ మహానిర్మాణంలో

నేనొక పునాది రాయి మాత్రం,
ప్రజాభ్యుదయ మహా క్షేత్ర విస్తరణలో
నే నొక నారు మొక్కను మాత్రం.
ఏ తొలి సమిధా
యజ్ఞపురుషుని పూర్ణ సాక్షాత్కారాన్ని చూడ గోరదు
ఏ పునాది రాయీ
మహా సౌధ శిఖర శిల్పం కావాలని ఆశించదు
ఏ చెట్టు వేరూ దాని పుష్పఫల సౌభాగ్యంగా
మన్నన లందా లను కోదు, కాని –

*ప్రయోక్త*

చావో, స్వాతంత్ర్యమో అన్న
క్విట్ ఇండియా మహా విప్లవంలో
బలవంతుడే రాజన్న
పశు బలం తుపాకి గుండుకు
గుండె పగిలి చచ్చిపోయిన
ఒక యువ వాలంటీ రతడు !

*ధర్మసేన*

అతడొక్కడే కాదు
అసంఖ్యాకంగా వున్నా రిక్కడ
ప్రజల కోసం ప్రాణా లర్పించిన

తరతరాల తరుణ యోధులు
యుగ యుగాల యువ వీరులు
ఈ మహాంధకారం నిండా
ఏ మహోదయం కోసమో ఎదురు చూస్తూ!
కాని –

అమరాత్మ

కాని –
ఏదీ ఆ మహాయజ్ఞ ఫలం ?
ఏదీ ఆ మహాసౌధశ్రీ ?
ఏదీ ఆ మహావృక్షచ్ఛాయ ?

ధర్మసేవ

యజ్ఞఫలం కుక్కల పాలు
సౌధశ్రీ పిశాచాల పాలు
వృక్షచ్ఛాయ కొండచిలవల పాలు,
ఏ ప్రజల సంక్షేమం కోసం
ఏ ప్రజల సుఖశాంతుల కోసం
త్యాగధనులు ప్రాణా లర్పిస్తున్నారో
ఆ ప్రజ లంతా ఏరి ?

*ప్రయోక్త*

ప్రజల కింకా నవోదయం కాలేదు
కవి పిలుపు ఉషస్సుకుకూడ అందడంలేదు
(శోకరుద్ధమైన కంఠంతో ఒక స్త్రీ వెర్రిగా నవ్వుతున్న ధ్వని)

*కవి*

నీ వెవరు తల్లీ ?
కష్టనష్టా లన్నింటినీ
కడుపులోనే దాచుకొని
కమ్మని శాంతి సుఖాలను
కన్నబిడ్డల కర్పించే
ధరామతల్లిలా ఎవరు తల్లీ నీవు ?

*ప్రకృతి మాత*

నేనా కవీ ?
నేను ప్రకృతి మాతను
స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం
సర్వ జన సౌఖ్యం కోసం
సమతా ధర్మ సంస్థాపన కోసం
మానవుడే మాధవుడు కావాలనీ,
మహిమీదే స్వర్గం నెలకొనాలనీ,
ఆశించి, అలమటించి, అందుకోసం
విద్రోహ శక్తులతో పోరాడి

వీర మరణం పొందిన
తరతరాల వీరయోధుల
ఆరని ఆదర్శాలకు ఆశ్రయాన్ని
తీరని కోరికలకు తీర్థాన్ని.

*ధర్మసేన*

ఆమె మా అమ్మ !
నవమాసాలు కాదు
నవకోటి మాసాలకైనా
విముక్తి లభించని మా క్షుభితాత్మలను
వెలుగు కనిపించని మా చిరలక్ష్యాలను
తన అణువణువునా ధరించి
నవోదయం కోసం
వొళ్ళంతా కళ్ళు చేసుకొని
నిరీక్షిస్తున్న మా అమ్మ ;
మనిషి చచ్చినా మనసు చావని అవస్థకు
వ్యవస్థ అయిన అమ్మ.
(అయోమయ స్థితిని తెలిపే అవ్యక్త కంఠస్వరాలు – సభలో
గందరగోళంలాంటి ధ్వనులు )

ప్రయోక్త

కవికి అయోమయంగా వుంది ;
ఉషస్సు కోసం విసిరిన తన పిలుపు
మధ్యలో తేనెతుట్టెకు రాయిలా
అతృప్త నిస్సృప్త వీరాత్మల పుట్టకు తగిలి
ఆ నివురుకప్పిన నిప్పులు రేగి
చేలరేగి చుట్టుముట్టినై ;
కవి సతమతమై పోతున్నాడు.
తన చుట్టూ తల నిండా
అన్ని ప్రక్కలా విశ్వవ్యాప్తంగా
అవే కంఠధ్వనులు !
అవే ఆశా నిరీక్షలు
'ఏనాటి నుంచో
ఇహ పరాలను 'ఏకం చేసి
'ఏ స్వర్గమో నిర్మించాలన్న
ఎందరో మహర్షుల, ప్రవక్తల, మహాత్ముల
నిత్య నిరంతర కృషి –
ఈ నాటికీ ఫలించ లేదన్న
నిరాశా నిస్పృహల మూకుమ్మడి ధాటికి
ఈయన ఎలా తట్టుకుంటాడో, పాపం !

*కవి*

ఎందుకయ్యా పాపం ?
పాపం అనవద్దు ఏ కవిని గురించీ ;
సానుభూతిని సహించలేడు కవి
సహించేవాడు కవి కాదు.
ఏ మహాశయ సాధన కోసం
మీరంతా ప్రాణ త్యాగం చేశారో
ఆ మహాశయం ఇంకా సిద్ధించక
వాపోతున్న అమర జీవాత్మలారా !
ఒక్కసారి నాకు
మీ అపరోక్ష దర్శనం దయచెయ్యండి. !
(భయంకరమైన నిశ్శబ్దం)

*ప్రకృతి మాత*

కవీ ఏమిటి నీ ఉద్దేశం ?
మహోదయం పేరుతో
మహాప్రళయమే కల్పించ దలిచావా ఏమిటి ?
వెలుగులో కళ్లు మూసుకొన్నా
కారు చీకటిలో కళ్లు తెరిచినా
ఒకటే నయ్యా కవీ !
ప్రజా సంక్షేమం కోరి, పోరి
ప్రాణాలర్పించిన అమరవీరుల ఆకాంక్షల

అపరోక్ష దర్శనం కదూ కోరావు ?
అదిగో అలా చూడు !
( ఇక్కడ పేర్కొనబడే దృశ్యాలకు అనుగుణంగా రకరకాల ధ్వనులు ప్రవర్తిస్తై)

*ప్రయోక్త*
ఎండలు మండి పోతుస్తై
మేఘాలు సమ్మె చేస్తుస్తై
సరోవరాలు ఎండి పోతుస్తై
జన పదాలు దగ్ధ మవుతుస్తై !
ఓహో !
ఆ రంకాల కాల నాటకశాలకు
నిప్పంటుకొన్నది !
జ్వాలలు, రక్త జ్వాలలు !

*ప్రకృతి మాత*
ఆ మండి పోతున్నవి ఎండలు కాదు, ధరలు
ఆ సమ్మె కడుతున్నవి మేఘాలు కాదు, మేధావులు
ఆ ఎండిపోతున్నవి సరోవరాలు కాదు
ప్రజల ప్రాణావసరాలు
ఆ తగలబడుతున్నవి జన పదాలు కాదు
జనానీకపు బ్రతుకు తెరువులు
నిప్పంటుకొన్నది కాలానికి కాదు

మానవుడి భవిష్యత్తుకు
అవి జ్వాలలు కాదు
అమర జీవాత్మల నిరాశానిస్పృహలు !
అయ్యో అది మృత్యు ధూళి పొగ కాదు
బ్రతికున్న వాళ్ళపై చచ్చిన వాళ్ళ పగ !
కవీ, మానవుడు !
మానవు డాత్మ హత్య చేసుకొంటున్నాడు !

అమరాత్మ
ఆత్మంభర, కుంక్షిభర పదవీలోలుడై
తోటివాణ్ని మోసం చేసైనా
కోటికి పడగెత్తాలన్న దురాశకు దాసుడై
లంచానికి కంచానికి లొంగిపోయి
ధర్మాన్ని హత్యచేసే విశ్వాస ఘాతుకుడై
శ్రమ శక్తిని దాచుకునే చోరుడై
సమభుక్తిని నిరాకరించే క్రూరుడై
మానవుడు మైమరచి
తనను తానే తినేసుకొంటున్నాడు !

భ్రాంతిలో పడ్డాడు
అది రజ్జుసర్పభ్రాంతి కాదు
సర్పరజ్జు భ్రాంతి !
(అమరసేన అట్టహాసం చేసిన ధ్వనులు)

*కవి*

అమ్మా, నవ్యోషా !

(ప్రకృతి పగిలేటంత గంద్రగోళం, అరపులు, అట్టహాసాలు)

*కవి*

అమ్మా, నవ్యోషా !

*ఉష*

ఎవరదీ ?

కవి గొంతులా ఉంది !

*కవి*

అవును, నేనే

*ఉష*

అప్పుడే లేచావా, కవీ ?

*కవి*

అప్పుడే లేవడమా ?

నేను పడుకొన్న దెప్పుడు ?

ఎంతో కాలంగా

నిజమైన నవోదయం కోసం

సర్వ జన శ్రేయస్సుందరమైన

మానవ మహోదయం కోసం
కంటిపై రెప్పలేకుండా
ఒళ్ళంతా కళ్లుచేసుకొని
ఎదురు చూస్తున్నాను, ఉషా !
గొంతుకలోనే గూడు కట్టుకొని
కంఠాన్నే కల కంఠంగా కూర్చుకొని
ప్రతి నవోదయాన్నీ పిలుస్తున్నాను !

ఎన్నో ఉషస్సులు వచ్చిపోతున్నై
ఎన్నో నవోదయాలు పుట్టి గిడుతున్నై
ఎందరో దేశభక్తులు, ప్రవక్తలు
మహాత్ములు త్యాగాలు చేస్తున్నారు
ఎన్నో పథకాలు, ప్రాజెక్టులు తయారవుతున్నై
కోటానుకోట్ల ధనం యజించబడుతోంది
కాని – ఇంతవరకూ
నే నూహించిన ఆ నవ్యోషకు
నా గొంతు నివిపించలేదు,
నే నాశించిన ఆ నవ నవోదయానికి
మానవత సిద్ధించలేదు !

వింటున్నావుగా
యుగ యుగాల నుంచి

మానవ నవోదయం కోసం ఆహుతై
ఎదురుచూస్తున్న అమరాత్మల
ఆవేదనలు, అలజడులు ?
ఇంకెంతకాలం ప్రకృతి మాత కడుపుకోత ?
ఇంకెంతకాలం ఈ పెరిగిపోతున్న సాధు హత్య ?

ఉష

కవీ, ఓ కవీ !
ఇంకెంతోకాలం అక్కరలేదయ్యా !
నేను భావిస్తున్న నవమానవ నవోదయం
నీవు ఊహిస్తున్న శ్రేయోరాజ్య నిర్మాణం
నీవు సంకల్పిస్తున్న సమధర్మ సమాజం
దగ్గరలోనే ఉందయ్యా !


భారతాత్మను మేల్కొల్పుతున్నాను
విశ్వాత్మను తోడి తెస్తున్నాను.
నీ పిలుపు వినబడుతున్నది
నీ కృషి ఫలిస్తున్నది
నీ వసుధైక కుటుంబ నవ్యోష
రూపం దిద్దుకొంటున్నది !
అదిగో, అమరాత్మ
ఆనంద రాగోదయంతో !

ఇదిగో, ధర్మసేన
ప్రకృతి మాత ప్రభాత వదనంతో !
మేమంతా నీవాళ్ళం
నీ మహోద్యమ ప్రవర్తకులం
లేవయ్యా, కవీ, లే !
లేచి, నమస్కరించు నవ నవోదయానికి !
(అమరాత్మ, ధర్మసేన అందరి కంఠాలతో)

*ప్రయోక్త*

జయోస్తు ఉషాదేవీ జయోస్తు
విజయోస్తు మహాకవీ విజయోస్తు !
ధన్యం మానవ జాతి !
ధన్యం జీవ జగత్తు !
(ఆకాశవాణిలో ప్రసార మైనట్టిది)

❋ ❋ ❋


డ్రగ్ ఎడిక్ట్సులు
డా॥ బోయి భీమన్న

ప్రథమ ముద్రణ: 1993

హక్కులు రచయితవి

వెల: రూ॥ 20/-

ప్రతులకు:

1. భీమన్న సాహితీ నిధి
ఐ.సి. 85, ఇర్రం మంజిల్ కాలనీ,
హైదరాబాద్ - 482

2. విశాలాంధ్ర పబ్లికేషన్స్
విజ్ఞాన్ భవన్, బ్యాంక్ స్ట్రీట్
అబిడ్స్, హైదరాబాద్

ముద్రణ:
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్
1-1-517/బి/1,
న్యూ బాకారం, గాంధి నగర్,
హైదరాబాదు - 380
ఫోన్: 611413

## అంకితం – వుండేల వారికి

వుండేల మాలకొండా!
భండన భీమేశు చేతి బంగరు కొండా!
చెండాలి దుండగుల, బా
గుండాలి సదా జనాళి గుండెల నిండా!

శూన్యము నుండి సర్వ విధ
 సృష్టి జనించిన శ్రీ ప్రతీకగా
మాన్యుడవైతి వీ జగతి
 మంచి తనమ్ముల కెల్ల కేంద్రమై;
ధాన్య ధన ప్రసిద్ధ కవి
 తాదిక సంపదలందు నీదె ప్రా
ధాన్యము నేడు; ఆధునిక
 ధాతవు, దాతవు, నేత వాంధ్రులన్.

పుట్టుకతోనె పెల్లుబికి
 పొంగిన సాహితి కానకట్టలన్
గట్టి, రసార్ద్రతన్ తెలుగు
 గడ్డను సాగొనరించునట్టి నీ

యట్టి నవాంధ్ర కశ్యప మ
హర్షిని సన్నుతియింప కింకిణుల్
గట్టిరి ఎందరో తమ క
లాలకు, నీదిర షష్టి పూర్తనన్!

కృతులు నిర్మించుటయె కాదు, కృతుల నెన్నొ
అంకితము గొన్న కృష్ణరాయలవు నీవు!
కవుల బోషించు మేటి భాగ్యమ్ము నీది,
శ్రీకరము మాకు నీకు ఆశీస్సు లిడుట!

పుష్టి పూర్తి నీది, సాహిత్య రసపుష్టి
శిష్ట జగతి కెల్ల ఇష్ట పూర్తి!
నూట ఇరువదేండ్ల మాటను మన్నించి
మరొక షష్టి పూర్తి మనుచు నిన్ను!

"ద్రగ్గడిక్టు" లనెడి టంకార కావ్యమ్ము
మహిత మానవతకు మార్గదర్శి
సాధనముగ కృతిని సమకూర్చు నీ కిప్డు
విక్రమింపు మింక వేల కృతుల!

–భీమన్న

## విరుగుడు

"దిక్కులేని వాడికి దేవుడే దిక్కు-"

"నారు పోసినవాడు నీరు పోయడా?"

దేవదాస్యం ఎంత తప్పనిసరో, ఎంత తప్పించుకోరానిదో సామాన్య మానవులకు నొక్కి చెప్పే ఇలాంటి లోకోక్తులు చాలా వున్నై. అందులో ఇవి రెండు.

వీటి అర్థం ఏమిటి? లోతుగా ఆలోచించి చూడండి.

"దిక్కులేని వాడికి దేవుడే దిక్కు" అంటున్న ఈ లోకోక్తి మానవులందరకూ ఆమోద యోగ్యమైనట్టిదిగానే కన్పిస్తున్నది. దానిని గురించి మరేమీ ఆలోచించనక్కరలేదనిపిస్తున్నది. అయితే దిక్కు లేకపోవడం అనే పరిస్థితి ఎలా ఏర్పడిందో, అందుకు కారణం ఎవరో, అట్టి వారికి దేవుడు ఎలా దిక్కవుతాడో పరిశీలించి చూస్తే మాత్రం అదొక భయంకరమైన వాస్తవాన్ని ఆవిష్కరిస్తుంది.

మానవుల మధ్య అంతరాలను, ధనిక దరిద్ర భేదాలను, దోపిడీవిధానాలను సృష్టించి, కష్టపడే సామాన్య ప్రజలను దోచి, వారి శ్రమ ఫలాన్ని దౌర్జన్యంగా పోగు చేసుకొని, ధనాధికులై అధికారాన్ని చేపట్టి, తమ ప్రాబల్యాన్ని పటిష్టం చేసుకొనే ధూర్తులు కల్పించి, ప్రజలలో అదే నిజమన్నంత గట్టిగా ప్రచారంలో పెట్టిన నినాదం ఈ "దిక్కులేని వారికి దేవుడే దిక్కు" అనే లోకోక్తి.

మానవుణ్ని మానవుడే మోసం చేసే దౌష్ట్యానికి ఇది అద్దం పట్టటం లేదా?

సామాన్య మానవులను వంచించడానికే కాదా ఇలాంటి లోకోక్తులను యుక్తిపరులు సృష్టించింది? తమ యుక్తుల ప్రయోజనాలకు తోడ్పడేటందుకే కాదా దేవుణ్ణి సృష్టించింది? మనం ఆలోచించవలసింది దేవుడు దిక్కు కావడం గురించి కాదు. కొందరికి దిక్కు వుండి, జన బాహుళ్యానికి దిక్కు లేకపోవడానికి గల కారణాలను గురించి.

అందుకే చెపుతున్నాను – అట్టి కారణాల పరిశోధనలో నిష్పక్షపాతంగా వాస్తవాలు ఆవిష్కృతం కావాలంటే దేవుడనే కల్పిత మూర్తిని నిషేధించాలి. దేవుణ్ణి ఒక ప్రమాదకరమైన డ్రగ్గుగా పరిగణిస్తేనే తప్ప అట్టి నిషేధం సాధ్యం కాదు.

''నారు పోసినవాడు నీరు పోయడా'' అనేది రైతుకూ, వ్యవసాయానికి సంబంధించిన లోకోక్తి. దానిని దేవుడి పరంగా చెప్పడం మానవజాతిలోని క్రియాశక్తిని నాశనం చేయడమే అవుతుంది.

## నిజమాడితే నిష్ఠూరం

నేను నా సాహిత్యం పొడుగునా నిజాలనే చెప్పుతూ వచ్చాను. ఈ ''డ్రగ్ ఎడిక్టులు'' కావ్యంలో సాధారణ మానవ లోకానికి అర్థం కాని, అసాధారణ మేధావి వర్గానికి రుచించని, సహచర బంధుకోటికి అసూయాజనకమైన నిజాలను నిక్కచ్చిగా చెప్పాను.

''నిజ మాడితే నిష్ఠూరం'' అనేది కూడా ఒక లోకోక్తి. ఎలాంటి నిష్ఠూరాలనైనా తట్టుకోడానికి సిద్ధపడే నేను నిజం చెప్తాను. నిజం చెప్పడం నా స్వభావం – అది కళగానీ, కవిత్వం గానీ, వర్ణనగానీ, వేదాంతం గానీ – ఏదైనా గానీ.

ఆలోచించి చూస్తే – సామాన్య ప్రజలను నిజం చెప్పకుండా నిరోధించడం కోసమే ఆ సామెత పుట్టిందని నేననుకొంటున్నాను.

నిజం చెప్పకు, నిజం చెపితే నీ ఇరుగు పొరుగు వాళ్ళతో, నీ బంధు మిత్రులతో, నీవు బ్రతుకుతున్న సమాజంతో, నీవు నిష్ఠూర పడవలసి వస్తుంది. విరోధ పడవలసి వస్తుంది. నీవు సుఖంగా బ్రతకాలనుకొంటే చచ్చినా నిజం చెప్పకు అనే హెచ్చరిక ఈ సామెతలో వుంది.

ముఖ్యంగా నిజం మాట్లాడితే మత, రాజకీయ నాయకులే కాకుండా ప్రభుత్వం కూడా ఆగ్రహించి, చితగ్గొట్టి, చెరసాలలో వేసే ప్రమాదం ఎక్కువగా వుంది. అందుకని నిజం చెప్పకు. ఎన్ని ప్రమాణాలు చేసైనా అబద్ధమే చెప్పు.''

ఈ సత్యాన్ని మనం ఇంకాలోతుకూ, వెనక్కూ తీసుకువెళ్ళి పరిశీలిస్తే – సత్య హరిశ్చంద్ర నాటకం సత్యాన్ని నిరుత్సాహ పరచడానికే ప్రచారం చేయబడుతున్నదనీ, ధర్మరాజు వంటివాడు నమ్మకంగా అబద్ధం చెప్పడం వల్లనే మహాభారత యుద్ధాన్ని గెలువగలిగాడనీ తేటతెల్లమవుతుంది.

ప్రపంచ మానవ చరిత్ర నిండా ఇలాంటి సంఘటనలే మనకు వేలకొలదీ కనిపిస్తై.

నేను నిజాలు చెప్పడం వల్ల నిష్ఠూరాలు పొందుతూ వస్తున్నానే తప్ప, నష్టపోయిం దెక్కువగా లేదు. అయితే అందువల్ల సన్నిహిత మిత్రులనూ, దగ్గరి బంధువులనూ పోగొట్టుకొంటూ రావడం జరిగింది. పోగొట్టుకోవడమంటే నేను పోగొట్టుకోవడం కాదు. నా రుజు వాక్య ధోరణి నచ్చక వాళ్ళే నాకు దూరమవుతూ వచ్చారు. ఇంకా దూరమవుతూనే వున్నారు.

ఈ మాట ఇక్కడ ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే – ఈ డ్రగ్గెడిక్టులు కావ్య వస్తువు నిష్ఠూరం కలిగించేది కనుక, "దేవుడు లేడు, పరమాత్మ వుంది" అని సిద్ధాంతీకరిస్తూ 'మోక్షం నా జన్మ హక్కు' అనే పేరుతో ఇదివరలో నేను ప్రకటించిన కావ్యాన్ని కనీసం స్వీకారంలో కూడా పేర్కొనలేదు ఏ ముఖ్య పత్రికా. మౌలికమైన భావాలు, చర్యలు లేకుండా పురోగమనమే సాధ్యం కాదు.

దేవుడు ఒక ప్రమాదకరమైన డ్రగ్గుగా పరిణమించి దేశ దేశాలలో మానవాభ్యు దయాన్ని, భావ స్వేచ్ఛను నిరోధిస్తున్నాడనేది ఆలోచనాపరులందరికీ తెలిసిన వాస్తవమే. అయితే ఎవరూ ఆ వాస్తవాన్ని వెల్లడించడానికి సాహసించరు. ఈ నిజాన్ని నేనిప్పుడు చెబుతున్నాను – నిష్ఠూరమైనా సరే.

నే నిప్పుడు ఈ కావ్యం ద్వారా చెబుతున్న ఈ ఒకే ఒక్క వాస్తవాన్ని ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించండి. ఇప్పుడు ఈ దేశాన్నే కాదు, అన్ని దేశాలనూ పట్టి పీడిస్తున్న అపోహలన్నీ అదృశ్యమైపోయి, అన్ని జాతుల మానవులు ఏక సమాజంగా విశ్వమానవత ఎందుకు ఏర్పడదో చూడండి.

## మతాలుచెప్పే అబద్ధాలు

"ఈ ప్రపంచం ఒక బుద్బుదం వంటిది. మృగతృష్ణ వంటిది. దాన్ని ఆ విధంగా చూసేవాడిని మృత్యుదేవత ఏమీ చేయలేదు" అంటున్నది ధమ్మపథం.

ప్రపంచం అశాశ్వతమనీ, బుద్బుదప్రాయమనీ భావిస్తూ, దానిపట్ల వైరాగ్యం ప్రదర్శించేవాడిని మృత్యువు ఏమీ చెయ్యలేదంటూ ఇదే భావాన్ని అన్ని మతాలూ తమ ధర్మ గ్రంథాలలో పేర్కొంటున్నై. ఆయా మతాల అనుయాయులు విధేయతతో వాటిని పారాయణ చేస్తున్నారు. బాగానే వుంది.

అయితే, ఈ సూత్రాన్నే పరిశీలించి చూస్తే, అది ఎంత అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నదో స్పష్టపడుతుంది. బుద్ధుడు ప్రపంచాన్ని అశాశ్వతంగా చూసినవాడే కదా! బుద్బుదప్రాయం గానే, మృగతృష్ణగానూ భావించినవాడే కదా! కోరికలు చంపుకొన్న అనాసక్తుడే కదా! మరి, ఆయన మృత్యువుకు ఎందుకు లొంగిపోయినట్టు?

అలాగే, అంతకుముందు, ఆ తరువాత పుట్టిన మహర్షులు, వేదాంతులు, విరాగులు, అశోక చక్రవర్తి, నాగార్జునాచార్యుడు, శంకరాచార్యుడు, బ్రహ్మంగారు, వేమనయోగి, గాంధీగారు వంటి వారంతా ఎందుకు మరణించినట్టు?

నేను నా నిరంతర పరిశీలన ద్వారా, గ్రంథ పఠనం ద్వారా తెలుసుకొన్న ఒక మహా సత్యమేమిటంటే – ప్రపంచంలోని మతాలు చెప్పే ధార్మిక సూత్రాలన్నీ అబద్ధాలనీ, ఆచరణ సాధ్యాలు కావనీ, సామాన్య మానవులకే కాదు, ఎంతటి మేధావులకు కూడా అందుబాటు కానివనీ, జీవిత యాత్రకు నిరుపయోగాలనీ.

ప్రపంచంలో ఇటువంటి అభిప్రాయంగల వాస్తవికతావాదులు చాలా మందే వున్నారు. అయితే, తమ అభిప్రాయాలను బహిరంగంగా చెప్పగల ధైర్యం ఎక్కువ మందికి లేదు.

ఆహారం, నిద్ర, మైథునం, భయం – ఈ నాలుగూ జీవ సహజ లక్షణాలు. దాహాలు, ఆర్తులు – వీటిని అనుక్షణం తీర్చుకొంటూ వుండడమే జీవితం. మొదటి మూడింటినీ తీర్చుకోవడం జీవి అధీనంలోనే వుంది. నాలుగోది భయం కదా! భయాన్ని పూర్తిగా తొలగించుకోవడం జీవి అధీనంలో లేదు. తక్కిన జీవుల కంటే మానవుడిలో తెలివి (awareness) అదనంగా వుండడంవల్ల, అతడు భయాన్ని నివారించుకోడానికి తన శక్తిని మించిన ఏదో ఒక అతీత శక్తిని ఆశ్రయించడం జరిగింది. ఆ అతీత శక్తే దేవుడుగా తుదిరూపం దాల్చింది.

ఇక్కడ హిందూ మతానికి సంబంధించిన ఒకే ఒక ఉదాహరణ ఇస్తున్నాను. పరిశీలించండి–

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ అంటే శిష్టుల భయాన్ని తొలగించడం కోసం దుష్టులను శిక్షించడమే కదా! అందుకు దశావతారాలు దాల్చినవాడు విష్ణు దేవుడు. ఆ విష్ణువుకు తమ భయాన్ని తొలగించే నిమిత్తం శిష్టులు సమకూర్చిన ఆయుధాలను గమనించారా? ప్రపంచంలో మరే శక్తీ ఎదిరించలేని చక్రం, ఖడ్గం, గద ఆయనకిచ్చారు. అలాగే,

శివుడికి త్రిశూలం, పాశుపతం, పినాకం వంటి వాటినే కాక, అగ్ని నేత్రాన్ని కూడా ఇచ్చారు. ఈ ఆయుధాలన్నిటినీ ధరించి ఈ దేవుళ్ళు తమ చుట్టూ కాపలా వుండాలని ప్రతి భక్తుడూ ఆశిస్తాడు. అప్పుడు గాని అతడికి నిర్భయంగా నిద్రపట్టదు. మానవ సమాజంలో దేవుడు సృష్టించబడడానికి భయమే మూలకారణమన్న వాస్తవం స్పష్టపడింది కదా!

దేవుడు చేసిన మేలేమిటి?

దేవుడు నామ రూప రహితుడని చెప్తూనే అతడికొక పేరు పెట్టి, రూపం కల్పించి, గుడికట్టి ఆ మతస్థులంతా నియమంగా అక్కడ చేరి సామూహిక ప్రార్థనలు చేస్తున్నారంటే, భజనలు చేస్తున్నారంటే - అంతకంటే విడ్డూరం మరేముంటుంది?

మానవుడి మెదడు వికసించి, మనస్సు అనేది ఏర్పడి, తెలివి ఆవిష్కరించబడిన తర్వాత మొదలుకొని ఈనాటి వరకూ, దేవుడు అనబడుతున్న వ్యక్తి లేక శక్తి తన భక్తులకు, తన మతస్థులకు చేసిన మేలు ఏమిటి? ఊహా జనితాలైన కథలలోనూ, భావోదితాలైన కావ్యాలలోనూ తప్ప వాస్తవంగా ఏమీ లేదు.

దేవుడికి మొక్కుకొంటే, దేవుడ్ని ప్రార్థిస్తే, ఏదో వ్రతం చేస్తే, ఏదో తీర్థాన్ని సేవిస్తే పుణ్యక్షేత్రాన్ని దర్శిస్తే ఏదో మేలు జరిగిందనుకోవడం కేవలం భ్రాంతితో కూడుకున్నట్టిది, విశ్వాస జనితమైనట్టిది.

ఎక్కడో దేవుడుండి, లేక తమ చుట్టూ కాపలా వుండి, తమను సంరక్షిస్తున్నాడని మానవ సమూహాలు భావిస్తూ వుండడంవల్ల మానవ సమాజంలో క్రియాశక్తి నశించిపోతూ, వాస్తవ ప్రగతి కుంటుపడుతూ వస్తున్నది. అంటే, తాగుడు, నల్లమందు, గంజాయి వంటి డ్రగ్గులు, మత్తుపానీయాలు శరీరాన్ని ఎంతగా క్షీణింపచేస్తాయో, అంతగానూ దేవుడు తమను ఎల్లప్పుడూ కాపాడుతూ వుంటాడన్న ఊహలు జీవశక్తిని క్షయింపచేస్తాయి. అందుకే డ్రగ్గులను నిషేధించినట్టే దేవుడ్ని కూడా నిషేధించాలంటున్నాను.

మౌలికమైన డ్రగ్గు ఒకటే అయినా అది కొకైన్, హెరాయిన్, బ్రౌన్ సుగర్, చరస్, భంగు మొదలైన అనేక రూపాలలో బజారులో పోటీ పడుతున్నట్లే, మౌలికంగా

దేవుడు అనే భావన ఒకటే అయినా అది వివిధ నామ రూపాలతో మత వేదికలపైకెక్కి పోరాటాలకు దిగుతున్నది. డ్రగ్గును మార్కెట్ చేస్తున్నది వివిధ కంపెనీలు, దేవుడ్ని మార్కెట్ చేస్తున్నది వివిధ మతాలు.

మానవ సమాజం సమైక్యంగా వివిధ భ్రాంతుల నుంచి బయటపడి, మత శృంఖలాలను తెంచుకొని, ముందుకు సాగాలంటే, మరికొంచెం ప్రగతిని సాధించాలంటే, సమున్నతమైన మరొక మజిలీని చేరుకోవాలంటే ముందుగా దేవుడు అనే డ్రగ్గు యొక్క చెడు గుణాల నుంచి, మత్తు నుంచి విముక్తం కావాలని నా ఉద్దేశం. మద్య నిషేధం అమలు జరగాలంటున్నాం. ముందుగా దైవభావనా నిషేధం జరగాలని ప్రత్యేకంగా నేను అంటున్నాను.

మానవుడు ఆహార, నిద్రా, మైథునాలను తనకు తానుగా ఎలా కంట్రోలు చేసుకోవడం నేర్చుకొన్నాడో, అలాగే భయాన్ని కూడా స్వశక్తితో కంట్రోలు చేసుకోవడం నేర్చుకోవాలి. మానవుడు అనునిత్యమూ అనేక భయాలకు లోనవుతూ వుంటాడు. అట్టి భయాల నివారణ కోసం దేవుడు అనబడే ఒక అతీత శక్తిపై ఆధారపడడం మానుకోవాలి. ఆకలిని నివారించుకోవడం కోసం ఆహారాన్ని తాను కష్టపడి సంపాదించుకొంటాడు. నారు పోసినవాడు నీరు పోస్తాడనడం నిజమే. ఆ సామెత జీవితానికి అన్వయించదు, అతకదు - తన భయాలను తానే నివారించుకోగల ఉపాయాలను మానవుడు సమకూర్చుకోవాలి. అందుకు ముందుగా దేవుడు అనే డ్రగ్గు ప్రభావం నుంచి బయటపడాలి.

చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకొనే విధంగా ఈనాడు దేవుడి పేరు చెప్పి ఎన్నో కల్తీలు, మోసాలూ, బూటకపు వాగ్దానాలూ, దొంగ వ్యాపారాలూ, అవినీతి పనులూ చేస్తున్న వాళ్లే మెజారిటీగా వుంటున్నారు మానవులలో.

ఖుదా, ఈశ్వర్, గాడ్ వంటివన్నీ ఒకే దేవుడికి వివిధ భాషలలోని పేర్లని చెబుతూనే, ప్రతి మతం వాళ్ళూ తమ భాషలోని పేరే దేవుడికి అసలైన పేరని వాదిస్తారు. తమ వాదనను నిలుపుకోడానికి పోరాడతారు. ఈనాడు జరుగుతున్న మత కలహాలకు మూలకారణం ఇదొక్కటే. పైగా, ఏ మతం ఎక్కడ పుట్టిందో అక్కడి ప్రజల సహజ సంప్రదాయాలే ఈ పోరాటాలలో ప్రాధాన్యం వహిస్తున్నై. దేవుడొక్కడే అనే నినాదం మాటమాత్రంగానే వుండి పోతున్నది.

# దేవుడు లేడు, పరమాత్మ వుంది

"దేవుడు లేడు, పరమాత్మ వుంది" అనేది నా సిద్ధాంతం. పరమాత్మ అంటే విశ్వైక జీవశక్తి, చైతన్యం. ఇందుకు సంబంధించిన విషయాలన్నీ 'మోక్షం నా జన్మ హక్కు' అనే సిద్ధాంత గ్రంథంలో సమగ్రంగా చర్చించి వున్నాను. ఇప్పుడీ గ్రంథంలో దేవుడు అనే భావన ప్రమాదకరమైన ఒక డ్రగ్గువలే మానవుణ్ని పీడిస్తున్నదనీ, దాని నుంచి విముక్తి పొందాలనీ మానవ జాతికి హెచ్చరిక చేస్తున్నాను.

పరమాత్మ అనేది విశ్వైక చేతన అని చెప్పుకొన్నాం కదా! అది ఒక జీవ బీజ క్షేత్రం. అనంతమైన బీజాణువులతో, జల కణాలతో సముద్రం నిండివున్నట్టు, నిండి వుంది. త్రిగుణాత్మకమైన ఆ విశ్వచైతన్యం యొక్క నిరంతర స్పందన నుంచి దానిలోని చైతన్య బీజాలు అంకురించడమే సృష్టి జరగడం. త్రిగుణాల మిశ్రమంతోనూ, ఏదో ఒక గుణం ప్రాముఖ్యం వహించడంతోనూ ఆ చైతన్య బీజాంకురాలు వివిధ జీవులుగా, వివిధ రూపాలతో విస్తరించాయి, వికసించాయి. అందులో ఒక రకం బీజాంకురాల స్వరూపమే మానవుడు. వివిధ శీతోష్ణస్థితులు గల ప్రపంచపు వివిధ ప్రాంతాలలో అనుకూల పరిసరాలు లభించినచోటెల్లా మానవులుద్భవించారు. వాళ్ళ రంగు, గుణ వర్తనలు ఆయా ప్రాంతాలనుబట్టి వచ్చాయని నా భావన.

ఆఫ్రికా మానవుడు నల్లగా వున్నా, మంగోలియా మానవుడు పసుపు పచ్చగా వున్నా, కకేషియా మానవుడు తెల్లగా వున్నా అందరూ ఒకే మానవ జాతి. వాళ్ళ వాళ్ళ గుణ వర్తనలు ఆయా ప్రాంతాల మట్టిని, గాలిని, నీటిని, వేడినిబట్టి వచ్చినట్టివి.

ఈ పరమాత్మ బీజం మానవుడిలో మనోరూపంలో వికసించింది. మనస్సు తన చుట్టూ ఒక జీవ రూపాన్ని నిర్మించుకొన్నది. ఆ రూపమే శరీరం. అది మొత్తం ఒక జీవాణు సముదాయమే. ఆత్మ, జీవం, చిత్తం, బుద్ధి మొదలైన పేర్లతో పిలువబడుతున్నదీ మనస్సే. జీవం పుట్టి, పెరిగి, మనస్సుగా వికసించి, తిరిగి సముద్రంలో అల లేచి పడినట్టు పరమాత్మలో లయించి పోతుంది. ఈ లయించి పోవడంలో ముందు శరీరమైనా పోవచ్చు, ఆత్మైనా పోవచ్చు. ఏది ముందు పోయినా

దానితో అదే క్షణంలో రెండోది పోతుంది. శరీరం కంటే ఆత్మ (మనస్సు) ముందు పోయే సందర్భాలు మనకనేకం కనిపిస్తై. కోమా, వృద్ధాప్యం వంటి సందర్భాలలో శరీరం కంటే ముందే మానసిక ప్రవర్తనలన్నీ అంతరించిపోతూ వుండడం స్పష్టమే కదా!

ఇక్కడ మరొక్క వాస్తవం గురించి వివరించవలసి వుంది. భయం అన్ని జీవులకూ సమానమే అయినా, మానవుడు మాత్రం భయానికి బానిస అయి బ్రతుకుతుండడం నిజమే కదా! భయం నుంచి తనను తాను రక్షించుకోడానికి అతడు ఏదో ఒక అతీత శక్తిని (దైవశక్తిని) ఆశ్రయిస్తూ వున్నాడు. ఆ అతీత శక్తి మనస్సు కల్పించినట్టిదే. దానికి దేవుడు అనే పేరు పెట్టి వివిధ మతాలూ తమ చుట్టూ వున్న మానవులకు అభయ హస్తం పట్టి తమ అనుచరులుగా చేసుకొన్నై. అందుకే మతాలను నేను, దేవుడు అనే డ్రగ్గును మార్కెట్ చేస్తున్న వ్యాపార సంస్థలు అన్నాను. ఆ డ్రగ్గు (దేవుడు)వల్ల స్వప్రయోజనాలకు తప్ప సామాన్య మానవులకు ఏమీ ప్రయోజనం లేదన్నాను. పైగా కొట్లాటలు వంటి ప్రమాదాలెన్నో జరుగు తున్నాయన్నాను.

అయితే, మనస్సు కల్పించుకొనే ఈ అతీత శక్తిని ఎవరికి వారే వ్యక్తిగతంగా రూపకల్పన చేసుకొని తమ తమ అభిరుచులకూ, ఆశలకూ, ఆకాంక్షలకూ అనుగుణమైన రీతిలో, భక్తి శ్రద్ధలతో ఆరాధించుకొంటే అందులో ప్రమాదం లేదని అనుభవం మీద చెపుతున్నాను. ప్రమాదం లేకపోగా సహజ గుణమైన భయాన్ని నివారించుకోడానికి అట్టి వ్యక్తిగత ఆరాధన తోడ్పడుతుంది కూడా. సామూహిక ప్రార్థనల కంటే వైయక్తిక ఆరాధనలు మనస్సు ఏకాగ్రం కావడానికి తోడ్పడుతై. దానివల్ల మనోబలం చేకూరుతుంది. దేవుడులేడు, పరమాత్మ వుంది అనే నా సిద్ధాంతానికి ఈ నా వ్యక్తిగత విగ్రహారాధన మాత్రం అనుగుణమైనట్టిదే. సృష్టి సమస్తమూ పరమాత్మ బీజాంకుర విన్యాసాలే కనుక, మనస్సు కల్పించుకొనే ఆకాంక్షా రూపాలు, వాటి వాస్తవ విగ్రహాలు అసహజాలేమీ కాదు.

కాగా, నా ఉద్బోధ ఇది. దేవుణ్ణి వదిలెయ్యండి. విగ్రహారాధన ద్వారా మీకు మనోధైర్యమూ, ఆత్మశక్తి, సుఖ శాంతులూ లభిస్తే అట్టి ఆరాధనను భక్తిశ్రద్ధలతో చేసుకోండి. అయితే అట్టి విగ్రహాలు దేవుడికి ప్రతిబింబాలని మాత్రం అనుకోకండి. అవి కేవలం మీమీ వ్యక్తిగత మనోరథాల మీద ఆడుతూ, పాడుతూ మీకు అభయహస్తం పడుతున్న మీలోని పరమాత్మ యొక్క విశ్వరూపాలే.

ఇంత ఉన్నత స్థాయిలో మానవులు ఆలోచించ గలిగినప్పుడు స్వేచ్ఛగా, నిర్భయంగా, స్వయం ప్రతిభతో ఇచ్ఛా శక్తిని వికసింప చేసుకొంటూ విశ్వమానవతకేసి మరికొంత ముందుకు పోగలుగుతారు.

## విగ్రహాలు మనోరూపాలు

ఇక్కడొక సంశయాన్ని నివారించవలసి వుంది. పరమాత్మనే దేవుడంటున్నాం అని ఎవరైనా అంటే, ఆ మాట నిజం కాదు. కేవలం సామాన్య మానవులను మభ్యపెట్టడానికి అనే మాట మాత్రమే. మత్తైక జీవులైన మానవులు దేవుడు అని చెప్పేది పరమాత్మ కాదు. పరమాత్మ అనేది నామరూపాలు లేని ఒక చైతన్య శక్తి. దానిని పరమాత్మ, పరబ్రహ్మ, ఆల్మైటీ, ఆమ్నిసెంట్, ఆమ్నీ ప్రెజెంట్, ఆమ్నీ పొటెంట్ మొదలైన శక్తిపరమైన పేర్లతో పిలవవచ్చు. కానీ శివుడు, విష్ణువు, యెహోవా, అల్లా వంటివి దేవుడి పేర్లు అవి ఆయా మతాలకు పరిమితమైనట్టివి.

దేవుడు వేరు, పరమాత్మ వేరు అనే నా సూత్రానికి ఈ మాత్రం వివరణ చాలనుకొంటాను. వ్యక్తిగతమైన పారమాత్మిక మానసిక రూపాలు విగ్రహాలు కావచ్చునే కాని దేవుళ్ళు మాత్రం కాజాలవు.

దేవుడు మతపరమైన ఒక వ్యక్తి. పరమాత్మ విశ్వాత్మకమైన ఒక శక్తి. దేవుడు అనేవాడు పురుషుడు. పరమాత్మ స్త్రీ పురుష భావైకమైన శక్తి. దేవుడు ఆ మతం వాళ్ళకే స్వర్గమో, నరకమో ప్రసాదిస్తాడు. తన భక్తులకే శరణమిస్తాడు. తన ఆరాధకులకే రక్షణ కల్పిస్తాడు. తదితర మతాల వాళ్ళను ద్వేషిస్తాడు. తన స్వర్గంలోకి రానివ్వడు. పరమాత్మ అలా కాదు. అది కులమత వర్గ వివక్షత లేకుండా సమస్త జీవరాశులకు సహజ శక్తి సామర్థ్యాలను ప్రసాదించే విశ్వైక శక్తి.

పరమాత్మ మానవుడిలో మనో, బుద్ధి, చిత్త, అహంకారాల పేర్లతో పిలువ బడుతున్న ఆత్మ. అదే మనస్సు.

ఇక్కడ నేను నా చిన్నప్పటి నుంచీ సృష్టిస్తూ వస్తున్న సాహిత్యం గురించి ఒక మాట చెప్పాలి. నా సాహిత్యంలో ఉండే పాత్ర పోషణ, కళాత్మకత, శిల్ప రమణీయత, రసనిష్ఠత, సౌందర్యారాధన, వర్ణనా విన్యాసం, భావనా వైవిధ్యం, సర్వమానవ సమత,

సాంఘిక న్యాయం, ఆర్థిక సమృద్ధి, రాజకీయ బలసంపాదన వంటివన్నీ కూడా పైన నేను ప్రతిపాదించిన మనోగత వాంఛారూపాలైన విగ్రహాల సమారోహ సముత్సాహాలకు భిన్నమైనవేమీ కాదు.

దేవుడు లేడనడం దేశ మాత ఆరాధనకు అడ్డం రాదు. తల్లిదండ్రుల ఫోటోలకూ, విగ్రహాలకూ పూలదండలు వేసి చేతులు జోడించడాన్ని నిషేధించదు. ఈ దృష్టితోనే ఈ గ్రంథంతో పాటూ నా తదితర గ్రంథాలను కూడా సహృదయులు పరిశీలించాలి. అప్పుడే కావ్య రసానందం కలుగుతుంది. జీవితాలు సఫలీకృతమవుతాయి.

నేను ఈ ''డ్రగ్ ఎడిక్టులు'' కావ్యంలో చెప్పిన ప్రధాన విషయం ఒక్కటే అయినా దానిని నిరూపించుకోవడానికి ఇంత గ్రంథం వ్రాయవలసి వచ్చింది. మరొక విషయమేమిటంటే – ఇందులో నేను ఉదాహరణకు తీసుకొన్న విషయాలన్నీ ఎక్కువగా హిందూత్వ సాహిత్య సంస్కృతుల నుంచే. నేను మౌలికంగా హిందూత్వానికి చెందినవాణ్ణి కనుక నా మతం నుంచి, నా సంస్కృతి నుంచి, నా పూర్వీకుల రచనల నుంచి ఉదాహరణలను తీసుకోవడం నాకు సులభ సాధ్యం.

మరొక వాస్తవ మేమిటంటే – హిందూమతాన్నీ, హిందూ దేవుళ్ళనూ, హిందూత్వ భావాలనూ హిందువుడైనవాడు స్వేచ్ఛగా ఎంతైనా విమర్శించవచ్చు. సహన గుణం హిందూతత్వంలో సహజంగా వుంది. విమర్శకు తట్టుకోగల శక్తి హిందూత్వంలో వుంది. దైవ ద్రోహం (Blasphemy) అనేది హిందూమతంలో లేదు. మానవుల దౌర్జన్యాలకు, విమర్శలకు తట్టుకో లేనంతటి బలహీనుడు కాదు హైందవ దేవుడు (గ్రంథకర్త). అందుకనే నా ఉదాహరణ లన్నిటినీ హిందూత్వం నుంచే తీసుకొన్నాను. ప్రస్తుత ప్రపంచ పరిస్థితి దృష్ట్యా ఈ వివరణ ఇస్తున్నాను. సహృదయులు గమనించగలరు.

## నిత్యానిత్య జిజ్ఞాస

నిత్యా నిత్య వస్తు జిజ్ఞాస కలవాడే నిజమైన జ్ఞాని అనేది ఒక లోకోక్తి. నిత్య సత్యాన్వేషణకు గాని, విషయ విజ్ఞాన పరిశోధనకు గాని ఇదే మూల సూత్రం అనవచ్చు. సనాతన భారతీయ వైదిక ఋషులూ, ఆ తరువాత వేద వ్యాసుడూ ఈ లోకోక్తికి లక్ష్య ప్రాయులుగా ఉదాహరించవచ్చు. ఆధునిక ప్రపంచంలో అట్టివాడు ఒక్క డా॥ అంబేడ్కరే అనిపిస్తాడు నాకు.

ఈ మాట నేను చెప్పడానికి ఒకే ఒక కారణం వుంది. హైందవ సమాజంలో జాతి సమైక్యతను భగ్న పరిచే కుల వ్యవస్థనూ, అస్పృశ్యతనూ నిర్మూలించడానికి డా॥ అంబేడ్కరు తన శక్తి సామర్థ్య విద్యా ప్రాభవాలన్నిటినీ వెచ్చించి పోరాడిన వాడు. తాను పుట్టిన హిందూ మతాన్ని నిర్ధ్వంసం చెయ్యడానికి సర్వ విధాలా కృషిచేసినవాడు. కుల నిర్మూలన గ్రంథాన్ని వ్రాసి, దేశ విభజన విషయంలో తన అభిప్రాయాలను స్పష్టంగా ప్రకటించి, పూనా ఒడంబడికపై సంతకం చేసి, గాంధీజీ ప్రాణాలను రక్షించి, భారత సంవిధానాన్ని నిర్మించి, హిందూ కోడ్ బిల్లును సంకలనం చేసి – ఇలా ఎన్నో విధాలుగా హైందవ సమాజాన్ని సంస్కరించడానికి పూనుకొన్నవాడు. చివరకు హైందవ సమాజం అంత సులభంగా సంస్కరణకు సుముఖం కాగల జీవశక్తి కలది కాదని తెలుసుకొన్న తరువాత హిందూమతం నుంచి వైదొలగాలనుకొన్నాడు. అప్పుడు ఒక నిష్కళంక నిరామయ నిత్య సత్యాన్వేషిగా లోకంలోని అన్ని మతాలను గురించి పరిశోధన కావించాడు. చివరకు దేవుడి గురించి చెప్పని, దేవుడి ప్రమేయం లేని ఉత్తమ మానవుడే బుద్ధ భగవానుడని చెప్పే బౌద్ధ మతాన్ని ఎన్నుకొన్నాడు.

దేవుడి విషయంలో నా వైఖరికి, డా॥ అంబేడ్కరు వైఖరికి మధ్య ఎక్కువ తేడా వున్నట్టు లేదు. అందుకే ఇక్కడ ఈ సత్యాన్ని ప్రస్తావించాను. నాది ఇంతకాలమూ ఒక నిత్యానిత్య సత్యాన్వేషణ యాత్రే అనుకొన్నప్పటికీ, ఇప్పుడు ఈ ''డ్రగ్ ఎడిక్టులు'' కావ్యం ఒక స్థిరీకృత సిద్ధాంతం.

''దేవుడు ఒక డ్రగ్గు. ఈ డ్రగ్గును నిషేధించాలి.'' దేవుడు లేడు, పరమాత్మ వుంది. దేవుడి మత్తు నుంచి విముక్తుడై మానవుడు పరమాత్మను గుర్తించాలి. అవసరం అనుకొంటే విశ్వైక చైతన్య శక్తి అయిన పరమాత్మను తనకు ఇష్టమైన గుణాసక్తి రూపాలలో ఆరాధించుకోవచ్చు.

"Religion is a personal issue" (The Hindu, 15-3-1993) అన్నారు ప్రధాన మంత్రి P.V. నరసింహారావు గారు. మేధావులూ, హేతువాదులూ, కవి పండితులూ ఎంతో మంది ఎంతో కాలంగా అంటున్న మాటే ఇది. అయితే ఎవరూ పట్టించుకోవడం లేదు. కారణం ప్రపంచంలోని మెజారిటీ ప్రజలు వివిధ మతాల అధీనంలో వుండడమే. మతమంటేనే దేవుడు. దేవుడంటేనే డ్రగ్గు. ఈ డ్రగ్గును నిషేధిస్తేనే కానీ విజ్ఞానం తలెత్తుకోలేదు.

## అంకిత చరిత్ర - కృతజ్ఞతలు

పూర్ణ మదః పూర్ణ మిదం
పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ
పూర్ణమే వావశిష్యతే

అనే వేద వాక్యానికి ఈనాడు ప్రత్యక్ష నిదర్శనం మహాకవి డా. వుండేల మాలకొండారెడ్డిగారు. గొప్ప ఇంజనీరు, విశాల హృదయుడు, వదాన్యుడు. పూర్ణం (శూన్యం) నుంచి పూర్ణం (సంపూర్ణ సమైశ్వర్యం) వరకు విరిసిన, విస్తరించిన పూర్ణ పురుషుడాయన. ఆయన జీవిత పురోగమనం గురించి, ఆయన సాహిత్య సృజన గురించి నేనిక్కడ మళ్ళీ చెప్పదలచ లేదు. ఆ వివరాలు అందరికీ తెలిసినట్టివే. వుండేల వారిని గురించి ''శూన్యం నుంచి సృష్టి'' అనే పేరుతో రావూరి భరద్వాజ గారు ఎంతో చక్కగా చిత్రించిన జీవిత చిత్రణ ఈ సందర్భంలో అందరూ చదవదగినట్టిది. నేనిక్కడ చెప్పేమాట ఒకటే - ఆయన నాకు చిరకాల మిత్రుడనీ, అందుకు నేనెంతో గర్వపడుతున్నాననీ.

1992, ఆగస్టు 23న వుండేల వారి షష్టిపూర్తి మహోత్సవ సందర్భంలో నేను కొన్ని పద్యాలు వ్రాశాను. అదే సందర్భంలో ఆయన కొన్ని గ్రంథాలను అంకితం తీసుకొంటున్నారన్న విషయం తెలిసి, అప్పటికి తయారుగావున్న నా ''డ్రగ్గెడిక్టులు'' కావ్యాన్ని ఆయనకు అంకితంగా ప్రకటించదలిచాను. ఆయన అందుకు అంగీకరించారు. ఈ కావ్యం ముద్రణ కొంచెం ఆలస్యమైనా, అవే పద్యాలతో ఇప్పుడు దీనిని అంకితంగా ప్రకటిస్తున్నాను.

మార్చి, 1993 బోయి భీమన్న

## ఒకటి

ప్రపంచం లోని ఏ మత విశ్వాసు లైనా
అందరూ డ్ర గ్గడిక్టులే,
ఆ డ్రగ్గు పేరు దేవుడు!

డ్రగ్ అంటే అదొక మత్తుమందు,
మత్తులో మహావీర స్వర్గాలూ లభిస్తై
మనోముగ్ధ సమాధులూ సిద్ధిస్తై.
అదొక పగటి కలల ఉరవడి,
మనస్సు నడిపే గారడీ!

ఒక్కసారి ఈ డ్రగ్గుతో జతకడితే
ఇక బ్రతుకంతా దానికి బానిసై పోతుంది,
మానవత్వమే మసై పోతుంది.

## రెండు

డ్రగ్గు మూల పదార్థం ఒకటే కావచ్చు,
తయారీలో వైవిధ్యం రావచ్చు,
కంపెనీల పేర్లతో బజారున పడవచ్చు.
ఎన్ని భాషలలో ఎన్ని పేర్లతో పిలువబడినా
అది డ్రగ్గే, దాని గుణం మైకమే!

నల్లమందు, గంజాయి, బ్రౌన్ సుగర్
భంగు, హెరాయిన్, ఛరస్, కొకెయిన్
ఎవరు ఏ పేరుతో జపించినా
దేనికి విధేయులై భజించినా
అది డ్రగ్గే, దాని వరం దాస్యమే!

## మూడు

మొదట్లో ఈ డ్రగ్గు జంకును తొలగిస్తుంది,
ధైర్యం కలిగిస్తుంది, సాహసం చేయిస్తుంది,
క్రమంగా అలవాటై, ఆ తర్వాత ఇక
అది లేకుండా బ్రతకలే మనిపిస్తుంది!

ఇంకా బలమైన డ్రగ్గేదో కావా లనిపిస్తుంది!
రకరకాల పేర్లతో ఆ డ్రగ్గును
పేటెంటు చేసుకొన్న కంపెనీలు
మా డ్రగ్గు గొప్పదంటే మా డ్రగ్గు గొప్పదంటూ
పోటీలు పడుతున్నై!
పోరాటాలకు దిగుతున్నై!
మోనోపోలీ కోసం
మోసాలకు పాల్పడుతున్నై!
మతాలుగా ఏర్పడి మానవుల్ని
మందలుగా విభజించి పాలిస్తున్నై!
సొంత ఆలోచనల్ని చంపేస్తున్నై!

## నాలుగు

సృష్టిలో ఒక్క మానవ జాతికి తప్ప
మరే జీవ జాతికీ దేవుడు లేడు,
తదితర జీవ జాతు లన్నిటికీ
తమ స్వభావమే తమ గైడు.

మానవ మానవేతర జగత్తు కంతకూ
పితృదేవు డొక్కడే అయితే-
పశు పక్షి మత్స్యాదులకు అతడు
దయచేసిన వర మేమిటి?
పరస్పరం చంపుకు తిను మనడ మేనా?
మానవుడికి ఆహారం క మ్మనడ మేనా?

సృష్టికర్త కరుణామయుడే అయితే
వ్యాధిని, క్రౌర్యాన్ని, హింసను, మృత్యువును
దారిద్ర్యాన్ని, దాస్యాన్ని, దోపిడీని
ఎందుకు సృష్టించి నట్లు?

## అయిదు

సృష్టికి ఒక కర్త కల డనడం కంటె-
సృష్టిలోని లోపాలకూ, పాపాలకూ
అతడే బాధ్యు డనడం కంటె-
అతడికి ప్రత్యర్థులుగా సైతాను, కర్మ వంటి
ధూర్త శక్తులను కల్పించడం కంటె-
సృష్టే తనకు తానుగా పుట్టి ప్రవర్తిస్తున్న దనడం
వాస్తవానికి దగ్గర, హేతువుకు ధాతువు.

సృష్టికర్త మంచివాడే అయితే
చెడును ఎందుకు సృష్టించినట్టు?
తినగూడని వంటను వడ్డించడ మెందుకు?
తిని నందుకు శిక్షించడ మెందుకు?

దేవుడి పేర రెండు మతాల వాళ్ళు
ఒకరి నొకరు చంపుకొంటుంటే
ఆ ఇద్దరికీ దేవు డొకడే అనడం ఎలా?

## ఆరు

సృష్టికి ఒక కర్తను కల్పించినవాడు మనిషి,
అతణ్ణి దేవుడు అని పేర్కొన్నవాడు మనిషి,
అతడి స్వరూప స్వభావాల అవగాహన కోసం
తన జాతి ఫీఫ్‌టన్‌తో పోల్చి చూచుకొని
దేవుడు ఒక మహా కఠిన నియంతగా
నిర్ణయించినవాడు మనిషి!

మనిషి ఇదంతా ఎందుకు చేశాడు?
ఏ జీవ జాతికీ లేని దైవ భీతి
మానవుణ్ణే ఎందుకు పట్టుకుంది?

## ఏడుపు

'నే నెవరు?
పుట్టక ముందు ఎవర్ని?
చచ్చి ఏమవుతాను?"
ఈ ప్రశ్నలు మానవుడికే కలిగిస్తె,
కారణం వికసించిన అతడి మెదడు!

ప్రశ్నలతో దేవాలయాలు కట్టాడు
జవాబులతో గ్రంథాలయాలు నింపాడు.
"పృథివీ పతి కంటె విష్ణువు లేడు" అన్నాడు
అతడు ఒక ప్రజాకంటకు డైనా సరే!

తన గుణ కర్మలు జీవన్నైజాలే అయినా
బాధ్యతను మాత్రం దేవుడిపై పెట్టాడు!
అసలు సృష్టికంటె
మానవ సృష్టి తెలివి గల దయింది!

## ఎనిమిది

అరటి గెల ముదిరే కొలదీ
చెట్టుకు బోటు అవసరం,
మనిషి పైకెక్కే కొలదీ పట్టుకొమ్మ అవసరం,
ఇంటి అంతస్తులు పెరుగుతున్న కొలదీ
వాచ్‌మన్‌లూ, రక్షక భటులూ అవసరం.
అలాగే మెదడు వికసించే కొలదీ
దేవుడు అవసర మయాడు!

## తొమ్మిది

గతం జ్ఞాపక ముంటున్నది
ఆలోచనలలో భవిష్యత్తు కనిపిస్తున్నది
గతంలోని అనుకోని సంఘటనలు
భవిష్యత్తును భయపెడుతున్నవి!

ఆనందాన్ని భగ్నం చేస్తూ ఆకస్మిక దుఃఖం,
చేతిలోని ఆహారాన్ని గద్ద తన్నుకుపోవడం,
ఒక్కడి చేతిలో నూరు మందిని చంపే దర్పం,
ఒక్కడి కంచంలో వేయి మందికి సరిపడే అన్నం!

ఏ పనీ చెయ్యనివాడు ప్రజాపతి,
పని చేసే ప్రజలంతా అతడికి బానిసలు!
క్రూర మృగానికి సాధు జంతువు ఆహారం!
ఓహో, ఎంతటి దుష్ట ప్రణాళిక!

## పది

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ ద్వారా
తన సృష్టినే నిష్కలుషం చేసుకోలేక
అంతా ప్రారబ్ధ కర్మకు వదిలేసిన దేవుడు,
తన శత్రువయిన సైతానును నిర్జించలేక
వాడి ఆకర్షణలకు లొంగిపోయే
అమాయకులను శిక్షించే దేవుడు,
సర్వ శక్తిమంతు డెలా అవుతాడు?

సంకల్ప మాత్రలో సర్వం సృష్టించే వాడికి
ప్రారబ్ధ కర్మ ఎక్కడి నుంచి వచ్చింది?
శత్రువు ఎక్కడి నుంచి పుట్టాడు?

## పదకొండు

పాపమో పుణ్యమో స్వయంగా చేసే స్వేచ్ఛ
మానవుడి కున్నదా?
మానవుడి గుణ కర్మలపై అజమాయిషీ
దేవుడికి లేదా?

ఆది నుంచీ చరిత్రను పరిశీలిస్తే
అన్ని మతాలకు సంబంధించీ కూడ
దేవుడు మానవుడికి చేసిన వాగ్దానా లెన్ని?
అవి ఎప్పు డెలా నెరవేర్చబడ్డాయి?

కనీసం తమ ఉత్సవాల ఊరేగింపుల మీదైనా
శత్రు మూకల నుంచి రాళ్ళు పడకుండా
రక్షించుకో గలుగుతున్న దేవు ళ్ళెవరు?

ఒక మతం వాళ్ళ గుడిలో దేవుడు లేడని
మరొక మతం వాళ్ళు రుజువు చేస్తూ వుంటే
మరి ఇక దేవుడు ఎక్కడ వున్నట్టు?

## పన్నెండు

మూడో కన్ను తెరిస్తే ముల్లోకాలను
భస్మం చెయ్యగల డనుకొంటున్న శివుణ్ణి
ఒక్క దెబ్బతో ఘజ్నీ ముక్కలుగా నరికేసి పోతే
ఎవరేం చెయ్యగలిగారు?

దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, సమాధులు
అన్నీ భక్తుల యాత్రా స్థలాలే;
అయితే, కోరికలు తీరిన భక్తు లెందరు?

దేవుడు స్వర్గం మాత్రమే ఇవ్వగల డంటే
దేవుడు తన భక్తుల కోరికలే తీరుస్తా డంటే
పార్టీ నాయకుల వంటి వా డేనా?
పక్షపాత బుద్ధి కల వా డేనా?

## పదమూడు

దేవుడు సర్వ జీవ హితుడని గాని
సర్వ శక్తి సమర్థుడని గాని
ఏ మతమూ నిరూపించలేదు!

అన్ని మతాలూ దేవుడి పేర
నర హత్యలు చేసినవే,
న్యాయం తప్పినవే,
నష్టపోయినవే!

అందుకు కారణం-
ప్రభువు కిష్టమైన డ్రగ్గునే
ప్రజ లందరూ సేవించా లనే
నిరంకుశాధికారిక నిబంధన!
వ్యక్తిగత స్వేచ్ఛా నిరోధక బంధన!

## పదునాలుగు

మతాని కొకడుగా, కులాని కొకడుగా
రూపొంది వున్న దేవుళ్ళను కలిపి
ఏకేశ్వరు డనడం కుదరదు.

దేవుడు మానవ ప్రతిష్ఠితుడు
మానవుడు స్వప్రయోజకుడు.

ఏ రెండు మతాల దేవుళ్ళూ
కలిసి కాపురం చెయ్యలేరు,
ఏ రెండు మాఫియా గేంగులూ
తమ డ్రగ్గుల్ని కలిపి అమ్ముకోలేవు.

ఏ కంపెనీ కూడ
మరొక కంపెనీ డ్రగ్గును ఆమోదించదు.

## పదిహేను

పరమాత్మనే దేవు డంటా మంటావా?
అలా అనడం కరెంటును లైటు అనడమే!
మట్టిని ముంత అనడమే,
సముద్రాన్ని బిందు వనడమే!

"సమోహం సర్వ భూతేషు"
అని కృష్ణ భగవాను డన్నాడని
ప్రతి జీవినీ కృష్ణుడు అంటామా?

విష్ణువు వరాహ మయా డని
ప్రతి వరాహమూ విష్ణు వవుతుందా?

దేవు డనే దొక ఊహ,
పరమాత్మ ఒక వాస్తవ జీవ శక్తి.

## పదహారు

మనం పేర్లు పెట్టి పిలిచేది శరీరాలను!
నామ రూప గుణాలు ఆత్మకు
అది ధరించే శరీరాలను బట్టి వస్తై.

ఆహార నిద్రా మైధున భయాలు
ప్రతి జీవికీ సహజంగా వుండే ఆర్తులు.
అవి మానవుడికీ వున్నై,

అతడికి అదనంగా వున్న శక్తి జ్ఞానం!
జ్ఞానం గుణత్రయ సంయోగ సంస్కారం,
అది మానవుడి కొక్కడికే వుంది!

## పదిహేడు

జీవి బ్రతకడానికి
మరొక జీవిని తినక తప్పదు
అది జంగముమైనా, స్థావరమైనా.

తనకు ఎప్పుడే ప్రమాదం ఏర్పడుతుందో
అన్న భయమే ప్రతి జీవికీ
ఆత్మ రక్షణ పోరాటాన్ని మప్పుతుంది,
గెల్చిన జీవి బ్రతుకుతుంది.

మనిషి ప్రాణభయం ఏర్పడినప్పుడు
విజయానికి భుజబలం, ఆయుధ బలం,
బుద్ధి బలం మాత్రమే చాల వనుకో న్నప్పుడు
ఏదో అతిలోక శక్తి బలం కూడా
తనకు లభించా లనుకొన్నాడు,
ఆ అతిలోక శక్తినే దేవు డన్నాడు,
తన భారాన్ని అతడిపై పెట్టాడు.

## పద్దెనిమిది

తెలి వంటే తనలోని వెలుగే అనే గ్రహింపు లేని
తొలి యుగాల మానవుడు
తెలివిని వదిలేసి, దేవుణ్ని పట్టుకొన్నాడు,
దెబ్బ తిన్నాడు!

తెలివిగా వికసిస్తున్నది పరమాత్మ,
దానికి దేవుడని పేరు పెట్టింది ఊహ.

అందుకే చెపుతున్నాను-
వాస్తవంగా దేవు డెక్కడో లేడని,
శాశ్వత చైతన్య నిత్య తరంగిణి
సర్వ సృష్టికీ మూల బీజ క్షేత్రం
పరమాత్మే అని,
పురోగతికి కారణం దేవుడు కాదని,
తన సొంత తెలివి ఇచ్చే వెలుగేనని!

## పందొమ్మిది

మానవుడికి-
దేవు డొకడే అంటే చాలదా?
ఆ ఒకడూ "మా ఎల్లయ్య" అంటూ ఒకడూ
"కాదు, మా పుల్లయ్య" అంటూ మరొకడూ
ఇప్పటికీ కొట్టుకు చస్తున్నా రెందుకు?

దేవు డొకడే అని విశ్వసిస్తే,
అతడి పేర్లు భాషను బట్టి వుంటాయని గుర్తిస్తే,
హిందూ, ముస్లిం ప్రజలు కలిసి
"ఈశ్వర్ అల్లా తేరే నాం" అంటూ
ఎందుకు పాడరు?

## ఇరవై

ఏ మతమైనా - మత మంటే అది
ఆ జాతి సాంఘిక వ్యవస్థ యొక్క
ఏవో కొన్ని విధి నిషేధాల బంధం,
ఆ వ్యవస్థలోని ప్రతి జీవికీ
పుట్టుకతోనే మెడలో పడుతుం దది.

ఈ బంధాలు-
ఇంట్లో తాతయ్య పేనినవీ కావచ్చు,
స్వదేశీవీ కావచ్చు, విదేశీవీ కావచ్చు,
మార్కెట్లో దొరుకుతై ఎన్నైనా.

విశ్వాసాలు మార్చినప్పు డల్లా
బంధాలు మార్చుకోవచ్చు,
ఒకటి చాల దనుకొంటే
రెండు మూడు - ఎన్నైనా ధరించవచ్చు.

## ఇరవై ఒకటి

చాలడం, చాలక పోవడం అనేది
ఆయా బంధాలలోని డ్రగ్గులు ఇచ్చే
కిక్కులపై ఆధారపడి వుంటుంది.
ఏ డ్రగ్గు ఎక్కువ కిక్కిస్తే
ఆ డ్రగ్గుకు గిరాకీ పెరుగుతుంది.

కిక్కు అంటే తన్నడం కదా?
ఎవరు బాగా తన్నగలిగితే
వారే లోకానికి ప్రభువులు అన్నమాట.
రాజ్యం వీరభోజ్య మనడం అందుకే!
బలవంతుడు మంచివా డైతే హీరో,
చెడ్డవా డైతే విలన్!

## ఇరవై రెండు

"కానున్నది కాక మానదు, అయినా
నీ పని నీవు చెయ్యి!"
అనేది అర్థం లేని మాట,
మోసానికి సీటు.
కానున్నది కాక మాన నప్పుడు
పని చెయ్యడం దేనికి?

ఎవరైనా పని చేసినప్పుడు
ఏదో ఒకటి కావడం.
పని జీవ లక్షణం,
ఫలితం సృష్టి వికసనం.

## ఇరవై మూడు

బంగారం, ప్రపంచ బేంకు, అణ్వాస్త్రం
ఈ మూడే ఈ కాలపు ట్రినిటీ !
ఈ మూడూ ఎవరి అధీనంలో వుంటే
వారే విశ్వనాథులు !
నీవు విశ్వనాథుడి అనుచరుడి వైతే
వైశేషిక శక్తి నీ వద్ద వుండాలి !

అహింస నిరాయుధుడి ఆపద్ధర్మం,
సత్యాగ్రహం బలహీనుడి ఆయుధం,
అవనిని పాలించా లంటే
ఆయుధాలు ధరించాలి !

వెర్రివాడి పెళ్లాం
వాడ కంతకూ వదిన అవుతుంది,
అది ఆ వంశం అస్తిత్వాన్నే తీసేస్తుంది.

## ఇరవై నాలుగు

శివుడికి త్రిశూలం
విష్ణువుకు చక్రం ఎందుకు?
కర్ర చేత లేకపోతే గొర్రె కూడ
కరుస్తుం దని నమ్మే మానవుడు
తన దేవుడి కిచ్చిన ఆయుధా లవి !

ఏ జీవికీ అక్కర లేని దైవ రక్షణ
మానవుడి కవసర మయింది!
అప్రతిహతా లైన దివ్యాయుధాలతో
నిత్య ప్రార్థనల హెచ్చరికలు స్వీకరిస్తూ
దేవుడు మానవుడి చుట్టూ పాపం
నిత్య గస్తీ తిరగాలి మరి!

## ఇరవై అయిదు

పరిశీలించు, మిత్రమా, పరిశీలించు !
లోక ప్రవర్తనను నిశితంగా పరిశీలించు !

ఒకే దేవుణ్ణి నమ్మే ఒకే మతంలో కూడ
శాఖా భేదాలూ, వర్గ వైరాలూ ఎందుకున్నై ?
వీర శైవులకూ, వీర వైష్ణవులకూ
ప్రొటెస్టెంటులకూ, కేథలిక్కులకూ
షియాలకూ, సున్నీలకూ
ఆ పోరాటాలు దేనికోసం?
దేవుడి కోసమేనా?

## ఇరవై ఆరు

సైన్సు ఇంతగా వికసించని ఆ కాలంలో
సూర్య చంద్రులు శివుడి నేత్రాలు,
ప్రపంచ మానవు లందరూ శైవులు!

సైన్సు చాలాగా వికసించిన ఈ కాలంలో
శివుణ్ణి వదిలేసి కూడా కొందరు కొందరు
కేవల భౌతిక గోళాలైన సూర్య చంద్రుల్ని
ఇంకా ఆరాధిస్తున్నా రెందుకు?

సూర్యుడు శక్తి మూల మని
సైన్సే ఆరాధిస్తున్నది, సరే!
మరి, చంద్రారాధకుల మా టేమిటి?
తామే అధికుల మంటూ వాళ్ళు
సూర్య భక్తులపై దండెత్తడ మేమిటి?
చంద్రుడు ఒగ గ్రహం కూడా కాదే!

## ఇరవై ఏడు

వేల వత్సరాలుగా వస్తున్న మత కర్మలన్నీ
కేవల మూఢ చర్యలని రుజువైన నేడు,
ప్రజల ప్రార్థనల్ని ఏ దేవుడూ వినడం లేదని
స్పష్టంగా తెలుస్తున్న నేడు కూడ
విజ్ఞానపు వెలుగులో వాస్తవాలను చూడ రెందుకు?

చూడక పోవడం కాదు, మిత్రమా!
బాగా చూచే చేస్తున్న మోస మది!
గుడిలోని దేవుడి సత్తా
పూజారికి తెలియ దనుకోకు!

## ఇరవై ఎనిమిది

దేవుడొక ఊహ,
మత మొక నియమావళి.

వివిధ దేశాల లోని ప్రవక్తలు సృష్టికర్తను
తల కొక విధంగా ఊహించారు,
అందుకే ఆ ఊహల్లో అన్ని వైరుధ్యాలు!

సైంటిస్టులు కనుగొన్న అణుశక్తి
రాజకీయ ప్రభువుల పరమైనట్లు,
మేధావులు ఊహించిన దేవుడు
మత కర్తల చేతికి చిక్కాడు,
మత్తు మందుగా ఉపయోగ పడుతున్నాడు!

## ఇరవై తొమ్మిది

సమాజాన్ని క్రమశిక్షణలో నడపడానికి
దైవభీతి, పాపభీతి, నరక భీతి అక్కర లేదు.

వాటిని ప్రతి మతమూ ప్రచారం చేస్తున్నది కదా!
ఇంతవరకు ఎంతమంది విన్నారు?
ఎంతమంది ఇప్పుడు వింటున్నారు?

ఇవి ఉష్కు ప్రచారాలని అందరికీ తెలుసు.
త్రికరణ శుద్ధీ, ధైర్య సాహసాలూ గల
మేధావులు బహిరంగంగా ధిక్కరిస్తుంటే,
సామాన్యులు ఆచారంగా సహిస్తున్నారు, అంతే.

## ముప్ఫై

ప్రపంచంలోని వివిధ దేశాలు, జాతులు
ఇంతగా దగ్గరకు రాని పూర్వ కాలంలో
పుట్టిన మత సూత్రాలు, సంఘ నియమాలు
భూగోళమే మునిగి పోయేటంత మంది పుట్టి
కలగలిసి పోతున్న ఈ కాలానికి పనికివస్తాయా?

విజాతీయుడు కనిపిస్తేనే చంపేసేది పూర్వకాలం,
సహజీవనమే జీవజలం జగత్తుకే ఇప్పుడు !
జాతీయ సమైక్యం పరిధి కూడ చిన్నదయింది,
నాది విశ్వమానవ సమైక్యజీవన పథకం.

## ముష్టి ఒకటి

జీవం అంటే ఏమిటి?
దాని పుట్టు పూర్వోత్తరా లేమిటి?

ఈ ప్రశ్నకు జవాబు దొరకలే దింత వరకు.
యోగం వెదికి సొమ్మసిల్లింది,
సైన్సు ఇంకా వెదుకుతూనే వుంది.

"సృజామ్యహం" అన్నాడు కృష్ణ పరమాత్మ,
పరమాత్మ తనను తాను సృష్టించుకొంటున్నది,
ఇందులో దేవుడి ప్రమేయం లేదు.

## ముప్పై రెండు

తా నెవరో
తన మూల మేమిటో
గమ్య మేమిటో, పర్యవసాన మేమిటో
అన్వేషణకు దిగినవాడు మానవుడే!
దాని ఫలితాలే-

వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు
మత గ్రంథాలు, దేవుడు, సైతాను
స్వర్గ నరకాలు, కర్మ సిద్ధాంతం వగైరా!

ఇందులో సైన్సు ఒక్కటే వాస్తవం,
తక్కిన వన్నీ ఊహలు, భ్రాంతులు!

## ముప్పై మూడు

మానవుడి అస్తిత్వం, వ్యక్తిత్వం, ప్రగతి
మనో బుద్ధి అహంకార ప్రవర్తనలే.
మనో బుద్ధి అహంకారాలు లేకపోతే
మనిషి జీవచ్ఛవమే!

ముఖ్యంగా–
అహంకారమే అస్తిత్వం జీవికి
అతిశయానికి మూలధాతువు అహంకారం,
అహంకారం కలవాడే అనీశ్వరుడు
అది లేనివాడు దీనుడు, దాసుడు.

## ముప్ఫై నాలుగు

మానవులలో
తెలివి తక్కువ వాళ్ళెవరూ వుండరు.
కొందరు బహుముఖ ప్రజ్ఞావంతులైతే
కొందరు ఏకముఖ ప్రతిభావంతులు.

ప్రజల్ని దోచుకునే ధనికులూ
ధనికుల్ని దోచుకునే దొంగలూ
తెలివితేటలలో సమానులే.

కోటి విద్యలు
శతకోటి ఉద్యోగాలు
అనంతకోటి ప్రణాళికలు !
ఇదీ మానవ జీవితం
దీనికి దేవు డక్కరలేదు.

## ముప్పై అయిదు

దేవు డొక డ్రగ్గు!
ఈ డ్రగ్గును వాడుకలో పెడుతున్న
మతా లన్నీ మాఫియా ముఠాలు!

ఈ ముఠాల మధ్య వ్యాపార కలహాలే
అశాంతికీ అభద్రతకూ హేతువులు!

మానవ సుఖ శాంతులకు
విజ్ఞాన వికాసాలకు మార్గ మొకటే వుంది,
అది దేవుణ్ణి నిషేధించడం!

అయితే-
మానవుణ్ని ఎడ్యుకేట్ చెయ్యకుండా
దేవుణ్ని నిషేధించలేం!

## ముప్పై ఆరు

మానవుడు భయస్తుడు, శంకాకులుడు
అగోచర భవితవ్యుడు,
అతడికి కావాలి ఏదో ఒక అదృష్ట శక్తి అండ.

అదే పరమాత్మ అనుకొంటే చాలదా?
చాలదు! కనుకనే
మానవుడు తన ఇచ్ఛా శక్తితో
క్రియా రూపాలను తయారుచేసుకొని
ఆత్మ రక్షణ కోసం ఆరాధిస్తాడు.

కనుక-
మానవాత్మను పరమాత్మగా మలచాలంటే
భయాన్ని తొలిగించాలి.

## ముప్పై ఏడు

సముద్రంలోని ప్రతి అలా సముద్రమే,
పరమాత్మలోని ప్రతి అణువూ పరమాత్మే,
మరణానంతరం ఏమీ వుండదు,
అంతా ఒకే పరమాత్మ!
ఏ జీవి అస్తిత్వమైనా లయం వరకే!

వెలిగినంతసేపే ఆ వెలుగు,
మళ్ళీ వెలిగేది మరొకటి.
ఏ విత్తనమూ రెండు సార్లు మొలవదు,
మళ్ళీ మొలిచేది మరొకటి.

## ముప్పై ఎనిమిది

ధనం ద్వారా అధికారం-
అధికారం ద్వారా మళ్ళీ ధనం!
అవి రెండే మళ్ళీ మళ్ళీ!
డబ్బు ముష్టిలో దేవు డున్నా డనేది లోకోక్తి!
నీ మాఫియా ముఠాల వ్యాపార మంతా
డబ్బు కోసమే కాదా?

నీతులు, నియమాలు
పాప పుణ్యా వివక్షలు
నరక భయాలు, స్వర్గ సుఖాశలు-
అన్నీ ప్రజల్ని మాయచేసి
ప్రభువులు భోగా లనుభవించడానికి
కల్పించబడిన డ్రగ్ వాగురలే!

## ముప్పై తొమ్మిది

కొన్ని విదేశీ డ్రగ్గులపై
కొందరికి విశ్వాసం జాస్తి,
స్వదేశీ డ్రగ్గుల మీదే కొందరికి భక్తి.
మా సెక్యులరిస్టులకు
ఏ డ్రగ్గైనా ఫర్వాలేదు!

మిత్రమా!
నీ మనోరథాన్ని తీర్చుకోడానికి
మాదక ద్రవ్యం (డ్రగ్గు) అవసరమా?
స్వచ్ఛమైన ఆత్మీయతతో
సాధించలేవా సంకల్ప సిద్ధిని?

## నలబై

ఒక్కొక్క డ్రగ్గు చాలా ఖరీ దయింది,
సామాన్యులు దూరం నుంచే దానికి
సాష్టాంగ పడి పోతుంటారు.

దాని పే రేదో మన కర్థం కాని
ఏదో పర భాషలో వుంటుంది,
దాని యజమానులు
ఫైవ్ స్టార్ చివరి అంతస్తులో వుంటారు.
దానిలో వుండేది నల్లమందే కావచ్చు
దాని విలువ ఒక్క రూపాయే కావచ్చు
బజారులో దాని ఖరీదు మాత్రం
వేల డాలరులు!

పనివాడి శరీరమూ, ప్రభువు శరీరమూ
నగ్నంగా సమానమే,
ఖరీదులు మాత్రం పదవులను బట్టి!

## నలభై ఒకటి

గోదావరి నుంచి ప్రవహించే
ప్రతి కాలువా, ప్రతి బోదే, ప్రతి బిందువూ
తానే గోదావరి ననుకొంటుంది!
అవును, కాదా మరి?

మరి, తానే పరమాత్మ నని
మానవు డెందు కనుకోడు?

అనుకొంటాడు–
డ్రగ్గను వదిలేస్తే!

## నలభై రెండు

నీ జీవిత లక్ష్యం ఆటైతే
ఆడుతూ గెలవాలి
పాటైతే పాడుతూ గెలవాలి
పోరాటమైతే పోరాడుతూ గెలవాలి

నీకు ఏ రంగంలో ఆసక్తి వున్నదో
ఆ రంగంలో కృషిచేస్తూ గెలవాలి

నీ శత్రువు బలవంతుడైతే
నీవు బలవత్తరుడవై గెలవాలి

గెలుపే జీవితం
జీవించడమే జన్మకు పరమార్థం!

## నలభై మూడు

కృష్ణా అంటూ గొంతెత్తి పాడిన ఘంటసాల
గొంతు కేన్సరుతో మరణించాడు!
ఇదేమి అన్యాయం అంటే
కర్మ అన్నారు మత పెద్దలు!
అంటే – కృష్ణపరమాత్మ కంటే
కర్మే బలవత్తర మనుకోవాలా?
ఎంత దైవ ద్రోహం!

## నలభై నాలుగు

ఈ ద్రగ్గు కూడా ఇప్పుడు నికార్సుగా లేదు
కాలక్రమంలో కల్తీ అవుతూ వచ్చింది
ఇప్పుడు బొత్తిగా నిష్ప్రయోజక మయింది
ఈనాడు ఏ డ్రగ్గైనా ఇంగువ కట్టిన గుడ్డే!

దాని పేరు చెప్పి యుక్తిపరులు, గూండాలు
అమాయకులను మోసగిస్తున్నారు, అంతే!

మానవులను అన్యోన్యంగా వుంచుతున్నది
దేవుడు కాదు, సహజీవన స్వభావం,
డ్రగ్గు కాదు, కలిసి వుండడంలోని బలం.

## నలభై అయిదు

పుట్టడం, బ్రతకడం, చావడం
ఈ మూడే లోక నైజాలు.

పుట్టడం మన చేతిలో లేదు,
చావడం ఎప్పుడో ఒకప్పుడు తప్పదు,
ఎంతకాలం బ్రతకగలం అనేది
మన జాగ్రత్తపై ఆధారపడి వున్నట్టిది.

ఒకటి ప్రవేశ ద్వారం, ఒకటి నిష్క్రమణ ద్వారం,
దాని కవతలా, దీని కవతలా అంతా పరమాత్మ.
ఈ మధ్యదే అస్తిత్వం, వ్యక్తిత్వం, జగన్నాటకం.

నాటకంలో నీవు పాత్రధారివా? ప్రేక్షకుడివా?
క్రిక్కిరిసి వున్న హాలులో, సీట్ల కోసం పోరాటంలో

నీవు సీటు దొరికినవాడవా?
పరాజితుడివా?

జీవిత పోరాటంలో విజయానికి
మంచితన మొకటే చాలదు,
పోరాట బలం కూడా కావాలి!

## నలభై ఆరు

మహారణ్యంలో
సింహాలూ, జింకలూ కూడ
సహ జీవనం చేస్తున్నై.

సింహాల ఆకలి ఆగడాలు పెరిగే కొలదీ
జింకల సంఖ్య తరిగిపోక తప్పదు!
తుదకు సింహ దేవుడు
జింక దేవుణ్ణి తినివేయకా తప్పదు!

జింక జాతిని రక్షించుకోవాలంటే
సింహ జాతిని అదుపులో పెట్టుకోవాలి.
అందుకు వట్టి చేతులు చాలనప్పుడు
చేతిలో కొరడా అయినా వుండాలి!
తుపాకి అయినా వుండాలి!

## నలభై ఏడు

సాధారణంగా–

ఒకో దేశంలో ఒకో జాతి నివసిస్తారు.

వాళ్ళ ఆచార సంప్రదాయాలు

ఆ దేశపు భౌగోళిక లక్షణాలనుబట్టి వుంటై.

అందుకు తగ్గట్టే వుంటాయి వాళ్ళ మతం,

విశ్వాసాలు, అవసరాలు, దేవుడు.

ఏ దేశం ఆచార సంప్రదాయాలు

ఆ దేశానికే పరిమితం కావాలి,

కానప్పుడు–

కలహాలు తప్పవు,

వాటిని మతం అనడం వంచన!

మతం పేరుతో జరిగినా

దురాక్రమణ ఎప్పుడూ దుష్ట స్వార్థ వ్యూహమే!

## నలభై ఎనిమిది

దేవుడు, అతడి అవతారం, అతడి ఆత్మ కథ
ఇవి మూడూ పవిత్ర త్రిమూర్తులు
ఏ ముఠా డ్రగ్గడిక్టు కైనా.
ఏ ఎడిక్టునీ ఆ డ్రగ్గు ప్రభావం నుంచి
బైట పడనీయదు ఆ ముఠా
క్రూరమైన శిక్షల ద్వారా.

ఎడిక్టుల జీవ ధాతువును పిండి వండి
ముఠా వ్యాపారులకు
బంగారం వడ్డిస్తున్న ట్రినిటీ
ఈ గోల్డెన్ ట్రయాంగిలే మరి!

## నలభై తొమ్మిది

దేవుడు లేకపోతే-
అతడు ఒక డ్రగ్గు మాత్రమే అయితే-
అతడి పేరు మీద జరుగుతున్న ఇన్ని
హిత బోధలు, నీతి పాఠాలు, ప్రసంగాలు
పండగలు, ఉత్సవాలు, పూజలు, వ్రతాలు
సంగీత నృత్య శిల్పాదిక కళా విన్యాసాలు
ప్రార్థనలు, భజనలు, తీర్థ యాత్రలు
గుడులు, జాతరలు అన్నీ ఏమై పోవాలి?

ఇది కదా నీ ప్రశ్న?
అవన్నీ మనలోనివే,
అన్నీ మనతోనే వుంటాయి!

## ఏభై

ఈ జరుగుతున్న వేడుక లేవీ కూడ
దేవుడికి సంబంధించినవి కావు.
అవి ఆయా జాతుల సాంస్కృతిక సంపదలు,
మతాలు మారినా మానవుడితోనే వుండేవి!

అవన్నీ ప్రకృతి పరమైన శక్తికి, సౌందర్యానికి
మనస్సు కల్పించుకొన్న వ్యక్తీకరణలు!

వాటిలో మనస్సుకు ఆనంద ముంది,
పరమాత్మకు సాఫల్య ముంది.

మనస్సే ఆత్మ, మహాత్మ, పరమాత్మ
మనస్సే వ్యక్తీభూత విశ్వాత్మ.

## ఏభై ఒకటి

సృష్టిలోని మరే చేతనా చేతన వర్గానికీ
ఎందుకూ పనికిరాని డ్రగ్గును
మానవు డాశ్రయిస్తే – అది
మానవ లోకాన్నే మతాలుగా చీల్చి
చీల్చి చెండా డేస్తున్నది!

అందుకే చెప్తున్నాను-
మనస్సును స్వేచ్ఛగా వికసించనీ!
ఆత్మ స్థాయి పెరిగి
మహాత్మగా, పరమాత్మగా పరిణమించనీ!

## ఏభైరెండు

జీవిత సౌందర్యాలు, మాధుర్యాలు, సుఖాలు
ప్రేమలు, అనురాగాలు, అనుభూతులు
ఉత్సవాలు, వినోదాలు అన్నీ మానసికాలే.

మనస్సు భౌతిక స్థాయిలో ప్రకృతి,
ఆధ్యాత్మిక స్థాయిలో పరమాత్మ.

ప్రార్థన, ధ్యానం, యోగం
వంటి చింతనలన్నీ మనోగతాలు,
మనస్సును మహిమ పరిచేవి.

కోరికలు సృష్టి స్థితులు, అవే జీవిత రతులు
వాటి ప్రవర్తనా రీతులే పురోగతులు.

## ఏభై మూడు

ప్రతి మనిషికీ కోరిక లుంటై,
కోరికలే జీవన వీచికలు
సృష్టి స్థితి లయాల సూచికలు,
వేటి క్రియా పరిధి వాటిది.

పరిధి తెగి నప్పుడే పోరాటం,
గట్టు తెగినప్పుడే వరద ముంపు.

కనుక, మిత్రమా
నీ పరిధిలో నీవు పురోగమించు,
అప్పు డే ఘర్షణా వుండదు
ఏ డ్రగ్గా అవసరం లేదు.

## ఏభై నాలుగు

తాను రాజ్యం వీర భోజ్యంగా విజృంభిస్తూ
నీకు అహింసనూ, సహనాన్నీ, సౌజన్యాన్నీ
బోధించేవాడు వంచకుడు, గుర్తించు!

నీవు వంచకుడివి కా నక్కర లేదు
వంచనకు బలి కాకుండా వుండు, చాలు.

నీ మనస్సే నీ పరమాత్మ,
దాని స్వేచ్ఛే నీ సృజనాత్మకత,
అదే నీ ఆనందం, అభ్యుదయం, గమ్యం.

గుఱ్ఱానికి వెయ్యవలసింది నోటికి కళ్ళెం
కాళ్ళకు బంధం కాదు,
అస్తిత్వానికి కావలసింది ఉత్తేజం
ఆత్మ న్యూనత కాదు.

## ఏభైఐదు

మనిషి ఆశా జీవి–
ఆశలతో, ఊహలతో, ఉద్వేగాలతో
జీవితం కొనసాగిస్తూ వుంటాడు.

మనిషి జీవితంలో వాస్తవాల కంటె
ఊహా చిత్రాలే అధిక భాగం!

జీవిత యాత్రా పథంలో ఎదురుపడే,
అడ్డుపడే, ఘర్షణపడే వైర శక్తులను
ప్రతిఘటించి జయించడంలో,
ఆయు రారోగ్యైశ్వర్యాలను, సుఖ శాంతులను
సాధించడంలో తోడ్పడ వలసిందిగా
ఎవరెవరో దేవుళ్లను ప్రార్థిస్తూ వుంటాడు.

అలా ప్రార్థించడంలో తప్పేం లేదు, కాని
అది నిష్క్రియకు బీజం కాకూడదు.

నిజానికి, ప్రార్థన ఎవరి గురించి అయినా
ఆ ఎవరో తన మనస్సే అవుతుంది,
మనస్సుకు పదును పెడుతుంది.

## ఏభై ఆరు

నా ఉద్ఘాటనలు ఇది-
దేవుడు లేడు, పరమాత్మ వుంది,
మరణానంతరం ఏమీ వుండదు,
ప్రతి వ్యక్తికీ బ్రహ్మైక్యం సైజం,

పునర్జన్మ లేదు,
కర్మ సిద్ధాంతం అబద్ధం,
పాప పుణ్యాలూ, స్వర్గ నరకాలూ
అజ్ఞానుల ఊహలు, స్వార్థపరుల కల్పనలు.

సృష్టి స్థితి లయాలు సహజ సిద్ధాలు,
జీవితం స్వభావ ప్రవర్తనం,
క్రమబద్ధ జీవితానికి ఏ దేవుడూ అక్కర లేదు,
శక్తే పరమాత్మ, శక్తే జీవిత మహాత్మ.

❊ ❊ ❊

# COMPLETE WORKS OF BOYI BHIMANNA VOL - 3 : VACHANA KAVITHALU PART - 2

## డా॥ బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు

1. సంపుటి - 1 - భీమన్న గేయ కావ్యాలు : భాగం 1 & 2
2. సంపుటి - 2 - భీమన్న పద్య కావ్యాలు : భాగం 1 & 2
3. సంపుటి - 3 - భీమన్న వచన కవితలు : భాగం 1, 2 & 3
4. సంపుటి - 4 - భీమన్న వచన గ్రంథాలు : భాగం 1 & 2
5. సంపుటి - 5 - భీమన్న నాటకాలు : భాగం 1 & 2
6. సంపుటి - 6 - Works of Boyi Bhimanna
7. సంపుటి - 7 - భీమన్న అముద్రిత రచనలు
8. సంపుటి - 8 - భీమన్న పీఠికలు : భాగం 1 & 2

### ఇతర రచనలు :

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - శ్రీమతి హైమవతీ భీమన్న
2. భీమన్న సాహితీ షష్టి పూర్తి సంచిక - సంపాదకుడు : శ్రీ గనుమల జ్ఞానేశ్వర్
3. బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - (సదస్సు పత్రాలు)
4. బోయి భీమన్న నాటకాలు - సార్వజనీనత - (సదస్సు పత్రాలు)
5. బోయి భీమన్న సాహిత్యం - వర్తమాన సమాజానికి సందేశం (సదస్సు పత్రాలు)
6. బోయి భీమన్న రచనలు - కావ్యతత్వ వివేచన (సదస్సు పత్రాలు)